తాతయ్యా

అనుసరణ:

ఎస్. కె. వెంకటాచార్యులు, య

ప్రకాశకులు :

తులసీ పబ్లిషర్సు, విజయవా

విద్యావిషయిక ప్రచారకులు.

2

1964

Adapted from
'he Old Curiosity shop

by
Charles Dickens

మూల్యము: రు. 7-00

ముద్రణ:
సోమేశ్వర ప్రింటింగ్ ప్రెస్,
విజయవాడ-2.

TPL 2A1098162

తాతయ్య ప్రేమ

లండను మహానగరము రకరకముల మనుజులకు, సకల సంపదలకు పుట్టినిల్లు. మన కథాకాలమున ఆ నగరరాజమున ఒక ముసలివాడు నివసించుచుండెను. అతని కచ్చట నొక అంగడికలదు. అతడా యంగడిలో పురాతనవస్తువుల నమ్ము చుండెడివాడు. ఆ వస్తువులు రకరకములుగా నుండెడివి. పూర్వ కాలపు ఆయుధములు, ఇనుము, కఱ్ఱ, దంతము మున్నగు వానితో చేయబడి విఱిగిపోయిన బొమ్మలు మున్నగునవి అన్నియు ఆ యంగడిలో గలవు. అతని ఇల్లు ఆ వస్తువులకు తగినట్లుగనే యుండెడిది. ఆ ముసలివాని రూపురేఖలును అందుకు తగినట్లుగనే యుండెడివి.

ఆ ముసలివానికొక కూతురుండెడిది. ఆమె దురదృష్టవశమున ఒక ఆడపిల్లనుకని మరణించెను. ఆ ఆడపిల్ల ముసలివాని (తాతయ్య) వద్దనే పెరిగి పెద్దదగుచుండెను. క్రమక్రమముగా ఆమెకు పదిసంవత్సరముల వయస్సు వచ్చెను. తాతయ్య మనుమరాలిని గాఢముగా ప్రేమించుచుండెను. మనుమరాలు తాతయ్యను అపరిమితముగ ప్రేమించుచుండెను. వారి ప్రేమను గూర్చి పలువురు ప్రశంసా పూర్వకముగ చెప్పుకొనుచుండిరి. వారి జీవితములు సుఖముగా గడచిపోవుచుండెను.

వేసవికాలమున సాయంసమయములందు వారు వాహ్యాళికి పోవుచుండెడివారు; ఇష్టము వచ్చినంత సేపు పొలములలో

తిరుగుచు ఆనందసాగరమున నోలలాడు చుండెడివారు. శీతకాలమున ఇంకను చీకటిపడక పూర్వము వారిరువురును ఒకచోట కూర్చుండెడివారు. అప్పుడు మనమరాలు తాతయ్యకు వేర్వేరు పుస్తకములలోని విషయములను చదివి వినిపించుచుండెడిది. చీకటిపడగానే ఆ చదువు ముగిసెడిది.

చీకటిపడిన తరువాత తాతయ్య మనమరాలికి తన కొమార్తెకు సంబంధించిన విషయములను చెప్పుచుండెడివాడు. "నే నామెను ఎంతో గాఢముగ ప్రేమించుచుండెడివాడను. నేనన్న ఆమె ప్రాణమిచ్చుటకు సిద్ధముగా నుండెడిది. నేను దురదృష్టవంతుడను. నే నామెను కోల్పోయినాను. నీవు తల్లి లేని దానవైనావు. నిన్ను నేను ప్రాణప్రదముగ పెంచుకొనుచున్నాను" అని తాతయ్య అనుచుండెడివాడు. తల్లికి సంబంధించిన విషయములను తెలిసికొనుటకు నెలబాల ఎంతయు సంబరపడుచుండెడిది. తాతయ్య ఒకసారి చెప్పిన విషయములనే మాటిమాటికి చెప్పుచుండెడివాడు. అయినను అవి నెలబాలకు అపరిమితమగు ఆనందమును చేకూర్చుచుండెడివి. ఆ విధముగా తాతా మనమరాండ్రు సుఖజీవితము గడపుచుండిరి.

కాని అంతలో తాతయ్యలో నొక విధమగు మార్పు వచ్చెను. అతడు రాత్రి సమయములందు ఇల్లువీడి బయటకు పోవుచుండెను తెల్లవారిన తరువాత మాత్రమే అతడు ఇంటికి తిరిగి వచ్చుచుండెను. మఱి యాతడేదో విషయమును గూర్చి తీవ్రముగా ఆలోచించు చున్నట్లుండెను. ఇంటికి తిరిగివచ్చునప్పటి కతని మొగములో నొక విధమగు బాధ ప్రస్ఫుటముగ కనబడుచుండెను, అతని కన్నులు నిప్పులవలె ఎఱ్ఱగా నుండెడివి.

అతడు రాత్రి సమయములందు ఏమాత్రము నిదురించుట లేదను విషయము స్పష్టముగా తెలియుచుండెను. అతడు మాటిమాటికి ఇట్లనుకొనుచుండెడివాడు: "నేనింకను కష్టపడి పనిచేయవలసి యున్నది. నా చిన్నారి నెలబాలకు అపరిమితమగు ధనమును సంపాదించి ఈయవలసి యున్నది. నేను మరణించునప్పటికి నెల బాల గొప్ప ధనికురాలుగా నుండవలయును." తాతయ్య బాధ పడుచున్న విషయమును నెలబాల గ్రహించెను. అతడెందులకు బాధపడుచున్నాడో గూడ నెలబాల తెలిసికొనెను. తాతయ్య ఆ విధముగ బాధపడుచుండుట ఆమెకే మాత్రము ఇష్టమైన విషయము కాకుండెను. ఆమె ధనధాన్యములను, భాగ్యభోగ్యములను ఏమాత్రము కోరుచుండుట లేదు; తాతయ్య ఆనందమును, సౌఖ్యమును మాత్రమే కోరుకొనుచుండెను.

అందువలన ఒకనాటి యుదయమున తాతయ్యతో నెలబాల ఇట్లనెను: "తాతయ్యా! నీవు నన్ను ప్రాణప్రదముగ ప్రేమించుచున్నావు; పెంచుకొనుచున్నావు. అది నాకు చాలును. మన జీవితము లా విధముగ సుఖముగ గడిచిపోయిన చాలును. మఱి నీవు ఇప్పుడెందులకు బాధపడుచున్నావు? తాతయ్యా! నీకు బాధ ఎందులకు? ప్రతిరాత్రి నీ వెచ్చటకు పోవుచున్నావు? నీవు కష్టపడి పనిచేయవలసిన అవసరమేమి వచ్చినది? నాకు అపరిమితమగు ధనమును సంపాదించి యీయవలసినపని ఏమివచ్చినది? మనకు తిని తిరుగుటకు తగినంత వచ్చుచున్నదిగదా? ఎక్కువ డబ్బు మనకు ఎక్కువ సౌఖ్యముల నొసగునన్న మాటకల్ల. తాతయ్యా! నామాట వినుము. రాత్రి సమయములందు ఇంటి వద్ద సుఖముగా నిదురింపుము."

ఆ మాటలువిని తాతయ్య మందహాసముచేసి నెల బాలను ముద్దుపెట్టుకొనెను; పిమ్మట నిట్లనెను: "అమ్మాయి! చిన్నారి నెలబాలా! నా సంగతి నీకేమి తెలియును? మన మనుభవించు సౌఖ్యము మనవద్దనుండు డబ్బుమీదనే ఆధారపడి యుండును. నీవు ఎనలేని సౌఖ్యముల ననుభవింపవలయునని నేను కోరుకొనుచున్నాను. మఱి అందుకు నీకు మితిలేనిధనమును సంపాదించి యీయవలసియున్నది. ఆ ధనమును సంపాదించుటకై కష్టపడి పనిచేయవలసి యున్నది. అందులకే నేను కష్టపడి పనిచేయవలసి యున్నది. అనతికాలములోనే నీవు గొప్ప ధనికురాలవు కాగలవు. నీవు కడు మనోహర భవనములో నివసింతువు; అందమైన శకటములో విహరించుచుందువు."

ఆ మాటలు నెలబాల కేమాత్రము రుచింప లేదని ప్రత్యేకముగ చెప్పనక్కఱలేదు. అయినను ఆమె తాతయ్యకు సౌఖ్యమును చేకూర్పదలచెను. అందువలన నామె అతనిని గట్టిగా కౌగిలించుకొనెను.

2

తాతయ్య ఇంటికి సమీపముననే క్రిస్టఫర్ అను కుఱ్ఱ వాడొకడు నివసించుచుండెను. అతడు చాల బీదవాడు; కాని మంచి నమ్మకమైనవాడు; నిజాయితీపరుడు; చిత్తశుద్ధికలవాడు. ఆ బాలుడు తాతయ్య ఇంట నౌకరుగా పనిచేయుచుండెను. అతడు ప్రతిరోజు ఉదయము తాతయ్య ఇంటికివచ్చి పను

యున్నియు చేయుచుండెడివాడు; చీకటిపడిన తరువాత తన యింటికి తిరిగి పోవుచుండెడివాడు. అతడు తాతయ్యనే, నెలబాలను గాఢముగ ప్రేమించుచుండెడివాడు. అతనికి వారిరువురిపట్ల అపరిమితమగు భక్తివిశ్వాసములు కలవు. నెలబాల అతనిని ఎంతో అభిమానముతో చూచుచుండెడిది. ఆమె యతనిని ముద్దుగా "కిట్" అని పిలుచుచుండెడిది.

లండను మహానగరములోనే క్విల్పు అను పేరుగల వడ్డీ వ్యాపారి యొకడు కలడు. అతడు వట్టి కుటిలుడు; దుర్మార్గుడు. అతడు హెచ్చువడ్డీకి సొమ్మునితరులకు అప్పు ఇచ్చెడివాడు; వారిని పీల్చి పిప్పి చేసెడివాడు. అతడింకను ఎన్నో కుటిల మార్గముల ననుసరించి డబ్బు సంపాదించెడివాడు. అతని రూపు రేఖలతని స్వభావమునకు తగినట్లుగనే యుండెను. అతడు వట్టి మఱుగుజ్జని చెప్పిన చాలును.

క్విల్పు తాతయ్య కిదివఱకు కొంత ధనము నప్పుగానిచ్చి యుండెను. తాతయ్య కింకను ధనము కావలసి యుండెను. అందువలన నతడొక యుత్తరము వ్రాసి దానిని నెలబాల చేతి కిచ్చి క్విల్పుకిచ్చి రావలసినదిగా గోరెను. ఆ పనిపై నెలబాల క్విల్పు వ్యాపార స్థలమునకు బోయెను. ఆమెవెంట కిట్ కూడా వెళ్ళెను.

క్విల్పు తన కార్యాలయములో నిదురించు చుండెను. అంతలో నతడు నిదురించుచున్న గదిలోనికి ఒక బాలుడు ప్రవేశించెను. ఆ స్వల్పమగు సవ్వడికే క్విల్పు నిదురనుండి మేల్కాంచెను.

"అయ్యా! మీ కొఱకు ఎవ్వరో వచ్చినారు" అని ఆ

బాలుడు అనెను.

"ఎవరు?"

"ఎవ్వరో నాకు తెలియదు."

"అడిగిరమ్ము, ఓరి కుక్కా! పోయి అడిగిరమ్ము."

అంతట బాలుడు బయటకు పోయెను. కాని అతడు తిరిగి రాలేదు. నెలబాల వచ్చెను. ఆమె గది గుమ్మము ముందు నిలబడెను.

"ఏమి! నీవా? నెల్లీ!"

"అవును. నేనే వచ్చినాను."

"గుమ్మమువద్ద ఆగిపోయినా వెందులకు? నిర్భయముగ లోనికి రమ్ము. వచ్చి తలుపులు మూసివేయుము. మంచిది, నెల్లీ! ఏమి పనిమీద వచ్చినావు ఆలస్యము చేయక చెప్పుము."

అంతట నెలబాల అతని చేతికి తాతయ్య వ్రాసియిచ్చిన యుత్తరము నిచ్చెను. అతడు దానిని అందుకొని చదువసాగెను. అప్పుడు నెలబాల అతని మొగమువంకకు చూడసాగెను. అతడేమి సమాధాన మిచ్చునోయని ఆమె ఆతురపడుచుండెను.

అతడు రెండు వాక్యములు చదివెనో లేదో కన్నులు పెద్దవిచేసి మరల చదవసాగెను. మఱి రెండుమూడు వాక్యములు చదివిన తరువాత అతడు తల గోకికొనసాగెను. ఎట్టకేలకతడు ఉత్తరము చదువుట ముగించి భయంకరముగ ఈల వేసెను. తరువాత నతడు ఉత్తరమును మడచి ఒకచో పెట్టి పది వ్రేళ్ళ గోళ్ళు కొఱికికొనెను. పిమ్మట నతడు మఱియొకసారి యుత్తరము చదివెను. తరువాత నతడు నెలబాలవంక తీక్షణముగా

చూచెను.

"ఓహో, నెల్లీ!"

"అయ్యా! ఇచ్చటనే యున్నాను."

"నెల్! ఈ యుత్తరములోని విషయమేమో నీకు తెలియునా?"

"తెలియదయ్యా!"

"తెలియదా? నిశ్చయముగ తెలియదా? నిజముగ తెలియదా? ముమ్మాటికి తెలియదా?"

"నిశ్చయముగ తెలియదు."

"తెలిసి అసత్యమాడుచున్నచో మరణింతువను విషయము తెలిసికొనుము."

"తెలియును. నే నసత్యమాడుట లేదు. ఆ యుత్తరములో నేమి యున్నదో నాకు తెలియదు."

"మంచిది. నేను నీమాట నమ్ముచున్నాను. ఊహుం! అప్పుడే అయిపోయినదా? ఇరువది నాలుగు గంటలలో అయిపోయినది. దానితో అతడేమి చేసినాడు? అంతయు పరమ రహస్యముగా నున్నది!"

అతడు మరల గోళ్లు కొరికికొనెను. తలగోకికొనెను. కొంచెము సేపు గడచిన తరువాత అతడు మందహాసము చేయుటకు ప్రయత్నించుచు ఇట్లనెను: "నెల్లీ! నేడు నీవు చాల అందముగ కనబడుచున్నావు! కడు మనోహరముగ కనబడుచున్నావు! నెల్లీ! అలసిపోయినావా యేమి?"

"లేదయ్యా! నే నింటికి తిరిగి పోవలయునని తొందరపడుచున్నాను. మా తాతయ్య నారాకకొఱకు వేచియుండును."

"తొందరలేదు, చిన్నారి నెలబాలా! తొందరలేదు. నీవు నాకు రెండవదానిగా నుండుట కిష్టపడుదువా?"

"మీ రనుచున్న దేమో నాకు అర్థమగుటలేదు."

"అర్థమగుటలేదా? అర్థమగుట కేమి యున్నది? నాకు రెండవ దానిగా నుండుట కిష్టపడుదువా యని ప్రశ్నించు చున్నాను."

ఆ మాటలు నెలబాలకు అర్థముకాలేదు. అయినను ఆమె మొగములో నొక విధమగు భయము ప్రస్ఫుటముగ కనబడ సాగెను.

"నా మొదటి భార్య చనిపోయినపుడు నీవు నా రెండవ భార్యగా నుండుట కిష్టపడుదువాయని ప్రశ్నించుచున్నాను. నా అందాల భార్యగా నుండుట కిష్టపడుదువా? నా యిప్పటి భార్య ఇంక అయిదు లేక నాలుగు సంవత్సరములు మాత్రమే జీవించు ననుకొనుము. అప్పుడు నీవు నా ముద్దుల భార్యగా నుండుటకు తగిన వయస్సు కలదానవగుదువు" అని ఇంకను క్వైల్పు అనెను.

ఆ మాటలు నెలబాల కేమాత్రమును సంతోషమును చేకూర్పలేదు. పైగా ఆమె భయముతో గజగజ వణకిపోసాగెను. క్వైల్పు ఆమె భయము నేమాత్రము గమనింపని వాసివలె నవ్వి ఇట్లనెను: "నీవు నాతో కలసి మా యింటికి రమ్ము. అచ్చట నీవు నా భార్యను చూడవచ్చును. ఆమెకు నీవన్న ఎంతయు ఇష్టము. నాకు నీవన్న అంతకంటె ఎక్కువ ఇష్టమనుకొనుము. నీవు నాతో కలసి మా యింటికి రావలయును."

"నేను తిన్నగా మా యింటికి తిరిగి పోవలయును. మీ వద్దనుండి సమాధానము తీసికొని తిన్నగా ఇంటికి తిరిగి రావలసి

నదని మా తాతయ్య చెప్పినాడు."

"కాని నేను నీ కింకను సమాధాన మీయ లేదుగదా! నేను నీ కిచ్చట సమాధాన మీయను. మా యింటివద్దగాని నీకు సమాధానమీయను. అందువలన నీపని నెఱవేఱవలయు నన్నచో నీవు నాతో గలసి మా యింటికి తప్పక రావలసి యున్నది."

తరువాత వారిద్దరును కార్యాలయ భవనములోనుండి బయటకు వచ్చిరి. అచ్చట కిట్ వేచియుండెను. ముగ్గురును కలసిపోయి క్విల్పు గృహమును చేరుకొనిరి.

ఇల్లు చేరుకొన్న తరువాత క్విల్పు తన భార్యతో రహ స్యముగా నిట్లనెను: "నా మాటలు జాగ్రత్తగా ఆలకింపుము. ఈ అమ్మాయి నెలబాల వద్దనుండి ఆమె తాతయ్యకు సంబం ధించిన విషయములు జాగ్రత్తగా తెలిసికొనుము. వారేమి చేయుచున్నారు? ఎట్లు జీవించు చున్నారు? తాతయ్య మనమ రాలితో ఏయే విషయములు చెప్పుచున్నాడు? మున్నగు విష యములు తెలిసికొనుము. ఈ విషయము లన్నిటిని నేను అత్యావ సరముగా తెలిసికోవలసి యున్నది. మీ రిరువురు స్త్రీ జాతికి చెందినవారే యగుటవలన స్వేచ్ఛగా మాట్లాడుటకు అవకాశ మున్నది. నీవు చక్కగా మృదువుగా మాట్లాడి నేర్పుగా ఆమె వద్దనుండి అన్ని విషయములు తెలిసికొన గలవు. వినబడినదా?"

"వినబడినది."

"మఱి ఇంక నీపని ప్రారంభింపుము."

"నేను నెలబాలను గాఢముగా ప్రేమించు చున్నాను. మఱి ఆమెను నేను మోసగింప ప్రయత్నించుట న్యాయమా?"

"నీకది అంతయు అనవసరము. నన్ను రెచ్చగొట్టకుము. నేను చెప్పినట్లు చేయుటకు ప్రయత్నించి విజయము సాధింపుము. లేనిచో నిన్ను కఠినముగ శిక్షింతును. నీప్రాణములు నీవి కావను విషయమును గుర్తించుకొనుము."

"కోపగింపకుడు. మీరు చెప్పినట్లు నడచుకొందునని వాగ్దానము చేయుచున్నాను."

"మంచిది. విజయము సాధింపుము."

క్విల్పుసతి నెలబాలయున్న గదిలోనికి బోయెను. క్విల్పు ప్రక్కగదిలో పొంచియుండెను.

క్విల్పుసతి నెలబాలను సాదరముగ పలుకరించి ఇంకను ఇట్లనెను: "అయ్యో! పాపము! ఇటీవల నీవు నా భర్తను కలసికొనుటకు ఎన్నోసార్లు వచ్చినావుకదా! ఇచ్చటకు వచ్చుటతో, తిరిగి మీ యింటికి పోవుటతో నీ కాలము సరిపోవుచున్నది!"

నెలబాల అమాయకముగ నిట్లనెను: "అవును, నే నా విషయమును మా తాతయ్యకు కనీసము వందసార్లయినను చెప్పినాను."

"మఱి అప్పుడతడేమి సమాధానము చెప్పినాడు?"

"నిట్టూర్పువుచ్చి తల వంచుకొన్నాడు. దుఃఖ సముద్రములో మునిగియున్న ఆర్తునివలె కనబడినాడు. అతని యప్పటి దుస్థితిని చూచినచో ఎంతటి కఠినహృదయులైనను కన్నీరు కార్చుదురు. కాని ఎవ్వరేమి చేయగలరు? నేనేమి చేసినాను?"

"మీ తాతయ్య పూర్వమట్టి స్థితిలో నుండెడివాడు

కాదుకదా !"

"ఏమాత్ర మట్లుండెడివాడుకాదు! అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా ఉన్నది. పూర్వము మేము ఎంతో సుఖముగా, సంతృప్తిగా జీవించుచుండెడివారము. ఆనందసాగరమున మునిగి తేలియాడుచుండెడివారము. ఇప్పుడు మేము దుఃఖసముద్రమున మునిగిపోవుచున్నాము. ఈ పరిస్థితిని ఎవ్వరును ఊహింపలేరు."

"చిన్నారి నెలబాలా! నేను ఈ పరిస్థితికి ఎంతయు విచారించుచున్నాను. నీవీవిధముగ మాట్లాడవలసిన అవసరము కలిగినందుల కెంతయు విచారించుచున్నాను."

"నేను మీ కెంతయు కృతజ్ఞురాలను. మీ రెప్పుడును ఈ విధముగనే నాపట్ల దయను ప్రదర్శించుచుందురు. మీతో మాట్లాడుట నా కెంతయు ఆనందదాయకముగ నుండును. నేను మా తాతయ్యనుగూర్చి ఎవ్వరితో చెప్పుకొనుటకును వీలు లేదు. ఒక్క కిటకితో మాత్రమే చెప్పుకొనుటకు వీలున్నది. నే నిప్పటికిని సుఖముగనే యున్నాను. ఈ పరిస్థితిలో ఎక్కువ సంతోషముగ నుండుటకూడ అవసరమే. అయినను నేను మా తాతయ్య పరిస్థితిలో వచ్చిన మార్పునుచూచి ఎంతయు విచారించు చుందును."

"మీ తాతయ్యలో తిరిగి మార్పువచ్చును, పల్లీ! అత డెప్పటివలె సుఖముగా జీవించునుటకు ఎట్టి సందేహ మును లేదు."

"భగవంతుని దయవలన మార్పువచ్చిన ఎంతయు బాగుండును కాని అతడు ఏమో ఆలోచించుచున్నవానివలెను, ఏమాత్రము ఉత్సాహము లేనివానివలెను ఉండుట మొదలిడి

చాలకాలమైనది. అంతకు మునుపు సాయంకాల సమయములను మేము చక్కగా గడపుచుండెడివారము. మే మిరువురము నెగడు ప్రక్కన కూర్చుండెడివారము. నే నేదో పాత్రమును చదువుచుండెడిదానను. అతడు వినుచుండెడివాడు. కొంతసే పైనతర్వాత మేము కబుర్లు చెప్పుకొనుచుండెడివారము. ఆ సందర్భము నతడు నా తల్లినిగూర్చి చెప్పుచుండెడివాడు చిన్న ప్పుడు నా తల్లి అచ్చముగా నావలెనే ఉండెడిదట. నావలెనే మాట్లాడుచుండెడిదట. నా తల్లి సమాధిలో లేదనియు, ఆకా శమున కావలనున్న యొక సుందర లోకమున కెగిరిపోయిన దనియు అతడు చెప్పుచుండెడివాడు. ఆ మనోహరలోకమున నుండువారికి ముసలితనముగాని, మరణముగాని ఉండవట. ఇప్పుడు మాకీ కబుర్లవివియు లేవు. ఇప్పుడు మాజీవితమంతయు దుఃఖమయమే."

"నెల్లీ! నెల్లీ! నీవంటి చిన్నది ఈ విధముగ దుఃఖించు టను నేను భరించలేకున్నాను. విచారింపకుము. ఏడువకుము."

"నేను సాధారణముగా కన్నీరు పెట్టుకొనను. ఇప్పుడు నేను కన్నీటిని ఆపుకోలేకున్నాను. నా దుఃఖమును మీాముందు ప్రదర్శించుటకు నే నేమాత్రము వెనుదీయను. ఏలయన మీారీ విషయమును మఱి యింకెవ్వరికిని చెప్పరను విషయము నాకు తెలియును."

ఆ మాటలను విని క్వైల్పుసతి తల ప్రక్కకు త్రిప్పుకొనెనే కాని సమాధానమేమియు నీయలేదు.

నెలబాల ఇంకను నిట్లనెను: "మే మింకను తఱచుగా పొలములలోను, తోటలలోను తిరుగుచుండెడివారము. బాగుగ

అలసిపోయినతరువాత ఇంటికి తిరిగివచ్చు చుండెడివారము. ఇప్పుడు మేమావిధముగ తిరుగుటలేదు. మాకింక ఆ ఆనందము లేదు. మా కంతయు అంధకారమయముగ నున్నది. కాని ఒక్క మాటనుమాత్రము జ్ఞప్తియం దుంచుకొనుము. మా తాతయ్య నన్నిప్పుడు ఇదివఱకుకంటె తక్కువ దయతో చూచు చున్నాడని మీరు లేశమాత్రము భావింపరాదు. అతడు నన్ను రోజు రోజుకు ఇదివఱకుకంటె ఎక్కువగా ప్రేమించు చున్నాడు. నాపట్ల ఇదివఱకుకంటె ఎక్కువ దయను ప్రదర్శించు చున్నాడు. అతనికి నేనన్న ఎంత ఇష్టమో మీకు తెలియదు."

"నిన్నతడు గాఢముగ ప్రేమించుచున్నాడను విషయము నాకు నిశ్చయము తెలియును."

"నిశ్చయము! నిశ్చయము! నేనతని నెంత గాఢముగ ప్రేమించుచున్నానో అతడు నన్నంత గాఢముగ ప్రేమించు చున్నాడు. కాని నే నింతవఱకు అతనిలో వచ్చిన అతి ముఖ్య మైన మార్పును మీకు చెప్పయుండలేదు. ఈ విషయమును మీకు మఱియొకప్రాణి కెట్టి పరిస్థితులలోను చెప్పరాదు. అతనికి విశ్రాంతిగాని, నిదురగాని లేవు. పగలుమాత్రము పడకకుర్చీలో కూర్చున్నప్పుడు కొలదిగా కునికిపాట్లు పడుచుండును. ప్రతిరాత్రి అతడు బయటకు పోవుచుండును. తెల్లవారుటకు ముందు మాత్రమే ఇంటికి తిరిగివచ్చుచుండును."

"నెల్లీ!"

"ఉష్! అప్పుడు నేతనిని ఇంటిలోనికి ప్రవేశపెట్టెదను. ఎప్పటివలె కడచినరాత్రిగూడ అతడు బయటకు పోయెను. కాని బాగుగ తెల్లవాఱినతరువాత మాత్రమే అతడు ఇంటికి తిరిగి

వచ్చెను. అప్పుడు నేనతని ముఖమును బాగుగ పరిశీలించి చూచితిని. అతని ముఖమును ప్రేతకళ ఆవరించియుండెను. అతని కన్నులు నిప్పులవలె ఎఱ్ఱగా నుండెను. కాళ్లు గజగజ వణకిపోవుచుండెను. నేనతనిని లోనికి ప్రవేశపెట్టి మరల నిదు రింపబోతిని. కాని అంతలో నా కతని మూలుగు వినబడెను. అంతట నేను తిరిగి అతనివద్దకుపోతిని. కాని అతడు నాయునికిని గ్రహింపలేదు. అతడిట్లనుకొనుచుండెను: నేనింక ఎంతో కాలము జీవింపజాలను. నా ముద్దుల నెలబాలకొఱకు 'నేను బ్రతుకు చున్నాను. లేనిచో ఎప్పుడో మరణించియుండెడివాడను.' నే నేమి చేయను? అయ్యో! నేనేమిచేయను?"

ఆవిధముగ నెలబాల తనహృదయ రహస్యమును క్విల్పు సతికి చెప్పి కంటికి మంటికి ఏకధారగా కన్నీరు కార్చసాగెను. అంతట క్విల్పుసతి ఆమెను తన చేతులలోనికి తీసికొని బుజ్జగింప సాగెను.

ప్రక్కగదిలోనుండి వారి సంభాషణము నంతను ఆలకిం చిన క్విల్పు మఱికొన్ని క్షణములకు ఆ గదిలో ప్రవేశించెను. అతడు పయోముఖ విషకుంభమువంటివాడు. అందువలన నతడు ఏమియు నెఱుగనివానివలె నెలబాల ముఖకవళికపట్ల విచార మును ప్రకటించి, సానుభూతిని తెలిపెను.

"నెలబాల బాగుగ అలసిపోయినది! పాపము!" అని క్విల్పు తన భార్యతో ననెను. పిమ్మట నతడు నెలబాలతో నిట్లనెను:

"అమ్మాయి! నీవు మా దంపతులతో కలసి భోజనము చేయుదువుగాని ఉండుము."

"అయ్యో! ఇప్పటికే చాల ఆలస్యమైపోయినది. నేనింక ఇంటికి తిరిగి పోవలయును" అని నెలబాల అనెను.

"మంచిది. నెల్లీ! త్వరగా పోవలయునుకొన్నచో నీవు పోవచ్చును. ఇదిగో ఉత్తరము. దీనిని తీసికొనిపోయి మీ తాతయ్యకిమ్ము. రేపుగాని, ఎల్లుండిగాని నేనే మీ తాతయ్యవద్దకు వత్తును. మీ తాతయ్యకోరిన చిన్నసాహాయ్యమును నే నీపూట చేయలేకపోయినాను. ఈ విషయమునే నేను ఈ యుత్తరములో వ్రాసినాను. ఇంక నీవు పోవచ్చును" అని క్విల్పు అనెను.

అంతట నెలబాల క్విల్పు సతివద్ద సెలవు తీసికొని బయటకు బోయి కిటును కలసికొనెను. వారిరువురును ఇంటికిబయలు దేఱి పోయిరి.

తరువాత క్విల్పు తన భార్యతో నిట్లనెను: "నీవు నెలబాలతో చాల చక్కగా మాట్లాడి ముసలివానికి సంబంధించిన రహస్యమును తెలిసికొన్నావు. ఇందుకు నిన్ను నేను అభినందించుచున్నాను. ముసలివాడు ధనమునంతను ఏవిధంగా ఖర్చు పెట్టుచున్నాడో నాకిప్పుడు చక్కగా అర్థమయినది. అతడు ప్రతి రాత్రి ఇల్లు వీడి బయటకుపోయి పేకాట ఆడుచున్నాడు. పేకాట ఆడి, జయము సంపాదించి, మనమరాలికి డబ్బు కూడబెట్టవలయునని అతడు ఆశపడుచున్నాడు. ఎంత తెలివితక్కువవాడు! అతడు మాటిమాటికి నా సాహాయ్యము నపేక్షించుచున్నాడు. దీనిని బట్టి అతడు పేకాటలో డబ్బు కోల్పోవుచున్నాడను విషయము స్పష్టముగా తెలియుచున్నది. ఇంక నే నతనికి రాగినాణెమునైన అప్పుగా ఈయను. పైగా నే నతని కింతవఱకు ఇచ్చిన ధనమును వెంటనే రాబట్టుకొనవలసి యున్నది.

3

నెలబాల కిట్‌తో కలసి ఇంటికిపోయి తాతయ్యను కలసికొనెను. క్విల్ప్ ఇచ్చిన యుత్తరము నిచ్చెను. "క్విల్ప్ మన యింటికి రేపుగాని ఎల్లుండిగాని వచ్చును." అనికూడ ఆమె అతనితో ననెను. అతడు నెలబాలను ధనముకొఱకై పంపియుండెను. ఆమె డబ్బు తీసికొని వచ్చునని అతడు ఎంతో ఆశతో వేచియుండెను. కాని క్విల్ప్ డబ్బు పంపలేదు. అందువలన అతడు ఆశాభంగము చెందెను. దుఃఖసముద్రమున మునిగియున్న అతని కది ఆశనిపాతమువలె నుండెను. చేత డబ్బు లేకుండుటవలన అతడు నాటిరాత్రి ఇల్లు వీడి బయటకు పోలేదు. ఇంటివద్దనున్నను అతడు సరిగా నిదురపోలేదు.

క్విల్ప్ వచ్చి డబ్బు ఇచ్చునని తాతయ్య మఱునాడు ఎంతో వేచియుండెను. కాని క్విల్ప్ రాలేదు; డబ్బు ఈయలేదు; ఉత్తరముగూడ పంపలేదు. తాతయ్య విచారమునకు మతి లేకుండెను. రెండవరోజుకూడ ఆవిధముగనే గడచిపోయెను. మూడవనాడుకూడ క్విల్ప్ రాలేదు. ముసలివాడు సహనము కోల్పోవుచుండెను.

మూడవనాటిరాత్రి తాతయ్య నెలబాలను దగ్గఱకు పిలిచి ఇట్లనెను: "అమ్మాయి! రెండురోజులు! రెండురోజులు పూర్తిగా గడచిపోయినవి! మూడవరోజుగూడ గడచిపోనున్నది. అతడు రాలేదు. అతనివద్దనుండి ఉత్తరముకూడ రాలేదు. నెలబాలా!

అతడు నీతో ఏమని చెప్పినాడో సరిగా చెప్పుము."

"నే నిదివఱకే సరిగా చెప్పియుంటినికదా. అతడు చెప్పిన ప్రకారము మొన్నగాని, నిన్నగాని రావలసియుండెను."

"అవుడు, నిజమే. అయినను నాకు మఱియొకసారి చెప్పుము. నా బుద్ధి సరిగా పనిచేయుటలేదు అతడు నీకుచెప్పిన విషయమేమి? మొన్నగాని నిన్నగాని కలసికొందునని చెప్పినాడా? అంతకంటె ఎక్కువ ఏమియు చెప్పియుండలేదా? ఆ విషయమే ఉత్తరములోకూడ వ్రాసినాడు."

"అవును, అంతకంటె ఎక్కువ ఏమియు చెప్పియుండలేదు. తాతయ్యా! నేను జేవతనియింటికి మఱియొకసారిపోనా? పెందలకడనేపోనా? తొందఱగాపోయి ఉదయకాల భోజనపువేళకు పూర్వమే తిరిగి వత్తును."

ముసలివాడు తల పంకించెను. అతడువిచారసూచకముగ నిట్టూర్పు పుచ్చుచు, నెలబాలను దగ్గఱకు లాగుకొనెను. పిమ్మట నిట్లనెను:

"అమ్మాయి! లాభమేమియులేదు. ఏవిధమైన ఉపయోగము నుండదు. ఈ అవసరసమయమున అతడు నన్ను వదలివైచినచో ఏమి జరుగును? నే నిప్పటికి ఎంతో ధనము నష్టపోయినాను; ఎంతో కాలము వృథాపుచ్చినాను. నేను మానసికముగ క్రుంగిపోయినానను విషయము నీకు బాగుగ తెలియును. నే నిప్పుడు అతని సాహాయ్యమునుపొంది నష్టపోయిన సొమ్మంతను రాబట్టుకోవలసియున్నది; ఇంకను పైగా సంపాదింపవలసియున్నది. అతడిప్పుడు సాహాయ్యము చేయకపోయినచో, నేను సర్వనాశనమై పోయినట్లే! నేను నీకొఱకే సాహసకృత్యము చేసి

నాను. మఱి నీవుకూడసర్వనాశనమై పోయినట్లే! మనము నిర్ధనుల మైనచో?"

"అయిననేమి? నిర్ధనులమైననేమి? మనము నిర్ధనులమైనను సుఖముగా జీవింపవచ్చును."

"నిర్ధనులమైన తరువాత సుఖముగా జీవించుటయా? అయ్యో! నీకేమియు తెలియదు! చిన్నపిల్లవు!"

"తాతయ్యా! నాకేమియు తెలియదా? నేను చిన్న పిల్లనా? చిన్నపిల్లనైనను నా కన్నివిషయములును తెలియును. మన యిప్పటి యీ జీవిత విధానము నాకేమాత్రము నచ్చుట లేదు. మన పొట్టలు పోషించుకొనుట కిటుల జీవించుటకంటె బిచ్చమెత్తుకొనుట మేలు! పొలములలోగాని, రోడ్లమీదగాని పనిచేసికొనుట మేలు!"

"నెల్లీ!"

"అవును! ఈవిధముగజీవించుటకంటె ఆవిధముగ జీవించు టయే మేలని మఱియొకసారి ఉద్ఘాటించుచున్నాను. నీవు విచా రించుచున్నావా? నీ విచారమునకు కారణమేమో తెలుపుము. నేనుగూడ విచారింతును. నీవు రోజు రోజుకు క్షీణించిపోవు చున్నావు; కృశించి పోవుచున్నావు. నేను నీకు సేవచేసి సంతోష మును చేకూర్చుటకు సిద్ధముగానున్నాను. నీవు బీదవాడవైనచో మన మిరువురము కలసి బీదవారముగా జీవింతము. నన్నెప్పుడును నీతోనే ఉండనిమ్ము! నన్నెప్పుడును నీతోనే ఉండనిమ్ము!! నీలోని మార్పుకు కారణమేమో తెలియజేయుము. కారణము నాకు తెలియకపోయినచో హృదయము పగిలి మరణింతును. తాతయ్యా! తాతయ్యా! మనము రేపే ఈ ప్రదేశమును వీడి

పోదము! మన మిరువురము కలసి బిచ్చమెత్తుకొని జీవింతము."

అంతట ముసలివాడు చేతులతో మొగము కప్పుకొని తలగడలో దూర్చెను.

నెలబాల తాతయ్య మెడచుట్టు చేయివైచి ఇంక నిట్లనెను: "మన మిరువురము కలసి బిచ్చమెత్తుకొని జీవింతము. మనకు పొట్టనిండ కూడు దొరకును. ఆ విషయమునుగూర్చి నా కెట్టి భయమునులేదు. మనకు కావలసినంత లభించునని నిశ్చయముగ చెప్పగలను. అందుకు సందేహ మేమాత్రము లేదు. మన మిరువురముకలసి గ్రామసీమలలో నడచిపోదము. పొలముల లోను చెట్లక్రిందను నిదురింతము. ధనములు గురించి ఇంక ఆలోచింపవలదు. ఒకడు-ధనమే అననేల? నీకు విచారమును కలిగించు విషయమును గురించిగాని ఆలోచింపవలదు. రాత్రులందు చక్కగా నిదురింతము. పగటి సమయములందు సూర్య రశ్మిని, గాలిని చక్కగా అనుభవింతము. మన మిరువురము కలసి కరుణామయుడగు భగవానుని ప్రార్థింతము. మనమింక నెన్నడును చీకటి గదులలోగాని, దుఃఖమున కాటపట్టులగు గృహములలోగాని అడుగు పెట్టవలదు. మన యిచ్చవచ్చినట్లెల్ల బాహ్య ప్రపంచంలో తిరుగుదుము. నీవు అలసిపోయి నప్పుడు కడు మనోహరమగు ప్రదేశములలో విశ్రాంతి తీసికొనవచ్చును. అప్పుడు నేనుపోయి మన యిరువురకు బిచ్చమెత్తుకొని వత్తును."

నెలబాల ఇంక మాట్లాడలేకపోయెను. ఆమె కన్నీరు కార్చుచూ తాతయ్యపై పడిపోయెను ఆమెతోబాటు తాతయ్య గూడ కన్నీరు కార్చసాగెను.

దుర్మార్గుడగు క్విల్పు అంతకుమునుపే అచ్చటకువచ్చి చాటున నిలబడియుండెను. అతడా దృశ్యమునంతను జూచెను. వారి సంభాషణమునంతను ఆలకించెను. అంతలో నతడు నెల బాల కంటబడెను. అతనిని చూడగానే ఆమె ఒక్క అఱపఱ చెను. అప్పుడు ముసలివాడుకూడ అతనిని చూచెను.

"క్విల్ప్! నీవు లోనికెట్లు వచ్చినావు? మాకు తెలియ కుండ లోనికెట్లు వచ్చినావు?" అని ముసలివాడు ఆశ్చర్యముతో ననెను.

"నీకా విషయమునుగూర్చి సందేహ మెందులకు? నేను దొంగదారిని రాలేదు. వీధి ద్వారమునే వచ్చినాను. తాళపు చెవి కంతలోనుండి వచ్చుటకు నేను చిన్నదోమను కాదుకదా! నేను నీతో రహస్యముగా కొన్ని విషయములు మాట్లాడవలసి యున్నది. ఇక్కడ నేను, నీవుతప్ప మరి యింకనెవ్వరును నుండ రాదు. నెల్లీ! నీవింక పోవచ్చును."

అంతట నెల్లీ తాతయ్యవంక చూచెను. తాతయ్య నెల బాలను బుగ్గపై ముద్దుపెట్టుకొని, 'ఇంకనీవు పోవచ్చును' అను అర్థము వచ్చునట్లు చూచెను.

అప్పుడు క్విల్పు ఇట్లనెను: "ఆహా! ఎంతచక్కగా ముద్దు పెట్టుకొన్నావు. చక్కని గులాబిరంగు భాగముమీద ముద్దు పెట్టుకొన్నావు. ఆహాహా! ఎంతచక్కని ముంచు."

నెలబాల ఆ ప్రదేశమును వీడిపోసాగెను. క్విల్పు ఆమె పోవుచున్న వంకకు చూడసాగెను. నెలబాల గదిబయటకుపోయి తలుపులు మూసివైచెను. అంతట క్విల్పు నెలబాలను పలుపరి విధముల ప్రశంసింపసాగెను. తాతయ్య ప్రయత్న పూర్వకముగ

మందహాసము చేయఁసాగెను. కాని అతడెంతయు బాధపడు చుండెను. అది క్విల్పునకెంతయు సంతోషదాయకముగా నుండెను.

"ఆహాహా! నెలబాల సౌందర్యము నేమని వర్ణింప వచ్చును?"

"ఆ మాటలకేమిగాని, నీ విప్పుడు డబ్బుతీసికొని వచ్చి నావా? లేదా?"

"లేదు."

"అయిన నేను, నా నెలబాల సర్వనాశనమై పోయినా మన్నమాట!"

"మిత్రమా! నేను నీతో స్పష్టముగ మాటాడ గోరు చున్నాను. మనమధ్య ఇంక దాపరికము లేదు. నీ సంగతి నాకు తెలియదనుకొనుచున్నావు కాబోలు. నీరహస్యము బట్టబయలై పోయినది. నీ రహస్యమేమో నా కిప్పుడు సంపూర్ణముగ తెలియును."

అంతట ముసలివాడు గజగజ వణకుచు చూడసాగెను.

క్విల్పు ఇంకను ఇట్లు చెప్పసాగెను: "నీవాశ్చర్య పడు చున్నావు కాబోలును. నీ వాశ్చర్యపడుట సహజమే. నీకు సంబంధించిన రహస్యము నాకు తెలియనిది ఏదియు లేదు. అవును, లేదు. మమ్మాటికిని లేదు. నీవు నావద్దనుండి ఎన్నో రకములుగా డబ్బు తీసికొన్నావు. నీవు ఆ డబ్బునంతను ఏమి చేసినావో నాకు బాగుగా తెలియును. ఏమిచేసినావో చెప్పనా? నీకెట్టి అభ్యంతరమును లేదుకదా?"

"లేదు. చెప్పుము."

"పేకాటలో వెచ్చించినావు. నీవు ప్రతిరాత్రి పేకాటకు పోవుచుండెడివాడవు. అపారమగు ధనమునుసంపాదింపవలయునను నుద్దేశ్యముతో నీ వందుకు పూనుకొన్నావు. అవునా? కాదా? నా ధనమునంతను నీవా ఆటలో వెచ్చింపదలచినావు. అవునా? కాదా?"

"అవును! అవును!"

"నీవు జూదరివి. నా సొమ్మును జూదములో వెచ్చింప దలచినావు. నీ ఆటలు సాగనిచ్చుటకు నేను గ్రుడ్డివాడనను కొన్నావా ఏమి? ఎంత తెలివితక్కువవాడవు! ఎంత మోస గాడవు!"

"నేను జూదరినికాను. నా తరఫున భగవంతుడు సాక్షిగా నున్నాడు. నే నెన్నడును నా స్వలాభముకొఱకు ఆడలేదు. ఆటపై గల ప్రేమతో ఆడలేదు. నేను నా చిన్నారి నెలబాల కొఱకు ఆడినాను. ఆడినప్పుడెల్ల నాకు విజయమును చేకూర్ప వలసినదని భగవంతుని ప్రార్థించినాను. కాని నాకు భగవానుడు విజయమును ప్రసాదింపలేదు. నే నెవ్వరితో ఆడినాను? నాతో ఆడినవాండ్రందఱు మోసగాండ్రు; దోపిడిగాండ్రు; స్వార్థపరులు; నరరూపరాక్షసులు. వారు విజయము సాధించి నా సొమ్ము తీసుకొన్నారు. నేను డబ్బు సంపాదించినచో వారివద్దనుంచి సంపాదించి యుండెడివాడను. ఆ సొమ్మంతయు నా నెలబాలకు చెందియుండెడిది. ఆమె సుఖమయ జీవితము గడుపుటకు వీలుం డెడిది. దోపిడిగాండ్రకు వచ్చిన పెద్ద నష్టమేమియు నుండెడిది కాదు. మఱి యిప్పుడు చెప్పుము. నా ప్రణాళిక మంచిదో? కాదో?"

"అసలు ఈ పేకాటలోని కెప్పుడు దిగినావు?"

"ఎప్పుడు దిగినానా? నేనింక ఎక్కువకాలము బ్రతకనని తోచినది. ఉన్న స్వల్పకాలములోనే నా చిన్నారి నెలబాలకు అపారమగు ధనము సంపాదించి యీయవలయునను అభిప్రాయము కలిగినది. అప్పుడు నేను పేకాటకు వెళ్ళుట ప్రారంభించినాను."

"అటులనా?"

"అవును. నేనా విషయమునుగూర్చి దీర్ఘముగా ఆలోచించినాను. సరిగా నిదురకూడ పోకుండ ఆలోచించినాను. అప్పుడు నేను ప్రారంభించినాను. అందు ఆనందమేమియు లేదు. ఆనందము కలుగవలయునని నేను ఆశించియుండలేదు. ఎప్పుడును ఆందోళనయే! నిదురలేనిరాత్రులే! మనశ్శాంతి నశించినది. ఆరోగ్యము నశించినది! విచార సముద్రమున మునిగిపోయినాను. శరీరము శుష్కించిపోయినది."

"మొదట నీవు కొంతధనమును దాచియుంచితివి గదా! ఆ ధనమునంతను పేకాటలో పోగొట్టుకొన్నావు. తరువాత నా వద్దకు వచ్చినావు. నా వద్దనుండి తీసికొనిపోవుచున్న ధనమును పెంచుచున్నానని నాతో చెప్పసాగినావు. కాని దానినంతను పోగొట్టుకోసాగినావు. నీవా విధముగ నన్ను మోసగింపసాగినావు. నీవంటి దివాళాకోరుకా నేను డబ్బిచ్చినది. అయ్యో! అయ్యో! నీవెప్పుడైన పేకాటలో విజయము సాధించినావా?"

"లేదు, లేదు. ఒక్కసారియైన విజయమును సాధింపలేదు."

"చాలకాలము ఆడినచో ఎప్పటికైన లాభము పొంద

వచ్చుననియు, వచ్చిన నష్టము పూడ్చుకోవచ్చుననియు నీవింత వఱకు భావించుచు వచ్చినావు. మఱి నీ అనుభవమిందుకు వ్యతిరేకముగ నున్నది."

"నీ యూహ సరియైనదే! అందుకు సందేహమేమియు లేదు. అంతిమ విజయము నాదే. నేటినుండి విజయము నాదే యనుటలో కొట్టి సందేహమును లేదు. నాకిప్పుడు గట్టినమ్మిక మేర్పడినది. నేను అపారమగు ధనము సంపాదింపగలను. నీ బాకీ తీర్చివేయుదును. నాచిన్నారి నెలబాలకు కావలసినంత ధనము నిచ్చెదను. నాకిప్పుడు అపూర్వమగు అవకాశము లభింప నున్నది. ఈ సమయమున నన్ను విడిచిపుచ్చకుము. నాకు నీవు తప్ప మఱియింక దిక్కెవ్వరును లేరు. నేను నీ ఒక్కనిపైననే ఆధారపడి యున్నాను. నాకు కొంచెము ఒక్కసారి సాహాయ్యము చేయుము. ఈ ఒక్కసారి సాహాయ్యము చేయుము."

ఆ మాటలనువిని క్విల్పుభుజము లెగురవైచెను.

ముసలి వాడింకను నిట్లనెను: "క్విల్ప్! నీవు ఎంతయు దయార్ద్ర హృదయుడవు. నీవింతవఱకు నాకెంతో సాహాయ్యము చేసినావు. ఈ ఒక్కసారికూడ సాహాయ్యము చేయుము. నేనీ సారి తప్పక విజయము సాధింపవలయును. ప్రియమైన క్విల్ప్! కొలదిగా సాహాయ్యము చేసిన చాలును. నలువది పౌను లిచ్చిన చాలును."

"నీ కింతకుముందు కడపటిసారి డెబ్బదిపౌను లిచ్చి యుంటిని. ఆ సొమ్మునంతను నీవు ఒక్కరాత్రిలో పోగొట్టు కొంటివి.

"అవును. నిజమే కాని నేను విజయము సాధించు కాల

మప్పటి కింకనురాలేదు. ఇప్పుడు వచ్చినది క్యోల్ప్ ! క్యోల్ప్! ఆలోచించుము! దయచూడుము. ఈ పాట్లన్నియు నేను నెల బాల కొఱకేకదా పడుచున్నది! నీ వామెను దయతో చూడుము. ఆమెకొఱకు సాహాయ్యము చేయుము. ఇందు నా స్వార్థమేమియులేదు. నే నొక్కడనే నైనచో సంతోషముగ మరణించి యుండెడివాడను. ఆమెకొఱకు సాహాయ్యము చేయ వలయునని నిన్ను ప్రార్థించుచున్నాను. నాకొఱకు కాదు! ఆమె కొఱకు! నా చిన్నారి నెలబాలకొఱకు!!"

"నేను మఱియొకరితో మాట్లాడుటకు వెళ్ళిపోవలసి యున్నది లేనిచో నీతో మఱియొక అరగంటకాలము గడపి యుండెడివాడనే."

"క్యోల్ప్! క్యోల్ప్! దయచూడుము. నా చిన్నారి నెల బాల సంగతి నీ కంతయు తెలియును. నావలన నీ విదివఱ కెంతో లాభము పొందినావు. ఈ ఒక్కసారి దయచూడుము! ఈ ఒక్కసారి దయచూడుము. నేను ఒక్కడినే నైనచో సంతోషముతో మరణించుటకు సిద్ధముగా నున్నాను. కాని నే నిప్పుడు చిన్నారి నెలబాలకొఱకు పాటుపడవలసి యున్నది. నేను చేసినదంతయు ఆమెకొఱకే. ఆమెకొఱకు నాకు సాహాయ్యము చేయుము. నా కొఱకుకాదు! ఆమెకొఱకు!"

"నేను వెంటనే వెళ్ళిపోవలసి యున్నది!"

"ఈ ఒక్కసారికి సాహాయ్యము చేయుము. నా కొఱకు కాదు! నా చిన్నారి నెలబాలకొఱకు !!"

"నేను నీ కిప్పుడు సాహాయ్యము చేయను. ఇంతవఱకు నీవు డబ్బు సక్రమముగా వినియోగించుచున్నావని భావించుచు

వచ్చినాను. కాని నీవు నన్ను మోసగించినావు. జూదములో డబ్బంతయు తీగులబెట్టినావు. అంతయు తెలిసిన తరువాత నీకు సాహాయ్యము చేయుటకు నేను తెలివితక్కువ వాడనుకాను"

"నేను ఆపని ఎందుకు చేసినాను? నా చిన్నారి నెలబాలకు అపారమగు ధనమును సంపాదించి యీయవలయునను సముద్దేశ్యముతో ఆ విధముగ చేసినాను. ఇందు నా స్వార్థమేమియు లేదు. అంతయు నా చిన్నారి నెలబాల కొఱకే! ఈ విషయము గ్రహింపుము."

"అవునవును. ఇప్పుడు ఆ విషయము నాకు చక్కగా అర్థమయినది. కాని నీవు నన్ను మోసగించినావను విషయమును నే నెట్లును మఱచిపోగలను? ఇంతవఱకు నీవు మంచి నమ్మకమైనవాడవని తలచుచు వచ్చినాను. అందువలననే తాకట్టు ఏమియు లేకుండ వట్టి పత్రముమీదనే నీకు డబ్బు అప్పిచ్చినాను. మఱి యిప్పుడు నాకు నీ రహస్య జీవితమంతయు చక్కగా తెలిసినది."

"నేను ఆ విషయము ఎవ్వరికి తెలియకుండ నుండవలయునని ఎంతో జాగ్రత్తపడినాను. మఱి నీకా విషయమెవ్వరు చెప్పినారు? ఎవ్వరు చెప్పినారో చెప్పుము. ఆ చెప్పినవారిపేరు నేనును తెలిసికొనవలసి యున్నది."

నెలబాల పేరుచెప్పుటకు క్విల్పు ఏమాత్రము ఇష్టపడకుండెను. అందుల కతనికి నెలబాలపై కల దయ కారణము కాదు. నెలబాలవద్దనుండి ఆ రహస్యమును తెలిసికొనుటకు తాను పన్నిన పన్నాగము బయల్పడునని అతని భయము! అందువలన నతడు "ఎవ్వరనుకొనుచున్నావు?" అని ఎదురుప్రశ్న

వేసెను.

"నీకా రహస్యమును చెప్పినవాడు కిట్ అయియుండును! అవును. ఆ బాలుడే అయి యుండును. అందుకు సందేహ మేమియు లేదు. అతడు గూఢచారిగా ప్రవర్తించి నా రహస్యమును గ్రహించినాడు. నీవతని వద్దనుండి ఆ రహస్యమును గ్రహించినావు."

కిట్ అనిన దుర్మార్గుడగు క్వీల్పునకు అమితమగు ద్వేషము. అందువలన నతడు ఇట్లనెను: "ఆ పేరు నీకెట్లు తట్టినది? అతని పేరు నీయూహకెట్లు తోచినది? అవును, ఆ పనిచేసినది కిట్! పాపము, కిట్!"

పిమ్మట క్వీల్పు ఆ ప్రదేశమును వీడిపోయెను. త్రోవలో అతడు ఇట్లనుకొనెను: "కిట్‌నుగూర్చి బాగుగా చెప్పినాను. అతడు నన్నెన్నోసార్లు వెక్కిరించినాడు. నేను అనాకారినని ఎన్నోసార్లు అన్నాడు. అతనికిప్పుడు తగినశాస్తి జరుగును. తప్పక తగినశాస్తి జరుగును!"

నాటిరాత్రి నెలబాల కిట్ గృహమునకు బోయెను. నెల బాలను చూడగనే కిట్ ఇట్లనెను: "నెల్లీ! ఈ అర్ధరాత్రి సమయమున నెందులకు వచ్చినావు?"

"నేనిచ్చట నింక ఒక్కక్షణమైనను నుండుటకు వీలు లేదు. తాతయ్యకు తీవ్రముగా జబ్బుచేసినది. నేను చూచు నప్పటి కతడు నేలపై మూర్ఛపోయి యున్నాడు."

"అయిన నేను వెంటనే డాక్టరువద్దకు పరుగెత్తుకొని పోదును. నేను తిన్నగా మీయింటికే వచ్చెదను. మీ..."

"వలదు, వలదు. నీవు మాయింటికి రావలదు. ఇప్పుడే

కాదు. ఇంక నెప్పుడును నీవు మాయింటికి వచ్చుటకు వీలు లేదు ఎప్పుడును రావలదు."

"ఏమి!"

"అవును. ఎన్నటికిని రాకూడదు. కారణమేమని నన్ను అడుగకుము. కారణమేమో నాకు తెలియదు. దయయుంచి కారణమేమని నన్ను అడుగకుము. ఇందులకు నీవేమాత్రము విచారింపవలదు. నన్ను అసహ్యించుకొనవలదు. నిజముగా ఆ విషయములో నాకెట్టి సంబంధము లేదు. నేను ముమ్మాటికి సత్యమునే పలుకుచున్నాను."

కిట్ కన్నులు చాల పెద్దవి చేసికొని నెలబాల వంకకు చూడసాగెను; ఎన్నోసార్లు నోరు తెరచెను; ఎన్నోసార్లు నోరు మూసికొనెను; కాని నోటినుండి ఒక్కముక్కయినను బయటకు రాలేదు.

నెలబాల ఇంకను ఇట్లనెను: "ఇదిగో, ఈ వారమునకు కీయవలసిన సొమ్ము తెచ్చినాను, ఈ బల్లపై నుంచుచున్నాను. నీవు చాల మంచివాడవు. నన్నెంతో దయతో చూచుచుండెడి వాడవు. అందువలన నీకు మఱికొంతసొమ్ము తెచ్చినాను. ఆ సొమ్ముగూడ ఈ బల్లపై నుంచుచున్నాను. ఇందులకు నీ వేమాత్రము విచారింపకుము. ఈవిషయమును హృదయమునకు పట్టించుకొనకుము. నీవింక మాయింటికి రాకుండుట నాకెంతయు విచారింపదగిన విషయము. అయినను నే నిందు చేయదగినది ఏమియు లేదు. జరిగినదేమో జరిగినది ఇంక సెలవు."

నెలబాల గజగజవణకి పోవుచుండెను. కన్నీరు కాచ్చుచుండెను. ఆమె కిట్ గృహమును వీడి స్వగృహమునకు పయనమై పోయెను.

4

తాతయ్య తీవ్రమైన జ్వరముతో బాధపడసాగెను.

అతని జ్వరము ఎంతకును తగ్గకుండెను. ఒక్కొక్కనాడు అతని ప్రాణము పోవునట్లుండెను. నెలబాల రాత్రిం బగళ్లు తాతయ్యప్రక్కనే కూర్చుండి సేవచేయసాగెను. మఱియు నామె ప్రతినిత్యమును సర్వలోకరక్షకుడగు భగవానిని ప్రార్థింపనాగెను. "ఓ కరుణామయుడా! మా తాతయ్యను రక్షింపుము! అతడింకను ఎన్నో సంవత్సరములు జీవించునట్లు అనుగ్రహింపుము!" అని ఆమె ప్రతినిత్యమును ప్రార్థించుచుండెను. ఎట్టకేలకు భగవంతుడామె కోరికను అనుగ్రహించెను. తాతయ్య జ్వరము తగ్గిపోయెను. కాని అప్పటికి చాలవారములు గడచిపోయెను.

తాతయ్యకు ఎప్పటిబలము చేకూరునప్పటికి మఱికొన్ని వారములు గడచిపోయెను. ఆ కాలములో నతడు గుఱ్ఱపుస్వారి చేయసాగెను. ఆ సమయమున నెలబాల తాతయ్యప్రక్కనే కూర్చుండియుండెడిది. సరియైన పరిశ్రమవలనను, మంచిగాలిని పీల్చుటవలనను, విశ్రాంతివలనను, నెలబాల చేసిన సేవవలనను తాతయ్య ఎప్పటివలె ఆరోగ్యవంతుడయ్యెను.

కాని తాతయ్య ఆరోగ్యవంతుడగులోపున ఒక అవాంఛ

నీయమైన సంఘటన జరిగెను. అది ఏమన క్విల్పు తాతయ్య గృహమును వశపఱచుకొనెను. తాతయ్య క్విల్పుకు కొంత సొమ్మీయవలసి యుండెనుగదా! అందువలన క్విల్పుకు చట్ట సమ్మతమైన హక్కులు కొన్ని సంక్రమించినవట. ఆహక్కులేమో ఎవ్వరికిని తెలియవు. ఎవ్వరును ప్రశ్నింపలేదు. క్విల్పు ఆపనిని బ్రాస్ అను వకీలు సాహాయ్యమున పూర్తిచేసికొనెను.

బ్రాస్ అను నతడు వట్టి దుర్మార్గుడు; కడు నీచుడు. అతని చరిత్ర అంతయు మఱియొక దుష్టుడగు క్విల్పుకు తెలియును. మఱి క్విల్పుకు సాహాయ్యము చేయకపోయినచో అతని రహస్యములన్నియు బయల్పడును. అందువలన నతడు భయపడి క్విల్పు చెప్పినట్లెల్ల చేయుచుండెను. వేయేల? అతడు క్విల్పు బానిసిడుగా పనిచేయుచుండెను. ప్రతిదినము అతడు క్విల్పుతో బాటు తాతయ్యగృహములో నిదురించుచుండెను.

తాతయ్యకు సంపూర్ణారోగ్యము చేకూరినతరువాత ఒక నాడు క్విల్పు అతనివద్దకుపోయి ఇట్లనెను: "మిత్రమా! నీకు తిరిగి ఎప్పటి ఆరోగ్యము చేకూరినందుకు నేనెంతయు సంతసించు చున్నాను. నీకిప్పుడు ఎప్పటివలె బలము చేకూరినదికదా?"

"అవును, అవును."

"మిత్రమా! నేను నిన్నిప్పుడు తొందఱ పెట్టదలచుకో లేదు. కాని నీ భవిష్యత్తును సాధ్యమైనంత త్వరలో నిర్ణయించు కొనుట మంచిది."

"అవునవును. అందఱకు అదిమంచిది. అందుకు సందేహ మేమియు లేదు."

"ఇంక సందేహ మెందులకు?"

"అవును, సందేహ మెందులకు? అయినను దేనికిం సందేహము?"

"ఏమియు లేదు. నీవు నాకు డబ్బు బాకీపడినావుగదా! ఆ బాకీక్రింద నేను నీ అంగడిని, ఇంటిని వశపఱచుకొన్నాను. ఆవిషయము నే నీకు చెప్పుటకు వచ్చినాను."

"ఏమి? నాయింటిని, అంగడిని వశపఱచుకొన్నావా? నా కా సంగతి ఏమియు తెలియదే!"

"తెలియకపోయిన వచ్చిన నష్టమేమియున్నది? ఇప్పుడు చెప్పినాను కనుక తెలిసికొనుము."

"అయిన ఇప్పుడు నన్నేమి చేయుమందువు?"

"నేను అంగడిని, ఇంటిని మఱియొకరికిఅమ్మివైచినాను. కాని ఈ అమ్మకమువలన నాకు రావలసిన సొమ్మంతయు రాలేదు. నేను నష్టపోయినాను. కాని నేనందులకు ఏమాత్రము విచారించుటలేదు నీవు నాకు మిత్రుడవుకదా!"

"మఱి నీ కిప్పు డేమి కావలయును?"

"ఏమి కావలయునా? అసలు విషయము చెప్పెదను వినుము. మీ రిరువురును ఈ ఇల్లు వీడిపోవలయును. అప్పుడు ఈ ఇంటిని కొన్నవాడు వచ్చి ఆక్రమించుకొనును."

"నేను, నా చిన్నారి నెంబాల ఈ యింటిని వీడిపోవలయునా?"

"అవును."

"మఱి నా ముద్దుల నెంబాలను ఎక్కడకు తీసికొని పోను?"

"ఎక్కడకైనను తీసికొని పోవచ్చును. ఈ ప్రపంచము

ఎంతో విశ్రాంతిమైనది కదా! ఇన్నికోట్ల మందికి ఆశ్రయము లభించు చున్నప్పుడు, మీ యిరువురకు ఆశ్రయము లభింపదా?"

"అవును. బాగుగా చెప్పినావు."

"మఱి మీ రిరువురును వెంటనే ఖాళీచేసి పోరాదా?"

"వెంటనే పోవుట ఎట్లు? నేడు ఏ వారము?"

"మంగళవారము."

"మాకు కొంచెము గడువు ఈయరాదా?"

"ఇచ్చుటకు సిద్ధముగా నున్నాను. మఱి శుక్రవారము వెళ్ళి పోదురా?"

"శుక్రవారమా? వెళ్ళిపోయెదము."

"మంచిది. శుక్రవారము మాట జ్ఞప్తియందుంచు కొనుము."

"జ్ఞప్తియందుంచు కొనెదను."

"మంచిది. నీ కిప్పటి ఆరోగ్యము చేకూరినందులకు నే నెంతయు సంతసించు చున్నాను. ఇంక నే పోయివత్తును."

అట్లని క్వెల్చు బ్రౌస్ వద్దకు పోయెను.

మంగళవారమునాడు, బుధవారమునాడు తాతయ్య ఏమో తీవ్రముగ ఆలోచించుచున్న వానివలె ఇల్లంతయు తిరుగ సాగెను. అతడు మాటిమాటికిని నెలబాలను కౌగలించుకొని, "ఉత్సాహముగ నుండుము. మన మెప్పుడును కలసియే యుందము. నిన్ను విడిచినేను ఉండను. నన్ను విడిచి నీవు ఉండవు" అని పలుకసాగెను.

గురువారము వచ్చెను. ఆనాడుకూడ అతనిలో నెట్టి మార్పును రాలేదు. కాని సాయంకాల మగుసరికి అతనిలో నొక

విధమగు మార్పు వచ్చెను. ఆ సమయమున తాతా మనమ రాండ్రిద్దరును ఒకచోట కూర్చుండి యుండిరి. ఇరువురును ఏమియు మాట్లాడకుండిరి. ఎట్టకేలకు తాతయ్య ఇట్లనెను: "చిన్నారి నెలబాలా! దయయుంచి నన్ను క్షమింపుము."

"నిన్ను క్షమింప వలయునా? నిన్నెందులకు క్షమింపవల యును? నీవేమి చేసినావని క్షమింపవలయును? తాతయా! నేను క్షమింపవలసిన అవసరమేమి వచ్చినది?"

"అది యంతయు జరిగిపోయిన విషయము. చిన్నారి నెల బాలా! అంతయు నొక కలవలె జరిగిపోయినది! అంతయు నొక కలవలె జరిగిపోయినది!"

"తాతయ్యా! నీవా విధముగ మాట్లాడకుము. దయ యుంచి ఆ విధముగ మాట్లాడకుము. మనము మఱియొక విష యమును గుఱించి మాట్లాడు కొందము."

"అవునవును, మఱియొక విషయమును గుఱించి మాట్లాడుకొందము. మన మా విషయమును గుఱించి చాల కాలము క్రిందట మాట్లాడు కొనుచుండెడి వారము. నెలల క్రిందటనా? వారముల క్రిందటనా? రోజుల క్రిందటనా? నెల బాలా!"

"నీ యుద్దేశ్యమేమో నాకు సరిగా అర్థమగుట లేదు."

"ఆ విషయము నాకిప్పుడు మరల తట్టినది. మన మిక్కడ కూర్చున్నప్పటినుండి తట్టినది. నెలబాలా! నీకు మేలు కలుగుగాక!"

"అది ఏమి?"

"బిచ్చమెత్తుకొని జీవింపవచ్చునని నీ విదివఱకొకసారి

అన్నావు. ఆమాట జ్ఞప్తియందున్నదా! మెల్లన మాట్లాడు కొందము. మన మాటలు వారికి వినబడినచో నేను పిచ్చివాడ నందురు. నిన్ను నానుండి విడదీయుదురు. మనమింక నిక్కడ ఒక్కరోజైనను ఉండవలదు! ఒక్కరోజైనను ఉండవలదు. ఈ ప్రదేశమును వీడి దూరప్రాంతములకు పోదము."

"అవును, అటులనే పోదము. మన మీ ప్రదేశమును వీడి పోదము. మన మింక ఎన్నడును వెనుకకు తిరిగి చూడరాదు. ఈ ప్రదేశమును గూర్చి తలపరాదు. మనమిక్కడ నింక ఏ మాత్రముండరాదు. మనము విశాల ప్రపంచంలో స్వేచ్ఛగా తిరుగ వచ్చును."

"మన కింక అడ్డు ఏమియు నుండదు. మనమింక స్వేచ్ఛగా పొలములలోను, వనములలోను తిరుగుదుము. నదుల వెంబడి నడచి పోదము. భగవంతుడు అన్నిచోట్ల నున్నాడు. అతడే మనకింక దిక్కు. అతడే మనల నెల్లప్పుడును రక్షించుచుండును. రాత్రి సమయములందు బాధాకరమగు తలపులను జ్ఞప్తికి తీసి కొనివచ్చు గదులలో పరుండుటకంటె, బయట ఆకసము క్రింద పరుండుట మేలు. ఆకశము ప్రకాశవంతమగు నక్షత్రములతో కడు మనోహరముగ నుండును! అప్పుడు ఎన్నో తీయని తలంపులు వచ్చును. మన మిరువురము కలసి యుండి సంతోషము గను, సుఖముగను జీవింతము. జరిగిపోయిన దానిని పూర్తిగా మఱచిపోదము. అది ఎన్నడును జరుగలేదని భావింతము; ఎన్న డును జరుగలేదని భావింతము."

"మనము సుఖముగా జీవింతము. ఇచ్చట మనకింక సౌఖ్యము లేదు."

"నీవు నిజము చెప్పినావు. మనమింక నిక్కడ సుఖపడ లేము. తెల్లవాఱకముందే మన మీ ప్రదేశమును వీడిపోదము. మెల్లని వెళ్ళిపోదము. మనల నెవ్వరు చూడకుండ వెళ్ళిపోదము. మనల నెవ్వరును వెంబడించుటకు వీలులేకుండ వెళ్ళిపోదము. చిన్నారి నెలబాలా! నీ బుగ్గలు పాలిపోయినవి! నీ కన్నులు బహువుగా కాంతి విహీనములై యున్నవి. నీవు నాకు అపారమగు సేవ చేసినావు! నిదుర పోకుండ శ్రమించినావు! అందువలననే నీ విట్లున్నావు. నా కోసం నీ విట్లు తయారైనావు కాని అనతికాలములోనే నీ వెప్పటివలె తయారగుదువు. దూర ప్రాంతములకు పోయిన తరువాత నీ వెప్పటి వలె తయారగుదువు. సంతోష సాగరమున మునిగి తేలుచుందువు. చిన్నారి నెలబాలా! తెల్లవారకముందే మన మీ దుఃఖ కూపమును విడిచి పోదము. పక్షులవలె స్వేచ్ఛగా, సంతోషముతో సంచరింతుము."

నాటిరాత్రి తాతయ్య సుఖముగా గుఱ్ఱుపెట్టి నిదురించెను. నెలబాల తన వస్తువులను, తాతయ్య వస్తువులను కొన్నిటిని మూటకట్టెను. ఇల్లంతయు ఒక్కసారి తిరిగి చూచెను. తరువాత నామెకూడ నిదురించెను.

నెలబాల కానిదురలో ఎన్నో తీయని కలలు వచ్చెను. ఆ కలలమధ్య హఠాత్తుగా నామెకు మెలుకువ వచ్చెను. అప్పటికింకను తెల్లవాఱలేదు. ఆకాశమున నక్షత్రములు చక్కగా ప్రకాశించుచుండెను. క్రమక్రమముగా నక్షత్రముల ప్రకాశము తగ్గిపోసాగెను. అనగా త్వరలోనే సూర్యోదయము కానున్నదన్నమాట. అప్పుడు నెలబాలలేచి ప్రయాణమునకు కను

కూలమగు దుస్తువులను ధరించెను.

అప్పటికి తాతయ్య ఇంకను గుఱ్ఱుపెట్టి నిదురించుచుండెను. నెలబాల అతనికి నిద్రాభంగము కలిగింపలేదు. ఎట్లకేలకు అతడుకూడ నిదురనుండి లేచెను. వెంటనే అతడును ప్రయాణమునకు సిద్ధమయ్యెను. మనుమరాలు తాతయ్య చేయి పట్టుకొనెను. ఇరువురును ఇంటిలోనుండి బయటకు రాసాగిరి. అప్పటికి ఆ ఇంటిలోనే పరుండియున్న క్విల్పు గుఱ్ఱుపెట్టి నిదురించుచుండెను. మఱియొక గదిలోనున్న బ్రాస్‌కూడ గుఱ్ఱుపెట్టుచు పరుండియుండెను. తాతా మనుమరాండ్రిరువురును మెల్లన వీధితలుపు తెఱచుకొని బయటపడిరి. వీధిలో వారిరువురును ప్రశాంతముగ నిలబడిరి.

"ఏ దారిని పోదము?" అని నెలబాల తాతయ్యను ప్రశ్నించెను.

నిస్సహాయునివలెను. ఏ నిశ్చయమునకు రాలేనివానివలెను తాతయ్య మొదట నెలబాలవంకకు చూచెను. తరువాత కుడిప్రక్కకు, ఎడమప్రక్కకు చూచెను. మరల నెలబాలవంకకు చూచి తల పంకించెను. "నాకేమీ తెలియదు. ఇకనుండి నేను నీ స్వాధీనమందున్నాను నీ వెచ్చటకు తీసుకుపోయినను సరే. నీవే నాకు మార్గదర్శివి" అని అతడు అనుచున్నట్లుండెను. ఆ విషయమును నెలబాల గ్రహించెను. ఆ భారమును వహించుట కామె సంసిద్ధముగా నుండెను. అందువలన నామె తాతయ్య చేయి పట్టుకొని ఒక దిక్కుకు తీసుకొని పోసాగెను.

అది జూన్ మాసములో నొకరోజు. నీలివర్ణపు టాకాశము కడు ప్రశాంతమగు కాంతితో నిండియుండెను, వీధు

లన్నియు నిర్మానుష్యములై యుండెను. ఇండ్లు, అంగళ్ళు మున్నగునవి అన్నియు మూయబడియుండెను. ప్రభాత సమయపు పిల్లవాయువులు చక్కగా వీచుచుండెను.

తాతా మనుమరాండ్రా ప్రశాంత సమయమున నుంచి భవిష్యత్తునుగూర్చి కలలుగనుచు సాగిపోవుచుండిరి. వారెట్లకే లకు పట్టణమును వీడి బయటకుపోయిరి. మఱి తరువాత ఎక్కడకు పోవుచుండిరో వారికే తెలియదు. వారికొక గమ్యస్థాన మనునది లేదు.

బాగుగా తెల్లవాఱిన తరువాత క్విల్పు నిదురనుండి లేచెను. అప్పుడు బ్రాస్‌కూడ లేచెను. తాతా మనుమరాండ్రు తనతో చెప్పకుండ ఇల్లువీడి పోయినారను విషయమును క్విల్పు గ్రహించెను. అతడు బ్రాస్‌తో నిట్లనెను: "వారిరువురును నాతో చెప్పకుండ వెళ్ళిపోవుటకు చాల వింతగాను, ఆశ్చర్యకరముగ నున్నది. వారిట్లెందుకు చేసినారో నాకేమియు అర్థమగుటలేదు. నేనా ముసలివానికి గాఢ మిత్రుడను. అట్టి నాతో చెప్పకుండ వెళ్ళిపోవుట ఆశ్చర్యకరమైన విషయము కాదామఱి! గమ్య స్థానము చేరుకొన్న తరువాత అతడు నాకు తప్పక ఉత్తరము వ్రాయును, లేదా నెలబాలచే వ్రాయించును. అవునవును, నెల బాలచే తప్పక వ్రాయించును. నెల్లీకి నేననిన ఎంతయు ఇష్టము! అందాల నెల్లీ!"

తాతా మనుమరాండ్రు తనతో చెప్పకుండ వెళ్ళిపోయి నందుకు క్విల్పు ఆశ్చర్యపడుటయేగాదు: తీవ్రముగా బాధపడు చుండెనుగూడ. నెలబాల తనతో బాటు కొన్ని వస్తువులను తీసి కొనిపోయి యుండెనుగదా. ఆ వస్తువులు తనకు దక్కలేదని

క్విల్పు ఎంతయు బాధపడుచుండెను. అతనికింకొక విషయమును గూర్చిగూడ బాధపడసాగెను.

"ముసలివాడు రహస్యముగా అపారమగు ధనమును దాచియుండును! నేనా విషయమును అనుమానింపలేకపోతిని; కనిపెట్టలేకపోతిని. అతడా గుప్తధనమును తీసికొని నాకు తెలియకుండ వెళ్ళిపోయినాడు. నన్నెంత మోసము చేసినాడు!" అని క్విల్పు అనుకొనసాగెను. అది ఆ దుర్మార్గునకెంతయు బాధాకరముగ నుండెను.

మఱి కొంతసేపటికి కచ్చేటకు కిట్ వచ్చెను. అతనిని చూడగానే క్విల్పు ఇట్లనెను: "ఓహోహో! నీవా! రా రమ్ము అయిన నీ ముసలి యజమానుడు, పడుచు యజమానురాలు వెళ్ళిపోయినారన్న మాట!"

అంతట కిట్ చుట్టును కలయజూచుచు, "ఎక్కడకు?" అని ప్రశ్నించెను.

"అనగా నీకా విషయం తెలియదని చెప్పుచున్నావా? వారెక్కడకు పోయినారో చెప్పుము. తెలిసినదా?"

"నాకు తెలియదు."

"ఇంక ఆ మాటలు కట్టిపెట్టుము. నిజము చెప్పుము. నేను నిదురనుండి లేవక పూర్వమే వారిరువురును దొంగతనముగా పాఱిపోయినారు. ఆ విషయము నీకు తెలియదందువా? వారెక్కడకు పోయినారో నీకు తెలియదందువా? నీకు తప్పక తెలియును"

"తెలియదు" అని కిట్ ఆశ్చర్యముతో ననెను.

"నీకు తెలియదా? ఒకనాటి రాత్రి నీవీ యింటి ప్రాంత

ములో దొంగవలె తిరుగాడుచుండలేదా? నేనా దృశ్యమును చూడలేదనుకొన్నావా? నీ కప్పుడు వారు చెప్పియుండలేదా?"

"లేదు."

"నీకు చెప్పియుండలేదా? మఱి నీకేమి చెప్పినారు? నీవు నెలబాల కలసి ఏమి మాట్లాడుకొన్నారు?"

తాతయ్య జబ్బులోనుండగా కిట్ ఒకనాడు నెలబాలతో రహస్యముగా మాట్లాడియుండెను. అందువలన కిట్ క్రీల్పుతో నిట్లనెను: "వారిని మా యింటికివచ్చి నివసింపవలసినదని ఆహ్వానించినాను"

"ఓహో! అటులనా! అయినవారు మీ యింటికి తప్పక వత్తురు."

"వారు మా ఇంటికి వత్తురందురా?"

"వారు మీ ఇంటికి తప్పక వత్తురని నేను నమ్ముచున్నాను. వారు మీ ఇంటికి వచ్చినపుడు, నాకా విషయమును తెలియజేయుము. వినబడినదా? నేను వారికొక సాహాయ్యము చేయవలెనని నిశ్చయించుకొన్నాను. మఱివారి ఉనికి తెలిసినగాని సాహాయ్యము చేయలేనుగదా! నేను చెప్పినది విన్నావా?"

"విన్నాను. అటులనే చేయుదును" అని యని కిట్ తన ఇంటికిపోయెను.

5

తాతా మనమరాండ్రు లండన్ మహానగరమును వీడి ప్రశాంతముగ ప్రయాణమై పోవుచుండిరి. కొంతసేపటికి వారు మనోహర దృశ్యములుగల ప్రదేశమును చేరుకొనిరి. అచ్చటి ప్రకృతి సౌందర్యము వారినెంతయు ఆకర్షించెను. మఱియు వా రప్పటికి అలసిపోయియుండిరి. అందువలన వారచ్చట ఆగిరి. అచ్చట నొక చక్కని సరోవరముండెను. అందలి నీటిలో వారు కాలుసేతులు, ముఖము కడుగుకొనిరి. తరువాత వారు తమతో తెచ్చుకొన్న ఆహార పదార్థములను కొన్నింటిని భుజించిరి. భోజనమునకు పూర్వము వారు సర్వలోకరక్షకుడగు భగవానుని భక్తి పూర్వకముగ ప్రార్థించిరి.

"మన కష్టము లింతటితో తీఱిపోయిన వనుకొందును. ఇంక మన కెన్నటికిని కష్టములు రారాదు" అని నెలబాల అనెను.

"అవునవును. మన కిం కెన్నటికిని కష్టములు రావు. నీవు, నేను కష్టములనుండి విముక్తి పొందినాము. మన కింక మంచి భవిష్యత్తు ఉన్నది. అందుకు సందేహమేమియు లేదు" తాతయ్య అనెను.

"తాతయ్యా! నీవు అలసిపోయినావా? ఇంతదూరము నడచి వచ్చుటవలన నీ ఆరోగ్యము చెడిపోలేదుకదా?"

"మనము కష్టములకునిలయమైన లండనుమహానగరమును విడిచివచ్చినాము. అందువలన ఇకముందెన్నడును నాఆరోగ్యము చెడిపోదని నిశ్చయముగ చెప్పగలను. అమ్మాయి! మనమింక

బయలుదేఱిపోదము. మనము లండను మహానగరమునకు సాధ్యమైనంత దూరముగా పోదము."

"నీవు కొంచెముసేపు విశ్రాంతి తీసికొనుట మంచిదని తోచుచున్నది. అందువలన నష్టమేమియు నుండదు."

"అటులనే విశ్రాంతి తీసికొందును. నీవుమాత్రము నన్నెన్నడును వదలిపోకుము. ఇక నా అంతట నేను ఏపనియు చేయలేను. నేను నీపై సంపూర్ణముగ ఆధారపడి యున్నాను. నాకు మార్గము చూపవలసిన భారము నీపై నున్నది. నన్ను విడిచిపోనని చెప్పుము. నన్ను విడిచిపోయినచో నేను మరణింతును"

అట్లని అతడు తన శిరస్సును ఆమె భుజముపై బెట్టి ఏడువసాగెను. కొన్ని దినములక్రిందట తాతయ్య ఆవిధముగ అని యుండినచో నెలబాల అతనితోబాటు కంటికి మంటికి ఏక ధారగా ఏడ్చియుండెడిది. కాని యిప్పు డామె అటుల చేయ లేదు. ఆమె చక్కని మృదువైన మాటలతో తాతయ్యను ఓదార్చెను. "నేను నిన్ను విడిచిపోవుటయా! ఇది ఎన్నటికిని జరుగని విషయము! అసలు నీకా ఆలోచన ఎట్లు తట్టినది?"అని యని ఆమె మందహాసము చేసెను. ఆమె యింకను శతవిధముల తాతయ్యను ఉత్సాహపఱచెను. అనతికాలములో నతడు నిదురించెను.

కొంచెముసేపటికి తాతయ్య నిదురనుండి లేచెను. అంతట నిరువురును మరల ప్రయాణము ప్రారంభించిరి. వారి బాట కొకవైపున పంటభూములును, మఱియొకవైపున చక్కని గడ్డిభూములును నుండెను. వినీల నిర్మలాకాశమున భరద్వాజ

పక్షులు కడు మనోహరముగ గానము చేయుచుండెను. పలు రకముల సువాసనలతో కూడిన గాలి చక్కగా వీచుచుండెను. అచ్చటచ్చట వారికి కుటీరములు కనబడుచుండెను. వారావిధముగ పగలంతయు నడచిరి. చీకటి పడినతరువాత వారొకయిల్లు చేరుకొని అచ్చట నిదురించిరి. తెల్లవారినతరువాత వారు మరల ప్రయాణము ప్రారంభించి వేగముగ నడవసాగిరి.

వారు మధ్య మధ్య విశ్రాంతి తీసుకొనుచుండిరి. కాని ఎంతోసేపుమాత్రము విశ్రాంతి తీసికొనుటలేదు. విశ్రాంతి తీసికొన్నతరువాత వారు ప్రయాణవేగము హెచ్చించుచుండిరి. సాయంకాలము అయిదుగంట లగుసరికి వారు కొన్ని కుటీరములున్న గ్రామమును చేరుకొనిరి. అచ్చట నెలబాల ప్రతి యింటి వంకకును చూడసాగెను. "ఏ కుటీరములో విశ్రాంతి తీసికొనుటకు సౌకర్యము లభించును? ఏ కుటీరములో పాలు దొరకును?" అని ఆమె ఆలోచించుచుండెను. కాని ఆమె ఆ విషయమును గూర్చి ఏయింటివారినిగాని అడుగకుండెను. వారు వ్యతిరేకముగ సమాధాన మిత్తురేమోయని ఆమె బిడియపడుచుండెను. ఒక యింటిలో పిల్లలు ఏడ్చుచుండిరి. వేఱొక యింటిలో యజమానురాలేమో కేకలువేయుచుండెను. ఇంకొక ఇంటివారు బీదవారివలె కనబడుచుండిరి. మఱియొక యింటిలో పలువురు మనుజు లున్నట్లుండెను.

ఎట్టకేలకు నెలబాల ఒక యింటిముందు ఆగెను. ఆ యింటిలోనివారు ఒక బల్లచుట్టును కూర్చుండియుండిరి. ముసలివాడొకడు కుంపటికి సమీపముననున్న మెత్తని కుర్చీపై కూర్చుండి యుండెను. ఆ ముసలివాడు తనపట్ల సానుభూతి

చూపుటను నుద్దేశ్యముతో నే నెలబాల ఆ యింటిముందు ఆగెను.

ఆ యింటియజమానుడు, యజమానురాలుగాక ముగ్గురు పిల్లలుకూడ నుండిరి. నెలబాల వారిని సమీపించి, "అయ్యా! మాకు పాలు పోయుదురా? మేమిచ్చట కొంచెముసేపు విశ్రమించుటకు అనుమతింతురా?" అని యడిగెను. అందుకా యింటి వారు అంగీకరించిరి. వెంటనే పెద్దపిల్లవాడు పాలు తీసికొని రాబోయెను. రెండవపిల్లవాడు బాటసార్లు కూర్చుండుటకై రెండు కుర్చీలను వారి దగ్గఱకు లాగెను. మూడవపిల్లవాడు పోయి తల్లి గౌనులో దూఱెను; అతడు చేయి అడ్డుపెట్టుకొని బాటసారులవంక చూడసాగెను.

కుటీరములోనున్న ముసలివాడు తాతయ్య నుద్దేశించి ఇట్లనెను: "భగవంతుడు మిమ్ము రక్షించుగాక! మీరు చాల దూరము ప్రయాణమై వచ్చుచున్నారా?"

"అవును" అని నెలబాల సమాధానమిచ్చెను.

"లండనునుండి వచ్చుచున్నారా?"

"అవును."

నేను లండనుమహానగరమును ఎన్నోసార్లు దర్శించితిని. నేను తలచుగా బండ్లతో బాటు లండనుకువచ్చుచుండెడివాడను. ఇదియంతయు పూర్వకాలపుమాట. నేను కడసారిగా లండను మహానగరమును దర్శించి ముప్పదిరెండు సంవత్సరములైనది. తరువాత అచ్చట ఎన్నోమార్పులు జరిగినవని ఇతరులు చెప్పగా వినియున్నాను. నేనే ఎంతగానో మారిపోయినానుగదా! మార్పువచ్చుటయు సహజమే! ముప్పదిరెండు వత్సరములన్న సామాన్యమా యేమి! నా కిప్పుడు ఎనుబదినాలుగు సంవత్సరములు

వయస్సు! ఇది సామాన్యమైన వయస్సుకాదు. కొందఱు నూఱు సంవత్సరములవఱకు జీవింతురన్నమాట నిజమే. అట్టి వారిని కొందఱిని నేను ఎఱుగుదునుగూడ. నే నిప్పుడు మంచి ఆరోగ్యవంతుడనుకూడ" అని ముసలివాడు తాతయ్య నుద్దేశించి అనెను.

ముసలివా డింకను నిట్లనెను: నాయనా! నాకు నీవు పిల్లవానివంటివాడవు. నా కుమారుడు చనిపోయినాడు. అతడు బ్రతికియుండినచో అతనికిగూడ నీ వయస్సే ఉండి యుండెడిది. అతడు యుద్ధమునకుపోయి కుంటివాడైనాడు. తరువాత మరణించినాడు."

ఆ ఇంటి యజమానురాలా ముసలివాని కూతురు. ముసలివాడు తల ఆడించి అశ్రువులతో నిండిన కన్నులతో ఆమెవంకకు జూచుచు నిట్లనియెను. "నే నింక ఆ విషయమును గూర్చి దీర్ఘముగా మాట్లాడుదునని నీవు భయపడవలసిన పని లేదు. నేనింక మాట్లాడను. ఇతరులను బాధపెట్టుట నా అభిమతము కాదు. నేనిప్పు డెవ్వరినైన బాధపెట్టి యుండినచో, నన్ను క్షమింపవలయునని ప్రార్థించుచున్నాను. ఇంక నేను చెప్పవలసినదేమియు లేదు."

అంతలో పెద్దపిల్లవాడు పాలు తీసికొనివచ్చెను. అంతట నెలబాల తన మూటలోనుండి కొన్ని ఆహార పదార్థములను బయటకు తీసెను. అప్పుడు తాతా మనమరాం డ్రిరువురును చక్కగా భుజించిరి. అచ్చటి వాతావరణము నెలబాలకు అపరిమితమగు నుత్సాహమును కలుగజేసెను.

భోజనమైన తరువాత నెలబాల ఆ యింటి యజమాను

నితో నిట్లనియెను: "అయ్యా! ఏదేని గ్రామముగాని, పట్ట ణముగాని ఇచ్చటి కెంతదూరమున నున్నది?"

"ఇచ్చటికి రెండుమైళ్ళ దూరమున నొక పట్టణమున్నది. అమ్మాయి! ఇప్పుడంత తొందఱ ఏమివచ్చినది? నేటిరాత్రికి మాయిల్లు విడిపోరుకదా!" అని యింటి యజమానుడనెను.

నెలబాల సమాధాన మీయక పూర్వమే తాతయ్య ఇట్లనెను: "నెలబాలా! మనము ఇచ్చట నుండుటకు వీలులేదు; వెంటనే ప్రయాణమై పోవలసియున్నది. మన మింకను దూర ముగా పోవలసియున్నది. సాధ్యమైనంత దూరముగా పోవలసి యున్నది. అర్ధరాత్ర మగువఱకు ప్రయాణమై పోవలసియున్నది."

అంతట యజమాను డిట్లనెను: "ఆ పట్టణములో నొక పూటకూళ్ళ ఇల్లున్నది. అచ్చట మీరు విశ్రాంతి తీసుకో వచ్చును. కాని మీరిప్పుడు బాగుగ అలసిపోయినట్లు కనబడు చున్నారు. ఏదేని ముఖ్యకారణమున్న తప్ప మీ రిచ్చటనే విశ్రాంతి తీసికొనుటమంచిదని నేను అభిప్రాయ పడుచున్నాను."

"అవునవును. మేము పోవుటకు ముఖ్యకారణమున్నది. నెలబాలా! మన మింకను దూరముగా పోవలయునను విషయము నీకు తెలియునుగదా!" అని తాతయ్య ఆందోళనతో ననెను.

అంతట నెలబాల తాతయ్య కోరికలకు లొంగిపోయి ఇట్లనెను: "అవు నవును. మే మిప్పుడే ప్రయాణమై పోవలసి యున్నది. మేము మీ ఆదరణకెంతయు కృతజ్ఞులము. కాని మే మింత తొందఱగా విశ్రాంతి తీసికొనుట తగదు. తాతయ్యా! నేను ప్రయాణమునకు సర్వ సంసిద్ధముగా నున్నాను."

ఎక్కువగా నడచియుండుటవలన చిన్నారి నెలబాల పాద

ములలో నొకటి పుండుబడియుండెను. ఆ విషయము నాయింటి యజమానురాలు గ్రహించియుండెను. ఆమె స్త్రీ; మఱియు పిల్లలతల్లి. అందువలన నామె నెలబాల బాధను సహింప లేకుండెను. ఆమె ఆ పుండ్లను కడిగి మందు వేసెను. అందులకు నెలబాల ఎంతయు సంతసించి, "భగవంతుడు మీకు మేలు చేయుగాక!" అని యనెను. తరువాత తాత మనమరాండ్రు ప్రయాణము ప్రారంభించిరి.

కొంతదూరము పోయినతరువాత నెలబాల వెనుకకు తిరిగి చూచెను. అప్పుడు ఆమె తమకు ఆతిథ్యమునిచ్చిన కుటుంబము వారందఱును ఇంటిముందు నిలబడియున్న దృశ్యమునుచూచెను. అందులో ముసలివాడుకూడ నుండెను. వారందఱును చేతులు ఊపుచుండిరి. మఱికొంత సేపటికి తాతా మనమరాండ్రు కను చూపుమేర దాటిపోయిరి.

తాతా మనమరాండ్రు బాధపడుచు ముందుకు సాగి పోవుచుండిరి. వారావిధముగ సుమారొక మైలుదూరముపోయి యుండిరి. అంతలో వారికి ఏదోబండి యొకటి వెనుక వచ్చు చున్న సవ్వడి వినబడెను. వారు వెనుకకు తిరిగి చూచిరి. బండి యొకటి శరవేగమున వచ్చుచున్న దృశ్యము వారి కంటబడెను. అనతికాలములో బండి వారిని సమీపించెను.

బండివాడు సాదరముగ నెలబాలవంకచూచి, "అమ్మాయి! కొంచెముసేపటిక్రిందట మీరొక గృహములో నాగి పాలు తీసి కొని యుండిరా?" అని ప్రశ్నించెను.

"అవును" అని నెలబాల సమాధాన మిచ్చెను.

అంతట బండివాడు ఇట్లనెను: "ఆ యింటివారు మిమ్ము

లను కలసికొని ఈ బండిలో ఎక్కించుకోవలసినదని నన్ను కోరి నారు. అందువలననే నేను వేగముగ వచ్చినాను. నేను మీరు పోవుదారినే పోవుచున్నాను. దయయుంచి మీరిరువురును నా బండిలోని కెక్కుడు."

బండివాని మాటలు బాటసారుల కిరువురికును అపరిమిత మగు సంతోషమును కలుగజేసెను. ఏల యన వారు బాగుగ అలసిపోయి యుండుటవలన ముందుకు సాగిపోలేని పరిస్థితిలో నుండిరి. బండివాని సాహాయ్యమున వారిరువురును బండిలో ప్రవేశించిరి. నెలబాల ఒక మూలకు చేరుకొనెను. అనతికాల ములో నామెను నిద్రాదేవత ఆవహించెను. ఆనాడామె నిదు రించుట కదియే మొదటి పర్యాయము. బండి ప్రయాణము సాగించెను.

కొన్ని మైళ్ళు దూరముపోయిన తరువాత బండి యొక చోట హఠాత్తుగానాగెను. అపుడు నెలబాలకు మెలకువవచ్చెను. బండివాడామెను బండిలోనుండి క్రిందకు దింపెను. తాతిల్య కూడ క్రిందకు దిగెను. అంతట బండివాడు వారికి కొన్ని చెట్లను చూపుచు నిట్లనెను: "ఆ చెట్లచాటుననే మీరు పోదలచుకొన్న పట్టణమున్నది. అల్లదిగో ఆ కనబడుచున్న దారినిపోయి పట్టణ మును చేరుకొనుడు."

తాతా మనమరాండ్రు బండివానికి తమ కృతజ్ఞతను తెలిపి పట్టణము వంకకు పోసాగిరి. బండివాడు వేరొక దిక్కునకు పోసాగెను. తాతా మనమరాండ్రు కొంతదూరముపోయి చర్చి ఆవరణలో ప్రవేశించిరి. అచ్చట వారికి ఇరువురు మనుజులు కనబడిరి. వారిరువురును బొమ్మలాటగాండ్రు. వారివద్ద కీలు

బొమ్మలెన్నో యుండెను. వారు ఆ బొమ్మలతో వేర్వేఱు ప్రదేశములకుపోయి ఆటలాడి, ప్రేక్షకులను రంజింపజేసి డబ్బు సంపాదించుచుందురు. ఆ యిరువురిలో నొకడు బొమ్మలతో ఆటలాడించుచుండును; రెండవవాడు ప్రేక్షకుల వద్దనుండి డబ్బు వసూలు చేయుచుండును.

ఆట గాండ్రిరువురును బాటసారులను చూచిరి. అందొకడు వారిని కన్నులతో పలకరించెను. అంతట ముసలివాడు వారిప్రక్కనే కూర్చుండెను. అతడు బొమ్మలనుచూచి ఎంతో ఉత్సాహపడుచు పలుకరించిన ఆటగానితో నిట్లనెను: "మీరిచ్చటనున్నా రేమి?"

"మేమిక్కడ బొమ్మలను బాగుచేసికొనుచున్నాము. పట్టణములోని హాలులో మేమీరాత్రి ప్రదర్శన మిత్తుము. అచ్చటివారు మేమీ బొమ్మలను బాగుచేసికొనుచుండగా చూచుట ఏమియు బాగుండదుకదా! అందువలన మే మిచ్చట కూర్చుండి బాగుచేసికొనుచున్నాము."

"ఎందుకు బాగుండదు? ఎందుకు బాగుండ?" అని తాతయ్య నెలబాల వంకకు చూచుచు అనెను.

అంతట ఆటగాడు ఇట్లనెను: "వారు రాత్రి హఠాత్తుగా బొమ్మలనుచూచి ఎంతయు ఆనందింతురు. బాగుచేయుచుండగా చూచినచో ఆకర్షణ నశించిపోవును. తరువాత ప్రదర్శనము ను తిలకించుటకు వారు ఏమాత్రము ఆతురపడరు. ఏ విషయమున గాని అతిపరిచయము పనికిరాదుకదా!"

"బాగున్నది! బాగున్నది!" అనియని తాతయ్య ఒక కీలుబొమ్మను సాహసించి ముట్టుకొనెను; "మీరు నేటిరాత్రి

ఈ బొమ్మల ప్రదర్శనమును చూపుదురుగదా?"

"అవునవును" అని రెండవ ఆటగాడు అనెను.

నెలబాల ఆటగాండ్రకు వారిపనిలో కొంచెముసాహాయ్య పడెను. ఆమె తనవద్దనున్న సూదిదారముతో ఒక బొమ్మ దుస్తులను బాగుచేసెను. అపుడు అసలు ఆటగాడు ఆమెకు అపరిమితమగు కృతజ్ఞతను తెలియజేసి, "మీరెచ్చటకు ప్రయాణమై పోవుచున్నారు?" అని ప్రశ్నించెను.

నెలబాల తాతయ్యవంకకు చూచుచు, "నేటిరాత్రి కెచ్చటకును పోవుటలేదు" అని సమాధాన మిచ్చెను.

అంతట ఆటగాడు ఇట్లనెను: "అయిన మీరు నేటిరాత్రికీ పట్టణములో ఎచ్చటనో విశ్రాంతి తీసుకోవలయునుగదా! మే మొకచోట బసచేసి యున్నాము. మీరుకూడ అచ్చటనే బసచేసినచో ఎంతయు బాగుండును. మేము బసచేసిన ఇల్లు చాల పొడువుగా, తెల్లగానుండును. అచ్చట ఖర్చు చాల తక్కువ."

తాతయ్య ఆటగాండ్రు ఎచ్చటనుండిన అచ్చట నుండుటకు సిద్ధముగా నుండెను. వారా రాత్రి యంతయు చర్చి ఆవరణలోనే ఉండుట కిష్టపడినచో, అతడుకూడ అచటనే యుండుటకు సిద్ధముగా నుండెను. అందువలన నతడు, "మీ యిష్టము" అనెను.

మఱి కొంచెముసేపు గడచిన తరువాత నలుగురును చర్చి ఆవరణను వీడిపోసాగిరి. అసలు ఆటగాడు బొమ్మలను మోసికొనిపోవుచుండెను. ముసలివాడు ఆ బొమ్మలను చూచుటలో నిమగ్నుడై యుండెను. నెలబాల తాతయ్య చేయి

పట్టుకొని యుండెను. రెండవ ఆటగాడు (అతనిపేరు కాడ్లిన్) అందఱికంటే వెనుక ఏమో ఆలోచించుచున్న వానివలె నడచి పోవుచుండెను.

అనతికాలములో వారు ఒక పూటకూళ్ళ యిల్లు చేరుకొనిరి. ఆ యింటి యజమానుడు, యజమానురాలు చాల లావుగనుండిరి. వారు తాతా మనమరాండ్రను స్వీకరించుటకు ఎట్టి అభ్యంతరమును చెప్పలేదు. వారిరువురును నెలబాల సౌందర్యమును పరిపరివిధముల ప్రశంసించిరి. ఆ యింట మఱి యింకెవ్వరును లేరు. అందువలన నెలబాల ఎంతయు సంతసింపసాగెను. తాతా మనమరాండ్రు లండను మహానగరమునుండి వచ్చుచున్నారను విషయమును తెలిసికొని యజమానురాలు అపరిమితమగు ఆశ్చర్యమును ప్రకటించెను. వారి గమ్యస్థానమేదో తెలిసికోవలయునని ఆమె కుతూహలమును ప్రకటింపసాగెను. ఆ విషయమును గూర్చి ఆమె నెలబాలను పరిపరివిధముల ప్రశ్నింపసాగెను. నెలబాల ప్రశ్నలకు సూటియైన సమాధానమీయకుండ సాధ్యమైనంతవఱకు తప్పించుకొనసాగెను. తన ప్రశ్నలు నెలబాలకు బాధాకరముగ నున్నవను విషయమును గ్రహించి యజమానురాలు ఆ ప్రయత్నమునుండి విరమించుకొనెను.

"ఈ ఆటగాండ్రిరువురును మంచి గౌరవనీయులు. వీరీ రాత్రి కిచ్చటనే భోజనము చేయుదురు. సుమారొక గంటసేపటికి భోజనము తయారగును. మీ రిరువురుకూడ వారితో బాటు భోజనము చేయుట మంచిది. ఈ లోపల మీరిరువురును మంచి ద్రాక్షసారాయమును రుచిచూచుట మంచిది. మీరు చాల

దూరము నడచి బాగుగ అలసిపోయినారు. కొలది ద్రాక్ష సారాయమును సేవించినచో ఆ అలసట అంతయు మాయమై పోవును" అని యజమానురాలు తాతా మనమరాండ్రతో ననెను.

మొదట తాతయ్య ద్రాక్షసారాయమును సేవించెను తరువాత నెలబాల సేవించెను. అప్పుడు వారికిపోయిన ప్రాణము తిరిగి వచ్చినట్లుండెను. తరువాత అందఱును కీలుబొమ్మలాట చూడబోయిరి.

కీలుబొమ్మలాట చాలబాగుగ నున్నదని ప్రేక్షకులందఱును శతవిధముల ప్రశంసించిరి. వారు ఆటగాండ్రకు బాగుగా డబ్బిచ్చిరి. ఆటను చక్కగా ప్రశంశించిన వారిలో తాతయ్య కూడ నుండెను. అతనికా ఆటయంతయు అత్యద్భుతముగ నుండెను. ఆట జరుగుచున్నంతసేపు అతడు మిగిలిన వారందఱి కంటె గట్టిగా నవ్వుచునే యుండెను. పాపము, నెలబాల మాత్రము ఆట జరుగుచున్నంత సేపు నిదురించుచునే యుండెను. ఆట ముగిసిన తరువాత మాత్రమే ఆమెకు మెలకువ వచ్చెను.

నాటి రాత్రి భోజనము చాల చక్కగా నుండెను. కాని నెలబాల అంతగా తినలేదు. ముసలివాడు మాత్రము కడుపు నిండ భుజించెను. భోజనమైన తరువాత ముసలివాడు ఆటగాండ్ర మాటలను ఆనందముతో వినసాగెను. ఆటగాండ్రు నిదురింపబోయిన తరువాతమాత్రమే తాతా మనుమరాండ్రు తమ కొఱకే ఏర్పాటు చేయబడిన గదిలోనికి పోయిరి.

మొదట ముసలివాడు నిదురించెను. నెలబాల అతని పక్కనే కూర్చుండి ఏమేమో ఆలోచింప సాగెను. ఆమె

ముందు జీవితమును గూర్చి ఆలోచించుచుండెనని ప్రత్యేకముగ చెప్పనక్కరలేదు. ఆమెవద్ద నింక చాల కొద్దిడబ్బు మాత్రమే యుండెను. ఆ డబ్బు అయిపోయిన తరువాత వారు బిచ్చమెత్తు కొని జీవింపవలసినదే. ఆమె వద్దనున్న సొమ్ములో బంగారు నాణె మొకటి యుండెను. అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు దాని విలువ శతాధికమగును. "ఈ నాణెమును దాచి వేయుట మంచిది. అత్యవసర పరిస్థితిలో మాత్రమే దీనిని బయటకు తీయ వలయును" అని నెలబాల అనుకొనెను.

ఆమె యీ నిశ్చయమును వెంటనే అమలులో పెట్టెను. ఆమె ఆ బంగారు నాణెమును తనయొక్క గౌనుకు కుట్టివైచెను. పిమ్మట నామె తేలిక పడిన హృదయముతో పరుండెను. అనతి కాలములో నామె గాఢముగ నిదురింపసాగెను.

తెల్లవారిన తరువాత నెలబాల నిదురనుండి మేల్కొ నెను. అప్పటి కింకను ముసలివాడు మేల్కొనలేదు. అందువలన నామె పూటకూళ్ళ యింటిని వదలిపెట్టి చర్చి ఆవరణలోనికి పోయెను. ఆమె యచ్చటి సమాధులను చూడసాగెను. అచ్చటి శిలాఫలకములపై నున్న వ్రాతలను చదువసాగెను.

నెలబాల సామాన్యమైనదిగా కనబడుచున్న ఒక శిలా ఫలకముపైనున్న వ్రాతను పరిశీలించుచుండెను. ఆ సమాధి ఒక యువకునిది. మరణించునప్పటి కతనికి ఇరువదిమూడు సంవ త్సరముల వయస్సు మాత్రమే. అతడు మరణించి ఏబదియైదు సంవత్సరములైనది. నెలబాల అతనికి సంబంధించిన విషయ మును చదువుచుండగా నచ్చటకు వయోభారముచే క్రుంగి క్రుశించి పోయినముసలమ్మ యొకర్తె వచ్చెను. ఆమె అడుగులు

తడబడుచుండెను. ఆమె నెలబాలను చూచి, "అమ్మాయి! శిలాఫలకముపై వ్రాయబడియున్న విషయము నొకపరి చదువుము" అని యనెను. నెలబాల అటుల చేసెను. అందులకు ముసలమ్మ అపరిమితమగు కృతజ్ఞతను ప్రకటించుచు నిట్లనెను: "ఈ వ్రాత నాకు చాలకాలమునుండి నోటికి వచ్చును. ఇది నా హృదయములో హత్తుకొనిపోయి యున్నది. కాని యీ వ్రాత యిప్పుడు నా కన్నులకు కనబడదు."

"నీవాతని తల్లివా?" అని నెలబాల ప్రశ్నించెను.

"కాదు. నే నాతని భార్యను."

ఆ ముసలమ్మ ఇరువదిమూడు సంవత్సరముల వయస్సు గల యువకుని భార్య! అవును, నిజమే! అది ఏబదియైదు సంవత్సరముల క్రిందటి మాట!

ముసలమ్మ తల యూపుచు నిట్లనెను: "నే నా మాట చెప్పినచో నీవు ఆశ్చర్యపడుదువు. అటుల ఆశ్చర్యపడుటకు నీవు మొదటి దానవు కావు. నీకంటె పెద్దవారుకూడ ఇంతకు మును నావిషయమును గూర్చి ఆశ్చర్యమును ప్రకటించినారు. అవును, నిజమే. నే నాతని భార్యను. అతని మరణము మా యిరువురి మధ్యగల సంబంధమును మార్చ లేదుగదా!"

"నీ విచ్చటకు తఱచుగా వచ్చుచుందువా?"

"వేసవి కాలములో నే నిచ్చటకు తఱచుగా వచ్చి కూర్చుందును. పూర్వము నే నిచ్చటకు వచ్చి కూర్చుండి ఏడ్చుచుండెడిదానను. అప్పుడిచ్చటకు నేను అంచులకే వచ్చుచుండెడి దానను. అది ఎంతో కాలము క్రిందటి మాట." ముసలమ్మ కొంచెముసేపు ఆగి మరల నిట్లనెను: "నే నిచ్చటి పుష్పములను

కోసి ఇంటికి తీసుకొని పోవుచుందును. ఈ పుష్పములన్న నాకింతయు ప్రీతి. నే నెన్నో సంవత్సరములనుండి యీపని చేయుచున్నాను. నే నిప్పుడు ముసలిదాననై పోయినాను!"

ముసలమ్మ అంతటితో సంతృప్తి చెందలేదు. ఆమె యింకను నిట్లనెను: "నే నిచ్చటకు వచ్చి కుమిలి కుమిలి ఏడ్చుచుండెడి దానను. నన్నుకూడ తీసికొని పోయిన బాగుండునని భగవంతుని ప్రార్థించుచుండెడి దానను. విచారముతో నాహృదయము వేయి వ్రక్కలై పోవునట్లుండెడిది. కాని కాలము గడచిపోవు చున్నకొలది పరిస్థితులు మాఱిపోసాగినవి. విచారము తగ్గలేదుగాని బాధమాత్రము క్రమ క్రమముగా తగ్గిపోసాగినది. ఇచ్చటకు నేను సులభముగా రా గలుగుచుంటిని. మఱికొంత కాలమునకు బాధ తగ్గిపోయినది. ఇచ్చటకు వచ్చుట నా విధ్యుక్త ధర్మముగా భావించుచు వచ్చినాను. ఇచ్చటకు వచ్చుట నాకిప్పుడెంతో ఆనందకరమైన విషయము. అతడు పరలోకమునకేగి ఏబదియైదు వత్సరములు గడచి పోయినవి. అప్పటి కతడు ఇరువది మూడు వత్సరముల యువకుడు! నా కిప్పుడు అంత వయస్సుగల కుమారుడుకాని మనుమడుకాని ఉండుట కవకాశ మున్నది! నే నిప్పుడు ముసలి దాననై పోయినాను. అనతి కాలములో నేను నా భర్తను చేరు కొందును."

తరువాత నెలబాల ఆ ప్రదేశమును వీడిపోయి పూటకూళ్ళ యిల్లు చేరుకొనెను. అప్పటికి తాతయ్య లేచి కాలకృత్యములన్నియు తీర్చుకొని యుండెను. అంతట నందఱును ఉదయకాల భోజనమునకు కూర్చుండిరి.

భోజన సమయమున (అసలు ఆటగాడు (అందఱును

అతనిని పార్ట్ అని పిలుచు చుందురు) నెలబాలతో నిట్లనెను:
"నేడు మీరు ఎచ్చటకు పోవుచున్నారు?"

"నిజముగా నాకు తెలియదు. మే మింకను ఆ విషయమును గూర్చి నిర్ణయించుకో లేదు."

"మేము గుఱ్ఱపు పందెములు జరుగుచున్న స్థలమునకు పోవుచున్నాము. మీరు ఆదారిని పోదలచినచో, మాస్నేహము మీకు కావలసినచో, మీరుకూడ మాతో రావచ్చును. మీ యంతట మీరు పోదలచినచో మాకెట్టి అభ్యంతరమును లేదు. మిమ్ము బాధపెట్టుట మా అభిమత మేమాత్రమును కాదు."

"మేము మీతో కలసి వత్తుము" అని ముసలివాడు అనెను; "నెలబాలా! మనము వారితో కలసి పోదము. వారితో కలసి పోదము."

నెలబాల ఒకక్షణకాలమా విషయమునుగూర్చి ఆలోచించెను. "అనతికాలములో మేము బిచ్చమెత్తుకోవలసి యున్నది. మఱి గుఱ్ఱపు పందెములు జరుగు స్థలమునకు పలువురు జనులు వత్తురు. అందు ధనికులు, గౌరవనీయులు, ధర్మదాతలు మున్నగువారందఱు నుందురు. బిచ్చమెత్తు కొనుటకు అంతకంటె మంచి స్థలము మఱియొకటి యుండదు. అందువలన మేమీ ఆటగాండ్రను అంతవఱకు అనుసరించి పోవుట మంచిది" అని ఆమె అనుకొనెను.

పిమ్మట నామె పార్క్‌తో నిట్లనెను: "మేము మీ కెంతయు కృతజ్ఞులము. మేము మీతో కలసి వచ్చుటకు మీకు ఎట్టి అభ్యంతరము......"

"అభ్యంతరమా? మాకెట్టి అభ్యంతరమును లేదు.

మీరు స్వేచ్ఛగా మాతో కలసి రావచ్చును."

మఱియొక ఆటగాడగు కాడ్లిన్ తనతోడి వానిని బలపఱచుచు మాట్లాడెను.

మఱికొంత సేపటికి భోజనము పూర్తి అయ్యెను. తరువాత ఆటగాండ్రిరువురు, తాతా మనమరాండ్రు ఇంటివారివద్ద సెలవు తీసికొని గుఱ్ఱపు పందెములు జరుగు స్థలమునకు ప్రయాణము ప్రారంభించిరి.

త్రోవలో ఏదేని గ్రామము వచ్చినపుడు ఆటగాండ్రు తమ ఆట చూపి డబ్బు సంపాదించు చుండిరి. తరువాత వారెప్పటివలె ప్రయాణము చేయుచుండిరి. తాతా మనమరాండ్రు వారి ననుసరించి ప్రయాణము చేయుచునే యుండిరి. పగలంతయు గడచిపోయి చంద్రుడు వచ్చిన తరువాతకూడ వారు ప్రయాణము చేయుచునే యుండిరి. ఒకచోట నాలుగు రోడ్లు కలియుచుండెను. అచ్చట వారు కొంచెముసేపు విశ్రాంతి తీసుకొనిరి. తరువాత అందఱును కలసి ప్రయాణము ప్రారంభించిరి.

మఱి కొంతదూరము ప్రయాణముచేసిన తరువాత వారొక పూటకూళ్ళ ఇంటిలో ప్రవేశించిరి. ఆ ఇంటి యజమానుడు వారికి కావలసిన సదుపాయముల నన్నిటిని సమకూర్చెను. బాగుగా అలసిపోయియున్న తాతా మనమరాండ్రు భోజనము కాకుండగనే నిదుర మునిగిరి. ఇరువురు ఆటగాండ్రు, యింటి యజమానుడు వారికి సమీపములోనే కూర్చుండి - మాట్లాడు కొనుచుండిరి.

యజమానుడు తాతా మనమరాండ్రను చూపుచు

పార్ట్‌తో నిట్లనెను: "వీరెవ్వరు?"

"నాకు తెలియదు. తెలిసిన బాగుండును" అనునర్థం వచ్చునట్లు ఆటగాడు తలడోపెను.

"నీకుగూడ తెలియదా?" అని యజమానుడు రెండవ ఆటగానిని ప్రశ్నించెను.

"నాకుగూడ తెలియదు. వారివలన లాభ మేమియు లేదు" అని కాడ్లిన్ బదులు పలికెను.

అంతట పార్ట్ ఇట్లనెను: "వారి వలన అపాయ మేమియు లేదు. అందుకు సందేహ మేమియు లేదు. ముసలివాని మనస్సు సరిగా పనిచేయుటలేదని తోచుచున్నది."

"నీకు తెలిసిన విషయ మదియేనా? అయిన మనమింక ఆ విషయమునుగూర్చి మాట్లాడకుండనుండుట మంచిది" అని కాడ్లినె అనెను.

"నీవు వినకపోయిన నష్టమేమియున్నది? వీ రిరువురును ఈ రకపు జీవితమున కలవాటుపడినవారు కారని స్పష్టముగ తెలియుచున్నది. ఈ అందాలబాలిక రెండుమూడు రోజులనుండి నడచుచున్నది. అంతకు ముందెన్నడును ఆమె నడచియుండలేదని సుస్పష్టముగ గ్రహింపవచ్చును" అని పార్ట్ అనెను.

"ఆమె ఇదివఱకు నడచుచుండెడిదని నీతో ఎవ్వరైనా చెప్పినారా ఏమి? ఆ విషయమునుగూర్చి తగవెందులకు?" మనము మాట్లాడుకొనుట కింతకంటె మంచి విషయములు దొరకలేదా?" అని కాడ్లిన్ అనెను.

అపుడు పార్ట్ ఇట్లనెను: "ముసలివాడు సాధ్యమైనంత స్వల్పకాలములో సాధ్యమైనంత దూరముగా పోవలయునని

వాంఛించుచున్నాడు. నీవా విషయమును గ్రహింపలేదా?"

"అయిననేమి?"

"ముసలివాడు మిత్రులకు చెప్పకుండ పాఱిపోవుచున్నాడను విషయము సుస్పష్టముగ తెలియుచున్నది. ఎవ్వరికి చెప్పకుండ పాఱిపోవుచున్నాడను విషయమును గుర్తుంచుకొనుము. వీరిరువురును ఒకరినొకరు గాఢముగా ప్రేమించుకొనుచున్నారు. అందువలననే ఈ అమ్మాయి ముసలివానితో బాటు వచ్చుటకు అంగీకరించినది. ఈ అందాలబాలయే ముసలివానికి దారి చూపుచున్నది. గమ్యస్థానమేమో ఈ ముసలివానికే తెలియదు! నేనే విషయమును సహింపలేను."

"నీవా విషయమును సహింపలేవా? ఏమి వచ్చినది?"

"అవును. సహింపలేను ఈ అందాలబాలిక చెడ్డవారి చేతులలో చిక్కుకొనుటకు నేను ఏమాత్రము సహింపజాలను. ఈమెకు స్నేహితులుగా నుండుటకు మంచివారు మాత్రమే అర్హులు. అందువలననే నొకపని చేయబోవుచున్నాను. వీరు మనలను వీడిపోవుటకు ప్రయత్నించినపుడు తగిన చర్య తీసికొందును. వీరిని అనగా వీరు వెళ్ళిపోకుండ తగిన చర్యలు తీసికొందును. వీరి ప్రాతమిత్రులకు అప్పగించి వేయుదును. ఈ పాటికి వీరు పాఱిపోయిన విషయము లండను నగర మంతటను వివరముగా తెలిసియుండునని నేను గట్టిగా నమ్ముచున్నాను."

"ఇప్పుడు నీ మాటలు నాకు బాగుగా నచ్చినవి. నీవు అపూర్వమగు లోకజ్ఞానముతో మాట్లాడుచున్నావను విషయము సుస్పష్టముగ తెలియుచున్నది. వీరిని అప్పగించినచో గొప్ప బహుమానముకూడ రావచ్చును. కాని ఒక్కవిషయము

మాత్రము జ్ఞప్తియందుంచుకొనుము. బహుమానములోగూడ మన మిత్రుపురము వాటాదారులమే"

అంతట పార్ట్ తల ఊపెను. అతడు సమాధానము చెప్పుటకు తగిన వ్యవధిలేక పూర్వమే నెలబాల నిదురనుండి మేల్కొనెను. అంతవఱకు ఆటగాండ్రు చాల దగ్గఱగా కూర్చుండి గుసగుసలాడుకొనుచుండిరి. కాని నెలబాల లేవగానే వారు దూరముగా జరిగిరి. నెలబాలకు ఏవిధమగు అనుమానము కలుగకుండునట్లు వారు వేఱొక విషయమునుగూర్చి మాట లాడు కొనసాగిరి.

కాని నెలబాల నిశితమైన బుద్ధికలది. వారి వాలకము నామె జాగ్రత్తగా పరిశీలించెను. వారంతవఱకు తమ్ముగూర్చియే మాట్లాడుకొను చుండిరని ఆమె సులభముగా గ్రహించెను.

మఱి కొంతసేపటికి భోజనము తయారయ్యెను. భోజన పదార్థములు చాల చక్కగా నుండుటవలన అందఱును తృప్తిగా భుజించిరి. తరువాత అందఱును నిదురింపబోయిరి.

తాతయ్యను నిదురపుచ్చిన తరువాత నెలబాల తనగది లోనికి పోయి తలుపులు మూసివైచెను. అంతలో ఎవ్వరో తలుపు తట్టిరి. వెంటనే ఆమె తలుపులు తెఱచెను. గుమ్మము వద్ద నిలబడియున్న కాడ్లిన్‌ను చూచి ఆమె ఉలికిపడెను.

"ఏమి పనిమీద వచ్చినావు?" అని ఆమె ప్రశ్నించెను.

"అమ్మాయి, పని ఏమియు లేదు. నేను నీకు మంచి మిత్రుడను. బహుశా నీవు ఆ విధముగ అనుకొని యుండవు. కాని నేనే నీకు మిత్రుడను. అతడు మాత్రము కాడు."

"అతడెవ్వరు?"

"షార్ట్! అతడు పైకి దయార్ద్ర హృదయునివలె కన బడును. అందువలన అతడు మంచి మిత్రుడని నీవు భావింప వచ్చును. కాని అతడు కాడు. నేనే నీకు హృదయపూర్వక మైన మిత్రుడను. నేను పైకి ఆ విధముగ కనబడక పోవచ్చును. కాని నేనే నిజమైన మిత్రుడను."

ఆ మాటలను విన్న నెలబాల కాడ్లిన్ చిత్తుగా త్రాగి యున్నాడని భావించి భయపడసాగెను.

కాడ్లిన్ ఇంకను ఇట్లు చెప్పసాగెను: "అతడు పైకి కన పడుచున్నంత దయార్ద్ర హృదయుడు కాడను విషయమును తెలిసికొనుము. నా సలహా తీసికొనుము. ఎందువలన అని ప్రశ్నింపకుము. నాసలహా తీసికొనుము. మాతో ప్రయాణము చేయుచున్నంతసేపు నాకు సాధ్యమైనంత దగ్గఱగా నడచు చుండుము. ఏ సందర్భలోను మమ్ము వీడి పోవలదు. ఎల్లప్పుడును నన్ను అంటిపెట్టుకొని యుండుము. నేను నీ మిత్రుడనని చెప్పుము. అమ్మాయి! నేను నీ మిత్రుడనని చెప్పుచుందువా? మఱి యీ విషయమును జ్ఞప్తి యుందుంచు కొందువా?"

"ఎప్పుడు? ఎక్కడ?" అని నెలబాల అమాయకముగ ప్రశ్నించెను.

"ప్రత్యేకముగ ఒకచోట అనిలేదు. నేను నీ మిత్రుడనని నీవు భావింపవలయునని ఆతుర పడుచున్నాను. నాకు న్యాయము చేకూర్ప వలయునని కోరుచున్నాను. నాకు నీపట్ల ఎంతటి అభి మానము కలదో నీవు ఊహింపలేవు. నీ చిన్నారి చరిత్రను నాకు ఎందుకు చెప్పలేదు? నేను నీకు మంచి సలహాదారుడను. నావంటి సలహాదారుడు మఱియొకడు నీకు లభింపడు. నీపట్ల

నాకుగల అభిమానముకూడ అపరిమితమైనది. మఱియొకమాట. మన మా విధముగ మాట్లాడుకొన్న విషయమును పార్ట్‌కు చెప్పకుము. భగవానుడు నీకు మేలుచేకూర్చుగాక. ఈ మిత్రుని జ్ఞప్తియందుంచుకొనుము. కాడ్లిన్ నీ మిత్రుడు. పార్ట్ కాడు. పార్ట్ పైకి మిత్రునివలె కనబడును. నీకు నిజమైన మిత్రుడు కాడ్లిన్ అను విషయమును జ్ఞప్తియందుంచుకొనుము."

అట్లని కాడ్లిన్ వెళ్ళిపోయెను. నెలబాల కంతయు అయోమయముగను, ఆశ్చర్యముగను నుండెను. ఆమెపోయి తలుపులు మూసి పైచెను.

మఱికొంతసేపటి కెవరో తలుపు తట్టిరి.

"ఎవరు?" అని నెలబాల ప్రశ్నించెను.

ఆ వచ్చినవాడు తలుపుకంతలోనుండి చూచుచు ఇట్లనెను: "నేనే! నాపేరు పార్ట్. మనము తేపు పెందలకడనే ఈ ప్రదేశమును వీడిపోవలయును. మనము పెందలకడ పయనమై పోనిచో గిట్టుబాటుకాదు. నీవు పెందలకడనేలేచి మాతో కలసి వత్తువుగదా? నేను నిన్ను పిలిచెదను."

"అటులనే" అని నెలబాల లోపలనుండియే సమాధాన మిచ్చెను.

అంతట బయటనున్నవాడు వెళ్ళిపోయెను. నెలబాల ఆట గాండ్ర ప్రవర్తనలోని అంతరార్థమును గుఱించి ఆలోచింప సాగెను. అంతలో బాగుగా అలసియున్న ఆమెకు నిదుర పట్టెను.

అన్నమాట ప్రకారము పార్ట్ పెందలకడవచ్చి నెలబాలను పిలిచెను. నెలబాల ఏ మాత్రము ఆలస్యము చెయ్యకుండ

లేచెను. పిమ్మట నామె ముసలివానిని లేపెను. అందఱును ఏవో ఆహారపదార్థములు తిని ప్రయాణమునకు సిద్ధపడిరి.

ఆటగాండ్రిరువురు, తాతా మనమరాండ్రు ప్రయాణము ప్రారంభించిరి. కాడ్లిన్ మధ్యమధ్య నెలబాల దగ్గఱకుపోయి పార్ట్ చూడకుండ ఏవేవో సంజ్ఞలు చేయసాగెను. ఆ సంజ్ఞల అర్థమిది: "నీవు నన్నే నమ్ముము. పార్టును నమ్మకుము." పార్టు ప్రవర్తనకూడ ఆ విధముగనే యుండెను. వారిరువురును తాతా మనమరాండ్రను తమ వశములో నుంచుకొనుటకు ప్రయత్నించుచున్నట్లుండెను. వారిచేష్టలు నెలబాలకు అనుమానమును కలిగించుచుండెను. వారేదో మోసము చేయుచున్నారని ఆమె తలపసాగెను.

వారు గుఱ్ఱపుపందెములు జరుగు పట్టణమును చేరుకొనకమునుపే చీకటిపడెను. అనతికాలములో వారు పట్టణములో ప్రవేశించిరి. పట్టణమంతయు చాల సందడిగా నుండెను. ఎచ్చట చూచినను జనసమూహాములే! ఆ త్రొక్కిడిలో తాతయ్య తన్ను వీడిపోకుండ నెలబాల జాగ్రత్త పడసాగెను. క్రమక్రమముగా వారుపోయి గుఱ్ఱపు పందెములు జరుగు స్థలమును చేరుకొనిరి. తాతా మనమరాండ్రచ్చట భోజనముచేసి ఒక గుడారములో నిదురించిరి.

సూర్యోదయమైన తరువాత నెలబాల నిదురనుండి లేచెను. ఆమె పొలములోనికిపోయి రకరకముల పుష్పములను ప్రోగుచేసెను. ఆమె యా పుష్పములను తీసికొని తిరిగివచ్చి ముసలివాని ప్రక్కన కూర్చుండెను. ఆమె యా పుష్పములతో పూగుత్తులు తయారు చేయసాగెను. ఆ సమయమున ఆట

గాంగ్రిరుపురుసు గుడారములో నొకమూల గుఱుపెట్టి నిసు రించుచుండిరి.

నెలబాల తాతయ్యను మెల్లన తట్టి లేపి హీనస్వరమున చెవిలో నిట్లుచెప్పెను: "తాతయ్యా! నేనొక రహస్యమును కనుగొన్నాను. నా మాటలను సావధానముగ నాలకింపుము. నీవు మాట్లాడవలసిన పని లేదు. ఈ యిరువురును మనము ఎవ్వరి కిని చెప్పకుండ లండను మహానగరమును వీడివచ్చినామని అను మానించుచున్నారు. వీరు మనలను ఏ పెద్దమనిషికైన నప్పగించి తిరిగి లండను నగరమునకు పంపివేయవలయునని ఆలోచించు చున్నారు. నీవు నా మాటలువిని వణకిపోవుచున్నావెందుకు? నీవీ విధముగ ప్రవర్తించినచో మనము వీరిబారినుండి తప్పించు కొని పోలేము. నీవు ప్రశాంతముగనున్నచో మనము సుభ ముగ తప్పించుకొని పోవచ్చును."

అంతట ముసలివాడు ఇట్లనెను: "ఎట్లు? ప్రియమైన నెల్లీ! ఎట్లు? వారు నన్నొక చీకటికొట్టులో పెట్టి గొలుసులతో కట్టి వేయుదురు. నన్ను కొరడాలతో కొట్టి హింసింతురు. నిన్ను చూడనీయరు."

"నీవు మరల వణకిపోవుచున్నావు. రోజంతయు నీవు నన్ను అంటిపెట్టుకొనియుండుము. ఆటగాండ్రజోలి నీకు వలదు; వారివంక చూడకుము; ఎప్పుడును నావంకే చూచుచుండుము. మనము తప్పించుకొని పాటిపోవుటకు తగిన సమయమును నేను కనిపెట్టెదను. నేను సంజ్ఞ చేసినప్పుడు నాతో బాటు వచ్చి వేయుము. ఎక్కడను ఆగవలదు. ఒక్కమాటయైన మాట్లాడ వలదు. నేను చెప్పదలచుకొన్న దింతియే" అని నెలబాల

అనెను.

అంతలో కాడ్లిన్‌కు మెలకువ వచ్చెను. అతడు తల్పపై కెత్తి ఆవలించుచు నెలబాలనుజూచి, "ఏమిచేయుచున్నావు?" అని ప్రశ్నించెను. తన మిత్రుడింకను నిదురించుచున్నాడను విషయమును గమనించి అతడింకను మెల్లన నిట్లనెను: "కాడ్లిన్ నీ మిత్రుడను విషయమును జ్ఞప్తియం దుంచుకొనుము."

అపుడు నెలబాల ఇట్లనెను: "నేను పూగుత్తులు తయారు చేయుచున్నాను ఇచ్చట మూడురోజులు గుఱ్ఱపు పందెములు జరుగును గదా! ఈ మూడురోజులు నేను పూగుత్తులు అమ్మి డబ్బు సంపాదింతును. నీకొక పూగుత్తి బహుమానముగా కావలయునా!"

కాడ్లిన్ నెలబాలవద్దకుపోయి ఆ పూగుత్తిని స్వీకరింప దలచెను. కాని నెలబాల ముందుగ అతనివద్దకుపోయి అతని చేతిలో ఒక పూగుత్తి నుంచెను. అంతట నతడు మఱియొకసారి ఇట్లనెను: "నీకు మిత్రుడు కాడ్లిన్ అను విషయమును జ్ఞప్తి యందుంచుకొనుము."

సూర్యకాంతి బాగుగా వ్యాపించిన తరువాత అందఱును తమతమ గుడారములనుండి బయటకువచ్చిరి. ఆ ప్రదేశమంతయు నేల ఈనినట్లుండెను. ఆటగాండ్రుకూడ బయటకువచ్చిరి. వారి వెంట తాతా మనమరాండ్రు ఉండిరి. కాడ్లిన్ నెలబాలను గమనించుచునే యుండెను. నెలబాల అచ్చటి వారికి పూగుత్తులను అమ్మజూపుచుండెను. కాని ఎవ్వరును వానిని కొనకుండిరి. కొందఱు వనితలు నెలబాలను జూచి మందహాసముచేసి తల ఊపుచుండిరి. మఱికొందఱు తమ ప్రక్కనున్నవారితో, "ఆ

బాలిక ముఖము ఎంత అందముగా నున్నదో!" అని యను చుండిరి. ఆ ముఖములోని దైన్యస్థితిని మాత్రము ఎవ్వరును గుర్తింపకుండిరి.

ఒక వనిత మాత్రము నెల్లబాల పరిస్థితిని అర్థముచేసి కొనినట్లుండెను. ఆమె ఒక చక్కనిబండిలో ఒంటరిగ కూర్చుండి యుండెను. అప్పుడే బండిలోనుండి క్రిందకుదిగిన గౌరవనీయు లిద్దఱు—వారు చక్కని దుస్తులను ధరించియుండిరి—కొలది దూర మున నిలబడి, ఆమెను పూర్తిగా మఱచిపోయినట్లు, మాట్లాడు కొనుచుండిరి. ఆ చుట్టుప్రక్కలనున్న పలువురు యువతులు నెల బాల పరిస్థితి నేమాత్రము లెక్కచేయకుండిరి. వారు గౌరవ నీయులవంక చూచుచుండిరి. జిప్సీ యువతి యొకర్తె బండిలోని యువతిని సమీపించి, "అమ్మా! మీ భవిష్యత్తును చెప్పెదను" అని యనుచుండెను. అంతట నా వనిత, "నా భవిష్యత్తు నా కిది వఱకే తెలియును. నీవు చెప్పవలసిన పనిలేదు. పో పొమ్ము" అని అనుచుండెను. ఆమె నెలబాలను దగ్గఱకు బిలిచి ఆమె వద్దనున్న పూగుత్తుల నన్నిటిని తీసికొనెను; వణకుచున్న నెల బాల చేతులలో డబ్బుపెట్టి, "ఇక ఇంటికి పొమ్ము. ఇక నెప్పు డును ఇంటివద్దనే యుండుము" అని యనెను.

ఆటగాండ్రు తమ బొమ్మలను చూపి డబ్బు సంపాదించు చుండిరి. తాతా మనమరాండ్రు వారివెంట పోవుచుండిరి. కాఢ్లిన్ నెలబాల నొకకంట కనిపెట్టి చూచుచునే యుండెను. కొంత సేపైన తరువాత మాత్రము ఆటగాండ్రొకచోట నాగి బొమ్మలాట చూపసాగిరి. ప్రేక్షకులా ఆటను చూచి ఎంతయు సంతసించు చుండిరి, వారి వెనుక తాతా మనమరాండ్రు

కూర్చుండి యుండిరి. నెలబాల తప్పించుకొని పాఱిపోవుటకు తగిన సమయము కొఱకు వేచియుండెను. అట్టి సమయము వచ్చెను. షార్ట్ బొమ్మలాటలో నిమగ్నుడై యుండెను. ప్రేక్షకులు అపరిమితమగు సంతసముతో జేబులలో చేతులు పెట్టుచుండిరి. కార్లిన్ వారి జేబులవంక చూచుటలో నిమగ్నుడై యుండెను. తాతా మనమరాండ్రవంక ఎవ్వరును చూచుటలేదు. అది పాఱిపోవుటకు తగిన సమయమని నెలబాల గ్రహించెను. ఆమె తాతయ్యను తట్టెను. ఇరువురును మెల్లనలేచి ఆ ప్రదేశమును వీడి పాఱిపోసాగిరి.

తాతా మనమరాండ్రు గుడారముల మధ్యనుండి, బండ్ల మధ్యనుండి, జనుల మధ్యనుండి పాఱిపోసాగిరి. వెనుకకు తిరిగి చూచుటకు వారొక్కసారియైనను ఆగకుండిరి. వారు తమ ప్రాణమును రక్షించుకొనుటకు ఏ అడ్డును లెక్కచేయక ముందుకురికి పాఱిపోవుచుండిరి.

6

మధ్యాహ్నమగుసరికి తాతా మనమరాండ్రొక అరణ్యము చేరుకొనిరి. అచ్చటవారు కొంచెముసేపు ఆగి విశ్రాంతి తీసికొనిరి.

"తాతయ్యా! మన మిప్పుడు సురక్షితముగ నున్నాము. మనమింక భయ పడవలసిన పనిఏమియు లేదు."

"భయపడవలసిన పనిఏమియు లేదా? నిన్ను నా నుండి వారు తీసికొని పోయినచో భయములేకపోవుట ఏమో తెలి యును! వారు మనలను విడదీసినచో భయము లేకపోవుటఏమో తెలియును! నాపట్ల విశ్వాస మెవ్వరికిని లేదు! నెలబాలకుగూడ లేదు!"

"తాతయ్యా! అట్లనకుము! నా సంగతి నీకు బాగుగా తెలియును! నాకు నీపట్ల అచంచలమగు విశ్వాసము కలదను సంగతి నీకు తెలియును!"

"అయినచో మనమింక సురక్షితముగ నున్నామని నీ వెట్లు అనగలుగుచున్నావు? వారు మనలనుగూర్చి ప్రతిచోట వెదకుచున్నారు. అనతికాలములో వారిచ్చటకు రావచ్చును. మనము మాట్లాడుచుండగనే మనలను పట్టుకొని పోవచ్చును."

"మనలను ఎవ్వరును వెంబడించుటలేదను విషయము నాకు బాగుగా తెలియును. తాతయ్యా! నీకు నీవే ఒక్కపరి ఆలోచించుకొనుము. చుట్టును కలయ జూడుము! అంతయు ఎంత ప్రశాంతముగనున్నదో! మనమింక ఒంటరిగ నున్నాము. మనమింక ఇచ్చవచ్చినట్లు తిరుగవచ్చును. మనము సురక్షిత ముగ లేమా? నీకెట్టి అపాయమును కలుగదు."

"నిజమే. నిజమే. మరి ఆ ధ్వని ఏమి?"

"అడవిలోనికేదో పక్షి ఎగిరిపోవుచున్నది. అది మనకు దారి చూపు చున్నది. మనము దానిననుసరించి పోవుటమంచిది. అడవులలోను, పొలములలోను, నదుల యొడ్డునను స్వేచ్ఛగా తిరుగ వచ్చుననియు, సుఖముగా జీవింప వచ్చుననియు మన మనుకొన్నాము. ఆ విషయము జ్ఞప్తియందున్నదా? కాని మన

ఖిప్పుడేమి చేయుచున్నాము? ఇచ్చట వాతావరణము చాల బాగున్నది. సూర్యుడు మన శిరస్సులపై చక్కగా ప్రకాశించుచున్నాడు. అయినను మనము విచారముతో నున్నాము. కాలమును వృథాచేయు చున్నాము. దారి ఎంత బాగున్నదో చూడుము! పక్షి ఎంత చక్కగా పాడుచు పోవుచున్నదో చూడుము! మనమింక బయలుదేఱి పోదము!"

తాత మనమరాండ్రిరువురును లేచి అడవిలోని దారి వెంబడి పోసాగిరి. ముందు మనమరాలు పోవుచుండెను; వెనుక తాతయ్య పోవుచుండెను. మనమరాలు తాతయ్యకు మంచి ఉత్సాహకరమైన మాటలు చెప్పుచుండెను. క్రమక్రమముగా తాతయ్యకుగూడ మంచి ఉత్సాహము కలుగనాగెను. అతడు భయముతో ఇటునటు చూచుట మానివైచెను. అడవిలోనికి పోవుచున్నకొలది అతనికి ధైర్య మెక్కువకానాగెను. ఎట్టకేలకు వారు అడవిలోనుండి బయటపడి ఒక రాజబాటపై ప్రవేశించిరి. వారు కొంచెము దూరము పోవుసరికి ఒక స్తంభము కనబడెను. అచ్చటకు మైలున్నర దూరములో ఒక గ్రామ మున్నట్లు ఆ స్తంభము తెలియజేయుచుండెను. ఆ గ్రామమునకు పోవలయునని తాతా మనమరాండ్రు నిశ్చయించుకొనిరి. అందువలన వారా స్తంభము చూపుచున్న దిక్కుకు పయనమై పోసాగిరి.

ఎట్టకేలకు వారా గ్రామము చేరుకొనిరి. వారు ముందు ఆటస్థలములో చేరిరి. అచ్చట పెద్దలు, పిల్లలు క్రికెట్ ఆట ఆడుచుండిరి. మఱికొందఱు వారి ఆట చూచుచుండిరి. తాతా మనమరాండ్రొక ఇంటివద్దకు బోయిరి. ఆ ఇంటిముందు ఒక చిన్న తోట యుండెను. ఆ తోటలో నొక మనుజుడు నిలబడి

యుండెను. అతడు పాఠశాలోపాధ్యాయుడు. ఆ యిల్లు పాఠశాల. ఉపాధ్యాయునితో మాట్లాడుటకు నెలబాల బిడియపడుచుండెను.

"అమ్మాయి! అతనితో మాట్లాడుము" అని తాతయ్య మెల్లన నెలబాలతో అనెను.

"అతడు మనవంక చూచుచున్నట్లులేదు. అతనిని పలుకరించుటకు నేను భయపడుచున్నాను. మనము కొంచెముసేపు ఆగినచో, అతనే మనవంక చూచును" అని నెలబాల అనెను.

తాత మనమరాండ్రు ఆతురముతో వేచియుండిరి. కాని ఉపాధ్యాయుడు వారివంక చూడకుండెను. అతడేదో విషయమునుగూర్చి ఆలోచించుచున్నట్లు ప్రశాంతముగ కూర్చుండి యుండెను. అతని ముఖములో దయారసము ప్రస్ఫుటముగ కనబడుచుండెను. అతడు నల్లని దుస్తులు ధరించి యుండెను. సన్నగా, పాలిపోయినట్లు కనబడుచుండెను.

తాతా మనమరాండ్రు బాగుగ అలసిపోయియుండిరి. నెలబాల ఆ ఉపాధ్యాని పలుకరించుటకు సాహసించియుండెనేదే. కాని ఆత డేదో విషయమునుగూర్చి బాధపడుచున్నాడని గ్రహించి ఆమె అటుల చేయకుండెను. కాని ఎట్టకేల కామె ధైర్యము వహించి తాతయ్యను తీసికొని ఉపాధ్యాయుని సమీపించెను. ఆ సవ్వడి కతడు తలఎత్తి చూచెను. అతని ముఖములో దయారసము కనబడుచుండెను. కాని అతడు ఆశాభంగము చెందినవానివలె నుండెను.

నెలబాల అతనికి నమస్కరించి ఇట్లనెను: "అయ్యా! మే మిరువురము బీద బాటసారులము. మాకు నేటి రాత్రికి

తల దాచుకొనుటకు తగిన స్థలము కావలయును. అందుకు ప్రతిఫలముగా మేము ఇచ్చుకొనగలిగినంత డబ్బు ఇచ్చుటకు సిద్ధముగా నున్నాము."

ఉపాధ్యాయుడు నెలబాలవంక చూచి లేచి నిలబడెను.

నెలబాల యింకను నిట్లనెను: "మీరు మాకీ విషయమున తగిన సలహా ఇచ్చినచో మే మెంతయు కృతజ్ఞులమై యుందుము."

"మీరు చాలదూరమునుండి నడచి వచ్చుచున్నా రనుకొందును."

"అవును. చాలదూరమునుండి నడచి వచ్చుచున్నాము."

ఉపాధ్యాయుడు తన హస్తమును మెల్లన నెలబాలతలపై నుంచి ఇట్లనెను: "అమ్మాయి! నీవు చిన్నదానవు. మిత్రమా! ఈమె నీ మనమరాలా ఏమి?"

"అయ్యా! అవును. నా జీవితసర్వస్వము ఈమెయే. నేను ఈమెకొఱకే బ్రతికియున్నాను" అని ముసలివాడు అనెను.

"మంచిది లోనికిరండు" అని ఉపాధ్యాయుడనెను.

మఱి యింక మాటలేమియు లేకుండ ఉపాధ్యాయుడు వారి నిరువురను లోనికి తీసుకొనిపోయెను. "మీ రిచ్చట జేపటి యుదయమువఱకు నుండవచ్చును" అని అతడు వానితోననెను.

"మేము మీ కెంతయు కృతజ్ఞులము" అని నెలబాల అనెను.

అంతలో ఉపాధ్యాయుడు ఒక బల్లపై గుడ్డను పఱచెను. దానిపై భోజనపు పళ్ళెముల నుంచెను. తాతా మనమరాండ్రు బల్లవద్దనున్న రెండు కుర్చీలపై కూర్చుండిరి.

నెలబాల భోజనముముందు కూర్చుండి [redacted]ంతయు కలయజూచెను. అది చాల చిన్నగది. అందులో పిల్లలు కూర్చుండుటకు కొన్ని బెంచీలుండెను. ఆ బెంచీలనిండ సిరా మరక లుండెను. ఉపాధ్యాయుడు కూర్చుండుట కొక మేజాబల్ల కూడ నుండెను. ఒక అలమరలో కొన్ని పుస్తకము లుండెను; ఆ అలమరలోనే పిల్లలవద్దనుండి లాగుకొనిన గోళీలు, బొంగరములు, బంతులు, సగము తిన్న ఆపిలుపండ్లు మున్నగునవి యుండెను. మఱియొకచోట పిల్లలకు భయంకరమగు పేము బెత్తము, రూళ్ళకఱ్ఱ యుండెను. మొద్దుపిల్లల నెత్తినిపెట్టు టోపీ ఒకటి ఇంకొకచోట నుండెను.

గది గోడలపై కొన్ని నీతి సూత్రములు వ్రాయబడి యుండెను. ఆ వ్రాత చాల చక్కగా నుండెను. గోడలపై కూడిక, గుణకారములకు సంబంధించిన కొన్ని లెక్కలు చేయబడి యుండెను. ఆ వ్రాతకూడ కడు మనోహరముగ నుండెను. నెలబాల ఆ వ్రాతవంక చూడసాగెను.

ఉపాధ్యాయు డావిషయమును గ్రహించి, "అమ్మాయి! ఆ వ్రాత చాల చక్కనివ్రాత!" అని యనెను.

"అవును. అది మీ వ్రాతయేనా?" అని నెలబాల వినయపూర్వకముగ ననెను.

"నా వ్రాతయా! ఇప్పుడు నేనావిధముగ వ్రాయలేను. అదియంతయు ఒకరి చేతిమీదుగనే జరిగినది. అతడు నీకంటె చిన్నవాడు; కాని చాల స్పష్టముగా, చక్కగా వ్రాయగల నేర్పరి."

ఉపాధ్యాయు డింకను ఆ వ్రాతను పరిపరివిధముల ప్రశం

సింప [redacted] అతడు దానిని ఒక మనోహర చిత్తరువును పరిశీలించునట్లు పరిశీలింపసాగెను. కాని అతని గొంతులో నొక విధమగు విచారము ప్రస్ఫుట మగుచుండెను.

"అతడు చాల చిన్నవాడు! చదువులోనేమి, ఆటలలో నేమి అతడు తన తోడివారి నందఱను మించిపోయినాడు. అతనికి నేనన్న ఎంత ఇష్టము. మఱి యతనికా ఇష్టమెట్లు కలిగినదో! నే నతనిని ప్రేమించుటలో ఆశ్చర్యకరమగు విషయ మేదియు లేదు. కాని అతడు నన్నంతగా ప్రేమించుట చాల ఆశ్చర్యకరమైన విషయము" అని కూడ ఉపాధ్యాయుడనెను. అప్పుడతని కన్నులు అశ్రుపూరితములయ్యెను.

"అయ్యో! ఆందోళన ఏమియు లేదుకదా?" అని నెలబాల ప్రశ్నించెను.

"అంతగా లేదు, అమ్మాయి! అతడు ఈరోజు ఆటస్థలమునకు రాలేదు. మఱి అత డెప్పుడును ఆటలలో ముందుండెడి వాడు. అతడు జేపు తప్పక ఇచ్చటకు వచ్చును."

పిల్లలకు సహజమగు సానుభూతితో నెలబాల, "అతనికి జబ్బుచేసినదా?" అని ప్రశ్నించెను.

"అంత పెద్దజబ్బేమియులేదు. అతని తల తిరుగుచున్నదని నిన్న అన్నారు. మొన్నగూడ అదేవిధముగ అన్నారు. కాని అది ఏమంత చెడ్డసూచనకాదు. చెడ్డలక్షణముకాదు."

"నెలబాల ఏమియు మాట్లాడలేదు. ఉపాధ్యాయుడు గుమ్మమువద్దకుపోయి బయటకు చూచెను. చీకటి తెరలు క్రమ్ముకొనుచుండెను. అంతయు ప్రశాంతముగ నుండెను.

ఉపాధ్యాయుడు మరల లోనికివచ్చి, "అతడు ఎవ్వరి

నైన ఊతగా తీసికొని వచ్చుటకు వీలున్నచో, తప్పక నావద్దకు వచ్చునను విషయము నాకు తెలియును. ప్రతి రాత్రి తోట లోనికి వచ్చి అతడు నావద్ద సెలవు తీసికొను చుండెడివాడు. బహుశా అతనిజబ్బు తగ్గుముఖము పట్టియుండును. ఇచ్చటకు వచ్చుటకు చాల ఆలస్యమైపోయి యుండును. బయట మంచు బాగుగ పడుచున్నది. అందువలన నతడీరాత్రి ఇచ్చటకు రాకుండుటయే మేలు."

పిమ్మట ఉపాధ్యాయుడు క్రొవ్వువత్తి వెలిగించి తలుపులు మూసివైచెను. అతడు కొంచెముసేపు ప్రశాంతముగ కూర్చుండి యుండెను. ఈ లోపల తాతా మనమరాండ్రు భోజనము ముగించిరి. అంతట ఉపాధ్యాయుడు నెత్తిమీద టోపీపెట్టుకొని నెలబాలతో నిట్లనెను: "నేను తిరిగివచ్చువఱకు మీరు వేచియుండుట కంగీకరించినచో స్వయముగా పోయి అతనిని చూచివత్తును"

అందుకు నెలబాల వెంటనే అంగీకరించెను. అంతట ఉపాధ్యాయుడు బయటకు పోయెను.

నెలబాల తాతయ్యను నిదురపుచ్చెను. తరువాత నామె యొంటరిగా కూర్చుండి యుండెను. గాలిసవ్వడి, గడియారపు ధ్వనితప్ప మఱియింకేమియు నామెకు వినబడకుండెను. ఆమె కంతయు క్రొత్తగా నుండెను. ఆ విధముగా అరగంటకుపైగా గడచిపోయెను. అంతలో బయటకుపోయిన ఉపాధ్యాయుడు తిరిగివచ్చెను. అతడు తిన్నగాపోయి ఒకమూల కూర్చుండెను. చాలసేపటివఱకు నతడేమియు మాట్లాడలేదు. ఎట్టకేల కతడు నెలబాలతో నిట్లనెను: "అమ్మాయి! నేటిరాత్రి నీవు జబ్బుతో

నున్న ఒక బాలునికి ఎప్పటి ఆరోగ్యము చేకూరవలయునని భగవానుని ప్రార్థింపవలయును. ఆ బాలుడు నా ప్రియశిష్యుడు! అతడు జబ్బుతో మంచముపట్టి యుండుట కడుంగడు హృదయ విదారకమైన విషయము."

తరువాత నెలబాల వేఱొకగదిలో నిదురింపబోయెను. తెల్లవాఱిన తరువాత నామె లేచి కడచినరాత్రి భోజనముచేసిన గదిలోనికి వచ్చెను. అప్పటికి ఉపాధ్యాయుడు నిదురనుండిలేచి బయటకు పోయియుండెను. అందువలన నామె ఆగది అంతయు పరిశుభ్రము చేయసాగెను. ఆమె ఆపని పూర్తిచేయునప్పటికి ఉపాధ్యాయుడు తిరిగి వచ్చెను.

ఉదయకాలపు భోజనము తయారుచేయుట కనుమతి యీయవలసినదని నెలబాల ఉపాధ్యాయుని కోరెను. అతడందుల కంగీకరించెను. అంతలో తాతయ్య అచ్చటకు వచ్చెను. వంట తయారగుచుండగా ఉపాధ్యాయుడు ఇట్లనెను: "తాతయ్య బాగుగ అలసిపోయినట్లున్నాడు. ఇతనికిప్పుడు విశ్రాంతి చాల అవసరము. మీరింకను చాలదూరము ప్రయాణము చేయవలసి యున్నదా? గమ్యస్థానము నొకరోజు ఆలస్యముగా చేరుకొన్నను వచ్చిన నష్టమేమియులేదా? అయినవో మీరు మఱియొకరాత్రి ఇచ్చట గడపవలసినదిగా కోరుచున్నాను. మీరిందుల కంగీకరించినచో నే నెంతయు సంతసింతును."

ముసలివాడు నెలబాలవంక చూడసాగెను. ఉపాధ్యాయుని ఆహ్వానమును అంగీకరించుటయా, అంగీకరించక పోవుటయా అను విషయమున అతడొక నిర్ణయమునకు రాలేకుండెను. అదిచూచి ఉపాధ్యాయు డింకను నిట్లనెను: "తాతయ్యా

మీ అమ్మాయి ఒకరోజు ఇచ్చటనున్నచో నేనెంతయు సంత సింతును. ఒంటరిగ నివసించుచున్న నాతో కలసి మీరున్నట్లుం డును. మీరు ఒకరోజు విశ్రాంతి తీసికొన్నట్లుండును. మీరు వెంటనే ప్రయాణమై పోవలసిన అవసరమున్నదా? అయినచో మీ ప్రయాణము సురక్షితముగ జరుగవలయునని వాంఛించు చున్నాను. నేను మీతోబాటు కొంచెము దూరము నడచి వచ్చెదనుగూడ."

ముసలివాడు ఏ నిశ్చయమునకు రాలేక నెలబాలతో నిట్లనెను: "నెలబాలా? మనమిప్పుడేమి చేయవలయును? మన మేమి చేయవలయునో చెప్పుము మణి!"

"మనమీ గౌరవనీయుని ఆహ్వానము నంగీకరించి యిచ్చట విశ్రాంతితీసుకొనుట యుక్తమని తోచుచున్నది" అని నెలబాల సమాధాన మిచ్చెను. తమకు ఆశ్రయ మొసగిన ఉపా ధ్యాయనిపట్ల ఆమె కృతజ్ఞత చూపదలచెను. అందువలన నామె ఆ యింటిలో చేయవలసిన పనులనన్నిటిని చేయసాగెను. అవి చేయుట పూర్తియైన తరువాత నామె అల్లికపని చేయసాగెను. ఆ సమయమున ముసలివాడు బయట సూర్యరశ్మిలో కూర్చుండి యుండి ఆకసములోని మేఘములవంక చూచుచుండెను.

ఈ లోపల ఉపాధ్యాయుడు నెలబాల యున్నగదిలో పిల్లలకు కావలసిన ఏర్పాట్లు చేయసాగెను. అప్పుడు నెలబాల అతనితో నిట్లనెను: "అయ్యా! నేనిచ్చట అడ్డుగానున్నానను కొందును. నేనీ గదివిడిచి నిన్నరాత్రి పరుండియున్న గదికిపోవు టకు సిద్ధముగా నున్నాను." కాని ఉపాధ్యాయు డందుల కంగీక రింపకుండెను. "నీ విచ్చటనే కూర్చుండి నీపని చేసికొనవచ్చును.

నీవు మఱియొక గదిలోనికి పోవలసిన పనియేమియు లేదు."

"మీ పాఠశాలలో చాలమంది పిల్లలుగలరా?" అని నెలబాల ప్రశ్నించెను.

ఉపాధ్యాయుడు తల త్రిప్పి, "ఎందఱో కలరు" అని అనెను.

"మిగిలిన వారందఱును తెలివైనవారేనా?"

"మంచివారు. చాలమంచివారు. కాని వారతనితో సరి పోలరు."

అంతలో నొక బాలుడు గుమ్మము వద్దకువచ్చి, ఉపాధ్యాయునకు నమస్కరించెను; లోనికివచ్చి తన స్థానములో కూర్చుండెను. క్రమక్రమముగా పిల్లలువచ్చి తమతమ స్థానముల నలంకరింపసాగిరి. మొత్తము వచ్చినవారు సుమారు పన్రెండు మంది పిల్లలు ఉందురు. గదిలో నింక ఒకస్థానము మాత్రము ఖాళీగా నుండెను. అది జబ్బుతోనున్న పిల్లవానిది.

పిల్లలు పాఠములు చదువుచుండిరి. ఉపాధ్యాయుడు తన స్థానములో కూర్చుండి యుండెను. కాని అతని మనస్సుమాత్ర మచ్చట లేకుండెను. ఎంత ప్రయత్నించినను అతని మనస్సు మఱియొక స్థలమునకు పరుగెత్తుకొని పోవుచుండెను. అతడు జబ్బుతోనున్న పిల్లవానిని గుఱించియే ఆలోచించుచుండెనని ప్రత్యేకముగ జెప్పనక్కఱలేదు. ఆ విషయమును కొందఱు సోమరిబాలురు గ్రహించిరి. అందువలన వారు తమ యిచ్చవచ్చి నట్లు అల్లరి చేయసాగిరి. ఉపాధ్యాయు డదియేమియు గమనింప కుండెను.

నెలబాల కిటికీవద్ద కూర్చుండి అల్లికపని చేసికొను చుండెను. పాఠములు చదువుట, అప్పచెప్పుట పూర్తియైన తరు

వ్రాత కాపీలు వ్రాయుట ప్రారంభమాయెను. అప్పుడు పిల్లలు అల్లరిచేయుటకు వీలులేకుండెను. ఉపాధ్యాయుడు ప్రతియొక్కని వద్దకునువచ్చి వ్రాతను పరిశీలించుచు కొన్ని సలహాలిచ్చుచుండెను. గోడమీది వ్రాతనుచూచి కొన్ని విషయములు నేర్చుకొనవలసినదని సలహాలిచ్చుచుండెను. కడచినరాత్రి జబ్బుతోనున్న పిల్లవాడు చెప్పిన విషయముల నతడు వారికి చెప్పసాగెను. "అతడు మీ మధ్యకు తిరిగిరావలయునని ఎంతో ఆతురపడుచున్నాడు" అని అనెను. ఉపాధ్యాయుని మాటలు విని పిల్లలెంతో జాలిపడిరి. అంతవఱకు అల్లరి చేసినందుకు వారు పశ్చాత్తాపపడిరి. ఇక ఏమాత్రం అల్లరి చేయకుండిరి.

గడియారము పండ్రెండుగంటలు కొట్టెను. అపుడు ఉపాధ్యాయు డిట్లనెను: "నాయనలారా! మధ్యాహ్నము మీరు పాఠశాలకు రావలసిన పనిలేదు. మీకు ప్రత్యేకముగ సెలవు ఇచ్చుచున్నాను."

ఆ మాటలను వినగానే విద్యార్థులు హర్షధ్వానములు చేసిరి. ఉపాధ్యాయు డింకను ఏమేమో మాట్లాడెను కాని వారి ధ్వనిమధ్య వినబడలేదు. అంతట "మీరందఱు ప్రశాంతముగ నుండవలయును" అను నర్థము వచ్చునట్లు ఉపాధ్యాయుడు తల పైకెత్తెను. అపుడు పిల్లలందఱు ప్రశాంతముగ నుండిరి.

అంతట ఉపాధ్యాయు డిట్లనెను: "ముందు మీరు నాకొక వాగ్దానము చేయవలయును. మీరు ఏవిధమగు అల్లరి చేయరాదు. ఒకవేళ చేయదలచుకొన్నచో ఊరిబయటకు పోయి చేయవలయును. ఏలయన జబ్బుగానున్న మీ మిత్రునకు మీ రెట్టి అలజడి కలిగింపరాదు."

ఉపాధ్యాయుడు చెప్పినట్లు చేయుటకు పిల్లలు అంగీకారము తెలిపిరి. అప్పుడు ఉపాధ్యాయు డిట్లనెను: "నా ప్రియమైన విద్యార్థులారా! మీరిప్పుడు చేసిన వాగ్దానమును మఱచి పోకుడు. ఈ యుపకారమును నాకు చేయుడు. మీరందఱు క్షేమముగ నుందురుగాక! ఇక మీరు పోవచ్చును."

అంతట పిల్లలు తమ కృతజ్ఞతను తెలియజేయుచు మెల్లన బయటకు పోయిరి.

అందఱను సంతృప్తిపఱచుట చాల కష్టమైన కార్యము. ఉపాధ్యాయుని పరిస్థితికూడ నట్లే యుండెను. ఏలయన నాటి మధ్యాహ్నము పిల్లలు తల్లులు మున్నగువారువచ్చి, ఉపాధ్యాయుని కలసికొని, సెలవు ఇచ్చినందుకు తమ తీవ్రమగు అసమ్మతిని తెలిపిరి. "అయ్యా! యీరోజు ఏఋషిసత్తముని జన్మదినోత్సవమని సెలవిచ్చినారు?" అని ప్రశ్నించిరి. మఱికొందఱు "చక్రవర్తి పుట్టినరోజుకుతప్ప సెలవీయరాదు. నీచ్ఛ వభావములు పనికిరావు" అని మందలించిరి. "ఒకపూట పిల్లలకు చదువు లేకుండ చేయుట పచ్చిమోసము" అని అనిరి. "ఉపాధ్యాయుడు ఈ పూటజీతము తగ్గించుకొనునేమో!" అని ఒకస్త్రీ యనెను. ఎందఱే విధముగ అన్నను ఉపాధ్యాయుడు ఏమియు మాట్లాడ లేదు.

చీకటిపడిన తరువాత ఉపాధ్యాయుడు, నెలబాలతో కలసి బయటకు పోవుటకు సిద్ధముగా నుండెను. అతడామె చేయి పట్టుకొని యుండెను. అంతలో నొకస్త్రీ అచ్చటకువచ్చి ఉపాధ్యాయునితో నిట్లనెను: "అయ్యా! మీరు వెంటనే మీ ప్రియ శిష్యుని ఇంటికి రావలయును. మీరు పరుగెత్తుకొని రావల

యును" ఉపాధ్యాయుడు, నెలబాల చేయి వదలిపెట్టలేదు. ఇరు వురును జబ్బుతోనున్న బాలుని ఇంటికి పరుగెత్తుకొని పోసాగిరి.

వారిరువురును ఒక కుటీరమువద్ద సాగిరి. ఉపాధ్యాయుడు మెల్లన తలుపు తట్టెను. వెంటనే తలుపులు తెఱచు కొనెను. వారిరువురును లోనికిపోయి ఒకగదిలో ప్రవేశించిరి. ఆ గదిలో నొక ముసలమ్మ కడుఘోరముగా నేడ్చుచుండెను. ఆమె చేతులు త్రిప్పుచు అటునిటు నూగుచుండెను. ఆమెచుట్టును కొందఱు స్త్రీలుండిరి.

ఉపాధ్యాయుడు ఆ ముసలమ్మ దగ్గఱకుపోయి "అమ్మా! పరిస్థితి అంత అధ్వానముగనున్నదా?" అని ప్రశ్నించెను.

"అతని పరిస్థితి అంతకంతకు అధ్వానమగుచున్నది. నా మనమడు మరణింపనున్నాడు. ఇది యంతయు మీమూలముననే జరుగుచున్నది. మీరతని నిప్పుడు చూచుటకు వీలులేదు. కాని అతడు మిమ్ము చూడవలయునని ఎంతయు ఆతురపడుచున్నాడు. మీ చదువు అతని నింతవఱకు తెచ్చినది. నాయనా? చిన్నారి నాయనా? నా ముద్దుల నాయనా? నే నిప్పుడు ఏమిచేయుదు?" అని ముసలమ్మ అనెను.

కాని వినయశీలుడగు ఉపాధ్యాయుడు ఇట్లనెను: "అమ్మా! దయయుంచి నేను తప్పుచేసినానని అనవలదు. నీ మాటలు నన్ను గాయపఱచలేదు. లేదు; గాయపఱచలేదు. కష్టస్థితిలో నుండుటవలన నీ మనస్సు ఏమియు బాగుండలేదు. నీవు అనవలయునని అనలేదను విషయము నాకు బాగుగ తెలి యును. నీ యుద్దేశ్యము నాకు బాగుగ తెలియును.

"నేను అనవలెననియే అన్నాను. అందుకు సందేహ

మేమియులేదు. నేను మఱియొకసారి ఆవిధముగ ననుచున్నాను. మీకు భయపడి అతడు పుస్తకములు తెగచదువుచుండెడివాడు. ఆ భయము లేకపోయినచో అతడు సుఖముగ తిరుగుచుండెడి వాడు. ఆ విషయమునాకు బాగుగ తెలియును" అనిముసలమ్మ అనెను.

తన తరపున ఒక్క మంచిమాట చెప్పవలసినదని కోరు చున్నట్లుగా ఉపాధ్యాయుడు అక్కడనున్న స్త్రీలందఱివంక చూచెను. కాని వారు అసమ్మతి సూచకముగ తలలూపిరి. "చదువులో మంచియున్నదని మేమెన్నడును అనుకొనలేదు. ఈ సంఘటన మాయభిప్రాయమును బలపఱచుచున్నది" అని ఆ స్త్రీలు అనుకొనిరి. అందువలన ఉపాధ్యాయుడు మఱి యిం కేమియు మాటలాడకుండ, ఆ స్త్రీలవంక కసిగాచూడకుండ మఱియొక గదిలోకిపోయెను. ఆ గదిలో నతనిప్రియశిష్యుడు అర్థనగ్నముగా ఒక మంచముపై పరుండి యుండెను.

ఆ ప్రియశిష్యుడు చాల చిన్న పిల్లవాడు. అతనిజుట్టు ఇంకను ఉంగరములుగా అతని ముఖముపై పడుచుండెను. అతనికన్నులు చాల ప్రకాశవంతముగ నుండెను. కాని ఆ కాంతి స్వర్గలోకము నకు సంబంధించినకాంతి; భూలోకమునకు సంబంధించినకాంతి మాత్రముకాదు. ఉపాధ్యాయుడా బాలుని ప్రక్కనేయున్న ఒక చిన్నబల్లపై కూర్చుండెను. అతడు పిల్లవానిపైకివంగి మెల్లన పేరుపెట్టి పిలిచెను. పిల్లవాడు వెంటనేలేచి ఉపాధ్యాయుని మొగ మును నిమిరెను; రెండుచేతులతోను అతనిమెడను కౌగిలించు కొనెను. "మీరు నాకు ప్రియమైనమిత్రులు" అనియనెను.

"నేను నీకెప్పుడును మిత్రుడనే. ఆ విషయము భగవాను

నకు చక్కగా తెలియును" అని ఉపాధ్యాయుడనెను.

బాలుడు నెలబాలనుజూచి, "ఆమెఎవరు?" అని ప్రశ్నించెను. అతడింకను నిట్లనెను. "నేనామెను ముద్దుపెట్టుకొన్నచో నాజబ్బు ఆమెకు అంటుకొనునని భయపడుచున్నాను. నా తోకరచాలనము చేయవలసినదని ఆమెతో చెప్పుడు."

పిమ్మట నా బాలుడు దగ్గఱకు జరిగి నెలబాలహస్తమును తన చేతితో బట్టుకొనెను. పిమ్మట వదలివైచి ఎప్పటివలె మంచముమీద పరుండెను.

బాలుని ఒక విధమైనమగత ఆవరించుచున్నట్లుండెను. అందువలన ఉపాధ్యాయుడతనిని ఉత్సాహపఱచదలచి, "హేరీ! నీకు తోటసంగతి జ్ఞాపకమున్నదా? సాయంకాలసమయము లందచ్చట ఎంత హాయిగనుండెడిది? నీవు మరల తొందఱగా అచ్చటకు రావలయును. అచ్చటి పుష్పములుగూడ నీవు రాని లోటును గ్రహించినవి. అవి ఇదివఱకువలె ప్రకాశించుటలేదు. నీవు తొందఱగా అచ్చటకు వత్తువుకదా? మిత్రమా! తొందఱగా వత్తువుకదా?" అనియనెను

ఆ మాటలను విని బాలుడు చాలమందముగ మందహాసము చేసెను. పిమ్మట నతడు తన హస్తమును ఉపాధ్యాయుని శిరస్సుపై బెట్టెను. అతడు తన పెదవులను గూడ కదల్చెను; కాని మాటరాలేదు. ఎటువంటిధ్వనియు వినబడలేదు

అచ్చట నంతయు ప్రశాంతముగనుండెను. అందువలన తెఱచియున్న కిటికీలోనుండి గాలితో బాలు బయటిధ్వనులు కూడ వచ్చుచుండెను. అపుడు పిల్లవాడు కన్నులు తెఱచి, "అదియేమి?" అని ప్రశ్నించెను.

"ఆటస్థలములోని పిల్లలుచేయుచున్న సవ్వడి."

అంతట పిల్లవాడు ఒక చేరుమాలు తీసికొని తనతలపైగా ఊపసాగెను. కాని తగినంతశక్తి లేకుండుటవలన చెయ్యిక్రిందపడి పోయెను.

"నేనాపనిచేయనా ?" అని ఉపాధ్యాయుడనెను.

పిల్లవాడు కడుహీన స్వరముననిట్లనెను : "దయయుంచి కిటికీవద్ద అట్లుచేయుడు. తరువాత అచ్చట కట్టివేయుడు. ఆట స్థలములోని కొందఱుపిల్లలు దానినిచూడవచ్చును. అప్పుడు వారు నన్నుతలచుకోవచ్చును."

తరువాత నతడు తలపైకెత్తి బల్లపై బడి యున్నవస్తువులను చూచుకొనెను. పిమ్మటనతడెప్పటివలె పరుండి, "చిన్నఅమ్మాయి ఇక్కడఉన్నదా ? నాకు కనబడుటలేదు" అనియనెను.

అంతట నెలబాలముందుకువచ్చి పిల్లవానిచేతిని నొక్కెను. తరువాత గురువు, ప్రియశిష్యుడు కౌగలించుకొనిరి. అటుపిమ్మట బాలుడు గోడవైపుకుతిరిగి నిదురమునిగెను.

ఉపాధ్యాయుడు ఎప్పటిచోటనే కూర్చుండి అచేతనముగా నున్నపిల్లవాని హస్తమును నిమురసాగెను. అది మరణించిన బాలునిహస్తము. ఆ విషయమును ఉపాధ్యాయుడు గ్రహించెను. కాని అతడు తనపనిమానలేదు; ఆ హస్తమును క్రిందపడవేయ లేదు.

ఉపాధ్యాయుని హృదయమువేయి వ్రక్కలైనట్లుండెను. నెలబాలపరిస్థితి కూడనట్లేయుండెను. ఇరువురును హృదయభార ముతో కుటీరమును వీడిబయటకువచ్చిరి. ఇరువురు మెల్లగా పాఠశాలా భవనమును చేరుకొనిరి. నెలబాల కన్నీరుకార్చుచునే

యుండెను. కాని అందుకు కారణమును మాత్రమామెతన తాతయ్యతో చెప్పలేదు. ఆమె చెప్పకుండుటకొక కారణమున్నది. ఇచ్చట తాతామనమరాండ్రు; ఆ కుటీరములో నాయనమ్మ, మనమడు. మనమడు పోయినాడన్న వార్త మనమరాలుపై మమ కారముగల తాతయ్యకు విచారమును కలిగించునుగదా!

నెలబాల సాధ్యమైనంతత్వరగా తనగదిలోనికిపోయెను. అచ్చటనామె ఒంటరిగా కూర్చుండి కంటికి మంటికి నేకధారగా నేడ్చి తన హృదయభారమును తీర్చుకొనెను. ఆమె చూచిన హృదయ విదారకదృశ్యమామెకు రెండుపాఠములు నేర్పెను. తాను సంపూర్ణారోగ్యము, స్వేచ్ఛ కలిగియున్నందుకామె సం తృప్తి చెందసాగెను. "మా తాతయ్యకు నేనొక్కర్తనే. మా తాతయ్య కేవిధమగు విచారముకలుగకుండ నేనుబ్రతికి యున్నాను. ఈ మనోహర ప్రపంచములో నేను జీవించియుండు టకు అవకాశము లభించుచున్నది. నా ఈడు వారెందరో మర ణించుచున్నారు. నేను బ్రతికియున్నాను. ఇందుకునేనెంతయు కృతజ్ఞురాలను" అని ఆమె తనకృతజ్ఞతాభావమును ప్రకటింప సాగెను.

నెలబాల మరణించిన బాలుని గుఱించి కలలుగన సాగెను. ఆ పిల్లవాడు దేవతలలో కలసి మందహాసము చేయు చున్నట్లుండెను. అట్టి చక్కని కలలమధ్య నుండగా సూర్యకిరణ ములా గదిలో ప్రవేశించెను. మఱి యింక నామె చేయవలసినది ఏమి యున్నది? ఉపాధ్యాయునివద్ద సెలవుతీసుకొని తాతయ్యతో బాటు మరల సంచారము చేయవలసినదే!

తాతామనమరాండ్రు ప్రయాణమునకు సిద్ధపడు నప్ప

టికి పాఠశాల ప్రారంభమయ్యెను. గదిలో బాలు రెప్పటివలె ప్రవర్తించుచుండిరి; వారి అల్లరి కొంచెము తగ్గినట్లు మాత్ర ముండెను. ఉపాధ్యాయుడు తాతా మనమరాండ్రతో బాటు తోట గుమ్మము వఱకు వచ్చెను.

నెలబాల చేతులు వణకు చుండెను; ఆమె ఉపాధ్యా యుని వీడిపోవుటకు ఇష్టపడకుండెను. కాని ఆమె వెళ్ళక తప్పదు. పూగుత్తులమ్మి సంపాదించిన డబ్బునామె ఉపాధ్యాయుని చేతిలో పెట్టి, "ఇది చాల తక్కువ సొమ్ము. దయతో స్వీకరింపుడు. మేము మీ కెంతయు కృతజ్ఞులము" అని యనెను. ఉపాధ్యా యుడా డబ్బు తీసి కొనుటకు నిరాకరించెను. "మీ రేమియు అనుకోవలదు" అని యని ఉపాధ్యాయుడు లోనికి వెళ్ళెను.

తాతా మనమరాండ్రు కొన్ని అడుగులు వేసిన తరు వాత, ఉపాధ్యాయుడు మరల గుమ్మమువద్దకు వచ్చెను. తాతయ్య వెనుకకు, తిరిగిపోయి ఉపాధ్యాయునితో కరచాల నము చేసెను; నెలబాలకూడ అటులనే చేసెను.

పిమ్మట ఉపాధ్యాయుడు ఇట్లనెను: "మంచి అదృష్టము, సౌఖ్యము మిమ్ముల నెప్పుడును అంటిపెట్టుకొని యుండునుగాక! నేను మరల నొంటరివాడనై పోయినాను! మీరు మరల నెప్పు డైన ఈ దారిని వచ్చుట తటస్థించినచో, నన్ను, ఈ పాఠ శాలా భవనమును మాత్రము మఱచి పోకుడు."

అంతట నెలబాల ఇట్లనెను: "ఆర్యా! మేము మిమ్మెన్న డును మఱచిపోము; మఱచిపోజాలము. మీరు మాపట్ల ఎంతో దయను ప్రదర్శించినారు. మేము మీ దయను ఎట్లు మఱచిపో గలము? మేము మీ కెప్పుడును కృతజ్ఞులమై యుందుము."

ఉపాధ్యాయుడు తల ఊపుచు, ఆలోచనా పూర్వకముగ మందహాసము చేయుచు నిట్లనెను: "పిల్లలు తఱచుగా ఈ విధముగ అనుచుండ నేను ఎన్నోసార్లు విన్నాను. కాని ఆ మాటలు త్వరలోనే మఱుగున పడిపోవును. ఒక్క చిన్న మిత్రుడు మాత్రము నన్ను అంటిపెట్టుకొని యుండెడివాడు. కాని ఆ అధ్యాయము ముగిసిపోయినది. భగవానుడు మీకు మేలు చేయుగాక!"

తాతా మనమరాండ్రు ఉపాధ్యాయునివద్ద సెలవు తీసికొని ముందుకు పోయిరి. ఉపాధ్యాయుడు కనబడుచున్నంతసేపు వారు వెనుకకు తిరిగి చూచుచునే యుండిరి. తరువాత వారు వెనుకకు తిరిగి చూచుట మానివైచిరి. క్రమ క్రమముగా వారు గ్రామమును వీడిపోయిరి.

7

తాతా మనమరాండ్రు రాజబాటపై ప్రవేశించి ప్రయాణమై పోవుచుండిరి. ఆ రాజబాట ఎంతవఱకు పోయిన అంతవఱకు పోవలయునని వారు అనుకొనుచుండిరి. వారికి రెండు మూడు చోట్ల కుటీరముల గుంపులు కనబడెను. కాని వారు అచ్చట ఆగలేదు. ఒకచోట వారికొక పూటకూళ్ళ యిల్లు కనబడెను. అచ్చట వారు కొంచెముసేపు ఆగి కొన్ని ఆహార పదార్థములను భుజించిరి. తరువాత వారు ఎప్పటివలె ప్రయా

ణము చేసిరి. ఎంత దూరము ప్రయాణము చేసినను, ఎంతసేపు ప్రయాణము చేసినను వారికి సరియైన గ్రామము కనబడకుండెను. మధ్యాహ్నము గడచిపోయినను పరిస్థితి ఆ విధముగనే యుండెను. మన బాటసారులు నిరుత్సాహము చెందసాగిరి. కాని వారు చేయగలిగినది ఏమి యున్నది? వారు ప్రయాణము కొనసాగించక తప్పదు.

ఎట్టకేలకా రాజబాట ఒక మైదానములోనికి దారి తీసెను. ఆ మైదానములో నొకచక్కని గుఱ్ఱపుబండి యుండెను. ఆ మనోహరమగు బండిలో నొక లావుపాటి స్త్రీ కూర్చుండి యుండెను. తాతా మనమరాండ్రచ్చటకు పోవునప్పటి కామె తేనీరు సేవించు పరిస్థితిలో నుండెను. ఆమె వారి నిరువురను చూచి, "ఆగుడాగుడు! అమ్మాయి! విజయము నెవ్వరు సాధించినారు?" అని ప్రశ్నించెను.

"ఎందులో? ఎచ్చట?" అని నెలబాల అనెను.

"గుఱ్ఱపు పందెములలో రెండవరోజు విజయము నెవ్వరు సాధించినారు?" అని గుఱ్ఱపు బండిలోని వనిత అనెను.

"రెండవరోజుననా?"

"అవును. రెండవరోజున! రెండవ రోజుననే! రెండవ రోజున గుఱ్ఱపు పందెములలో విజయము నెవ్వరు సాధించిరో చెప్పలేవా?"

"నాకు తెలియదమ్మా!"

"తెలియదా? ఎందుచేత? నీ వచ్చట నుంటివికదా! నిన్ను నేను స్వయముగా నా కన్నులతో జూచియుంటిని."

ఆ మాటలను విని నెలబాల కొలదిగా భయపడెను.

బండిలోని యువతికి బొమ్మలాట గాండ్రతో సంబంధము కల దేమో యని ఆమె సందేహింపసాగెను. కాని తరువాతి సంభాషణ ఆమె సందేహమును పాఱద్రోలెను.

బండిలోని యువతి ఇంకను నిట్లనెను: "నీవు బొమ్మలాట గాండ్రతో కలసి యుండగా చూచియుంటిని. అందుల కొంతయు విచారించు చున్నాను. వారు వట్టినీచులు; వారితోడి స్నేహము నెవ్వరును వాంఛింపరు."

"నేను ఇష్టపూర్వకముగ వారితో కలసి యుండుట సంభవింపలేదు. మాకు మార్గము తెలియలేదు. అందువలన దయాపరులగువారు మేము తమతో కలసి ప్రయాణము చేయుటకు అంగీకరించిరి. అమ్మా! మీరు వారి నెఱుగుదురా?"

"అమ్మాయి! వారి నెఱిగి యుండుటయా! వారి నెఱిగి యుండుటయా! నీవు చిన్నదానవు; అనుభవ మేమాత్రము లేని దానవు. అందువలన నీవట్టి ప్రశ్న వేసినందుకు క్షమించు చున్నాను. నేను నీకెట్లు కనబడుచున్నాను? సామాన్యమైన వనిత వలె కనబడుచున్నానా, వారి నెఱిగియుండుటకు! నాబండి ఎట్లు కనబడుచున్నది? సామాన్యమైనదిగ కనబడుచున్నదా, నేను వారి నెఱిగి యుండుటకు!"

ఏదో గొప్ప తప్పిదము చేసిన దానివలె నెలబాల ఇట్లనెను: "లేదమా! లేదమ్మా! నన్ను క్షమింపవలసినదిగా మిమ్ము వేడుకొను చున్నాను."

బండిలోని యువతి ఇంకను బాధపడు చున్నట్లు కనబడు చున్నను నెలబాలను క్షమించెను.

తరువాత నెలబాల ఇట్లనెను: "అమ్మా! మేము గుఱ్ఱపు

వందెములు జరుగుచున్న స్థలమును మొదటి దినముననే వదలి పెట్టినాము. ఈ రాత్రి ఏదేని పట్టణమునకు పోయి విశ్రాంతి తీసికోవలయునని అనుకొనుచున్నాము.''

క్రమ క్రమముగా బండిలోని వనిత మొగము కాంతివంతము కాసాగెను. అది కనిపెట్టి నెలబాల ఆమెను, "అమ్మా! ఏదేని పట్టణ మిచ్చటకు ఎంత దూరములో నున్నది?" అని ప్రశ్నించెను.

అంతట బండిలోని యువతి ఇట్లనెను: "నేను గుఱ్ఱపు పందెములు జరుగుచున్న ప్రదేశమునకు సరదాగా కాలము గడప వలయునని వెళ్ళినాను. అంతియేగాని వ్యాపారార్థము గాని, లాభసాటి బేరమునకుగాని వెళ్ళలేదు. అన్నట్లు నీ ప్రశ్నకు సమాధానము చెప్పవలయునుగదా! ముందు రాబోవు పట్టణ మిచ్చటకు ఎనిమిది మైళ్ళ దూరమున నున్నది."

పట్టణము ఎనిమిదిమైళ్ళ దూరమున నున్నదను మాటను వినగానే నెలబాల ఎంతయు నిరుత్సాహ పడెను. ఇంకను ఎనిమిదిమైళ్ళ దూరము నడచి పోవలయును! నెలబాల కన్నీరు కార్చ సాగెను. చీకటి పడకమునుపు ఆ పట్టణమునకు చేరుకొనుట అసాధ్యమైనపని! తాతయ్య మాత్రము ఎట్టి ఫిర్యాదు చేయకుండెను. అతడు తన చేతికఱ్ఱపై ఆనుకొని గట్టిగా నిట్టూర్పు పుచ్చెను.

నెలబాల బండిలోని వనితకు వందనము చేసి, సమాచారము తెలిపినందుకు కృతజ్ఞత తెలిపెను. తరువాత నామె తాతయ్య చేయి పట్టుకొని సుమారు ఏబది గజముల దూరము ముందుకు పోయెను. అంతలో బండిలోని వనిత వారిని వెనుకకు

రమ్మని పిలిచెను. వారు వెనుకకు వచ్చిరి.

"ఇంకను దగ్గఱకు రండు. ఇంకను దగ్గఱకు రండు. అమ్మాయి, నీవు ఆకలిగొని యున్నావా?"

"అంతగా ఆకలిగా లేదు. కాని మేము బాగుగ అలసి పోయి యున్నాము. పట్టణము చేరుకొనుటకు మే మింకను ఎని మిది మైళ్ళ దూరము ప్రయాణము చేయవలసి యున్నది."

"మీకు ఆకలిగా నున్నను, లేకపోయినను, మీరు కొంచెము తేనీరు సేవించుట మంచిది. ముసలయ్యా! నీ కటుల చేయుట ఇష్టమే అనుకొందును."

తాతయ్య నెత్తిపైనుండి టోపీ తీసి కృతజ్ఞతను తెలియ జేసెను. అంతట వనిత వారికువురకు రకరకముల ఆహార పదా ర్థములను, తేనీటిని ఇచ్చెను. మీరేమియు బిడియ పడకుడు. స్వేచ్ఛగా భుజింపుడు. స్వేచ్ఛగా త్రాగుడు" అని ఆమె వారిని హెచ్చరించెను. తాతా మనమరాండ్రు ఎటువంటి బిడియము లేక స్వేచ్ఛగా కడుపునిండ తినిరి; తేనీరు సేవించిరి.

వనిత బండి త్రోలువానిని పిలిచి అతనికి తాతా మనమ రాండ్రను చూపి ఇట్లనెను: "మనము వీరి నిరువురనుగూడ బండిలో నెక్కించుకొన్నచో ఎట్లుండును? గుఱ్ఱములు నడక తగ్గించునా?"

బండివాడు తాతా మనమరాండ్రను బాగుగ పరిశీలించి చూచి, మనము వీరిని తీసికొని పోవచ్చును" అని యనెను.

ఆ మాటలు విని నెలబాల ఎంతయు సంతసించి, వని తను పరిపరివిధముల ప్రశంసించెను. తాతా మనమరాండ్రు బండిలో ప్రవేశించిరి.

బండి బయలుదేరెను. నెలబాల ఆ ప్రాంతమునంతను నిశితముగ పరిశీలింప సాగెను. మొట్టమొదట తాతా మనమ రాండ్రు ఏమియు మాట్లాడకుండిరి. కాని క్రమ క్రమముగా వారు స్వేచ్ఛగా మాట్లాడుకొన సాగిరి. ఆ ప్రాంతమును గూర్చియు, అచ్చట కనబడుచున్న వస్తువులను గూర్చియు వారు మాటలాడుకొన సాగిరి. మఱికొంత సేపటికి తాతయ్య నిదుర మునిగెను. అది చూచి వనిత నెలబాలతో నిట్లనెను: "మీ తాతయ్య నిదుర పోయినాడు గనుక నీవు వచ్చి నా పక్కనే కూర్చుండుము."

వెంటనే నెలబాల అటుల చేసెను.

"అమ్మాయి! ఈ రకపు ప్రయాణము గూర్చి నీ అభిప్రాయ మేమి?"

"చాల బాగున్నది."

తరువాత నిరువురును మఱికొన్ని విషయములనుగూర్చి మాట్లాడుకొనిరి. అటుపిమ్మట వనిత చాలసేపు ఏమియు మాట్లాడకుండ నెలబాలవంక చూడసాగెను. వనిత హఠాత్తుగా లేచి నెలబాల ముందొక గుడ్డను పఱచెను. ఆ గుడ్డపై నేమో వ్రాయబడి యుండెను.

"ఈ గుడ్డపై వ్రాయబడి యున్నదానిని చదువుము, అమ్మాయి!"

"జార్జి మైనపు బొమ్మల ప్రదర్శనము" అని నెలబాల చదివెను.

"మఱియొకసారి చదువుము."

"జార్జి మైనపు బొమ్మల ప్రదర్శనము" అని నెలబాల

మఱియొకసారి చదివెను.

"ఆజార్జీ ఎవరనుకొనుచున్నావు? నేనే ఆ జార్జీ సతిని." అట్లని ఆమె నెలబాలవంక ప్రోత్సాహకరముగ చూచెను. "నీవు బిడియపడవలసిన పనిలేదు. ఎప్పటివలె నావద్ద స్వేచ్ఛగా నుండవచ్చును" అను నా అర్థము ఆ చూపులో నుండెను. ఆమె మఱికొన్ని గుడ్డలను బయటకు తీసెను, అందొక దానిపై, "నూఱు పెద్ద మైనపు బొమ్మల ప్రదర్శనము" అని వ్రాయబడి యుండెను. "ప్రపంచములో మఱి ఎచ్చటను ఇటువంటి మైనపు బొమ్మలు లేవు" అని మఱియొక గుడ్డపై వ్రాయబడి యుండెను. ఆ విధముగనే వేర్వేఱు గుడ్డలపై వేర్వేఱు ప్రకటనలు వ్రాయబడి యుండెను. అవి యన్నియు జార్జీ మైనపు బొమ్మల ప్రాశస్త్యమును ఉగ్గడించు చుండెను. నెలబాల ఆ ప్రకటనల నన్నిటిని చదివి జార్జీ సతికి ముదమును కలిగించెను. ఆమె యాగుడ్డల నన్నిటిని ఎప్పటివలె దాచివైచెను. "చూచినావా! నేను చాల గొప్ప దానను! గొప్ప వంశమునకు చెందిన దానను! నా సంగతి నీ కిప్పుడు పూర్తిగా అర్థమైనదా?" అను అర్థము వచ్చునట్లు ఆమె విజయగర్వముతో నెలబాలవంక చూచెను.

పిమ్మట నామె యిట్లనెను: "ఇప్పుడు నీవంతయు చూచి నావుగదా! మఱియొక మందెన్నడును బొమ్మలాట గాండ్రవంటి నీచులతో సహవాసము చేయకుము."

"అమ్మా! నేను మైనపు బొమ్మల ప్రదర్శనము నెన్నడును చూచియుండలేదు. అది హాస్యగాని బొమ్మలాటకంటె తమాషాగా నుండునా?"

"తమాషాగానా! ఏ మాత్రము తమాషా నుండదు."

"అటులనా!" అని నెలబాల నమ్రతతో ననెను.

"మైనపు బొమ్మల ప్రదర్శనము ఏ మాత్రము తమాషాగా నుండదు. అది చాల ప్రశాంతముగను, సాంప్రదాయ సిద్ధముగను నుండును. నీచపు మాటలకు, తమాషాలకు ఇచ్చట తావు ఉండదు. ఇవి హాస్యగాని బొమ్మలవలె నుండవు."

"ఆ బొమ్మ లిచ్చట నున్నవా?"

"ఏ బొమ్మలు?"

"మైనపు బొమ్మలు."

"అమ్మాయి! నీ యుద్దేశ్యమేమి? నీవేమి అనుకొనుచున్నావు? అన్ని మైనపుబొమ్మలు ఇచ్చట నెట్లుండెను? అవి ఒక్కొక్కటి మనిషిఅంత ఉండునుగదా! ఈ బండిలోని వస్తువులన్నియు నీకు స్పష్టముగా కనబడుచున్నవిగదా! మఱి వాని నిచ్చట ఏమూల దాచితి ననుకొనుచున్నావు? ఆ బొమ్మలన్నియు మాకంటె ముందే వేఱు బండ్లపై పోయినవి. పట్టణములో నవి ఎల్లుండి ప్రదర్శింపబడును. మన మిప్పుడు ఆ పట్టణమునకే పోవుచున్నాము. నీవచ్చట తప్పక ఆ మైనపుబొమ్మల ప్రదర్శనమును తిలకింపవచ్చును. నీవు వానిని చూతువని తలచుట సహజమే. నీవు తప్పక చూతువనుటకు ఎట్టి సందేహమును లేదు. చూడకూడదని నీవు గట్టిగా నిర్ణయించుకొన్నను వానిని చూతువు."

"అమ్మా! నేను మఱి ఆ పట్టణములో నుండనుగదా!"

"ఆ పట్టణములో నుండవా? అయిన మఱి యెచ్చట నుందువు?"

"నాకు సరిగా తెలియదు. అక్కడ ఉందునని నేను

నిశ్చయముగ చెప్పజాలను."

"ఒక గమ్యస్థాన మనునది లేకుండగనే మీరీ ప్రాంత మంతయు తిరుగుచున్నారా? ఇదియేనా నీ మాటల అర్థము? మీరు ఎటువంటి వింతమనుష్యులు! మీరు చేయుచున్న పని ఏమి? నేను మిమ్ములను గుఱ్ఱపు పందెములు జరుగు స్థలమువద్ద చూచినపుడే అనుకొన్నాను; మీరచ్చటకు పనికట్టుకొని రాలేదని, ఏదో సందర్భవశమున వచ్చినారని."

"మీరన్నమాట నిజమే. మేమచ్చటకు పనికట్టుకొని పోలేదు. మే మచ్చటకు కాకతాళీయముగ వచ్చినాము. అమ్మా! మేము బీదవారము. అందువలన మేము ఈవిధముగ తిరుగవలసి వచ్చుచున్నది. మేము చేయుటకు పనిఏమియు లేదు. ఏదేని పని దొరకిన బాగుండునని అనుకొనుచున్నాను."

"అమ్మాయి! నీమాటలు నాకు అంతకంతకు ఆశ్చర్యము కలిగించుచున్నవి. మఱి మిమ్ముల నేమని పిలుచుకొందురు? బిచ్చగాండ్రా?"

"బిచ్చగాండ్రనికాక మమ్ముల నింక ఏమని పిలుచుకోవలయునో నిజముగా నాకు తెలియదు."

"అయ్యో భగవానుడా! నే నిటువంటిమాటల నెన్నడును వినియుండ లేదు. ఇట్లు జరుగునని ఎన్నడును ఊహించి యుండ లేదు."

తరువాత నామె చాలసేపటివఱకు ఏమియు మాట్లాడ లేదు. అందువలన ముందేమి జరుగనున్నదోయని నెలబాల భయపడసాగెను; తనమాట లామెకు అసహ్యము కలిగించినవని అనుకొనసాగెను.

అంతలో జార్జీసతి ఇట్లనెను: "అయినను నీవు చదువ గలవు. వ్రాయగలవు? ఈ విషయమున నాకే ఆశ్చర్యమును లేదు."

"అవునమ్మా!" అని నెలబాల భయముతో ననెను.

"కాని నాకు చేతకాదు!" అని జార్జీసతి అనెను.

"నిజముగా!" అని నెలబాల ఆశ్చర్యముతో ననెను.

జార్జీసతి ఇంక ఆమె నేమియు ప్రశ్నింపలేదు. ఆమె ఏదో ఆలోచించుచు కూర్చుండెను. అందువలన నెల బాల అప్పటికి మేల్కాంచియున్న తన తాతయ్యవద్దకుపోయెను.

చాలసేపైన తరువాత జార్జీసతి బండివానిని తన దగ్గఱకు పిలిచెను. అతనితో నేమో చాలసేపు మాట్లాడెను. వారిరువురును ఏదో ఒక ముఖ్యవిషయమునకు సంబంధించిన మంచి చెడ్డలను చర్చించుకొనుచున్న ట్లుండెను. ఆమె అతని సలహా నా విషయమున కోరుచున్న ట్లుండెను. ఆ సమావేశము ముగి సిన తరువాత నామె నెలబాలను తన దగ్గఱకు రావలసినదని పిలిచెను. "మీ తాతయ్యనుగూడ తీసికొనిరమ్మ"అని యనెను. అంతట తాతా మనమరాండ్రువురును ఆమెదగ్గఱకు పోయిరి.

ఆమె తాతయ్యతో నిట్లనెను: "తాతయ్యా! నీ మనమ రాలికి చక్కని యుద్యోగము కావలయునని కోరుచున్నావా? నీకా కోరిక యున్నచో, ఆ విషయమున నేను సాహాయ్యము చేయగలను. ఇందుల కేమందువు?"

"నే నామెను వదలిపెట్టి యుండలేను, మే మిరువురము వేఱుగా నుండుటకు వీలులేదు. ఆమె లేకపోయినచో నా పని ఏమి అగును?"

"నీ జాగ్రత్తను నీవు చూచుకొనగల వయస్సున్నదని నేను అనుకొన్నాను."

అంతట నెలబాల జోక్యము కలుగజేసుకొని మెల్లన ఇట్లనెను: "అమ్మా! మా తాతయ్య మాఱిపోయినాడు. ఇక పూర్వమువలె నతడెన్నటికిని కాజాలడు. దయయుంచి అతనితో కఠినముగ మాట్లాడకుడు." పిమ్మట నామె గట్టిగ ఇట్లనెను: "మేము మీకెంతయు కృతజ్ఞులము. కాని నేను మా తాతయ్యను విడిచి యుండలేను. మా తాతయ్య నన్ను విడిచి యుండలేడు. మాఎత్తు ధనము ఇచ్చినను మేము వేఱుపడము."

తన సూచన కావిధమగు సమాధానము వచ్చినందుకు జార్జీసతి కొలదిగా బాధపడెను. ఆమె తాతయ్యవంక చూడ సాగెను. తాతయ్య నెలబాల హస్తమును బట్టుకొని తన చేత బెట్టుకొనెను. కొంచెముసేపు ఎవ్వరును మాట్లాడకుండిరి. తరువాత జార్జీసతి మఱియొకసారి బండివానితో మాట్లాడెను. ఈసారి వారు త్వరగా ఒక అంగీకారమునకు రాలేకుండిరి. ఎట్టకేలకు వారొక సమాధానమునకు వచ్చిరి.

పిమ్మట జార్జీసతి తాతయ్యతో నిట్లనెను: తాతయ్యా! నీవుకూడ పనిచేయదలచుకొన్నావా? అయినచో నీకు నావద్ద కావలసినంత పని దొరకును. నీవు నా బొమ్మలమీద దుమ్ము ధూళి లేకుండ పరిశుభ్రము చేయుచుండవచ్చును; ఇంకను ఇతరపనులు చేయుచుండవచ్చును. నీ మనమరాలు నావద్దనే ఉద్యోగము చేయవచ్చును. ఆమె చేయవలసినపని చాల సులభమైనది. బొమ్మలనుగూర్చి చెప్పుటయే ఆమె చేయవలసిన పని. ఆమె యీ పనిని ఇతరుల కెవ్వరికి కష్టము కలుగకుండ

చక్కగా చేయగలదని నేను నమ్ముచున్నాను.

మిత్రమా! ఒక్క విషయమును జ్ఞాపక ముంచుకొనుము. జార్జి మైనపుబొమ్మల ప్రదర్శనము చాల ప్రసిద్ధమైనది. పని చాల సులభమైనది; గౌరవప్రదమైనది. ఈ ప్రదర్శనమును తిలకించుటకు గౌరవనీయులు మాత్రమే వచ్చుచుందురు. మఱియు నీ ప్రదర్శనము గౌరవప్రదమైన స్థలములందుమాత్రమే జరుగును. ఇది కీలుబొమ్మలాట కాదను విషయమును జ్ఞప్తియం దుంచుకొనుము. ఈ ప్రదర్శనము ప్రతిచోట జరుగదను విషయ మును జ్ఞప్తియం దుంచుకొనుము. ఈ ప్రదర్శన ప్రాశస్త్యమును గూర్చి నేను కొన్ని కరపత్రములను ప్రచురించియున్నాను. మా ప్రదర్శనము ఆ కరపత్రములలో నున్నంత గొప్పగా నుండును. ఇటువంటి ప్రదర్శనము మఱియొకటి లేదు. ఆఱు పెన్నీలకే ఈ గొప్ప ప్రదర్శనమును తిలకింపవచ్చును."

జార్జీసతి ఇంకను నిట్లనెను: "ఇటువంటి అవకాశము మీకు మఱియొకసారి రాదని నిస్సందేహముగ చెప్పగలను. ఇక నెలబాలకు ఎంత జీత మిత్తునందువా? ఆ విషయమునుగుఱించి నేనిప్పు డేమియు వాగ్దానము చేయజాలను. నేను నెలబాల శక్తి సామర్థ్యములను సంపూర్ణముగ పరిశీలింపవలయును. ఆమె తన విద్యుక్త ధర్మములను నిర్వహించు విధానమును నిశితముగ పరిశీలింపవలయును. కాని ఒక్క విషయమునుగూర్చిమాత్రము ఇప్పుడు వాగ్దానము చేయగలను. మీ యిరువురకు ఉచిత భోజనవసతి సౌకర్యములను సమకూర్చుదును. మీకు ఇచ్చు ఆహారము చాల ఉత్తమమైనదిగ నుండును. మఱియు మీరు మీ యిచ్చవచ్చినంత ఆహారమును భుజింపవచ్చును."

తరువాత తాతా మనమరాం(డు ఆ విషయమునుగూర్చి సం(పదించుకొనిరి. వారందు మునిగియుండగా జార్జీసతి హుందాగా కూర్చుండి యుండెను. కొంతసేపటికి నెలబాల ఆమెవైపుకు తిరిగెను.

"అమ్మాయి! ఏమి నిర్ణయమునకు వచ్చినారు?" అని నెలబాల నామె (పశ్నించెను.

"అమ్మా! మేము మీకెంతయు ఋణపడియున్నాము. మేము ఎంతో కృతజ్ఞతతో మీవద్ద పనిచేయుటకు అంగీకరించుచున్నాము" అని నెలబాల అనెను.

"ఈ చక్కని నిర్ణయమునకు వచ్చినందుకు మీరెన్నడును విచారింపరనియు, పశ్చాత్తాపపడవలసిన అవసరముండదనియు నేను నిస్సందేహముగ చెప్పగలను. ఆ విషయమును గూర్చి మీకు హామీ ఇవ్వగలను. ఇక అంతయు నిర్ణయమైపోయినట్లే. మనమింక భోజనము చేయుదుము."

అప్పటికి అర్ధరాత్రమయ్యెను. బండి పట్టణవీధులలో (పవేశించెను. వీధులలో నెవ్వరునులేరు. అంతయు (పశాంతముగ నుండెను. మఱి ఎవరి ఇండ్లలోవారు నిదురించుచుండిరి. (పదర్శనశాలకు బోవుటకది తగిన సమయము కానందున జార్జీసతిబండి ఒక ఖాళీ (పదేశములోనికిపోయి ఆగెను. అప్పటికచ్చట మఱియొక బండియుండెను. అదికూడ జార్జీసతికి చెందినదే. ఆ బండిలో నామెకు సంబంధించిన బొమ్మలు వచ్చియుండెను. ఆ బొమ్మలు (పదర్శనశాలలో చేర్పబడియుండుటవలన, బండి ఖాళీగానే యుండెను.

ముసలి తాతయ్య ఆ ఖాళీబండిలో నారాత్రి నిదురింప

వలయునని నిర్ణయింపబడెను. నెలబాల జార్జీసతితో బాటు వారు పయనమైవచ్చిన బండిలోనే నిదురింపవలయునని నిశ్చయింప బడెను. అనగా నెలబాల అప్పుడే ఆమె విశ్వాసమును చూఱ గొన్నదన్న మాట!

నెలబాల తాతయ్యతో బాటు ఖాళీబండిలోనికి వెళ్ళెను. అచ్చట నామె తాతయ్యను నిదురపుచ్చెను. పిమ్మట నామె జార్జీసతియున్న బండివద్దకు తిరిగిరాసాగెను. అప్పుడు చల్లనిగాలి చక్కగా వీచుచుండెను. ఆగాలిలో కొంచెముసేపు తిరుగవలయు నను నుద్దేశ్యముతో నెలబాల వేఱుదిక్కుకు పోయెను. ఆమె ముందు ఒకపెద్దగేటు వచ్చెను. అచ్చటనంతయు చీకటిగా నుండెను. నెలబాల ఆగి గేటువంక చూడసాగెను. ఆమె మన స్సులో ఏవేవో ఆలోచనలు బయలుదేఱసాగెను. అంతలో ఆ చీకటిలోనుండి ఎవ్వరో మనుజుడు బయటకువచ్చెను. అతని నామె వెంటనే గుర్తించెను. దుర్మార్గుడును, కురూపియునగు క్విల్పును ఎవరు గుర్తింపలేరు!

అతనిని చూడగనే నెలబాల చీకటిలోనికి పోయెను. క్విల్పు ఆమె ప్రక్కనుండియే వెళ్ళెను. అతని చేతనొక కఱ్ఱ యుండెను. అతడు కొంచెము దూరము ముందుకుపోయి కఱ్ఱపై ఆనుకొని నిలబడెను. అతడు తిన్నగా నెలబాల నిలబడియున్న దిక్కుకు చూచుచున్నట్లుండెను. అతడు నెలబాలనే చూచు చున్నాడాయేమి? కాదు, కాదు. ఆమెను చూచుటలేదు. కాని నెలబాల ఎంతయు భయపడుచుండెను. "సాహాయ్యము! సాహాయ్యము!" అని ఆమె అఱవవలెననుకొనెను. కాని ఆమె నోటివెంట మాటరాకుండెను! అంతలో చీకటిలోనుండి ఒక

బాలుడు బయటకు వచ్చెను.

క్రైల్పు ఆ బాలుని ఉద్దేశించి, "త్వరగారమ్ము! తొందరగారమ్ము!" అని అఱచుచుండెను.

"అయ్యా! నా నెత్తిమీంది బరువు సామాన్యమైనదికాదు. అయినను నేను తొందఱగానే వచ్చుచున్నాను" అని బాలుడు అనెను.

"తొందఱగా వచ్చుచున్నావా! దుర్మార్గుడా! బుద్ధిహీనుడా! తాబేలువలె నడచి వచ్చుచున్నావు! అందుకు సిగ్గుపడవేమి? ఇప్పుడప్పుడే పండ్రెండున్నర గంటలైనది. లండను కోచి ఎన్నింటికి వచ్చును?"

"ఒంటిగంటకు వచ్చును" అని బాలుడు సమాధానమిచ్చెను.

"అయిన తొందరగా రమ్ము. లేనిచో కోచి అందక పోవచ్చును."

క్రైల్పు, బాలుడు తొందఱ తొందఱగా పోసాగిరి. కనుచూపుమేఱ దాటిపోయిన తరువాత నెలబాల చీకటిలోనుండి బయటకు వచ్చెను. ఆమె తిన్నగా తాతయ్య నిదురించుచున్న బండివద్దకు పోయెను. క్రైల్పు ప్రక్కనుండి నడచిపోయినంత మాత్రాన తాతయ్య భయపడియుండునని ఆమె అభిప్రాయము! కాని, తాతయ్య సుఖముగ గుఱ్ఱుపెట్టి నిదురించుచుండెను. అది చూచి ఆమె మెల్లన జార్జీసతియున్న బండివద్దకు పోసాగెను.

క్రైల్పు కనబడిన విషయమును ఎవ్వరికిని చెప్పరాదని ఆమె నిశ్చయించుకొనెను. ఆ సందర్భమున నామె యిట్లను కొనెను; "ఆదుర్మార్గుడిచ్చటకు ఎందుకు వచ్చినాడో! బహుశా

మమ్ము వెదకిపట్టుకొనుటకే వచ్చియుండెను. కాని ఒక్క విష యము మాత్రము స్పష్టమైనది. అతడు లండను కోచినిగూర్చి బాలుని ప్రశ్నించినాడు. అనగా అతడు గృహోన్ముఖుడై పోవు చున్నాడన్నమాట. ఇచ్చట మేము లేమను ఉద్దేశ్యముతోనే అతడున్నాడు. కావున మేము ఇతర ప్రదేశములకు పోవుట కంటె ఇచ్చటనుండుటయే ఎక్కువ క్షేమకరము." అట్లామె అనుకొనెనుగాని అంతమాత్రమున ఆమె భయము తగ్గలేను. వాతావరణమంతియు క్విల్పులతో నిండియున్నట్లు ఆమె భావింప సాగెను.

నెలబాల జార్జీసతి పరుండియున్న బండిలోనికేగెను. అప్పటికామె గుర్రుపెట్టి నిదురించుచుండెను. నెలబాలకుగూడ పక్క సిద్ధముచేయబడి యుండెను; ఆమె ఆ పక్కపై పరుం డెను. కాని ఆ రాత్రి ఆమెకు సరిగా నిదురపట్టలేను. ఆమెకు మాటిమాటికి క్విల్పు జ్ఞాపకము వచ్చుచునేయుండెను. ఎట్టకే లకు ఇంక కొంచెముసేపటికి తెల్లవారుననగా ఆమెకు గాఢమగు నిదురపట్టెను.

నెలబాల నిదురనుండి లేచునప్పటికి జార్జీసతి మేల్కాంచి యుండెను. అంతియకాదు; ఆమె ఉదయకాలపు భోజనమును తయారుచేయుటలో నిమగ్నురాలై యుండెను.

"అమ్మా! నేను ఆలస్యముగ లేచినందులకు క్షమింప వలయును" అని నెలబాల ఆమెతో ననెను. ఆ మాటలనువిని జార్జీ మందహాసముచేసి యిట్లనెను: "నీకు రాత్రి సరిగా నిదుర పట్టియుండదు. అందువలననే ఆలస్యముగ లేచినావు. నీవు మధ్యాహ్నమువరకు పరుండియుండినను, నేను లేపి యుండెడి

దానను గాను."

జార్జీసతి మాటలనువిని నెలబాల ఉత్సాహపూరితురా లయ్యెను. జార్జీసతి ఇంకను ఇట్లనెను: "అమ్మాయి! బాగుగ అలసిపోయియున్నప్పుడు వీలైనంతసేపు నిదురించుట సత్ఫలిత ములనిచ్చును. అలసట మటుమాయమైపోయెను. మఱి నీ వయ స్సులోనున్న వారి కదియొక వరప్రసాదము. వారి యిష్టము వచ్చినంతసేపు సుఖముగా నిదురపట్టును.

"అమ్మా! నిన్నరాత్రి మీకు సరిగా నిదుర పట్టలేదా?"

"నిన్నరాత్రి అననేమి? ప్రతిరాత్రియు అంతే. నేను దీని నంతెను ఎట్లు భరింపగలుగు చున్నానాయని ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యపడు చుందును."

ఆ మాటలు నెలబాలకు ఆశ్చర్యమును కలిగించెను. వేలయన జార్జీసతి గుఱ్ఱుపెట్టి నిదురించుచున్న దృశ్యము నామె చూచి యుండెను. రాత్రియంతయు ఆ గుఱ్ఱు ధ్వని ఆమెకు వినబడుచునే యుండెను. "రాత్రియంతయు మేల్కొని యున్న ట్లీమె కలగాంచు చుండును కాబోలు!" అని ఆమె అనుకొనెను. అయినను ఆమె పైకి ఇట్లనెను; "అమ్మా! మీ అనారోగ్య పరిస్థితికి నే నెంతయు విచారించుచున్న దానను. అనతి కాలము లోనే మీకు సంపూర్ణారోగ్యము చేకూరవలయునని నేను భగ వంతుని ప్రార్థించు చున్నాను."

అంతలో తాతయ్యకూడ నిదురనుండి లేచి కాల కృత్య ములు తీర్చుకొనెను. భోజనముకూడ సిద్ధమయ్యెను. అందువలన ముగ్గురు కూర్చుండి భోజనము చేసిరి. భోజనమైన తరువాత పాత్రలు మున్నగు వానిని పరిశుభ్రము చేయుటలో నెలబాల

సాహాయ్యపడెను.

భోజనమైన తరువాత జార్జీసతి ఒకచక్కనిశాలువా కప్పుకొనెను. మఱి ఆమెపట్టణవీధులలో నడచి పోవలసియుండెను. ఆ సందర్భమున నామెనెలబాలతో నిట్లనెను: "అమ్మాయి! పెట్టెలను తీసికొనిపోవుటకు బండివచ్చును. కావున నీవు అందులో వచ్చుటమంచిది. ఇష్టము లేకపోయినను నేనునడచి పోవలసియున్నది. నేను ఆ విధముగ చేయవలయునని జనులఉద్దేశ్యము. ఇటువంటి వ్యవహారములలో మన యిష్టానిష్టముల ప్రశక్తి లేదు. ప్రజల ఉద్దేశ్యములప్రకారమేమనము నడచుకొనవలయును. మఱి నేనెట్లున్నాను? బాగుగ కనపడుచున్నానా?"

"మీరు చాల చక్కగనున్నారు" అని నెలబాల సంతృప్తికరమగు సమాధానమొసగెను. జార్జీసతి శరీరమంతట ఎన్నో పిన్నులు గుచ్చుకొనెను. ప్రజలకు చాల చక్కగ కనబడుటకు ఎన్నో ప్రయత్నములుచేసెను. ఎట్టకేలకామె సంతృప్తిచెంది ఠీవిగా నడచి పోసాగెను.

నెలబాల బండిలో పోసాగెను. ఆమె కిటికీలో నుండి బయటకు తొంగి చూచుచుండెను. తామున్నపట్టణమెటువంటిదో తెలిసికోవలయునను కుతూహలములోనే ఆమె అటులచేయుచుండెను. కాని ఎప్పటికప్పుడు దుర్మార్గుడగు క్వీల్పు కనబడునేమోయని ఆమె భయపడుచుండెను. ఆ పట్టణము ఒక మాదిరి పెద్ద పట్టణమే. ఆ పట్టణముమధ్యనొక పెద్ద ఖాళీస్థలముండెను. ఆ స్థలములో టౌన్‌హాలుకలదు. అచ్చట గడియారస్తంభము కలదు. ఆ పట్టణములో ఊళ్ళు, ఎఱ్ఱనిఇటుక, పసుపుపచ్చని ఇటుకలు మున్నగువానితో కట్టబడియుండెను. కొన్ని ఇండ్లు

పూర్తిగా కట్టియుండ్లే! అందులో చాలవరకు ప్రాతవే. వీధులు చాల పరిశుభ్రముగనుండెను. అక్కడక్కడ ఒకరిద్దరు మనుజులు మాత్రము కనబడుచుండిరి. వీధులు చాలవరకు ఖాళీగానే యుండెను.

ఎట్టకేలకు బండి ప్రదర్శనశాలవద్ద ఆగెను. అచ్చట పలువురు పిల్లలుండిరి. నెలబాల వారి ముందుబండిలోనుండి క్రిందకు దిగెను. పిల్లలామెను పలువిధముల ప్రశంసించిరి. వారామెను ప్రదర్శనములో నొక భాగమని తలచియుందురు. బండిలోనుండి తాతయ్యగూడ క్రిందకుదిగెను. పిల్లలతనినిగూడ ప్రదర్శనలో నొక భాగమనితలచిరి. బండిలో కొన్ని పెట్టెలుగూడ నుండెను. వానినిగూడ క్రిందకుదింపిరి. ఆ పెట్టెలలో అలంకరణ సామ్రగి ఉండెను. ఆ వస్తువులతో జార్లీసతి ప్రదర్శనశాలను చక్కగా అలంకరింపదలచి యుండెను.

ప్రదర్శనశాలలో నిదివరకే బొమ్మలుఅమర్చబడి యుండెను. కాని దుమ్ముపడునను భీతితో వానిమీద గుడ్డలుకప్పి యుంచిరి. తాతామనమరాండ్రు ఆ గుడ్డలనన్నిటిని తొలగించి వైచిరి. తరువాత ప్రదర్శనశాల అలంకరణ ప్రారంభమయ్యెను. ఆ పనిలో తాతామనమరాండ్రు జార్లీసతికి అపూర్వమగు సేవ చేసిరి.

ప్రదర్శనలోని బొమ్మలు రకరకములుగా నుండెను. వానినన్నిటిని చూచి నెలబాల ఆశ్చర్యమును ప్రకటించెను. జార్లీసతి ప్రదర్శనశాల మధ్యనున్న ఒక చక్కనికుర్చీలో కూర్చుండెను. ఆమె నెలబాలను దగ్గరకుపిలిచి చేతికొకకఱ్ఱనిచ్చి ఆకఱ్ఱతో బొమ్మలనన్నిటిని చూపవలసిన విధానమునుగూర్చి వివరించి

చెప్పెను.

నెలబాల కన్నుతో నొక బొమ్మను చూచెను. అప్పుడు జార్జీసతి ఇట్లనెను: "అది ఎలిజబెత్ రాణి కాలమునకు చెందిన ఒక కన్యారత్నము బొమ్మ. ఆమె ఆచారమునకు విరుద్ధముగ ఆదివారమునాడు పనిచేసినది. అందువలన వ్రేలికి సూది గుచ్చుకొని మరణించినది. ఆమె వ్రేలినుండి కారుచున్న ఆ రక్తమును గమనింపుము. ఆమె చేతిలోని సూదినిగూడ గమనింపుము."

జార్జీసతి మాటలను నెలబాల రెండు మూడుసార్లు అనుచుండెను. తరువాత వారు రెండవబొమ్మదగ్గఱకు వెళ్ళిరి. రెండవ బొమ్మనుగూర్చి జార్జీసతి ఇట్లనెను: "ఈ బొమ్మ రాక్షసుడనదగు జాస్పర్ పాకిల్ మెర్టన్‌ది. అతడు పదునలుగురు కన్యలను ప్రేమించి వివాహము చేసికొనియుండెను. వారు ఏ పాప మెఱుగని పతివ్రతా శిరోమణులు. కాని ఆ దుర్మార్గుడు నిదురించుచున్న ఆ వనితారత్నముల నందఱను నాశనముచేసియుండెను. ప్రభుత్వమువారతనిని పట్టుకొని న్యాయస్థానమునకు తీసికొనివచ్చిరి. 'నీవు చేసినపనికి విచారించుచున్నావా?' అని న్యాయాధికారి ప్రశ్నింపగా అతడిట్లు సమాధానమిచ్చెను: "'అవును.' వారినంత సులభముగా పోనిచ్చినందుల కెంతయు విచారించుచున్నాను. ఇందుకు క్రైస్తవ భర్తలందఱు నన్ను క్షమింతురని ఆశించుచున్నాను. ఇది స్త్రీలకందఱకు ఒక తీవ్రమైన హెచ్చరిక?"

ఆ మాటలుకూడ నెలబాలకు నోటికివచ్చెను. అంతట జార్జీసతి మిగిలిన బొమ్మలనుగూర్చిగూడ చెప్పెను. అది యంతయు నెలబాలకు నోటికివచ్చెను. జార్జీసతి సూచనలు

నెలబాలకు అపూర్వమగు లాభము చేకూర్చెను. రెండు గంటలు గడచునప్పటికి నెలబాల ప్రతి బొమ్మనుగూర్చి చూడ వచ్చినవారికి వివరముగా చెప్పగలస్థితిలో నుండెను. జార్జీసతి అందుల కామె నెంతయు ప్రశంసించెను. క్రమక్రమముగా ప్రదర్శనశాలకు సంబంధించిన ఏర్పాట్లన్నియు పూర్తి అయ్యెను. ప్రదర్శనశాలకు సంబంధించిన వివరములన్నియు పట్టణప్రజల కందఱకు తెలియఁజేయబడెను.

ప్రదర్శనము ప్రారంభమయ్యెను. ప్రదర్శనము తిలకించుటకు జనులు తండోపతండములుగ రాసాగిరి. అందువలన జార్జీసతికి మంచి రాబడి వచ్చుచుండెను. వచ్చినవారికందఱకు నెలబాల బొమ్మలనుగూర్చి చక్కగా వివరించి చెప్పుచుండెను. వచ్చినవారి కందఱకు ఓపికతో చెప్పవలయునుగదా! ఆ పని అంత సులభమైనదికాదు. అయినను నెలబాల ఆ పనిని జయప్రదముగ చేయుచుండెను. అందుల కామెకు జార్జీసతిపట్లగల సదభిప్రాయమే కారణము. జార్జీసతి తాను సుఖపడుటకు ప్రయత్నించును. అంతటితో నామె సంతృప్తి చెందదు. తన వద్దనున్నవారినిగూడ సంతోషపెట్టుటకు ప్రయత్నించుచుండును. అది నెలబాల కెంతయు సంతోషకారణముగ నుండెను.

ప్రదర్శనమును తిలకింపవచ్చినవారు అందాలబాలయగు నెలబాలను పరిపరివిధముల ప్రశంసింపసాగిరి. కొందఱు మాటి మాటికి బొమ్మలనుగాక నెలబాలను చూచుటకే వచ్చుచుండిరి. అందువలన జార్జీసతికి కావలసినంత రాబడి వచ్చుచుండెను. వచ్చినవారు నెలబాలకు ప్రత్యేకముగ బహుమతుల నిచ్చుచుండిరిగూడ. ఆ విషయమును జార్జీసతి గమనించెను. "ఆ

బహుమతులన్నియు నాకే చెందవలయును" అని జార్లీసతి అన్నచో ఆమెకు అడ్డుచెప్పువా రెవ్వరునులేరు. కాని ఆమె ఉదార హృదయముగల వనిత. అందువలన నామె అటుల అనలేదు. "ఆ బహుమతుల నన్నిటిని నీవే ఉంచుకొనుము"అని ఆమె నెలబాలను ప్రోత్సహించెను. నెలబాల తనవద్దనే ఉన్నచో గొప్ప లాభము చేకూరుననను విషయము ఆమెకు బాగుగ తెలి యును. ఏవిధముగనైనసరే నెలబాలను తనవద్దనే ఉంచుకో వలయునని ఆమె నిశ్చయించుకొని యుండెను. మఱి నెలబాలను సంతృప్తిపఱచుట అవసరముకదా !

తాతయ్య పరిస్థితికూడ చాల బాగుండెను. అతడు తనకు చేతనైన పనులు చేయుచు, చక్కగా భుజించి నిదురించు చుండెను. జార్లీసతి అతని నెంతయు గౌరవించుచుండెను. అది నెలబాల కెంతయు సంతోషకారణముగ నుండెను. ఆ విధ ముగ నెలబాల సుఖజీతముగనే గడపుచుండెను. కాని ఒక్క విషయమును గుఱించిమాత్ర మామె ఎంతయు భయపడు చుండెను. క్విల్పు ఎప్పుడైన ఆ పట్టణమునకు తిరిగివచ్చి హఠాత్తుగా పట్టుకొవచ్చునని ఆమె ఆందోళన పడుచుండెను. అసహ్యాకరమగు క్విల్పు స్వరూప మామెకు మాటిమాటికి గుర్తువచ్చుచుండెను. ఆమె ప్రతిరాత్రి మైనపుబొమ్మ లున్న చోటనే నిదురించుచుండెను. అక్కడ నిదురించు చుండుటయే ఎక్కువ క్షేమకరమని ఆమె భావించుచుండెను. కాని క్విల్పు స్వరూప మక్కడకూడ ఆమెను వదలిపెట్టలేదు. ఏదేని బొమ్మను తొలగించివైచి క్విల్పు దాని స్థానములో నిలబడియున్నాడేమో అనికూడ ఆమె అనుకొనసాగెను. అట్టి సమయములం దామె

లేచి కిటికీవద్ద కూర్చుండి ఆకసములోని నక్షత్రములవంక చూచుచుండెడిది.

అట్టి సమయములందామె తన తాతయ్యను గూర్చి ఆలోచించుచుండెది. "తాతయ్యకు మా పూర్వజీవితము జ్ఞప్తియందున్నదా? మొన్నటివఱకు నిస్సహాయులమను విష యము జ్ఞాపకమున్నదా? ఇప్పుడు వచ్చిన యీ క్రొత్త మార్పు నతడు ఏ విధముగ తీసికొనుచున్నాడు? తాతయ్యకు జబ్బుచేసినచో మాగతి ఏమగును? నేను పనిచేయలేని స్థితి ఏర్పడినచో మాగతి ఏమగును?" అని ఆమె అనుకొనసాగెను. ఆమె ఆవిధముగా తమ భవిష్యత్తునుగూర్చి చింతింపసాగెను.

8

ఒకనాటి సాయంకాలము తాతా మనమరాండ్రు వాహ్యాళికి బయలుదేఱిరి. ఆనాడు వారికి సెలవు దినము. అంతవఱకు వారికి పూర్తిపని యుండుటచేత ఎక్కడకు వెళ్ళుటకు పడలేదు. అందువలన వారానాడు చాల దూరము నడచిపోయిరి. వారు పట్టణమును వీడిపోయి ఒక కాలిబాట ననుసరించి పొలముల లోనికి వెళ్ళిరి. ఆ పొలములు కడు మనోహరముగ నుండెను. అందువలన వారచ్చట కూర్చుండి ప్రకృతి శోభను తిలకింప సాగిరి.

క్రమ క్రమముగా చీకటి పడసాగెను. సంధ్యకాలపు

సూర్యుని బంగారు కిరణములుమాత్ర మింకను తమ కాంతిని ప్రసరింప జేయుచుండెను. గాలి మర్మర ధ్వనులు చేయుచు వీచుచుండెను. మఱి కొంతసేపటికి సూర్యుడు పూర్తిగా అస్త మించెను. అది ఏమి మాయయోకాని, వెంటనే ఆకశము మేఘ ములతో నిండిపోయెను. ఉఱుములు, మెఱుపులు ప్రారంభ మాయెను. అనతికాలములో పెద్దపెద్ద చినుకులతో వానప్రారంభ మాయెను.

ఏ చెట్టు క్రిందనైన నిలబడినచో మీాద పిడుగులు పడ వచ్చును; లేదా కొమ్మలు విఱిగి పడవచ్చును. ఆ భయముతో తాతా మనమరాండ్రు ఏచెట్టు క్రిందకు పోలేరు. వారు వానలో తడియుచు ఇంటి దిక్కుకు పయనమై పోసాగిరి. మధ్యలో నెక్కడ నైన తగిన రక్షణ లభించునని వారు ఆశించుచుండిరి. కాని వారి కెచ్చటను రక్షణ లభింపకుండెను. పైగా అంత కంతకు వాన హెచ్చిపోవుచుండెను. ఇరువురును వానలో పూర్తిగా తడిసిపోయిరి. ఉఱుముల ధ్వని వారిని కలవర పఱచుచుండెను. మెఱుపుల కాంతి వారికి దిగ్భ్రాంతి గొల్పుచుండెను. అందు వలన వారు త్రోవలో నున్న ఒక ఇంటిని చూడకుండగనే ముందుకు సాగిపోవు చుండిరి.

కాని ఆ యింటి గుమ్మమువద్ద నిలబడియున్న మనుజు డొకడు వారిని పిలిచెను. అంతట వారు ఆగిపోయిరి.

"అదియేమి? అటుల వానలో తడిసి పోవుచున్నారు? ఈ యింటిలో ఆశ్రయము పొందవలయునను తలంపు మీాకు కలుగ లేదా? లేక ఏదేని తొందఱ పనిమీాద ముందుకు సాగిపోవు చున్నారా?" అని అతడు వారితో ననెను. అప్పటికి తాతా

మనమరాంద్రు ఇంటిలో ప్రవేశించిరి.

"అయ్యా! మేము మీ యింటిని చూచియుండలేము. చూచి యుండినచో లోనికివచ్చి యుండెడివారము. వానలో తడిసిపోవుట మాకు సంతోషకరమైన విషయముకాదు. మీరు కేకవేసినపుడు మాత్రమే ఇంటిని చూచినాను" అని తాతయ్య అనెను.

"అవునవును. మీరీ యింటిని చూచియుండకపోవుటలో ఆశ్చర్యకరమగు విషయమేదియు లేదు. ఒక ప్రక్క మెఱుపులు, మఱియొక వంక ఉఱుములు; అందువలన మీ కేమియు తోచి యుండదు."

అప్పటికి వారొక గదిలో ప్రవేశించిరి.

అంతట నాయింటి వాడింకను ఇట్లనెను: "మీరీ కుంపటి వద్ద కూర్చుండి, బట్టల నారబెట్టుకొనుడు. మీ కేమైన ఆహార పదార్థములుగాని, పానీయములుగాని కావలసినచో, ఆజ్ఞాపింప వచ్చును. మీ కేమియు అక్కఱ లేనిచో, ఆజ్ఞ యీయవల సిన పనిలేదు. ఆ విషయమును గుఱించి మీ కేమియు భయపడ వలదు. ఇదియొక పూటకూళ్ళ యిల్లు. దీని పేరు వీరవిహారము. ఇది యీ ప్రాంతమువారి కందఱకు బాగుగ తెలిసిన పూట కూళ్ళ యిల్లు."

"దీనిని వీర విహారమని పిలుతురా?" అని నెంబా ప్రశ్నించెను.

"ఆ సంగతి అందఱకు తెలియునని నేననుకొను చుంటిని. మఱి మీ కీ సంగతి తెలియదా? అయినచో మీ రెక్కడనుండి వచ్చుచున్నట్లు? ఇదియే వీరవిహారము. దీని యజమానుడు

జేమ్స్ గ్రీవ్స్. అతడు నేనే. నిజాయితీకి మారుపేరు జేమ్ గ్రీవ్స్. ఏ కళంకము లేని సహృదయుడతడు. అతనికి వ్యతిరేకముగ మాట్లాడు వారెవ్వరును లేరు.''

వారున్న గది చాల పెద్దగది. ఆ గది మధ్య నొక తెర యుండెను. తాతా మనమరాండ్రు తెరకొక వైపున నున్న కుంపటివద్ద కూర్చుండి గుడ్డలు ఆరబెట్టుకో సాగిరి. అంతలో నా తెర కావల ఏదో ధ్వని వినబడ సాగెను. తాతయ్య ఆ ధ్వనిని ఆలకించెను. అతడేదో గ్రహించినట్లుండును. వెంటనే అతడు నెలబాలతో నిట్లనెను: "నెలబాలా! నీకా ధ్వని వినబడుటలేదా? వారు పేకాట ఆడుచున్నారు. జాగ్రత్తగా ఆలకింపుము."

తెరచాటున నున్నవారు మాట్లాడుకొనుచుండిరి. వారి మాటలు పేకాటకు సంబంధించినవని స్పష్టముగా తెలియు చుండెను.

తాతయ్య మరల నిట్లనెను: "వారిమాటలు నీకు విన బడుచున్నవా? నెలబాలా! వారిమాటలు నీకు వినబడు చున్నవా?"

తాతయ్య స్వరూపములో నొక విధముగ మార్పు వచ్చెను. దానినిచూచి నెలబాల ఆశ్చర్యపడెను; అపరిమితముగ భయపడెను.

తాతయ్య మొగమంతయు ఎఱ్ఱగా కందిపోయెను; కన్నులు బాగుగ అలసిపోయినట్లుండెను; ఊపిరి చాలకష్టము మీాద ఆడుచుండెను; నెలబాలమీాదనున్న అతనిచేయి గజగజ వణకిపోవు చుండెను.

తాతయ్య పైకిచూచుచు నిట్లనెను: "నేను ఆ విధముగా

ప్రతినిత్యము చెప్పుచుంటిని; ఆ విషయము నాకు బాగుగ తెలియును; నేను దానినిగూర్చి కలగంటిని; అది సత్యమను విషయమును తెలిసికొంటిని; అవును! అది తప్పక జరుగవలయును! నెలబాలా! నీవద్ద ఎంతసొమ్మున్నది? నిన్న నీవద్ద డబ్బు ఉండగా చూచినాను. రమ్ము, రమ్ము! నీవద్ద నెంతసొమ్మున్నది? వెంటనే ఆ సొమ్మును నాకిమ్ము."

"తాతయ్యా! వలదు! వలదు! ఆ సొమ్మును నా వద్దనే ఉండనిమ్ము. మనము వెంటనే ఈ ప్రదేశమును వీడిపోవలయును. వానినింక ఏ మాత్రము లెక్కచేయరాదు. రారమ్ము. దయయుంచి రమ్ము. ఇంకపోదము" అని నెలబాల భయపడుచు అనెను.

అంతట తాతయ్య భయంకరముగ నిట్లనెను: "నామాట వినుము. వెంటనే ఆ సొమ్ము నిటు తెమ్ము. నెలబాలా! ఏడువకుము. నెలబాలా! కఠినముగ మాట్లాడియుంటినా? కఠినముగ మాట్లాడుట నా అభిమతమేమాత్రముకాదు! నెలబాలా! నేను నీ మంచికొఱకే ఆ విధముగ మాట్లాడియుంటిని. నెలబాలా! నేను నీకిదివఱకెంతో అపకారము చేసియుంటిని. ఇప్పుడు నేను నీకు మేలుచేయుదును. వడ్డీతో సహా నీ ఋణము తీర్చుకొందును. ఇందుకు సందేహ మేమాత్రము లేదు. నెలబాలా! సొమ్ము నిటు తెమ్ము."

"తాతయ్యా! దయయుంచి సొమ్ము తీసికొనకుము. తాతయ్యా! నామాట నాలకించి సొమ్ము తీసికొనకుము. మనయిరువురి మేలుకొఱకు ఈ సొమ్మును నావద్దనే ఉంచుకొననిమ్ము. నీ వందుల కిచ్చగింపనిచో సొమ్ము నావల పాఱవేయు

దును. ఈ సందర్భమున సొమ్ము నావల పాఱవేయుటయేమంచి దని తోచుచున్నది. నీ కిప్పుడు సొమ్మిచ్చుట ఏ మాత్రము మంచిపనికాదు. మనమింక పోదము రమ్ము. వానలోనే పోదము రమ్ము."

"నెలబాలా! నాకు సొమ్ము ఇమ్ము. నెలబాలా! నాకు తప్పక సొమ్ము కావలయును. నేను నీ మంచికొఱకే చెప్పు చున్నాను. నేను నీకు మేలుచేయవలయునని నిశ్చయించు కొన్నాను. ఎప్పటికైన నీకు మేలుచేయుదును. ఏ మాత్రము భయపడకుము."

నెలబాల తన జేబులోనుండి ఒక చిన్నపర్సును బయటకు తీసెను. ఏ మాత్రము ఆలస్యమును సహింపని తాతయ్య నెల బాల చేతిలోనుండి ఆ పర్సును లాగుకొనెను. పిమ్మట నతడు తెరకావలివైపుకు పోయెను. అతని నాపుట నెలబాల కసాధ్య మైనపని యయ్యెను. అందువలన నామె చేయునది ఏమియులేక అతనివెంట పోయెను.

తెరకావలివైపున యజమానుడు దీపము పెట్టుచుం డెను. అచ్చట నిరువురు మనుజులు కూర్చుండియుండిరి. వారి మధ్య పేక, కొన్ని వెండినాణెములు ఉండెను. అందులో నొకడు లావుగానుండెను. రెండవవాడు సన్నగా నుండెను. అతనిపేరు ఐజక్ లిస్టు.

ఐజక్ ముసలివానిని చూచి ఇట్లనెను: "ఓయీ ముసలి వాడా! మా యిరువురిలో నెవ్వరినైనా నీ వెరుగుదువా? తెర కీవలివైపు బహిరంగ ప్రదేశముకాదు."

"నేను తప్పేమియు చేయలేదనుకొందును" అని ముసలి

వాడనెను. అంతట ఐజక్ ఇట్లనెను: "ఓయి భగవానుడా! తప్పు చేయుటకపోవుటయేమి? మేమిక్కడ ఇరువురు గౌరవనీయులము మా పనిలో మునిగియున్నాము. నీవు పిలువని పేరంటముగ ఇచ్చటకు చొచ్చుకొని వచ్చినావు."

"అయ్యా! మీకు కష్టము కలిగించుట నా యభిమత మేమాత్రమును కాదు. మఱినేను ఏమనుకొంటిననగా......

"నీవు ఏమనుకొనుటకును హక్కు లేదు. నీవు ముసలి వాడవుకదా? అనుకొనుటతో నీకు సంబంధమేమి యున్నది?"

అంతలో లావుపాటివాడు జోక్యము కలుగజేసికొని ఐజక్‌తో నిట్లనెను: "ఓయీ! నీకు అంత ఆతురమెందులకు? ఆ ముసలివాడు ఏమి చెప్పదలచుకొన్నాడో పూర్తిగ చెప్ప నిమ్ము."

అంతవఱకు ఇంటి యజమానుడు ఎవరి పక్షమున మాట్లాడక తటస్థముగా నుండెను; లావుపాటివాడు ఏ పక్షమున మాట్లాడునో తెలియువఱకు నట్లుండదలచెను కాబోలు. లావు పాటివాడు మాట్లాడిన తరువాత యజమానుడు ఐజక్‌తో నిట్ల నెను: "ఓయీ! ముసలివానిని మాట్లాడనీయవా ఏమి? మాట్లాడనిమ్ము."

"ఎందుకు మాట్లాడనీయను? మాట్లాడనీయనని చెప్పి యుంటినా ఏమి? అని ఐజక్ అనగా ఇంటి యజమానుడు, "అయన మాట్లాడనిమ్ము" అని యనెను. అంతట ఐజక్ ఆకార మును చూడగ నతడింకను ఆ వివాదమును కొనసాగించు నట్లుండెను. అందువలన లావుపాటివాడు ఇట్లనెను: "ఈ ముసలి వాడు మంచి వుద్దేశ్యముతోనే ఇచ్చటకువచ్చియుండవచ్చును.

ఎవరికి తెలియును? మనతో బాటు తానుగూడ ఒకచేయి వేయుటకే వచ్చినాడేమో!"

"అవునవును. నేను ఆ వుద్దేశ్యముతోనే వచ్చినాను! నేను ఆ సదుద్దేశ్యముతోనే వచ్చినాను! నే నిప్పుడా విషయమును ఉద్ఘాటించుచున్నాను!" అని ముసలివాడు ఆతురముతో ననెను.

లావుపాటివా డింకను ఇట్లనెను: "నేను ఆ విధముగనే అనుకొంటిని. ఈ ముసలి గౌరవనీయుడు వట్టిచేతులతో గాక డబ్బుతో వచ్చినాడేమో ఎవరికి తెలియును?"

ఆ మాటలను వినగానే ముసలివాడు తన చేతిలోని చిన్నపర్సును ఇటునిటు ఊపెను; పిమ్మట దానిని బల్లపై పడవైచెను. ఎంతో ఆతురముతో క్రిందపడియున్న పేకముక్కలను ప్రోగుచేసికొనసాగెను.

అపుడు ఐజక్ ఇట్లనెను: "ఈ గౌరవనీయుని ఉద్దేశ్యమదియా? ఇప్పుడు నాకు తెలిసినది. నన్ను క్షమింపవలయునని ఈ గౌరవనీయుని వేడుకొనుచున్నాను. (బల్లమీద పర్సును పట్టుకొని) ఇది గౌరవనీయునిదా? చాల చక్కనిపర్సు. (పర్సును పైకివిసరి చేతితో పట్టుకొని) కాని తేలికగా నున్నది. అయినను వచ్చిన నష్టమేమియులేదు. ఈ గౌరవనీయునకు సుమారు అరగంటవఱకు సరిపోవును."

అంతట లావుపాటివాడు ఇట్లనెను: "అయిన మనము నలుగురము కలసి ఆడుదము. జెమ్మీ! నీవుకూడ ఒకచేయి తీసికొనుము."

అపుడు ఇంటి యజమానుడుకూడ పేకాటకు కూర్చుం

డెను. నెలబాల అపరిమితమగు భయముతోను, విచారము తోను, ఆందోళనతోను తాతయ్యను ప్రక్కకు తీసుకొని పోయెను. పేకాటలో పాల్గొనవలదని బ్రతిమాలుకొనెను.

"తాతయ్యా! మనము వెంటనే ఈ ప్రదేశమును వీడి పోదము. సుఖముగా జీవింతము" అని నెలబాల అనెను.

కాని తాతయ్య ఇట్లనెను: "అవును మనము సుఖముగా జీవింతము. ఈ విషయమున నేను నీతో ఏకీభవించుచున్నాను. కాని మనసౌఖ్యము పేకాటపై ఆధారపడి యున్నదను విషయము గుర్తింపుము. మనము చిన్నచిన్న విజయములనుండి పెద్దపెద్ద విజయములను సంపాదింపవలయును. ఇచ్చటనంత పెద్దవిజయము లభింపను. కాని ముందుముందు గొప్పగొప్ప విజయములు లభించును. నే నింతకుముందు పోగొట్టుకొన్న దానినంతను తిరిగి సంపాదింతును. ఇంతయు నీ కొఱకే. ప్రియమైన నెలబాలా!"

"భగవంతుడు మనకు సహాయ్యము చేయుగాక! మన మెట్టి దురదృష్ట పరిస్థితులలో ఇచ్చటకు వచ్చినామో నీకు బాగుగా తెలియునుగదా!"

ముసలివాడు నెలబాల నోటిపై చేయిపెట్టి ఇట్లనెను: "ఉష్. మాట్లాడకుము. అదృష్టమును నిందించుటవలన లాభ మేమియునుండదు. అదృష్టమును నిందింపకుము. నిందించినచో మనకింక అదృష్టము పట్టదు. ఆ విషయముచే నేను అనుభవ పూర్వకముగ తెలిసికొన్నాను."

అంతలో లావుపాటివాడు యిట్లనెను: "ఓయీ! గౌరవ నీయుడా! ఆటలో పాల్గొనుట కిష్టము లేనిచో ఆ పేక ముక్కల నిటు తెచ్చియిమ్ము."

"నేను వచ్చుచున్నాను" అని ముసలివాడు అఱచెను; "నెలబాలా! ఇచ్చట కూర్చుండుము; కూర్చుండి చూచుచుండుము. ధైర్యము వహించియుండుము. అంతయు నీకొఱకే చేయుచున్నాను. ప్రతిపెన్నీ నీకే యిచ్చెదను. ఈ విషయమును వారికి చెప్పెను. చెప్పినచో వారు ఆడరు. మనకే విజయము లభించినను సంగతి ముందుగా వారికి తెలియరాదు. నీవు ఏమాత్రము భయపడక నిశ్చింతగా కూర్చుండుము."

లేచిపోవువానివలె నటించుచు విజక్ ఇట్లనియెను: "ఈ గౌరవనీయుడు బహుశా మఱియొకవిధమగు నిశ్చయమునకు వచ్చినాడుకాబోలును గౌరవనీయుడు సాహసముచేయ లేకున్నందుకు నేను ఎంతయు విచారించుచున్నాను. కాని తన కేది మంచియో అతనికే తెలియును."

అంతట ముసలివాడు ఇట్లనెను: "మీ కా సందేహ మెందులకు? నేను సిద్ధముగానున్నాను. మీకంటె నేను ఎక్కువ సిద్ధముగానున్నాను. ఆట ప్రారంభింపవలయునని నేను మీకంటె ఎక్కువ ఆతురపడుచున్నాను. ఈవిషయమును మీరు గ్రహింపవలయునని కోరుచున్నాను."

అట్లని ముసలివాడు బల్లవద్దనొక కుర్చీలాగుకొని అందు కూర్చుండెను. అనగా నలుగురును బల్లకు నలువైపుల కుర్చీల మీద కూర్చున్నారన్నమాట. వెంటనే ఆటప్రారంభమాయెను.

నెలబాల ప్రక్కనే కూర్చుండెను. ఆమెమనస్సు బాధాపూరితమైయుండెను. కాని ఆమె ఏమి చేయగలదు? కన్నులు అప్పచెప్పి ఆట గమనమును చూచుచుండెను. ఆమెకు గెలుపు ఓటమిలతో సంబంధమేమియులేదు. తాతయొక్క మానసిక

ఆందోళనమాత్రమే ఆమెకు బాధాకరముగనుండెను. ఏవిధముగ నైనను విజయము సాధింపవలయునని తాతయ్య ఆతుర పడు చుండెను. అందువలన నతడు ప్రశాంతముగ ఆడలేకుండెను. తాతయ్య తనకు డబ్బు సంపాదించి యీయవలయునని బాధ పడుచున్నాడను విషయము నెలబాలకు తెలియును. అది ఆమెకు మఱింత బాధాకరముగనుండెను. ప్రశాంతముగ ఆడకుండుట వలన తాతయ్యకు ఓటమి సంభవించుచుండెనేగాని విజయము లభింపకుండెను.

మఱి మిగిలిన ముగ్గురును పేకాటలో సిద్ధహస్తులైన మోసగాండ్రు. విజయమును సాధింపవలయునని వారు కడు తీవ్రముగ వాంఛించుచుండిరి కాని వారు కడు ప్రశాంతముగ ఆడుచుండిరి.

తుపాను సుమారు మూడు గంటలవఱకు తన పూర్ణ ప్రతాపమును చూపెను. తరువాత ఉఱుములు, మెఱపులు క్రమక్రమముగా తగ్గిపోసాగెను. పేకాట ఇంకను సాగుచునే యుండెను. ఆకసము క్రమక్రమముగా నిర్మలమగుచుండెను. ఎట్టకేలకు పేకాట ముగింపుకువచ్చెను. ఐజక్ సంపూర్ణ విజయ మును సాధించెను. లావుపాటివాడును, ఇంటి యజమానుడును తమకు గలిగిన అపజయమును వేదాంతదృష్టితో స్వీకరించిరి; తనకు విజయము లభించినందుకు ఐజక్ ఆశ్చర్యపడలేదు; సంతోషింపలేదు. తనకు విజయము లభించుట సహజమే యన్నట్లుండెను.

నెలబాలకు చెందిన చిన్నపర్సు పూర్తిగా ఖాళీఅయ్యెను. అది ముసలివాని ప్రక్కనే పడియుండెను. మిగిలిన ముగ్గురు ఆట

గాంగ్రుడు లేచిపోయినను ముసలివాడింకను ఆడుకొనుచునే యుండెను; మిగిలిన ముగ్గురితప్పునకూడ అతడే ఆడుచుండెను. అత డా పనిలో మునిగియుండగా నెలబాల మెల్లన అతనివద్దకు పోయి, భుజముపై చేయివేసి, "ఇప్పుడు అర్ధరాత్రమైనది" అని యనెను.

అపుడు తాతయ్య బల్లమీద పఱచిన పేకముక్కలను నెలబాలకు చూపుచు నిటనెను: "ప్రియమైనబాలా! బీదఱిక మునకున్న శాపమెట్టిదో చూడుము. ఇంకకొంచెము సేపు మే మందఱము ఆడియుండినచో నాకు అదృష్టము పట్టియుండె డిది. అవును, పేకముక్కలను చూడుము. ఆ విషయము పేక ముక్కలలో సుస్పష్టముగ కనబడుచున్నది. ఇటుచూడుము! మఱి ఇటుచూడుము!"

"తాతయ్యా! వాని నటు ఉంచుము. వానిని మఱచి పోవుటకు ప్రయత్నింపుము". అని నెలబాల అనెను.

"వానిని మఱచిపోవుటకు ప్రయత్నించుటయా! వానిని మఱచిపోవుట! వానిని మఱచిపోయినచో మనము ధనవంతుల మగుట ఎట్లు సంభవించును?"

అంతట నెలబాల తల ఊపెను.

ముసలివాడింకను నిట్లు చెప్పసాగెను: "నెలబాలా! వీలు లేదు! వీలులేదు! వానిని మఱచిపోవుటకు వీలులేదు! వీలుచిక్క గానే తగిన ప్రతిక్రియ జరుపవలయును! ఓర్పు! ఓర్పు! నేనుచేసిన తప్పును సరిదిద్దుకొందును. నేడు ఓటమి; ఱేపు విజయము. ఏవిధముగనైనసరే విజయము సాధింపవలయును. రారమ్మా. ఇంకన్పోదము. నేను సిద్ధముగనున్నాను."

తన మిత్రులతో కలసి పొగ పీల్చుచున్న ఇంటి యజమాను డిట్లనెను: "ఇప్పుడు ఎంతటైము అయినది మీకు తెలియునా? పండ్రెండు దాటిపోయినది."

"వాన రాత్రికూడ" అని లావుపాటి మనుజు డనెను.

"ఇది వీరవిహారము. మంచి శయ్యలున్నవి. అందఱకు తగినసౌకర్యములు లభించును. చౌక రేట్లు. పండ్రెండున్నర గంటలు" అని ఇంటి యజమాను డనెను.

నెలబాల ఇట్లనెను: "ఇప్పటికే చాల ఆలస్యమైపోయినది. ఇదివఱకే మనము వెళ్లిపోయి యుండినచో ఎంతయు బాగుండెడిది. వారు మనలనుగూర్చి ఏమనుకొందురు? మనము తిరిగి పోవునప్పటికి రెండుగంటలగును. అయ్యా! మేమీరాత్రి ఇచ్చట నున్నచో మీకెంత ఈయవలయును?"

"రెండు మంచి శయ్యలు - ఒకటిన్నర షిల్లింగులు. భోజనము, బీరు - ఒక షిల్లింగు. మొత్తము రెండున్నర షిల్లింగులు" అని యజమానుడు సమాధానమిచ్చెను.

నెలబాల ఇదివఱకొక బంగారు నాణెమును దుస్తులలో కుట్టి దాచియుంచెనుగదా! దానిని బయటకు తీసి ఖర్చుపెట్టవలయునని నెలబాల అనుకొనెను. ఆమె తనలో తాను ఇట్లనుకొనెను: "ఇప్పుడు చాల ఆలస్యమై పోయినది. ఇంత ఆలస్యముగా జార్జీసతి వద్దకు పోవుట ఏమియు బాగుండదు. ఇప్పుడు పోయి తలుపుతట్టినచో ఆమె ఏమనుకొనును? అందువలన మేమీరాత్రి కిచ్చట నుండుటయే మంచిది. తెల్లవాఱకముందే లేచి, ఆమె నిదురనుండి లేవకముందే అచ్చటకు పోదుము. తుపానువలన రాత్రి రాలేక పోయినామని ఆమెకు చెప్పవచ్చును.

అది యామెకు సంతృప్తి కరముగ నుండును. కావున ఇచ్చటనే ఉండుట శ్రేయస్కరము.''

తరువాత నామె తాతయ్యను ప్రక్కకు పిలిచి, "మనము నేటి రాత్రికిచ్చట నుండుటకు కావలసిన డబ్బు నా వద్దనున్నది. మన మిచ్చట నుండుటయే శ్రేయస్కరము."

"ఆడబ్బు ఇదివఱకే నావద్ద ఉండినచో ఎంత బాగుండెడిది! నీ దగ్గఱ డబ్బు ఉన్నసంగతి నాకు కొన్ని నిమిషములకు ముందే తెలిసియుండిన ఎంత బాగుండెడిది!" అని ముసలివాడు గొణుగుకొనెను.

అనతికాలములో యజమానుడు ఆహార పదార్థములను, బీరు పానీయమును తీసికొని వచ్చెను. అతడు వాని గొప్పతనమును పలురకములుగా చెప్పసాగెను. "అయ్యా! ఈ చక్కని పదార్థములను, పానీయమును సేవించి తృప్తిచెందుడు; నన్ను తరింపజేయుడు" అని యజమానుడు తన అతిథులను ప్రార్థించెను. నెలబాల, తాతయ్య అంతగా తినలేదు; ఏలయన వారిరువురును రకరకముల విషయములను గూర్చి ఆలోచనలో మునిగియుండిరి.

తెల్లవాఱకముందే పయనమై పోవలయునని నెలబాల నిశ్చయించుకొని యుండెనుగదా. అందువలన తామీయ వలసిన సొమ్మును నిదురింపక పూర్వమే యజమానున కీయవలయునని ఆమె అనుకొనెను. కాని ఆమెవద్ద విలువైన బంగారు నాణెమున్నది. దానిని తాతయ్యకంట పడనీయరాదని ఆమె తలచుచుండెను. దానిని యజమానునకిచ్చి మిగిలిన చిల్లర తీసికోవలయునని ఆమె అనుకొనెను. దానినామె దాచియుండిన స్థలమునుండి రహస్యముగా బయటకు తీసి గదిని వీడి వెళ్ళుచున్న

యజమానుని వెంట పోయెను.

నెలబాల అతనికా బంగారు నాణెమునిచ్చి, "అయ్యా! మీ కీయవలసిన సొమ్ము తీసికొని మిగిలిన చిల్లర నీయుడు" అని యనెను.

ఆనాణెమును చూడగనే యజమానుడు ఆశ్చర్యపడినట్లు స్పష్టపడుచుండెను. అతడునాణెమునుబాగుగచూచిపరిశీలించెను; నెలబాలవంక చూచెను; మరల నాణెమువంక చూచెను. "నీకీ నాణెము ఎక్కడనుండి వచ్చినది? ఎట్లు వచ్చినది?" అని అతడు అడుగ దలచినట్లుండెను. కాని ఆ నాణెము మంచిదే; దొంగ నాణెము కాదు. అందువలన అట్టిప్రశ్న వేయకుండ నుండుటయే మంచిదని అతడు నిశ్చయించుకొనెను. మఱి నతడు తెలివైన యజమానుడుకదా! అతడు నెలబాల కీయవలసిన చిల్లర లెక్క పెట్టి ఇచ్చివైచెను.

నెలబాల మిగిలిన సొమ్ము తీసికొని గదికి తిరిగివచ్చు చుండెను. అప్పుడామెకు తనకంటె ముందుగా ఎవ్వరో ఆగదిలో ప్రవేశించినట్లు కనబడెను. ఆ గదికి ఆమె చిల్లర మార్చిన స్థలమునకు మధ్య చిన్నదారి యున్నది. ఆమె అచ్చట నిలబడి యుండగా ఆ దారిని వచ్చిన వారుగాని పోయిన వారుగాని లేరు. అందువలన తన నెవ్వరో కనిపెట్టి చూచుచున్నారని ఆమె తలంపసాగెను.

కాని ఆమెను కనిపెట్టి చూచుచున్న వారెవరు? ఆమెతిరిగి గదిలో ప్రవేశించిరి. గదిలోనివారు ఇదివఱకువలెనే తమ తమ స్థానములందు ఉండిరి. లావుపాటి మనిషి తన చేతిని తలక్రిందుగ పెట్టుకొని రెండు కుర్చీలపై పరుండియుండెను. అదే వి...

ఐజక్ బల్లకు మఱియొక వైపున పరుండి యుండెను. వారిరువురి మధ్య తాతయ్య కూర్చుండి యుండెను. అతడు పేకాటలో విజయము సాధించిన ఐజక్‌ను ప్రశంసా పూర్వకముగ చూచుచున్నట్లుండెను. అతని దృష్టిలో ఐజక్ మంచి శక్తి సామర్థ్యములుగల మానవుడు కాబోలు! నెలబాల కంతయు నొక చిత్ర సమస్యవలె నుండెను. గదిలో ఇంకెవ్వరైననున్నారేమోయని నెలబాల చుట్టును కలయజూచెను. కాని క్రొత్తవారెవ్వరును కనబడలేదు. అందువలన నామె తాతయ్యను సమీపించి మెల్లన అతని చెవిలో నిట్లనెను: "తాతయ్యా! నే నీ గదిలో లేనపుడు ఎవ్వరైన గదినివీడి బయటకు వచ్చినారా?" "లేదు" అని తాతయ్య ముక్తసరిగా సమాధానము చెప్పెను.

అయిన అంతయు నొకకల యన్నమాట! కాని అంతకు మునుపామె ఆ విషయమును గుఱించి ఊహించి యుండలేదే! అదికల ఎట్లగును? ఆ విషయమును గూర్చి ఆమె తీవ్రముగా ఆలోచింపసాగెను; ఆశ్చర్యపడసాగెను. అంతలోనామెను వేఱొక గదిలోనికి తీసికొని పోవుటకు ఒక అమ్మాయి వచ్చెను.

సరిగా నదే సమయమున తాతయ్య మిగిలిన వారివద్ద సెలవు తీసికొనెను. తాతా మనమరాండ్రిరువురును కలసి మేడపైకి పోయిరి. ముసలివాడు మేడమీదనున్న ఒక గదిలో ప్రవేశించెను. నెలబాల మఱియొక గదిలోనికి పోయెను. అచ్చట నామె కొఱకు శయ్య అమర్పబడి యుండెను. ఆమెతోబాటు వచ్చిన అమ్మాయి (సేవకురాలు) తన గోడును కొంతసేపు చెప్పుకొనెను.

"నా పరిస్థితి చాల అధ్వానముగా నున్నది. ఇచ్చట నా

కిచ్చు జీతము చాల తక్కువ. పనిమాత్రము మెండు. పదు నేను రోజులలో నేనీ పని వదలివేయ బోవుచున్నాను. మీరు నన్నిం కెవ్వరికైన సిఫారసు చేయగలరా? ఇచ్చట పనిచేసిన తరువాత మఱియొకచోట పని దొరకుట చాల కష్టమనుకొందును. ఇచ్చట పేకాట చాల ఎక్కువ. పేకాటలో మోస మెక్కువ. అమాయ కులను సులభముగా ఓడించి వారి వద్దనున్న సొమ్మంతను లాగు కొందురు. నేనీ సంగతి చెప్పినట్లు మాత్రమెవ్వరికిని తెలి యరాదు. నే నొకనిని ప్రేమించినాను. కాని ఆ ప్రేమ సఫ లము కాలేదు. ఇంక మీకు నిదుర వచ్చుచున్నది. కాబోలు చక్కగా విశ్రాంతి తీసికొనుడు. నేను తెల్లవాఱకముందే వచ్చి మిమ్ము నిదురనుండి లేపెదను. గుడ్ నైట్!'' అని యని అమ్మాయి వెళ్ళిపోయెను.

ఇక నా గదిలో నెలబాల ఒంటరిగ నున్నది. ఆ పరిస్థితి నామె సహింపలేకుండెను. తన్నెవ్వరో వెంబడించినారన్న విష యమునుగూర్చి ఆమె ఆలోచించుచుండెను. పనిపిల్ల చెప్పిన విషయమును ఆమె అనుమానమును ధ్రువపఱచు చుండెను. పేకాట ఆడినవారి మొగములు చెడ్డ ఆలోచనలతో నిండియున్న వని ఆమె భావింపసాగెను. వారు ప్రయాణీకుల సొమ్మును లాగు కొని, హత్యజేసి జీవించుచున్నారేమో! ఎవ్వరు చెప్పగలరు.

కొంతసేపు నెలబాల ఆ ఆలోచనలను మానుకొనెను. ఆమె తాతయ్యకు మరల పేకాట పిచ్చినిగూర్చి ఆలోచింప సాగెను. ఈ మధ్య నతడు పేకాట విషయమును పూర్తిగా మఱచిపోయినాడు. కానీ యిప్పుడు మరల ఆ పిచ్చి బయలుదేఱి నది. అతడింకను ఎట్టి దారి త్రొక్కునో ఆ భగవంతునకే

తెలియవలయును! అయ్యో! అచ్చట ఎందుకాగినట్లు? అచ్చట ఆగకుండ వానలో తడిసిపోయి యుండినచో ఏ బాధ ఉండెడిది కాదుకదా!

ఎట్టకేలకు ఆమెకు నిదురపట్టెను. కాని అది గాఢమైన నిదురకాదు. ఆమెకు మాటిమాటికి కలలు రాసాగెను. ఆమె యొకసారి హఠాత్తుగా లేచి భయముతో కేకలు వేసెను. తరువాత నామెకు మరల నిదురపట్టెను. అంతలో నామెకు మెలకువ వచ్చెను. అంతకు పూర్వము కనబడిన ఆకారమే ఆమెకు మరల కనబడసాగెను.

అవును. గదిలోని కెవ్వరో ప్రవేశించినారు. ఆ వచ్చిన వారు చేతులతో తడవుకొనుచు శయ్యచుట్టు తిరుగుచున్నారు. ఆమె, "సాహాయ్యము! సాహాయ్యము!" అని అఱవవలయునని అనుకొనెను. కాని నోటివెంట మాట రాకుండెను. కదలుట కామెకు శక్తి లేకుండెను. జరుగుచున్నదంతయు చూచుచు నామె యచ్చట పరుండియుండెను.

ఎట్టకేలకా ఆకారము నెలబాల తలవద్దకు వచ్చెను. ఆ వచ్చినవారి ఊపిరి స్పష్టముగా తెలియుచుండెను. వారి చేతులు తన మొగముమీద పడునేమో అను భయముతో నామె తలగడమీదనుండి క్రిందకు తప్పుకొనెను. వచ్చినవారు మరల వెనుకకు తిరిగిపోయిరి. వచ్చినదారినే వెళ్ళిపోయిరి.

నెలబాల లేచి బయటకువచ్చెను. ఆ ఆకారము తిన్నగా పోయి తాతయ్య గదిలో ప్రవేశించెను. ఆ దృశ్యమును చూడ గనే ఆమె అపరిమితముగ భయపడెను. ఆ ఆకారము తాత య్యను హత్యచేయునేమో! ఆ యాలోచన మనస్సులోనికి

రాగానే ఆమె గజగజ వణకిపోసాగెను. అయినను నామె సవ్వడి చేయకుండ తాతయ్య గదిలో ప్రవేశించెను.

తాతయ్య గదిలో దీపము వెలుగుచుండెను. శయ్య మీద నెవ్వరును లేరు. ఒక బల్లముందు తాతయ్య కూర్చుండి యుండెను. అతడు సొమ్ము లెక్కపెట్టుకొనుచుండెను. అప్పుడు నెలబాలకు విషయమంతయు నర్థమాయెను. ఆమె యజమానునకు బంగారునాణెమిచ్చి చిల్లర తీసికొనుచుండగా కనిపెట్టి చూచినవాడు ఆమె తాతయ్య! తరువాత ఆమె గదిలో దొంగతనముగా ప్రవేశించినవాడు తాతయ్య! ఆమె సొమ్మును దొంగిలించినవాడు తాతయ్య! పేకాట ఆడుటకు కావలసిన సొమ్ము కొఱకు ఈపని అంతయు చేసినవాడు తాతయ్య! అతని ఉద్దేశ్యమేమి! పేకాట ఆడి, విజయము సాధించి, ధనము సంపాదించి, ఆమెను ధనికురాలిని చేయవలయుననుటయే అతని ఆశయము! ఆమెకు మేలుచేయుటకొఱకే అతడు దొంగగా మారిపోయినాడు! ఆమెవద్దనే దొంగతనము చేసినాడు!

నెలబాల మెల్లన బయటకువచ్చి తనగదిలోనికి పోయెను. కాని ఆమెకు నిదురపట్టకుండెను. మరల తాతయ్యకు పట్టిన పిచ్చినిగూర్చి ఆమె ఎంతయు బాధపడసాగెను. "నావద్ద ఇంకను డబ్బు ఉన్నదని అతడు మరల ఇచ్చటకు వచ్చునేమో!" అని ఆమె అనుకొనసాగెను.

ఆమె తన గదినివీడి బయటకుపోయి తాతయ్య గదిలో ప్రవేశించెను. తాతయ్య మేల్కొనియుండినచో ఆమె అతనితో నిట్లు చెప్పదలచుకొనెను: "తాతయ్యా! నాకు శరీరారోగ్యమేమియు బాగుండలేదు. మనస్సేమో అదియొకవిధముగనున్నది.

అందువలన నిదురపట్టలేదు. నీవింకను మేల్కొనియున్నావేమో చూచుటకు వచ్చినాను."

నెలబాల గదిలోని శయ్యవంక జూచెను. తాతయ్య ప్రశాంతముగ పరుండియుండెను. అతడు గాఢముగ నిదురించుచుండెను. అతని మొగములో ఉద్వేగము, దురాశ, ఆతురము, ఆందోళన మున్నగునవి ఏవియు లేవు. అతని మొగము పసిపిల్లవాని మొగమువలె అమాయకముగను, ప్రశాంతముగను నుండెను. అతడిప్పుడు జూదరికాడు. మనమరాలికి డబ్బు సంపాదించి పెట్టవలయునని ఆశపడుచున్నవానివలె లేడు. నెలబాలమీద ఆధారపడియున్న తోడి ప్రయాణీకుడు తాతయ్యవలె నున్నాడు.

ఆవిధముగా నిదురించుచున్న తాతయ్యనుచూచి ఆమె భయపడలేదు. కాని ఆమె విచారించుచుండెను. ఆమె కన్నుల నుండి నీరు స్రవింపసాగెను.

"భగవంతుడు మమ్ముల నిరువురను రక్షించుగాక! వారు మేమెవ్వరమో తెలిసికొన్నచో మమ్ములను వేఱు చేయుదురు. అతనిని సూర్యరశ్మి సోకనిచోట బంధింతురు. అతనికి సాహాయ్యము చేయుటకు నేనుతప్ప మఱి యింకెవ్వరును లేరు. భగవంతుడు మమ్ముల నిరువురను రక్షించుగాక!" అని నెలబాల అనుకొనెను. తరువాత నామె యా గదినివీడి తన గదిలోనికి పోయెను.

నెలబాల చాలసేపు నిదురపట్టక కూర్చుండెను. ఎట్టకేలకామెకు నిదురపట్టెను. అంతలో దాసీకన్యవచ్చి యామెను లేపెను. ఆమె ప్రయాణమునకు సిద్ధపడి తాతయ్య గదిలోనికి

పోయెను. అంతకుముందామే తన జేబులు వెదకుకొనెను. తన వద్దనున్న ధనమంతయు పోయినదని ఆమె తెలిసికొనెను. ఆమె వద్ద నింక ఒక పెన్నీయైన లేదు. తాతయ్యకూడ ప్రయాణము నకు సిద్ధముగానుండెను. అనతికాలములో తాతా మనమరాం డ్రిరువురును పూటకూళ్ళయిల్లు వదలి రాజబాటపై ప్రవేశించిరి. తాతయ్య నెలబాల చూపులను తప్పించుకొని పోవుచుండెను. దొంగతనముసంగతి నెలబాలయే ముందుచెప్పవలయునని అతడు ఆశించుచున్నట్లుండెను. తానాసంగతి చెప్పక తప్పదని ఆమె అనుకొనెను. చెప్పకపోయినచో తనసంగతి బయల్పడినదని అతడు అనుమానింపవచ్చును!

సుమారొక మైలుదూరము ఒక్క మాటయైన లేకుండ నడచిన తరువాత నెలబాల తాతయ్యతో నిట్లనెను: "తాతయ్యా! మఱి ఆ పూటకూళ్ళయింటిలోనివారు నిజాయితీపరులందువా?"

అప్పుడు ముసలివాడు వణకుచు నిట్లనెను: "ఎందుకు? వారి నిజాయితీనిగూర్చి నా అభిప్రాయమేమో తెలిసికొనదలచు చున్నావా? వారు నిజాయితీగానే ఆడినారు."

"ఆ ప్రశ్న ఎందుకడిగినానో చెప్పెద వినుము. కడచిన రాత్రి నేను కొంతడబ్బు పోగొట్టుకొన్నాను. నేను పరున్న గది లోనే పోయినదని తలచుచున్నాను.. ఎవ్వరైన తమాషాకు ఆ సొమ్ము తీసికొన్నారేమో! తాతయ్యా! ఆ విషయము నాకు తెలిసినచో కడుపార నవ్వెదను" అని నెలబాల అనెను.

"తమాషా కెవ్వరు తీయుదురు? సొమ్ము తీసుకొనువారు దానిని తమ స్వంతము చేసికోవలయునని యే తీయుదురు. తమా షాను గుఱించి మాట్లాడకుము" అని తాతయ్య తొందఱ

తొందరగా సనెను.

తాతయ్య ఇచ్చిన సమాధానము నెలబాల కడపటి ఆశనుగూడ వమ్ముచేసెను. అందువలన నామె ఇట్లనెను: "అయినచో ఎవ్వరో నా గదిలో ప్రవేశించి దొంగతనము చేసినారన్నమాట !"

"నెలబాలా! మఱి నీవద్ద నింక ధనము లేదా ? ఎక్కడను ఇంక ధనము లేదా ? అంతయు తీసికొనిపోయినారా ? ఇంక నేమియు మిగులలేదా ?"

"ఏమియులేదు" అని నెలబాల సమాధానమిచ్చెను.

"మన మింకను ఎక్కువ సంపాదింపవలయును. ఏదో విధముగ అపారమగు ధనము సంపాదింపవలయును. ఈ నష్టమును ఏమాత్రము లెక్కచేయకుము. ఈ విషయము నెవ్వరికి చెప్పకుము. మనసొమ్ము మనకు తిరిగి రావచ్చును. ఇప్పుడు నన్నేమియు ప్రశ్నింపకుము. సొమ్ము తిరిగి ఎట్లువచ్చునని అడుగకుము. పోయిన సొమ్ము తిరిగివచ్చును. అంతియకాదు. దానికి కొన్ని వేలరెట్లు వచ్చును. డబ్బు పోయినసంగతి ఎవ్వరికి చెప్పకుము. చెప్పినచో మనము చిక్కులలో బడవచ్చును. వారు నీవు నిదురించుచున్నప్పుడు సొమ్ము దొంగిలించుకొని పోయినారన్నమాట ! అయ్యో! పాపము! అయ్యో! పాపము !"

నెలబాల తలవంచుకొని కన్నీరు కార్చెను. "మా తాతయ్య నా అభివృద్ధినికోరి నా వద్దనే దొంగతనము చేసినాడు. ఇది ఎంత విచారకరమైన విషయము! విషాదకరమైన విషయము!" అని ఆమె అనుకొనసాగెను.

తాతయ్య ఇంకను ఇట్లనెను: "ఈ విషయమును

గుఱించి నాకుతప్ప మఱి యితరులెవ్వరికిని ఒక్క మాటయైన చెప్పవలదు. వలదు, వలదు. నాకుగూడ చెప్పవలదు; నాకు చెప్పినందువలన లాభమేమియు నుండదు. నెలబాలా! కన్నీరు కార్చకుము. కన్నీరు కార్చవలసిన అవసరంలేదు. నేను విజయమును సాధింతును. నేను పోయిన ధనముకంటె ఎక్కువ ధనమును సంపాదింతును. ఇందుకు సందేహము వలదు."

"కన్నీరు కార్చినందువలన వచ్చిన నష్టమేమియున్నది? ఉన్న కన్నీరంతయు పోయిన మంచిది. ఇంక కన్నీరు కార్చవలసిన అవసరముండదు. ఒక పెన్నీ వేయి పౌనులతో సమానమైనను నేనింక కన్నీరు కార్చను."

అపుడు తాతయ్య మెల్లన ఇట్లనుకొనెను: "మంచిది, మంచిది. ఆమె కింతకంటె ఎక్కువ తెలియదు. అందుకు నేను భగవంతునకెంతయో కృతజ్ఞుడను."

"తాతయ్యా! ఏమి ఆలోచించుచున్నావు. ముందు నా మాట వినుము. ముందు నామాట వినుము."

తాతయ్య నెలబాలవంకకు చూడకుండగనే ఇట్లనెను: "విందును. విందును. గొంతు చాలబాగున్నది. నీ గొంతు నాకెప్పుడును మధురముగనే వినబడుచుండును."

"తాతయ్యా! అయిన నామాట వినుము. నేను చెప్పిన ప్రకారము చేయుము. ఇక లాభనష్టములనుగూర్చి ఏమాత్రమాలోచింపకుము. ఇక నీకు వానిప్రసక్తి వలదు. మన యిరువురము కష్టపడి పనిచేసి పొట్ట పోషించుకొందుము."

"అవునవును. మన మిరువురము కలసియే పని చేయుదుము. నేను నీకొరకే పనిచేయుచున్నాను."

"మన పరిస్థితి యిప్పుడెట్లున్నది! పూర్వముకంటె అధ్వానముగా నున్నదావేమి? లండను నగరమును వదలివచ్చిన తరువాత మన పరిస్థితి బాగుండలేదా? లండను నగరములో ఆ గృహములో నున్నప్పుడు మానసికముగ ఎంత బాధపడినాము? ఆ గృహమును వీడివచ్చిన తరువాత మనము సుఖముగనే యున్నాముకదా? స్వంతయిల్లు లేకపోయినను మనము ప్రశాంతముగ జీవించుచునే యున్నాముగదా? మన కిప్పుడేమి లోటు వచ్చినది?"

"ఆమె నిజమునే చెప్పుచున్నది. కాని అది నా మనస్సును మార్చరాదు. కాని అది సత్యము; అందుకు సందేహమేమియిలేదు" అని తాతయ్య గొణుగుకొన సాగెను.

"మనము లండను నగరములోని మన గృహమును వీడి బయలుదేఱినాము. అది కడుమనోహరమగు దినము. ఆ దినమును జ్ఞప్తియందుంచుకొనుము. అప్పటినుండి మనకెట్టి బాధలు లేవు. రాత్రింబవళ్ళు మనము కడు ప్రశాంతముగ గడుపుచున్నాము. ఎన్నో సౌకర్యముల ననుభవించున్నాము. మన కప్పుడప్పుడు అలసట వచ్చుచుండెడిది; ఆకలివేయుచుండెడిది. కాని మనము వెంటనే వానిని పోగొట్టుకొనుచుండెడివారము. మన కిదివఱకుకంటె గాఢముగా నిదురపట్టుచుండెడిది. మనమెటువంటి చక్కని వస్తువులనుచూచినామో జ్ఞప్తికి తెచ్చుకొనుము. ఎంత సంతృప్తికరముగ జీవించినామో జ్ఞప్తికి తెచ్చుకొనుము. మఱి యింక నీలో ఇప్పుడీమార్పు ఎందుకు?"

"ఇంకనీవు మాట్లాడవలదు" అని యన్నట్లు తాతయ్య చేయి ఊపెను. "ఇప్పుడింక నీవేమియు మాట్లాడవలదు. నేను

మంచి ఆలోచనలో మునిగియున్నాను" అని యతడనెను. రెండు నిమిషములు గడచిన తరువాత అతడామెను ముద్దుపెట్టుకొనెను. ఏదోఆలోచనలో మునిగియున్నవానివలె అతడు నడచుచుండెను. అతడు చాల ముందుకు చూచుచుండెను. ఏవో విషయములను జ్ఞప్తికి తెచ్చుకొని బాధపడుచున్న వానివలెనుండెను. నెలబాల అతని కన్నులలోని నీటి చుక్కలను చూచెనుగూడ. ఆ విధముగ కొంతకాలము గడచిపోయెను. అంతట నతడు మెల్లన ఆమె చేతిని తన చేతిలోనికి తీసికొనెను. క్రమక్రమముగా నతడు శాంతించుచున్నట్లుండెను. మఱి కొంతసేపు గడచునప్పటికి అతడెప్పటిమనిషి అయెను. అతడింక నెలబాల ననుసరించి పోవుటకు సిద్ధముగ నుండెను.

మఱి కొంతసేపటికి వారు జార్జిసతియున్న ప్రదేశమును చేరుకొనిరి.

9

తాతా మనమరాండ్రు మైనపు బొమ్మలున్న ప్రదేశమును చేరుకొనిరి. అప్పటికి జార్జి సతి ఇంకను నిదురనుండి మేల్కొనలేదు. తాతా మనమరాండ్రు కడచినరాత్రి ఇంటికి రానందుకు ఆమె బాధపడెనట. రాత్రి పదునొకండు గంటల వఱకు ఆమె మేల్కొని యుండెనట. ఎట్టకేలకు ఆమె యిట్లను కొని నిదురించెనట: "వారు దూరముగాపోయి తుపానులో

చిక్కుకొనియుందురు. ఎచ్చటనో ఈరాత్రికి ఆశ్రయము తీసికొని యుందురు. తెల్లవాటినతరువాత ఇచ్చటకు తిరిగివత్తురు".

నెలబాల గదిని జాగ్రత్తగా పరిశుభ్రముచేసి చక్కగా అలంకరించెను. ఆవిధముగా నామె తనపనిని జార్జీ సతి లేవక ముందే పూర్తిచేసి సంతృప్తిచెందెను. తరువాత చక్కగా దుస్తులు ధరించెను. ఆమె జార్జీసతికొఱకు ఎదురుచూడసాగెను. అంతలో జార్జీసతి నిదురనుండి లేచి, కాలకృత్యములు తీర్చుకొని, ఉదయకాలపు భోజనమునకు సిద్ధపడెను. అప్పుడు జార్జీ సతి నెలబాలను ఏమియు ప్రశ్నింపలేదు. భోజనమైనతరువాత గూడ నేమియు ప్రశ్నింపలేదు. పైగా ఆమె నెలబాలపట్ల అపరిమితమగు దయను ప్రకటింపసాగెను.

కాని నెలబాల ఒక విషయమును గుఱించి భయపడుచుండెను. నాటిసాయంకాల మామె భయపడినట్లుగనే జరిగెను. తాతయ్య నాటి సాయంకాలము నెలబాలకు చెప్పకుండ వెళ్ళిపోయెను. అర్థరాత్రి దాటిపోయిన తరువాతమాత్రమే అతడు ఇంటికి తిరిగివచ్చెను. మానసికముగను, శారీరకముగను బాగుగ అలసిపోయిన నెలబాల అంతవఱకు నిమిషములు లెక్కపెట్టుకొనుచు ఏకాంతముగ కూర్చుండియుండెను. తిరిగివచ్చిన తాతయ్య మొగములో ఏమాత్రముకళ లేదు. అతనివద్ద నొక్కరాగి నాణెమైన లేదు. ఆర్థికముగను, మానసికముగను అతడు దివాళాతీసి యుండెను. కాని అతని మనస్సుమాత్రము మాఱలేదు.

నిదురించుటకుముందు తాతయ్య నెలబాలతో నిట్లనెను: "నెలబాలా! నాకు డబ్బు కావలయును. డబ్బు తెచ్చియిమ్ము.

ఎప్పుడో ఒకనాడు నీబాకీని వడ్డీతోసహా తీర్చివేయుదును. కాని ఒక్కమాట నీచేతికిప్పుడు వచ్చు సొమ్మునంతను నాకు ఇచ్చివేయుచుండవలయును. ఇదియంతయు నాకొఱకుకాదు; నీకొఱకు. నెలబాలా! నీకొఱకని జ్ఞప్తియందుంచుకొనుము.

తాతయ్య పేకాటకు పోవుచున్నాడను విషయము నెల బాలకు చక్కగా తెలియును. కాని యిప్పుడామె చేయగలిగి నది ఏమియున్నది? ఆమె తనవద్దనున్న ప్రతిపెన్నీని తాతయ్య కీయవలసియుండెను. "నేను సొమ్మీయకపోయినచో తాతయ్య జార్జీసతివద్ద దొంగతనము చేయుటకు ప్రయత్నింపవచ్చును. అది ఏమాత్రము వాంఛనీయముకాదు. కావున నేను డబ్బు ఇచ్చుటయే మంచిది." అని ఆమె అనుకొనసాగెను. ముసలివాని సంగతి నందఱకు చెప్పిన ఏమగును? అందఱును అతనిని పిచ్చి వానినిగా జమకట్టుదురు. అతనికి సొమ్మీయకపోయిన నేమి అగును? అతడే దొంగతనముచేసి డబ్బు సంపాదించుకొనును. డబ్బు ఇచ్చుటవలన అతడు సర్వనాశనమైపోవు అపాయమున్నది. ఈ అభిప్రాయములు నెలబాలను మాటిమాటికి వేధించు చుండెను. తాతయ్య ఇంటలేనపుడామె పలురకముల ఆలోచ నలతో బాధపడసాగెను. ఆమెకంతయు ఱంపపుకోతవలె నుండెను. ఆమె గులాబిరంగు బుగ్గలు తమ రంగును కోల్పోవ సాగెను; కన్నులుమసకలగుచుండెను; హృదయము భారముతో దుర్బలమగుచుండెను. పూర్వపు విచారములన్నియు ఆమెను తిరిగి ఆవహించెను. క్రొత్తరకపు భయములు, సందేహములు కూడ ఆమెను ఆవరించెను. పగటిసమయములందలి ఎప్పుడును ఆమె మనస్సులో తిరుగాడసాగెను. రాత్రిసమయము లందలి

కలలరూపములో ప్రత్యక్షమగుచుండెను.

తన మనస్సులోని విషయము నెవ్వరికైన చెప్పి తేలిక పఱచుకోవలయునని నెలబాల భావింపసాగెను. అందుకు తగిన మనిషి ఆయూరి పాఠశాలలో పనిచేయుచున్న ఎడ్వర్డ్సు కన్య యని ఆమె అనుకొనెను. ఆ పాఠశాల యజమానురాలు వట్టి కఠినురాలు. పాఠశాలకు సెలవులగుటమూలమున యజమాను రాలు లండనునగరమునకు పోయియుండెను. మఱి ఎడ్వర్డ్సుకన్య ఎచ్చటనున్నది? ఆమె ఇంటికిపోయినదా? పోవుటకు ఇల్లున్నదా? ఆమె ఇంకను పాఠశాలలోనేయున్నదా? ఆవిషయము నెల బాలకు తెలియకుండెను.

ఒకనాటి సాయంకాలము నెలబాల ఒంటరిగ వాహ్యాళికి బోయి ఇంటికి తిరిగి వచ్చుచుండెను. అప్పు డామె కోచిబండి ఆగు పూటకూళ్లయింటికి ప్రక్కగావచ్చుట తటస్థించెను. ఆ సమయమున కచ్చటికొక కోచి వచ్చెను. అచ్చట అందాల యువతి ఎడ్వర్డ్సు కన్య నిలబడియుండెను. ఆమే కోచిబండిలో నుండి క్రిందకు దిగుచున్న ఒక చిన్నఅమ్మాయిని కౌగిలించు కొనుచుండెను.

ఆ చిన్న అమ్మాయి అందాలయువతి చెల్లెలు. ఆమె నెలబాలకంటె చాలచిన్నది. అక్కా చెల్లెండ్రు ఒకరినొకరు చూచుకొని అయిదు సంవత్సరములైనది. వారిరువురును కొంచెము దూరముగాపోయి ఒకరినొకరు గట్టిగా కౌగలించు కొనుచుండిరి. మఱియు వారు కన్నీరు కార్చుచుండిరి. ఆ కన్నీ టిలో అంతవఱకు కలసికోలేక పోయినందులకు విచారమును, అప్పటికైన కలసికొన గలిగినందులకు సంతోషమును కనబడు

చుండెను.

మఱి కొంతసేపటికి అక్కా-చెల్లెండ్రు మామూలు స్థితికి వచ్చిరి. అంతట వారిరువురును ఆ ప్రదేశమునువీడి నెలబాలకు ప్రక్కగా పోసాగిరి. "అక్కయ్యా! నీ జీవితము సుఖముగ గడచి పోవుచున్నదా?" అని చెల్లెలు అక్కను ప్రశ్నించెను.

"ఇప్పుడు సుఖముగా నున్నది."

"మఱి ఎల్లప్పుడును? అక్కయ్యా! ముఖము నా ప్రక్కకు తిప్పుకొనెద వెందులకు?"

నెలబాల వారికి కొంచెము దూరము వెనుకనే పోవు చుండెను. వారిరువురును ఒక ముసలినర్సు ఇంటివద్ద ఆగిరి. అక్కడ అక్కయ్య తన చెల్లెలు ఉండుటకు తగిన వసతి సౌకర్య ముల నేర్పాటుచేసియుండెను. "నేను ప్రతిదినము ఉదయమున నీవద్దకు వచ్చెదను. పగలంతయు మన మిరువురము కలసి ఉండ వచ్చును" అని అక్కయ్య చెల్లెలితో ననెను.

"రాత్రిపూటకూడ నాతో కలసి ఎందుల కుండరాదు? ప్రియమైన అక్కా! వారు నిన్ను కోపపడుదురా ఏమి?" అని చెల్లెలు ప్రశ్నించెను.

నాటిరాత్రి నెలబాల సంతతధారగా కన్నీరు కార్చెను. త్వరలోనే చెల్లెలు అక్కను వీడిపోవలయును. ఆ తలంపు నెల బాలకు విచారమును కలుగజేయుచుండెను. నెలబాల, తాతయ్య వేఱుపడినచో నెట్లుండెను? అది ఎంతయు విచారకరమైన విష యముకదా!

ప్రతిరోజు సాయంకాలము నెలబాల అక్క-చెల్లెండ్ర వెనుకపోవుచుండెను. కాని ఆమె వారిని కలసికొనుటలేదు; వారిని

పలుకరించుటలేదు. వారు ఆగినచో ఆమె ఆగుచుండెను వారు కూర్చున్నప్పుడు ఆమెకూడ కూర్చునుచుండెను. వారు లేచినపుడు ఆమెకూడ లేచుచుండెను.

ఒకనాటి రాత్రి నెలబాల ఎప్పటివలె వాహ్యాళికిబోయి ఇంటికి తిరిగివచ్చెను. అప్పుడు ఆమె జార్లీసతి ప్రచురించిన ప్రకటన నొకదానిని చదివెను. ఆ ప్రకటనలో నిట్లుండెను: "జార్లీసతి మైనపుబొమ్మల ప్రదర్శనమింక నిచ్చట ఒక్కరోజు మాత్రమే యుండును. చూడదలచుకొన్నవారు ఆశాభంగము చెందకుండ నుండవలయునన్నచో వెంటనే చూడవలయును."

ఆ ప్రకటన నెలబాలకు ఆశ్చర్యమును కలిగించెను. "మనము వెంటనే ఈ ప్రదేశమును వీడిపోవలయునా?" అని ఆమె జార్లీసతిని ప్రశ్నించెను. అపుడు జార్లీసతి, "ఇదిగో, ఈ ప్రకటనమును చదువుము. అప్పుడు నీకు విషయమంతయు నర్థమగును" అని యనెను.

ఆ రెండవ ప్రకటనలో నిట్లుండెను: "పురజనుల కోరికపై జార్లీసతి మైనపుబొమ్మల ప్రదర్శన మిక్కడ ఇంక ఒక్కవారము రోజులవఱకు మాత్రముండును."

కాని మైనపుబొమ్మలను చూచుటకువచ్చు వారిసంఖ్య క్రమక్రమముగా తగ్గిపోవుచుండెను. జార్లీసతి ఎంత ప్రయత్నించినను లాభములేక పోవుచుండెను.

ఒకనాడు నెలబాల ఎప్పటివలె అక్కచెల్లెండ్ర వెనక వాహ్యాళికి పోయెను. తిరిగి వచ్చుచుండగా నామె యొక మైదానములో ప్రవేశించెను. అచ్చటి ప్రకృతి దృశ్యములు మంచి ఆకర్షణీయముగ నుండెను. అందువలన నామె అచ్చట ఆగిపోయెను.

అక్కచెల్లెండ్రు వెళ్ళిపోయిరి. నెలబాల ఒంటరిగ మిగిలిపోయెను క్రమక్రమముగ చీకటిపడెను. ఆకసమున నక్షత్రములు మినుకు మినుకుమని ప్రకాశించుచుండెను.

నెలబాల ఒకచోట కూర్చుండి ఆకసములోని నక్షత్రములవంక చూడసాగెను. చూచుచున్న కొలది ఆమెకు క్రొత్త నక్షత్రములు కనబడసాగెను. నెలబాల భూత, వర్తమాన, భవిష్యత్కాలములనుగూర్చి ఆలోచింపసాగెను. క్రమక్రమముగా తాతా మనమరాండ్ర మధ్యగల సంబంధము దూరమై పోవుచున్నది. నెలబాల కదియెంతయు బాధాకరముగ నుండెను. ఆ పరిస్థితి నామె సహింపలేకుండెను. ప్రతి సాయంకాలము తాతయ్య ఒంటరిగ ఎచ్చటకో పోవుచుండెను. అతడు ఎచ్చటకు పోవుచున్నాడు? ఎందుకు పోవుచున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానము నెలబాలకు బాగుగ తెలియును. అతడు నెలబాలతో ఏమియు మాట్లాడుటలేదు. పైగా ఆమెకు కనబడకుండ తప్పించుకొని తిరుగుటకు ప్రయత్నించుచుండెను.

నెలబాల తాతయ్యలో వచ్చిన ఆ మార్పును గూర్చి ఆలోచించు చుండెను. అంతలో చర్చి గడియారము తొమ్మిది గంటలు కొట్టెను. అంతట నామె ఆలోచనలకు స్వస్తిచెప్పి లేచి, పట్టణము వంకకు పోసాగెను. అల్లంత దూరములో నామెకొక దీపము కనబడసాగెను. ఆ దీపము చుట్టును కొందఱు మనుజులు కూర్చున్నట్లుండెను. నెలబాల నిర్భయముగ ఆదీపము వంక పోసాగెను. దీపము చుట్టును కూర్చున్నవారిలో ఒకనిని ఆమె ఆనవాలు పట్టినట్లుండెను. కాని అంతలో నామె యిట్లనుకొనెను: "నేను పొరపడు చున్నాను. అతడు కాడు."

నెలబాల మఱికొంచెము ముందుకు పోయెను. అపుడామెకు మాటలు స్పష్టముగ వినబడసాగెను. అంతవఱకు కూర్చుండియున్న యొక ముసలివాడు లేచి నిలబడి కఱ్ఱమీద ఆనుకొని మాట్లాడుచుండెను. ఆతడెవ్వరు? ఆమె తాతయ్య!

నెలబాల వెంటనే పోయి అతని ఎదుట పడదలచెను. కాని వెంటనే ఆమె ఆ ఆలోచనను మానుకొనెను. అచ్చట నున్న ఇతరు లెవ్వరు? వారు ఏవిషయమును గుఱించి మాట్లాడు కొను చున్నారు? ఆమె యీ ప్రశ్నలకు సమాధానము తెలిసికొన దలచెను. అందువలన నామె మెల్లన మఱికొంచెము ముందుకు పోయెను. ఆమె ఒకచెట్టు చాటున నిలబడెను. దీపము వద్దనున్న వారామెకు స్పష్టముగ కనబడుచుండిరి. ఒకడు తాతయ్య; రెండవవాడు పేకాటలో విజయము సాధించిన ఐజక్; మూడవవాడు అతనితో పాటు ఆడిన లావుపాటివాడు. నెలబాల వారి మాటల నాలకింప సాగెను.

లావుపాటివాడు తాతయ్య మొగమువంక చూచుచు నిట్లనుచుండెను: "నీవు పోవుచున్నావా యేమి? ఒక్క నిమిషము క్రిందట నీవు పోవలయునని ఎంతో తొందఱపడి యుంటివి? పోదలచుకొన్న పొమ్ము. నీ యజమానుడవు నీ వేలనుకొందును?"

"అతని నా విధముగ బాధపెట్టి విసిగింపకము. మనకు కష్టము కలిగించుట అతనియుద్దేశ్య మే మాత్రము కాదని నేను నిశ్చయముగ చెప్పగలను" అని ఐజక్ అనెను.

తాతయ్య వారి యిరువురి వంక చూచుచు నిట్లనెను: "మీరిరువురును నేను అధ్వాన్న పరిస్థితులలో నుండునట్లు చేయు చున్నారు. నన్ను దోచుకొనుచున్నారు. పైగా నన్ను వేళా

కోళము చేసి వేడుక పడుచున్నారు. నన్ను పిచ్చివానిని చేయ బోవుచున్నారు."

చెట్టు చాటుననున్న నెలబాల ఇరువురు మోసగాండ్ర మొగములలోని కౌటిల్యమును స్పష్టముగా గమనించుచుండెను.

అంతవఱకు కూర్చున్న లావుపాటివాడు కొలదిగా లేచి యిట్లనెను: "ఆ విధముగ మాట్లాడుటలో నీ యుద్దేశ్య మేమి? నీ అధ్వాన్న పరిస్థితికి మేము కారకులమా? చేతనైనచో నీవు మాత్రము మమ్మా పరిస్థితిలో నుంచుటకు ప్రయత్నింపవా? నీ వంటివారితో ఇదే చిక్కు. నీవు ఓడిపోయినపుడు ఏమో కొంపలు కాలిపోయినట్లు అఱచుచుందువు! ఇతరులు ఓడిపోయి నపుడు మఱివారి పరిస్థితి ఎట్లుండును? నీవు మాత్రము సంతో షించుచు పండ్లు ఇకిలించుచుందువు! మేము నిన్ను దోచుకొను చున్నామా? నీవు గౌరవనీయుడవేనా? గౌరవనీయు లనవలసిన మాటలేనా అవి? నీకు జ్ఞానము లేదా?"

అట్లని అతడు మరల ఎప్పటివలె కూర్చుండెను. ముసలి వాడు కొంచెముసేపు తెల్లమొగము వేసికొని నిస్సహాయునివలె నిలబడి యుండెను. ఎట్టకేలకు అతడు లావుపాటివానితో నిట్ల నియెను: "నీ వింతకుముందు దోపిడీలనుగూర్చి మాట్లాడియుండ లేదు. మఱి నీ కిప్పుడు నామీద అంత కోప మెందులకు? నీవా విధముగ మాట్లాడి యుండలేదా?"

"మనము గౌరవ నీయులము. ఒకరి సొకరము దోచు కొనము. నేను మనలను గుఱించి మాట్లాడియుండలేదు. ఇతరు లను దోచుకొనుటను గుఱించి మాట్లాడి యుంటిని" అని లావు పాటి వాడనెను.

"మన తాతయ్య చాల మంచివాడు. అతనికి కష్టము కలిగించు మాటలు పలుకకుము" అని ఐజక్ అనగా లావుపాటి వాడిట్లనెను: "నా హృదయము చాల మెత్తనిది. అసలు నేనిప్పుడిక్కడ కూర్చుండి మంచి సలహాలిచ్చుట పొరపాటు. నా మాటవిను వారెవ్వరు? నా సలహాను ఎవ్వరును పాటింపరను విషయము తెలియును. నేనింత బాధ పడినందుకు నన్ను దూషింతురేకాని లాభమేమియు నుండదు. కాని నా జీవితమే ఇంత. ఈ విధముగ జరుగవలయునని భగవంతుడు నా మొగమున వ్రాసి యున్నాడు."

"జరిగినదానికి ముసలివాడెంతయు విచారించుచున్నాడు" అని ఐజక్ అనెను.

"మరి నే చెప్పినట్లు జరుగవలయునని అతడు వాంఛించుచున్నాడా?" అని లావుపాటి వాడనెను.

"నీవు చెప్పదలచుకొన్నది చెప్పుము. చెప్పదలచుకొన్నది చెప్పుము" అని ముసలవాడు అనెను.

"మంచిది. ముసలివాడా! నీకు మంచి అదృష్టము పట్టు సమయము వచ్చినది. ఈ విషయమును నమ్ముము. నీ అదృష్టమును పరీక్షించుకొనుటకు తగిన సొమ్ము నీవద్ద లేదా? అయిన నామాట వినుము. నీకొక చక్కని యుపాయము చెప్పెదను. ఇతరుల వద్దనుండి అప్పు తీసికొనుము. వీలుచిక్కినపుడు ఆ అప్పు తీర్చివేయ వచ్చును" అని లావుపాటివాడు అనెను.

"అవునవును. అప్పు తీసుకొనుటలో కూడ నొక చక్కని మార్గమున్నది. జార్లీ సతివద్ద కావలసినంత ధనమున్నది. ఆమె దాని నొక చిన్న పెట్టెలో దాచుచుండును. ఆమె రాత్రి

పడుండునపుడు ఆపెట్టెను దగ్గఱగా పెట్టుకొనును. అగ్నిభయము చేత ఆమె తలుపునకు తాళము వేసికోదు. కావున నీపని సులభముగా జరిగిపోవును. దేవుడు నీ పక్షమున నున్నాడనుటకు ఎట్టి సందేహమును లేదు" అని ఐజక్ అనెను.

లావుపాటివాడు ఇట్లనసాగెను: "ఐజక్! ఒక్క విషయము గమనింపుము. జార్జీసతి బసలోనికి రకరకముల జనులు పోవుచుందురు; లోపలనుండి బయటకు వచ్చుచుందురు. వీరిలో ఏ ఒక్కరుగాని ఆమె పెట్టెను తీసికొనిపోవుటకు వీలున్నదిగదా! అందువలన అనుమానము ఏ ఒక్కరిమీదగాని ప్రత్యేకముగ పడదు. అసలు వారిమీద అంతకంటెపడదు. ఆ సొమ్మును నేను సురక్షితముగ దాచియుంచగలను."

"నీవద్ద ఆ సొమ్ము సురక్షితముగ నుండునని ఎట్లు చెప్పగలవు?" అని ఐజక్ ప్రశ్నించెను.

అంతట లావుపాటివాడు తనవద్దనున్న చిన్న పెట్టెను పైకి తీసి ఊపుచు నిట్లనెను: "నావద్ద సురక్షితముగ నెందులకుండదు! ఇదిగో, ఈ పెట్టెనిండ విలువైన బంగారమున్నది. దీనిని నేను సురక్షితముగ దాచుటలేదా? అటులనే ఆ సొమ్ముకూడ నావద్ద సురక్షితముగ నుండును. పెన్నీలతోసహా నేను సరిగా అప్పచెప్పెదను."

అపుడు ఐజక్ ఎంతో వినయముతో నిట్లనెను: "నీ సంగతి నాకు బాగుగ తెలియును. నీవద్ద ధనములేదని నేను సూచనప్రాయముగనైన అని యుండలేదు. ముసలివానికి కెట్టి సందేహము లేకుండ నుండుటకే నేనట్లన్నాను. ఇప్పుడతడు నీవద్దనున్న ధనమును చూచినాడు. కావున అతనికి నిన్నుగూర్చి

ఇంక ఎట్టి సందేహమును లేదు."

తరువాత లావుపాటివాడు ఇట్లనెను: "నా సలహా స్పష్టముగ తెలియుచునే యున్నది. నేను చేయవలసినదేమో చేసినాను; చెప్పవలసినదేమో చెప్పినాను. నేను మిత్రుడను. ఆ విధముగనే సలహా చెప్పినాను. ఇతడు ఆటలలో విజయము సాధించి నావద్దనున్న ధనమునంతను తీసుకోవచ్చును. అయినను నేను అతని మేలునుకోరి మంచి సలహాను చెప్పినాను. నేను ఆవిధముగ ఎందులకు చెప్పినాను? నేనతని మిత్రుడను కనుకనే చెప్పినాను. ఈవిధముగ ఇతరుల మేలునుకోరి సలహా చెప్పుట తెలివితక్కువతనమన్నమాట నిజమే. కాని అటుల చేయుట నా స్వభావము. నేనందులకు వ్యతిరేకముగ నడచుకొనజాలను. అందువలన నన్ను నిందింపకుము."

"నిన్ను నిందించుటయా! ఓయి భగవానుడా! నిన్ను నిందించుటయే! నిన్నెందులకు నిందింపవలయును? ఈప్రపంచమంతయు తలక్రిందులై పోయినను నిన్ను నిందింపను. నీ వితరణబుద్ధి, విశాల భావములు నాకుగూడ నున్న ఎంత బాగుండును! నీ వన్నట్లు అతడు విజయము సాధించినచో జార్జీసతివద్ద తీసికొనివచ్చు సొమ్మును తిరిగి ఆమెకిచ్చివేయవచ్చును. కాని పోయినచో..." అని ఐజక్ చెప్పసాగెను.

అపుడు లావుపాటివా డిట్లనెను: "ఆ విషయమును గురించి ఆలోచింపవలసినపని లేదని నేను అభిప్రాయ పడుచున్నాను. ఒకవేళ అతడు ఓడిపోయినా డనుకొనుము. స్వంత సొమ్మును పోగొట్టుకొనుటకంటె ఇతరుల సొమ్మును పోగొట్టుకొనుట మంచిదికదా! ఇందులకు ఏమందువు?"

అపుడు ఐజక్ ఇట్లనెను: "విజయము సాధించుటలో ఎంత ఆనందమున్నది! విజయము సాధించుటలో ఎంత ఆనందమున్నది! ఇతరుల నాణెములనన్నిటిని సంతోషముతో తీసికొని జేబులో వేసికొనవచ్చును! అటులచేయుట ఎంత ఉత్సాహకరముగ నుండును! ఎంత ఉత్సాహకరముగ నుండును! విజయము సాధించుటలో ఎంత ఆనందమున్నది! ఓయీ, ముసలివాడా! వెళ్ళిపోవుచున్నావాయేమి ?"

"లేదు. లేదు. వెళ్ళిపోవుటలేదు. నేను మీరు చెప్పిన ప్రకారము చేయుదును. నేను సొమ్మునంతను తీసికొనివత్తును. ఒక్క పెన్నీకూడ వదలిపెట్టను" అని ముసలివాడు అనెను.

ఐజక్ హఠాత్తుగాలేచి ముసలివాని భుజమును తట్టి ఇట్లనెను: "చాల చక్కగా మాట్లాడినావు. చాల ధైర్యముగ మాట్లాడినావు. నీవు వయస్సుకు ముసలివాడవే. కాని నీలో యువకరక్తము ప్రవహించుచున్నది. అందుకు నిన్ను నేనెంతయు అభినందించుచున్నాను. నా మిత్రుడు నీకింత మంచి సలహా చెప్పినందుల కిప్పుడు విచారించుచున్నాడనుకొందును."

ముసలివాడు లావుపాటివానిని చూపుచు నిట్లనెను: "ఇంతవఱకు అతడే విజయమును సాధించుచువచ్చినాడు. ఇక ముందు నేనే విజయమును సాధింతును. మఱియు నతడు తన పెట్టెలోనున్న సొమ్మునంతను ఆడవలెను. ఒక్క చిన్ననాణెము నైనను దాచుకొనుటకు వీలులేదు. నేను ఆ సొమ్మునంతను ఆటలో సంపాదింతును."

"నే నందుకు సాక్షిని. మీ యిరువురిమధ్య న్యాయము జరుగునట్లు చూతును" అని ఐజక్ అనెను.

"నేను మాట అన్నాను. మాట నిలబెట్టుకొనుట నా స్వభావము. మఱి మన పందెపు ఆట ఎప్పుడు? ఎంత త్వరగా జరిగిన అంత మంచిది. నేటిరాత్రికే పూర్తిచేసికొందము" అని లావుపాటి వాడనెను.

అంతట ముసలివాడు ఇట్లనెను: "నాకు ముందు చేతికి సొమ్ము అందవలయునుగదా. రేపు రాత్రిగాని నాచేతికి సొమ్ము చిక్కదు."

"నేడే ఎందుకు చిక్కించుకోరాదు?" అని లావుపాటి వాడు ప్రశ్నించెను.

"ఇప్పటికే చాల ఆలస్యమైపోయినది. ఈ విషయమున హడావిడి పనికిరాదు. నేను నిదానముగా పూర్తిచేయుదును. రేపు రాత్రి పూర్తిచేయుదును" అని ముసలివాడు అనెను.

"మంచిది. రేపే పూర్తిచేయుము. మన మిప్పుడు ఏదేని పానీయమును సేవింతుము" అని యని లావుపాటివాడు మూడు కప్పులలో బ్రాందీ పోసెను. ముసలివాడు ప్రక్కకుతిరిగి బ్రాందీ త్రాగుచు నెలబాల నామము నుచ్చరించెను.

"ఈ సమయమున మాపట్ల భగవానుడు కరుణను ప్రదర్శించునుగాక! ఇది మాకు అగ్నిపరీక్షా సమయము! ఈ పరీక్షలో మేము విజయము సాధింపవలయును. మా తాతయ్యను రక్షించుకొనుటకు నే నిప్పుడు ఏమి చేయవలయును?" అని నెలబాల తనలో తాను అనుకొనెను.

ముప్వురును మఱికొంతసేపు మాట్లాడుకొనిరి. ఈసారి వారు చాల రహస్యముగా మాట్లాడుకొనిరి. అందువలన నెలబాల కేమియు వినబడలేదు. బహుశా వారు జార్జిసతి ధనము

నపహరించు విధానమునుగూర్చి మాట్లాడుకొనియుందురు; అను మానము మఱియొకరి పైకిపోవునట్లుచేయు విధానమునుగూర్చి కూడ మాట్లాడుకొనియుందురు. తరువాత ముసలివాడు ఇరువురి వద్ద సెలవు తీసికొని ఆప్రదేశమునుండి వెళ్ళిపోయెను.

ముసలివాడు మెల్లమెల్లన పోవుచుండెను. మిత్రు లిరువురును అతనివంకకు చూచుచుండిరి. ముసలివాడు మధ్యమధ్య వెనుకకు తిరిగి చూచుచుండెను. మిత్రులప్పుడు చేతులూపుచు అతని కుత్సాహమును గొల్పుచుండిరి. మఱికొంతసేపటికి ముసలివాడు కనబడకుండెను. అప్పుడు మోసగాండ్రిరువురును ఒకరి వంక నొకరు చూచుకొని గట్టిగా నవ్వుకొనిరి.

లావుపాటివాడు ఇట్లనెను: "ఎట్టకేలకు మనము సాధించినాము. కొద్దిమాటలతోనే అత డిందులకు అంగీకరించునని నేను భావించితిని. కాని మనము చాలసేపు తంటాలుపడవలసి వచ్చినది. మన మీ యభిప్రాయము నతని బుఱ్ఱలో ప్రవేశపెట్టి మూడువారములైనది. అతడేమి తీసికొని వచ్చునని నీవు భావించుచున్నావు?"

"అతడేమి తెచ్చినను మన మిరువురము సమానముగా పంచుకొందము" అని ఐజక్ అనెను.

అందుకు రెండవవాడు అంగీకరించెను. అతడు ఇట్లనెను: "మనము వెంటనే పని పూర్తిచేసికొవలయును. తరువాత మన మాతని సాహసచర్యమును పూర్తిగా వదలుకోవలయును. లేనిచో మనల నెవ్వరైన అనుమానింపవచ్చును. ఈవిషయమున మనము చాల జాగ్రత్తగా, తెలివితేటలతో ప్రవర్తింపవలయును."

ఐజక్ ఆ యభిప్రాయములతోనే నేకీభవించెను. తరువాత మఱికొంతసేపు వా రా విషయమునుగూర్చి మాట్లాడుకొనిరి. అటుపిమ్మట వారు ఇంకేదో విషయమునుగూర్చి మాట్లాడుకో సాగిరి. అది నెలబాల కేమియు అర్థము కాకుండెను. వారు సంభాషణలో బాగుగ మునిగియున్నసమయముచూచి నెలబాల ఆ ప్రదేశమునుండి తప్పించుకొనిపోయెను. ఆమె శరవేగమున పోయి ఇల్లు చేరుకొని తన శయ్యపై పరుండెను.

ముందు కర్తవ్యమునుగూర్చి నెలబాల కడు తీవ్రముగా ఆలోచింపసాగెను. "మే మిరువురము వెంటనే ఈ ప్రదేశమును వీడిపోవుటయే ఉత్తమోత్తమైనపని. తిన్నయింటి వాసములు లెక్కపెట్టుటకంటె బయటకుపోయి మరణించుటమేలు. ఉత్తము లగువారు ఆవిధముగనే ప్రవర్తింతురు. దొంగతనము రేపురాత్రి గాని జరుగదు. అందువలన ఏమిచేయవలయునో నిశ్చయించు కొనుట కింకను వ్యవధి యున్నది. కాని తాతయ్య నేటిరాత్రే దొంగతనము చేయుటకు ప్రయత్నింపవచ్చును. ఏమో! ఎవరు చెప్పగలరు? ఎప్పటికి ఎవ్వరికి ఏబుద్ధులు పుట్టునో తెలియరాదు గదా! ఆరుదాని సొమ్మును దొంగిలించుచుండగా తాతయ్య పట్టుపడినచో ఇంక నేమియున్నది! అబ్బ! నేనుభరింపలేను" అని ఆమె అనుకొనెను.

వెంటనే నెలబాలపోయి జార్లిసతి పరుండియున్న గది తలుపులు తెఱచి లోనికి తొంగిచూచెను. భగవంతుడు మహా మాన్వితుడు! తాతయ్య అచ్చటలేడు! జార్లిసతి చక్కగాగుఱ్ఱు పెట్టి నిదురించుచున్నది.

నేలబాల తిరిగి తన గదిలోనికిపోయి నిదురించుటకు సిద్ధ

పడసాగెను. కాని నిదురించుటయా! అట్టి పరిస్థితులలో ఎవ్వరికి నిదురపట్టును! భయంకరమగు తలపులు మనస్సులోనికిచొచ్చుకొని వచ్చుచుండ ఎవ్వరికి నిదురపట్టును? ఆ తలపు లంతకంతకు బలిష్ఠము లగుచుండెను. వెంటనే ఆమె తాతయ్య నిదురించు చున్న గదిలోనికిపోయెను. ఆమె యతనిని గట్టిగా పట్టుకొని నిదురనుండి మేల్కొల్పెను.

తాతయ్య ఉలికిపడిలేచి నెలబాల ఆకారమునుజూచుచు "ఇదియేమి? ఇదియేమి?" అని యనెను.

"నాకొక భయంకరమగు కలవచ్చినది" అని నెలబాల చెప్పసాగెను; "అబ్బ! ఆ భయంకరమగు కలను తలచుకొన్నంత మాత్రమున నాకు ఇప్పటికింకను వణకు పుట్టుచున్నది. ఇటు వంటి కలయే నా కిదివఱ కొకసారి వచ్చినది. నీవంటి తెల్లని వెండ్రుకలుగల ముసలివాండ్రు రాత్రి సమయములందు చీకటి గదులలో ప్రవేశించి బంగారమును దొంగిలించుచున్నారు. ఇదియే నాకు వచ్చినకలయొక్క సారాంశము! లే లెమ్మ! లే లెమ్మ!"

ఆ మాటలను వినగానే తాతయ్య గజగజ వణకిపోసాగెను. అతడు ప్రార్థన చేయుచున్నవానివలె చేతులు జోడించెను.

అంతట నెలబాల ఇట్లనెను· "నాకుకాదు! నాకుకాదు! కరుణామయుడగు భగవంతునకు! అటువంటి పనులనుండి మనలను రక్షింపవలయునని భగవంతుని ప్రార్థింపవలయును. ఈ కల ముమ్మాటికి సత్యమువలె నున్నది! అందువలన నాకు నిదురపట్టుట లేదు! నేనింక ఇచ్చట వుండను! ఇటువంటి కలలు వచ్చుచున్న

యింట నిన్ను ఒంటరిగా వదలిపెట్టిపోలేను. లేలెమ్మ్మా. మనము పక్షులవలె ఈ ప్రదేశమునుండి ఎగిరిపోవలయును!"

ముసలివాడు నెలబాలవంక చూచుచు ఇంకను గజగజ వణకిపోసాగెను.

"వృథాచేయుట కింక కాలములేదు. ఒక్క నిమిషము నైన వృథాచేయుటకు నేను ఏమాత్రము అంగీకరింపను. లే లెమ్మా! నావెంట రమ్మా" అని నెలబాల తాతయ్యను హెచ్చరించెను.

"నేటిరాత్రికేనా?" అని తాతయ్య గొణిగెను.

"అవును. నేటిరాత్రికే పోవలయును" అని నెలబాల చెప్ప సాగెను;

"రేపురాత్రి, పోవుటకు వీలులేదు. అప్పటికి చాల ఆల స్యమై పోవును. భయంకరమగు కల మరల రావచ్చును. మనము వెంటనే పాఱిపోవలయును; అది మాత్రమే మనలను రక్షింప గలదు. లేలెమ్మా!"

ముసలివాడు శయ్యపైనుండి లేచెను. అతని నుదురు భయముతో పట్టిన చెమటతో నిండిపోయియుండెను.

"నీవు దేవతలుపంపిన రాయబారివి. నన్ను మంచి మార్గ మున పెట్టుటకు వచ్చినావు. నేను నీవెంట వచ్చుటకు సిద్ధముగా నున్నాను" అను అర్థము వచ్చునట్లు ముసలివాడు వంగి నెల బాల ననుసరించుటకు సిద్ధముగా నుండెను. నెలబాల అతని హస్తములను బట్టుకొని ముందుకుపోసాగెను; వెనుక నతడు పోవు చుండెను. వారు జార్జీసతి గదిముందుగా పోవలసియుండెను. ఆ గదిరాగానే నెలబాల వణకిపోవుచు తాతయ్య మొగమువంక

చూచెను. అప్పుడు తాతయ్య మొగము వెలవెలపోవుచుండెను. అతనిచూపు లదియొక విధముగా నుండెను. నెలబాల అతనిని తన గదిలోనికి తీసికొనిపోయెను. ఆమె అతని హస్తములను విడువకుండగనే (అతడు పారిపోవునని భయము కాబోలును!) తన సామానులను, బట్టలను మూటకట్టుకొనెను. తరువాత నిరువురును ఆ గదిలోనుండి బయటకు వచ్చిరి. మఱి కొంతసేపటికి వారు వీధిలో బడిరి.

వారు సందులు గొందులు మున్నగునవన్నియు దాటిపో సాగిరి. క్రమక్రమముగా వారు పట్టణము బయటకు వచ్చిరి. వారింకను పయనమై పోవుచుండిరి. నెలబాల వెనుకకు తిరిగి చూచుటలేదు; అందువలన ముసలివాడుకూడ వెనుకకు తిరిగి చూచుటలేదు.

10

నెలబాల అపరిమితమగు ధైర్యముతో నిట్లనుకొనసాగెను: "ఇప్పుడింక బాధ్యత అంతయునాదే. మా యిరువురి భారమింక నామీదనే ఉన్నది. ఇకనుండి మా యిరువురి తరఫున నేనే ఆలోచింపవలయును; నేనే పనిచేయవలయును. నేను తాతయ్యను రక్షించినాను. అన్ని కష్టములలోను, అపాయములలోను నేనా విషయమును జ్ఞప్తియందుంచుకొందును."

జార్లీసతి నెలబాలపట్ల అపరిమితమగు దయను ప్రదర్శించి

నది. కాని నెలబాల ఆమెతో చెప్పకుండగనే వెళ్ళిపోవుచున్నది. ఆమె యిటుల వెళ్ళిపోవుటలో ఆవంతయు న్యాయములేదు. ఎంతటి కృతఘ్నత! ఎంతటి ద్రోహము! మఱి యొకప్పుడైనచో ఈ తలపులు నెలబాలకు బాధాకరముగ నుండెడివే! కాని యిప్పుడవి ఆమెకు బాధాకరముగలేవు. ఏలయన భవిష్యత్తంతయు నామెకు అంధకారమయముగ నున్నది.

తాతా మనమరాండ్రు నడచిపోవుచుండిరి. రాత్రి క్రమక్రమముగా గడచిపోవుచుండెను. చంద్రుడు క్రిందకుదిగిపోవుచుండెను. నక్షత్రములకాంతి అంతకంతకు తగ్గిపోవుచుండెను. తెల్లవారు సమయం సమీపించుచుండెను. మఱికొంతసేపటికి తూర్పు దిగ్భాగమున బాలభాను డుదయించి తన కాంతి పుంజములను వెదజల్లసాగెను. క్రమక్రమముగా సూర్యుడు పైకి రాసాగెను. సూర్యకిరణములు వెచ్చగా నుండెను.

తాతా మనమరాండ్రిరువురును ఒక కాలువ యొడ్డున పరుండిరి. నెలబాల ఇంకను తాతయ్య హస్తమును వదిలిపెట్టలేదు. తాతయ్య గుఱ్ఱుపెట్టి నిదురింపసాగెను. నెలబాల నిదురింపక అతనిని కనిపెట్టి చూడసాగెను. ఎట్టకేల కామెకుగూడ అలసట హెచ్చెను. ఆమె తాతయ్యహస్తమును వదలివైచెను. మరల పట్టుకొనెను; మరల వదలివైచెను; నిద్రాదేవత ఆమెను గూడ లోబఱచుకొనెను. ఇరువురును ప్రక్కప్రక్కనే నిదురింపసాగిరి.

నెలబాల కేవేవో కలలు రాసాగెను. మఱియు నామె కేవేవో ధ్వనులు వినబడసాగెను. అందువలన నామెకు హఠాత్తుగా మెలకువ వచ్చెను. అప్పుడు మొరటుగానున్న మనుజు

డొకడు వారినపురి మీదకు వంగి చూచుచుండెను. కాలువలో నొక పడవ యుండెను. ఆ పడవలో నిరువురు మనుజులు నిలబడి యుండిరి వారుగూడ తాతా మనయరాంద్రను పరిశీలనగా చూచు చుండిరి.

మొరటు మనిషి మోటుగా నిట్లనెను: "హల్లో! మీ రిక్కడ నెందుల కున్నారు? ఏమి చేయుచున్నారు?"

"అయ్యా! మేము నిదురించు చుంటిమి. మేము రాత్రి అంతయు నడచుచునే యుంటిమి" అని నెలబాల సమాధాన మిచ్చెను.

"మీ రిరువురును వింత ప్రయాణీకులవలె నున్నారే! మీ రిరువురును రాత్రియంతయు నడచుచునే యుండిరా? అది ఎట్లుజరిగినది? ఒకరు ముసలివారు. నీవేమో చాలాచిన్న దానవు. అది ఎట్లు జరిగినది? మీ రెక్కడకు పోవుచున్నారు?" అని మొరటు మనుజుడు అనెను.

మన బాటసారుల కొక గమ్యస్థానమనునది లేదు కదా! అందువలన నామెకు ఏమి చెప్పుటకును తోచకుండెను. ఆమె తడబడుచు పశ్చిమ దిక్కుకు చేయిపెట్టి చూపెను. అంతట మొరటు మనుజుడు ఒక పట్టణ నామమును పేర్కొని, "మీ రచ్చటకు పోవుచున్నారా?" అని ప్రశ్నించెను.

మఱికొన్ని ప్రశ్నలకు సమాధానము చెప్పవలసిన అవస రము తప్పిపోవునని నెలబాల, "అవును" అని సమాధాన మిచ్చెను.

"మీ రెక్కడనుండి వచ్చుచున్నారు?"

ఈ ప్రశ్నకు సమాధానము చెప్పుట చాల సులభము.

అందువలన నెలబాల ఉపాధ్యాయుని కలసికొన్న గ్రామ నామము చెప్పెను. ఇంక ప్రశ్నలు రావని ఆమె అభిప్రాయపడెను.

కాని మొరటు మనుజుడు ఇట్లనెను: "మిమ్ముల నెవ్వరైన దోచుకొని బాధ పెట్టినారని అభిప్రాయ పడినాను. ఇప్పుడు నా అభిప్రాయము తప్పని తెలిసినది. ఇంక సెలవు."

నెలబాల అతనికి నమస్కరించెను. మొరటు మనుజుడు పడవలో ప్రవేశించెను. పడవ ప్రయాణమై పోవుచుండెను. కొంచెముదూరం ముందుకు పోయిన తరువాత పడవ ఆగెను. పడవలోని మనుజులు నెలబాలను పిలువసాగిరి.

నెలబాల వారివద్దకు పరుగెత్తుకొని పోవుచు, "మీరు నన్ను పిలిచినారా?" అని అనసాగెను.

అపుడు పడవలోని మనుజు డొకడు ఇట్లనెను: "ఇష్టమైనచో మీరుకూడ మాతో రావచ్చును. మేముకూడ మీరు పోదల్చుకొన్న ప్రదేశమునకే పోవుచున్నాము."

ఆ మాటలను విన్న నెలబాల ఒక్క క్షణకాలము తటపటాయించెను. ఆమె యిట్లనుకొనెను: "మా తాతయ్య దొంగతనముచేసి తీసికొనివచ్చు ధనమును పంచుకోవలెయునని ఆ యిరువురు మోసగాండ్రను అనుకొనిరి. వారు మా తాతయ్య వద్దనుండి డబ్బు తీసికొనవలెయునను నుద్దేశ్యముతో మమ్ము వెంబడింప వచ్చును. ఇప్పుడు మేము ఈ పడవలో ప్రవేశించినచో మా ఆనవాళ్ళేవియు నుండవు. కనుక మమ్ముల నెవరును వెంబడింప జాలరు" అందువలన నామె, "మేము పడవ ప్రయాణము చేయుట కిష్టపడు చున్నాము" అని యనెను.

వెంటనే పడవగట్టు సమీపమునకు వచ్చెను. నెలబాల

తాతయ్యను లేపెను. అనతి కాలములో నిరువురును పడవలో ప్రవేశించిరి. పడవ బయలు దేఱిపోసాగెను. సూర్యకాంతి నీటిపై పడి తళతళ మెఱయు చుండెను. అచ్చటచ్చట గట్టున కిరువైపుల చెట్లుండెను. ఒక్కొక్కచోట కొండలు వచ్చుచుండెను. మఱియొకచోట పంట భూములుండెను. ఒక్కొక్కప్పుడు చిన్న చిన్న గ్రామములు కనబడు చుండెను. ఇంకొకప్పుడు దూరముగా నున్న పట్టణములలోని చర్చి గోపురములు కనబడు చుండెను. ఇండ్లపైకి వ్యాపించియున్న కర్మాగారముల పొగగొట్టములు కనబడు చుండెను, ఆ గొట్టములలోనుండి పొగచాల దట్టముగా వచ్చుచుండెను. మొత్తముమీద వారు పల్లపు ప్రాంతముల లోనే ప్రయాణము చేయుచుండిరను విషయము స్పష్టమగు చుండెను.

సాయంకాలమైన తరువాత నెలబాల నిరుత్సాహ పడు పరిస్థితి ఒకటి ఏర్పడెను. ఏలయన పడవ ఒక చిన్న పడవల రేవు వద్ద ఆగెను. అప్పుడు పడవలోని మనుజు డొకడు ఆమెతో నిట్లనెను: "మనము గమ్యస్థానమును తెల్లవారు వఱకు చేరుకోలేము. మీవద్ద నిప్పుడు ఆహార పదార్థములు లేనిచో ఇచ్చట కొను క్కొనుట మంచిది" నెలబాలవద్ద కొన్ని పెన్నీలు మాత్రమే యుండెను. క్రొత్త స్థలమునకు పోవుచున్నప్పుడు ఆ సొమ్మును చాల జాగ్రత్తగా ఖర్చుపెట్టుకో వలయును. లేకపోయినచో బాధలు పడవలసి వచ్చును. అందువలన నామె ఒక రొట్టెను మాత్రమే కొనెను. అరగంట గడచిన తరువాత పడవ మరల ప్రయాణము సాగించెను.

పడవవారు బీరు మున్నగు మత్తు పానీయములను కొని

పడవలోనికి తెచ్చియుండిరి. వారంతకుముందుకూడ స్వేచ్ఛగా ఆ పానీయములను సేవించి యుండిరి. పడవలో ప్రవేశించిన తరువాతగూడ సేవించిరి. అందువలన వారు తగవులాడుకొనసాగిరి. అందువలన తాతా మనమరాండ్రు పడలో వారున్న ప్రదేశమునకు దూరముగా కూర్చుండి యుండిరి. పడవవారి కేకలు వినబడు చుండగా ఆమె హృదయము తటతట మని కొట్టుకొనుచుండెను. "ఇప్పుడీ పడవలోనుండి దిగిపోయిన బాగుండును. రాత్రియంతయు నడక సాగించినను సరే" అని ఆమె అనుకొనసాగెను.

పడవవారు వట్టి మొరటువారు. వారికి నోటిక్రొవ్వు ఎక్కువ. వట్టి పశుప్రాయులు. కాని వారు తాతా మనమరాండ్రపట్ల మర్యాదగనే ప్రవర్తింపసాగిరి. ఒకసారి యిద్దఱు పడవవారు గట్టిగా కొట్టుకొనిరి. తనకెట్టి అపాయము సంభవించునోయని నెలబాల భయపడసాగెను. కాని ఆమె కెట్టి అపాయము కలుగకుండగనే తగవు అణగారిపోయెను.

బాగుగా చీకటిపడెను. చలిబాధ హెచ్చుగానుండెను. కాని నెలబాల చలిబాధను లెక్కచేయుటలేదు. "ఇకముందు మే మిరుపురము జీవించుట ఎట్లు?" అని మాత్రమే ఆమె బాధపడుచుండెను. ఆ విషయమునుగూర్చి ఆమె తీవ్రముగా ఆలోచింప సాగెను. తాతయ్య ఆమె ప్రక్కనే పరుండి నిదురించుచుండెను. అతడా రాత్రి చేయవలసిన దొంగతనము తప్పిపోయినది. అది ఆమెకు సంతోషమును కలిగించుచుండెను. కాని ఆమె మనస్సులో రకరకముల భావము లుత్పన్నమగుచుండెను.

అంతలో పడవవాడొకడు నెలబాల నుద్దేశించి యిట్లు

నేను: "ఓ బాలా! నీ గొంతు కడు మధురమైనది; నీకన్నులు చూడ ముచ్చటగా నున్నవి. నీకు మంచి జ్ఞాపకశక్తి కూడకలదు. నీ మాటలనుబట్టి నీ గొంతు తెలియుచున్నది. నీ కన్నులు ప్రత్యక్షముగ కనబడుచున్నవి. నీకు మంచి జ్ఞాపకశక్తి ఉండి యుండునని నేను ఊహించుచున్నాను. నేను ఎప్పుడును తప్పుగా ఊహింపను. నాకు పాటలు వినవలయునని యున్నది. కావున వెంటనే ఒకపాట పాడుము."

"అయ్యా! నాకు పాటలురావు" అని నెలబాల సమాధాన మిచ్చెను.

"నీకు నలువదియేడు పాటలువచ్చును. నీకు వచ్చిన పాటలసంఖ్య నలువదియేడు అను విషయము నాకు బాగుగా తెలియును. అందొక్కపాట పాడుము. ఉత్తమోత్తమ మైన దానిని పాడుము. వెంటనే ఒక పాట పాడుము."

పాట పాడనిచో పడవవా డేమిచేయునో తెలియదు. అందువలన నెలబాల భయపడి సుఖజీవితము గడపుచున్నప్పుడు నేర్చుకొన్న చిన్న పాట నొకదానిని చక్కగా పాడెను. అది పడవవాని చెవులు కెంతయు ఇంపుగా నుండెను. అందువలన నతడు, మఱియొక పాట పాడుము" అని బ్రతిమాలుకొనసాగెను.

నెలబాల మఱియొకపాట పాడెను. ఆపాటకు ప్రశంసాపూర్వకముగ పడవవాడు పొట్ట చెక్కలగునట్లు గట్టిగా నవ్వసాగెను. ఆ నవ్వుకు నివురించుచున్న పడవవాడు ఒకదు మేల్కొని విషయము తెలిసికొనెను. "పాటలు వినుటయన్న నా కెంతయు ఆనందము. పాటలున్నచో నాకింకేమియు అక్కఱ లేదు. నిద్రాహారములైనను మానివేయుదును. అందువలన

నాకొక పాట వినవలయునని యున్నది" అని రెండవవాడు అనెను.

నెలబాల ఈసారికూడ పాడక తప్పలేదు. ఆమె మూడవ పాట పాడెను. పడవవాండ్రు మువ్వురును ఆ పాట నెంతయు ప్రశంసింపసాగిరి. కాని పాటలు అంతటితో ఆగిపోలేదు; ఆమె యింకను పాడవలసి వచ్చుచుండెను. ఆమె పాడిన పాటలనే మరల మరల పాడుచుండెను. పడవవారు ఆమె నెంతయు ప్రశంసించుచుండిరి. నెలబాల బాగుగ అలసిపోవుచున్నప్పటికిని వారిని సంతోషపెట్టుచునే యుండెను. పడవవాండ్రు ప్రశంసాపూర్వకముగ గర్జించుచునే యుండిరి. ఆవిధముగ రాత్రి యంతయు గడచిపోయెను.

తెల్లవారెను. తూర్పుదిక్కున బాలభానుడు కనబడుచుండెను. కాని అంతలో వాన బయలుదేరెను. నెలబాల వానలో నుండలేకపోయెను. అందువలన పడవవాండ్రు తాతామనుమరాండ్రను—ఆమె పాటలుపాడి సంతోషపెట్టినందుకు కృతజ్ఞతాసూచకముగ—తెరచాప గుడ్డలతోను, టార్పాలిన్‌తోను కప్పిరి. కాలము గడచుచున్నకొలది వర్షము హెచ్చుచుండెను. మధ్యాహ్నమగుసరికి కుంభవృష్టి బయలుదేరెను. వర్ష మంతలో తగ్గదన్నట్లుండెను.

వారు చేరుకోవలసిన పట్టణము క్రమక్రమముగా సమీపించుచుండెను అందుకు కొన్నిసూచనలు కనబడసాగెను. కాలువలోని నీరు మడ్డిగాను, మురికిగాను నుండెను. కాలువలో మరికొన్నిపడవలు ప్రయాణము చేయుచుండెను. బొగ్గుమసితోనిండిన దాపులు, చిన్న చిన్న గుడిసెలు కనబడుచుండెను. పొగగొట్టములు గూడ చాల స్పష్టముగ కనబడుచుండెను. ఎట్టకేలకు

పట్టణము వచ్చెను.

పడవ పడవల రేవులో ఆగిపోయెను. పడవ ఆ రేవుకు సంబంధించినది. అందువలన పడవవారు తాతా మనమరాండ్ర సంగతి చూడకుండ తమ తమ పనులలో మునిగిపోయిరి. తాతా మనుమరాండ్రు పడవలోనుండి దిగిరి. వారు పడవవాండ్రకు తమ కృతజ్ఞతను తెలియజేయదలచి; మఱియు పట్టణములో నెచ్చటకు పోవలయునో తెలిసికొనదలచిరి. కాని పడవవారు వారివంక చూడకుండిరి.

తాతా మనమరాండ్రు చేయునది ఏమియు లేక ఒక మఱికి సందుగుండాపోయి జనులతో బాగుగా క్రిక్కిరిసియున్న ఒక పెద్ద వీధిలో ప్రవేశించిరి. అచ్చట నంతయు సందడే. వర్షమింకను ధారాపాతముగ కురియుచుండెను. అయినను జనులు తిరుగుచునేయుండిరి.

కొందఱు జనులు ఒకవైపునుండి రెండవవైపుకు పోవుచుండిరి. మఱికొందఱు జనులు రెండవవైపునుండి మొదటి వైపుకు పోవుచుండిరి. వారేదో కొంప అంటుకొన్నట్లు హడావుడిగా పోవుచుండిరి. తాతా మనమరాండ్ర కదియేమియు అర్థముకాలేదు. వారు గ్రుడ్లు అప్పజెప్పి చూడసాగిరి. వారి పరిస్థితి సముద్రమధ్యమున వంటరిగా తేలియాడుచున్న నావికునివలె నుండెను.

వారు వానబాధను సహింపలేక ఒక యింటి చూరు క్రిందకుపోయి నిలబడిరి. వీధిలో పోవుచున్నవారి మొగముల వంక చూడసాగిరి. ఒక్కరి మొగములోనైన ఆశాజనక కిరణములు కనబడునేమోయని వారు ఆతురపడుచుండిరి. కాని

ఎవ్వరుగాని వారున్నచోట ఆగి వారిని పలుకరింపలేదు. వారి సంగతి సందర్భములను తెలిసికొనలేదు. వారినిచూచి కొందఱు చీదరించుకొనిరి. కొందఱు మందహాసముచేసిరి. కొంతేమేమో గొణుగుకొనిరి. కొందఱేమో సంజ్ఞలు చేసిరి. మఱికొందఱు కుటిలముగా చూచిరి. కొందఱు తొందఱ తొందఱగా చూచుచు పోసాగిరి. కొందఱు మొద్దుచూపులు పఱపసాగిరి. కొందఱి మొగములలో లాభము కనబడుచుండెను. మఱి కొందఱి మొగములలో నష్టము కనబడుచుండెను.

ఆ దృశ్యము తాతా మనమరాండ్రకు ఆశ్చర్యకరముగ నుండెను. నెలబాల పరిస్థితిని మఱచిపోయి వారి పరిస్థితినిగూర్చి ఆలోచింపసాగెను. కాని ఎంతకాలమని ఆమె తన దుస్థితిని మఱచిపోగలదు? చలి, తడి, ఆకలి, అలసట, ఆశ్రయము లేమి మున్నగు వానిని ఆమె ఎంతకాలమని మఱచిపోగలదు? అనతి కాలములో నామె వానినిగూర్చి ఆలోచింపసాగెను. ఆలోచించి చేయునదిఏమి? వారిని పలుకరించువారు ఎవ్వరును లేకుండిరి. వారు తమ దుస్థితిని చెప్పుకొనుటకు ఎవ్వరునూ లేకుండిరి. మఱికొంతసేపు గడచిన తరువాత వారు చూరుక్రిందనుండి బయటకువచ్చి జనసమూహములో కలసిపోయిరి.

సాయంకాల మయ్యెను. తాతా మనమరాండ్రిరువురును గమ్యస్థాన మనునదిలేక అటునిటు తిరుగుచునే యుండిరి. వీధులలో జనులు పలుచగా నుండిరి. వారు తమతమ పనులు చూచుకొనుచుండిరేగాని తాతా మనమరాండ్రను పలుకరింపకుండిరి. వీధులలోను, అంగళ్ళలోను దీపములు వెలుగసాగెను. అది వారికి మఱింత బాధాకరముగ నుండెను; రాత్రి, చీకటి తొంద

ఊగా వచ్చుచున్నట్లుండెను. నెలబాల గజగజ వణకిపోవు చుండెను; ఆమె మానసికముగను, శారీరకముగను బాధపడు చుండెను.

వారా పట్టణమునకు ఎందుకు వచ్చినట్లు? ప్రశాంతమగు ప్రదేశములలో ఆకలిబాధతో నుండవచ్చునుగాని చెవులు చిల్లులుపడునట్టి ధ్వనులతో గూడిన ఆ పట్టణములో నుండుట సామాన్యమైన పనికాదు. అచ్చటి వారందరును దుస్థితిలోనే ఉన్నారు శాబోలు. వారిమధ్య జీవించుట చాల కష్టము.

నెలబాల తమ పరిస్థితికెంతయు విచారింపసాగెను. గోరు చుట్టుపై రోకటిపోటన్నట్లు తాతయ్య ఆమెను నిందింపసాగెను. అతడిట్లనసాగెను: "మన మీబాధలు పడుటకేనా ఇచ్చటకు వచ్చినది? నీవు నన్నిక్కడ ఎందులకు తీసికొనివచ్చినటు? జార్జి సతివద్ద మనకు చక్కగా జరుగుచుండెనిదిగదా? మన మా ప్రదేశమును ఎందులకు విడచివచ్చినట్లు? ఇది యంతయు నీ మూలముననే జరిగినది. మనము వెంటనే జార్జిసతివద్దకు తిరిగి పోదము."

తాతా మనమరాండ్రవద్ద ఒక్క రాగినాణెమైనను లేదు. వారికి సహాయ్యముచేయు వారెవ్వరును లేరు. అందువలన వారు మరల తిరిగి తిరిగి పడవలరేవుకు వచ్చిరి. తాము ప్రయాణమై వచ్చిన పడవ కనబడునేమోయని వారు ఆశపడుచుండిరి. నాటి రాత్రి శా పడవలో నిదురింపవచ్చునని వారు తలచుచుండిరి. కాని అచ్చటకూడ వారు ఆశాభంగము చెందిరి. వారచ్చటకు పోవునప్పటికి పడవలరేవు గేటు మూసివేయబడియుండెను. అచ్చటనున్న కొన్ని భయంకరమైన కుక్కలు గట్టిగా మొఱుగ

సాగెను. అందువలన తాతా మనమరాండ్రు నిరాశతోను, నిస్పృహతోను తిరిగిపోవలసి వచ్చెను.

నెలబాల హీనస్వరమున తాతయ్యతో నిట్లనెను : "తాతయ్యా! నేటిరాత్రి మనము విశాలాకాశముక్రింద పరుండ వలసినదే. రేపు మనము ప్రశాంతమగు స్థలమునకు బయలుదేరి పోదము. అచ్చట మనమేదేని పనిచేసి కొనుచు సుఖముగా జీవింతము."

కాని ముసలివాడు భీకరముగ నిట్లనెను: "నీవునన్నిచ్చట కెందులకు తీసికొనివచ్చినట్లు? నన్నీవిధముగ బాధపెట్టుటకేనా ఇచ్చటకు తీసుకొనివచ్చినది? నేనీ నవ్వడిని భరింపలేను. మనము ప్రశాంత ప్రదేశమునుండి ఇచ్చటకు వచ్చియున్నాము. నీవు నన్ను నిర్బంధించి బలవంతముగా ఇచ్చట కెందులకు తీసికొని వచ్చినావు?"

అంతట నెలబాల దృఢముగా నిట్లనెను: "నాకొక పీడకల వచ్చినదని చెప్పియుంటినిగదా! అట్టికలలింక రాకుండనుండుటకే నిన్నిచ్చటకు తీసికొనివచ్చియున్నాను. మనము బీదజనులమధ్య నివసింపవలయును. లేనిచో ఆ కల మరలవచ్చును. తాతయ్యా! ప్రియమైన తాతయ్యా! నీవు ముసలివాడవు; బలహీనముగ నున్నావు. ఆ విషయము నాకు బాగుగ తెలియును. కాని నా వంక చూడుము. నేను నిజముగా ఎంతో బాధపడుచున్నాను. కాని నీవు ఫిర్యాదు చేయకుండనున్నచో, నేనుగూడ ఫిర్యాదు చేయను."

అంతట ముసలివాడు నెలబాలను పరీక్షగా చూచుచు నిట్లనెను: "అయ్యో! నాముద్దుల మనమరాలా! నీకు యిల్లు,

వాకిలి, డబ్బులేకుండచేసినాను. దేశదేశములు తిరుగవలసిన గతి కల్పించినాను. నేను నిన్ను అందలముమీద కూర్చుండబెట్ట దలచినాను! నిన్ని దుస్థితికి తీసుకొనివచ్చితిని. ఒకప్పుడు నేను సుఖముగా జీవించుచుంటిని. సౌఖ్యమును, ధనమును పోగొట్టు కొన్నది నిన్ని దుస్థితికి తీసుకొని వచ్చుటకేనా!"

అపుడు నెలబాల తెచ్చిపెట్టుకొన్న మందహాసముతో నిట్లనెను: "తాతయ్యా! నీవా విషయమును గుఱించి విచారింప వలదు. రేపటికి మనమొక మంచి ప్రదేశమునకుపోయి అచ్చట సుఖముగా జీవింతము. ఇప్పటికి మనమిచ్చటకు వచ్చుటయే మంచిదియైనది. ఏలయన ఈ జన సమూహములో మనలనెవ్వ రును గుర్తింపలేరు. మనజోలి ఎవ్వరికిని అక్కఱలేదు. మనల నెఱిగియుండిన మోసగాండ్రెవ్వరును ఇచ్చటకురారు. ఇదిగో ఇచ్చటనొక సందున్నది. ఇచ్చట చాల చీకటిగానున్నది; కాని తడిమాత్రములేదు. మనమిచ్చట తలదాచుకొందము."

నెలబాల ఆ సందులోనికి వెళ్ళబోయి భయముతో కేక వేసి ఆగిపోయెను. ఏలయన ఆ సందులోనుండి మసిబొగ్గువలె నల్లగానున్న మనుజుడొకడు వచ్చుచుండెను.

"మరల మాట్లాడుము. నీగొంతు నే నెఱిగియున్న దేగా?" అని అతడనెను.

"కాదు, కాదు. మేమీ పట్టణమునకు క్రొత్తవారము. మంచిచోట విశ్రాంతి తీసికొనుటకు మావద్ద డబ్బులేదు. అందు చేత నిచ్చట విశ్రాంతి తీసుకోదలచుకొన్నాము" అని నెలబాల అనెను. అంతట నా మనుజుడు వారి నచ్చటనున్న ఒక చిన్న ఇంటిలోనికి తీసికొనిపోయెను. ఆ యిల్లు కడు నికృష్ట స్థితిలో

నుండెను. అందొక చిన్నదీపము వెలుగుచుండెను. అచ్చటి పరిస్థితులా యింటివారు వట్టి బీదవారను విషయమును విస్పష్టముగా తెలియజేయుచుండెను. గుడ్డిదీపపు వెలుగులో ఆ మనుజుని రూపురేఖలు నెలబాలకొక మాదిరిగా కనబడుచుండెను.

"మీాకీ సందులో విశ్రాంతి తీసికోవలయునను అభిప్రాయమెట్లు జనించినది? విశ్రాంతి తీసికొనుటకు అనువైన స్థలమును మీారీ సమయమునవా వెదకుచున్నారు?"

"మా దురదృష్టమే ఇందుకు కారణము" అని ముసలివాడు జవాబీయగా ఆ మనుజుడు నెలబాల వంకకు జూచుచు ముసలివానితో నిట్లనెను: "నీకు విషయము లేమియు అర్థము కావా? ఆమె ఎట్లు తడిసి నానిపోయియున్నదో చూడుము! తడి ప్రదేశములలో విశ్రమింపగోరుట ఆమెకు హానికరమను విషయము నీకు తెలియదా?"

"ఆ విషయము నాకు బాగుగా తెలియును. కాని నేను ఏమిచేయగలను? భగవంతుడు మమ్ము రక్షించునుగాక!" అని ముసలివాడనగా ఇంటి యజమానుడు నెలబాల దుస్తులను మెల్లగ పట్టుకొనిచూచెను. ఆమె దుస్తులనుండి ఇంకను నీరు కారుచుండెను.

యజమానుని సలహామీాద నెలబాల తడిదుస్తులను విప్పి మూటలోని దుస్తులను ధరించెను. అవికూడ కొంచెం తడిగానే యుండెను. ఆ యింటిలోనున్న మఱియొక గదిలో కుంపటి చక్కగా వెలుగుచుండెను. తాతా మనమరాండ్రు ఆ రాత్రికా గదిలో నిదురించిరి.

తెల్లవారకముందే యజమానుడు మేల్కొనియున్న

నెలబాలవద్దకువచ్చెను. వారిరువురును ఏవేవో విషయములను గుఱించి మాట్లాడుకొన సాగిరి. యజమానుడు తన చిన్ననాటి జీవితమును గూర్చి చెప్పుచు తండ్రి ప్రసక్తి తెచ్చెను. అతని తల్లి ప్రసక్తి ఎంతకు రాకుండెను.

అందువలన నెలబాల, "అప్పుడు నీతల్లి జీవించియుండ లేదా?" అని ప్రశ్నించెను.

"ఆమె చనిపోయినది. ఈ ప్రాంతములోని స్త్రీలు చాల కష్టపడి పనిచేయుదురు. ఆమె శక్తికిమించి పనిచేసి మరణించిన దని ఇతరులు చెప్పగా విన్నాను. ఆమాట నిజమనియే నమ్ము చున్నాను."

"నీ విచ్చటనే పెరిగి పెద్దవాడవైనావా?"

"అవును. నా తండ్రికూడ ఇచ్చటనే చనిపోయినాడు."

బాగుగా తెల్లవారిన తరువాత యజమానుడు, తాతా మనమరాండ్రు కలసి కొన్ని ఆహారపదార్థములు తినిరి.

"ఇప్పుడు మీరింక వెళ్ళిపోవుదురా?" అని యజమా నుడు ప్రశ్నించెను.

"మేము ఈ ప్రాంతపు పట్టణములను, పల్లెలను వదలి ప్రశాంతముగనుండు దూరప్రదేశములకు పోదలచుకొన్నాము. కనుక మేము ఏబాట ననుసరించిపోవుట మంచిది?" అని నెలబాల అనెను.

"నాకు అంతగా తెలియదు. నేనీ పట్టణముదాటి ఎన్న డును బయటకుపోయి యుండలేదు. నా జీవితమంతయు ఇచ్చ టనే గడచిపోవుచున్నది. దూరాన ప్రశాంత భూములు కలవు."

"చాల దూరమున నున్నవా?"

"అవును చాలదూరముననేయున్నవి. అట్టి భూములిచ్చటకు దగ్గఱగా నెట్లుండును? ఉన్నచో నవి పచ్చగా నుండవు గదా! చాలదూరమువఱకు ఈ ప్రాంతమంతయు మసితో నిండి నల్లగా కనబడుచుండును. రాత్రి సమయములందు ప్రయాణము చేసినచో మీకు అపరిమితమగు భయము కలుగును."

"మేము తప్పక పోవలయును" అని నెలబాల ధైర్యముగ ననెను.

"ఇచ్చటి జనులందఱు మోటువారు. ఇచ్చటి బాటలు నీవంటి చిన్నారి పాదము లుపయోగించుటకు తగినవి కావు మీ నిర్ణయమును మార్చుకొని వెనుకకు తిరిగి పోరాదా?"

"మేము వెనుకకు తిరిగిపోవుటకు వీలులేదు. దయయుంచి నీకు తెలిసినచో మాకు సరియైన మార్గమును చూపుము. మేము ఎటువంటి అపాయములో చిక్కుకొనియున్నామో నీకు తెలియదు. మేము ఆ అపాయమునుండి తప్పించుకొని పాఱి పోవుట న్యాయసమ్మతమను విషయము నీకు తెలియదు. తెలిసినచో నీవు మా నిర్ణయమును మార్చుటకు ప్రయత్నింపవు."

"నాకా సంగతులేవియు తెలియవు. భగవంతుడు మిమ్ములను రక్షించునుగాక!

అట్లని అతడు తాతా మనుమరాండ్రు పోవలసిన దారిని గూర్చి కొన్ని సూచనలు చేసెను.

తాతా మనుమరాండ్రు అతనికి కృతజ్ఞత తెలిపి పయనమై పోసాగిరి. వారు సంధ్యచివరకు పోవునప్పటికి యజమానుడు

వెనుకనే పసుగెత్తుకొని వచ్చెను. అతడు నెలబాల చేతిలో ప్రాత పెన్నిన కౌముల నుంచెను. అవి పొగచూరి చాల నల్లగా నుండెను. పిమ్మట నతడు వెనుకకుతిరిగిపోయెను. తాతా మనమరాండ్రు ముందుకు సాగిపోవుచుండిరి.

11

పచ్చని చేలతో నిండియున్న ప్రశాంతభూములను చేరుకొనవలయునని తాతా మనమరాండ్రు ఎంతయు ఆతురత పడుచుండిరి. "మే మింకను రెండురోజులు పూర్తిగా ప్రయాణము చేయవలసియున్నది. అంతవఱకు మేముజీవించియుండవలయును. ఆ ప్రదేశమును చేరుకొన్నతరువాత అచ్చట మరణించినను నష్టమేమియులేదు. భగవంతుడు మాకట్టి సదవకాశమును కల్పింపవలయునని మనసార ప్రార్థించుచున్నాను." అని నెలబాల అనుకొనుచుండెను.

ఆమె ముసలివానితో నిట్లనెను: "తాతయ్యా! నేడుమన ప్రయాణము అంతవేగముగా సాగదు. ఏలయన నాపాదములు పుండ్లు పడినవి. నిన్న వానలో తడియుటవలన నా శరీరమంతయు నొప్పిగానున్నది. పాప మా వయోవృద్ధుడు ఆ విషయమును రాత్రి చెప్పినాడు."

"బాట అంత బాగుండదని అతడు చెప్పినాడు. ప్రయాణమున కనుకూలమగు బాట మఱియొకటిలేదా? నన్ను మఱి

యొక మంచిదారిని తీసికొనిపోలేవా?" అని ముసలివా డనెను

"అందులకు మనము విచారింపవలసిన పనిలేదు. మన మెట్టకేలకు ప్రశాంతభూములను చేరుకొనగలము. అచ్చట సుఖముగ జీవింపవచ్చును. అందులకు మనమిప్పుడు కష్టపడకతప్పదు. ముందు ముందు బాట ఇంతకంటెఅధ్వానముగానున్నను మనము వెనుకకు తిరిగి రారాదు. వెనుకకు తిరిగి వత్తుమా?" అని నెల బాల అనెను.

"తిరిగిరాము. తిరిగిరాము. మనముముందుకేసాగిపోదము. నేనుసిద్ధముగనున్నాను. నెలబాలా! నేను సంపూర్ణముగసిద్ధముగ నున్నాను." అని ముసలివాడు అనెను.

నెలబాల ఎంతో కష్టముమీద నడచుచుండెను. అందుకు కారణ మామె కీళ్ళనొప్పులతో అపరిమితముగ బాధపడు చుండుటయే. శ్రమించుచున్నకొలది ఆబాధ హెచ్చుచుండెను. కాని ఆమె ఆ విషయమునుగూర్చి ఎట్టి ఫిర్యాదు చేయలేదు. కనీసము బాధపడుచున్నట్లయిన కనబడుటలేదు.

వారు ముందుకు సాగిపోవుచుండిరి. వారికెచ్చటను పచ్చని గడ్డిపరక ఒకటియైనను కనబడకుండెను. చెట్లు చేమ లంతకు ముందేలేవు. ఎచ్చట చూచినను నల్లని మసి ప్రత్యక్ష మగు చుండెను. ఎచ్చటచూచినను పొగగొట్టములు ప్రత్యక్షమగు చుండెను. ఆ దృశ్యములు వారి కెంతయు నిరుత్సాహమును కలుగజేయుచుండెను. గాలికూడ మసితోను, పొగతోను నిండి యుండుటవలన ఎంతయు భారముగనుండెను. దానిని పీల్చుట వారి కెంతయు కష్టముగనుండెను. అయినను వా రేమాత్రము లెక్కచేయక ముందుకు సాగిపోవుచుండిరి. వారు పగలంతయు

ప్రయాణము చేయుచునే యుండిరి.

చీకటి పడినతరువాత వారొకచోటఆగిరి. విశాలాకాశము క్రింద పరుండిరి. నెలబాల కిప్పుడింక భయమేమియులేదు. ఏల యన ఆమె ఆ స్థితిని దాటిపోయినది. "నే నెట్లున్న నేమి? ఏమై పోయిననేమి?" అని ఆమె అనుకోసాగినది. తన తాతయ్యను మాత్రము సురక్షితముగ చూడవలయునని భగవంతుని ప్రార్థింప సాగినది. ఆమె కడు బలహీనముగనున్నది; బాగుగ అలసిపోయి నది. ఆమె తన అవసరములనుగూర్చి ఏమాత్రము ఆలోచించుట లేదు. "ఓ భగవానుడా! మా తాతయ్యను సురక్షితముగ చూచు స్నేహితు డొకడు లభించునట్లు చేయుము" అని మాత్రము ప్రార్థింపసాగినది. అప్పు డామెకు రెండు పెన్నీల నిచ్చిన మిత్రుడు జ్ఞప్తికి వచ్చెను. ఆమె యతని పేరేమో అడుగ మఱచిపోయినది. ఆమె కృతాజ్ఞతా సూచకముగ అత డున్న పట్టణము దిక్కు కొక్కసారి చూచినది.

తాతా మనమరాండ్రాదినమున నొకచిన్న రొట్టెనుమాత్రము తినిరి. అది వారి ఆకలిని తీర్పలేనిమాట నిజమే. కాని నెలబాల ఆకలిమాటను పూర్తిగా మఱచిపోయినది. ఆమె మందహాసము చేయుచు నేలపై బరుండి నిదురింప సాగినది. అది పూర్తిగా నిదురయని చెప్పలేము. అట్టి నిదురలోనే ఆమెకు కలలు రాసాగి నవి. ఆ కలలో నామెకు ఉపాధ్యాయుని ప్రియశిష్యుడు కనబడ సాగినాడు.

తెల్లవాఱెను. నెలబాల ఇంకను ఎక్కువ నీరసముగా నుండెను. ఆమెకు వినుశక్తి, చూచుశక్తిగూడ కొంచెము తగ్గి నట్లుండెను. కాని ఆమె ఆ విషయమునుగుఱించి ఎట్టి ఫిర్యాదు

చేయలేను. "మే మీ ప్రదేశమునుండి బయటపడుదు మనుట కల్ల. అది జరుగని పని. నా శరీరములో ఏవిధమగు శక్తిలేను. నేను మరణించుట తథ్యము" అని ఆమె అనుకొనసాగినది. కాని ఆమె ఏమాత్రము భయపడుటలేదు; ఏమాత్రము ఆందోళన చెందుటలేదు.

ఆనాడామె దగ్గఱనున్న ఒక్క-పెన్నీతో ఒక చిన్నరొట్టె కొనెను. కాని ఆమె అందులో భాగము తీసికొనలేదు. ఆమె ఆకలి యన్నమాటను మఱచిపోయినది. తాతయ్య ఆరొట్టెను తీసికొని, కొన్ని సంవత్సరములనుండి భోజనము లేనివానివలె, తినివైచెను. ఆ దృశ్యమును చూచి నెలబాల ఎంతయు సంత సించెను.

తాతా మనమరాండ్రు ఎప్పటివలె ప్రయాణము చేయు చునేయుండిరి. కడచినదినమున కనబడిన నిరుత్సాహకరమగు దృశ్యములే వారికి ఆనాడు కనబడుచుండెను. ఎప్పటివలె గాలి బరువుగానుండెను; దానిని పీల్చుట కష్టముగానుండెను. దారి గతుకులుగతుకులుగా నుండెను. నెలబాల మాటిమాటికి క్రింద పడిపోవునట్లుండెను. పాపము! నెలబాల కష్టము వర్ణనాతీతముగ నుండెను. కాని ఆమె పొరపాటునగూడ బాధను పైకి వెలిపుచ్చ కుండెను. ఆమె సహనము నేమని వర్ణింపవచ్చును!

సాయంకాల మగుసరికి ముసలివాడు తీవ్రమగు ఆకలితో బాధపడసాగెను. అతడా బాధను భరింపలేక, "ఆకలి! ఆకలి! ఆహారము! ఆహారము!" అని అఱవసాగెను. రొట్టె కొనుటకు నెలబాలవద్ద ఒక్క- రాగి నాణెమైనను లేదు. ఆమె దారి ప్రక్క-నేయున్న ఒక గుడిసెను సమీపించి మెల్లన తలుపు

తట్టెను.

ఒక మనుజుడు తలుపు తెఱచి, "నీ కిచ్చట నేమి కావలయును?" అని ప్రశ్నించెను.

"అయ్యా! ధర్మము! ఒక చిన్న రొట్టెముక్క కావలయును."

అంతట నామనుజుడు నేలమీద మూటవలెనున్న దానిని చూపి ఇట్లనెను: "దానిని చూచితివా? అదియొక చచ్చిన బిడ్డ. మూడు నెలలక్రిందట ఐదువందల మందికి ఉద్యోగములు పోయినవి. అందులో నే నొకడను. ఆకలి బాధకు తాళలేక ఇంతకు ముందు ఇద్దఱు పిల్లలు మరణించినారు. ఇప్పుడీపిల్ల మరణము! ఇంక నాకు పిల్లలు లేరు. నేను ధర్మముచేయు స్థితిలో నున్నానని భావించుచున్నావా? ఇతరులకు రొట్టెముక్కనిచ్చు స్థితిలో నున్నానని తలచు చున్నావా?"

ఆమాటలను విన్న వెంటనే నెలబాల గిఱ్ఱున వెనుకకు తిరిగెను. ఇంటితలుపులు ఎప్పటివలె మూసికొని పోయెను. తాతయ్య ఆకలిబాధ నే విధముగనైన తీర్చవలయునను నుద్దేశ్యముతో ఆమె ప్రక్కనేయున్న మఱియొక గుడిసె తలుపులు తట్టెను. ఆమె చేతి తాకిడికి తలుపులు తెఱచుకొనెను. అంతట నామె లోపలకు వెళ్ళెను. ఆ గుడిసెలోపల రెండు కుటుంబములవారు నివసించుచుండిరి. ఇద్దఱు స్త్రీలు లోపల తమతమ పిల్లలతో రెండువైపుల కూర్చుండి యుండిరి. మధ్య శరీరమంతయు మసితో నల్లగానున్న మనుజు డొకడు నిలబడి యుండెను. అతడప్పుడే ఆ గుడిసెలో ప్రవేశించినట్లుండెను. అతడొక బాలుని చేతితో పట్టుకొని యుండెను.

అతడు ఒక స్త్రీతో నిట్లనుచుండెను: "అమ్మాయి! ఇదుగో నీ చెవిటి, మూగ కొడుకు. ఇతనిని నీకు అప్పగించి నందుకు నీవు నాకు కృతజ్ఞత తెలియజేయవలయును. ఇతడేదో దొంగతనము చేసినాడు. ఆ ఆరోపణతో కొందఱితనిని నావద్దకు తీసికొని వచ్చినారు మఱియొక బాలుడైనచో నేను కఠినముగ శిక్షించి యుండెడివాడను. అందుకు సందేహమేమియు లేదు. ఇతడు కొన్ని శారీరక లోపములు కలవాడగుట వలన దయ చూపినారు. ఆ లోపములవలన నితడు మంచి చెడ్డల విచక్షణా జ్ఞానమును కలిగియుండలేదు. అందువలన నే నితనిని విడిచిపుచ్చి నీవద్దకు తీసుకొని వచ్చినాను. ఇకముందు నీ వితనినిగూర్చి సరియైన జాగ్రత్త తీసికోవలయునని హెచ్చరించుచున్నాను."

అంతట అచ్చటనే యున్న మఱియొక స్త్రీ అతనితో నిట్లనెను: అయ్యా! మఱి నా కుమారుని నాకు తిరిగి తెచ్చి యీయరా? ఇదే నేరము చేసినందుల కతనిని కఠినముగ శిక్షించి యున్నారుగదా! మఱి నా కతనిని తిరిగి తెచ్చి యీయరా?"

అంతట నతడు కఠినముగ నిట్లనెను: "అతడు చెవిటివాడా? మూగవాడా?"

"అయ్యా! అతడట్టివాడు కాడా?"

"అతడట్టివాడు కాడను విషయము నీకు తెలియును."

"కాదు, అతడు మూగవాడు; చెవిటివాడు; గ్రుడ్డివాడు. చిన్నప్పటినుండియు మంచి చెడ్డ లననేమో అతడు ఎఱుగడు. ఆమె కుమారునకు మంచి చెడ్డల విచక్షణా జ్ఞానము లేదనికదా! నా కుమారునకు మాత్రమా జ్ఞాన మెక్కడిది? అతడా జ్ఞానము

నెచ్చట నేర్చుకొన్నాడు? నేర్చు కొనుటకుగల అవకాశములేవి? ఎవ్వరివద్ద నేర్చుకొనవలయును? ఎక్కడ నేర్చుకోవలయును?"

"అమ్మాయి! శాంతింపుము! శాంతింపుము! నీ కుమారునకు అన్ని ఇంద్రియముల జ్ఞానము కలదు. అతని అన్ని ఇంద్రియములు చక్కగా పనిచేయు చుండెడివి."

"అవును. నిజమే. అతని కన్ని ఇంద్రియములును గలవు. అందువలననే అతడు సరియైన దారిని విడచి తప్పు త్రోవ త్రొక్కుటకు తగిన అవకాశము లభించినది. ఈ బాలునకు మంచి చెడ్డల విచక్షణా జ్ఞానము లేనందువలన రక్షించితి నంటివికదా! మఱి నా కుమారునకుగూడ ఆ జ్ఞానము నెవ్వరును నేర్పి యుండలేదే! మఱి నీ వతనిని ఎందుకు రక్షించి యుండ లేదు? ఆ బాలునకు భగవంతుడు లోటు చేసినాడు. నా బాలునకు మీరు లోటు చేసినారు. కావున ఇరువురను సమానముగనే శిక్షింపవలయును. నీ ముందు కెందఱో బాలబాలికలు, స్త్రీలు, పురుషులు వచ్చుచుందురు. వారిలో నెందఱో మానసికముగ చెవిటివారు, మూగవారు. అట్టిస్థితిలో వారు తప్పులు చేయు చుందురు. అందులకని నీవు ఎట్టి సానుభూతి లేకుండ వారిని శిక్షించు చుందువు. కావున న్యాయముగ ప్రవర్తింపుము. నా కుమారుని నాకు తిరిగి తెచ్చి యిమ్ము."

"నీవు నిరాశచేత అన్నిటికి తెగించిన దానవు. అందుకునే నెంతయు విచారించుచున్నాను."

"అవును! నే నట్టి దాననే! అందుకు బాధ్యు లెవరు? నీవే నన్నట్టి దానినుగా చేసినావు. నా యీ పిల్లలు నిస్సహాయులుగా నున్నారు. కావున వీరికి సంపాదించి పెట్టుటకు నా కుమా

రుని తిరిగి తెచ్చి యిమ్ము. ఆ బాలుని దయతో విడిచిపుచ్చి నావుకదా! అటులనే నా బాలునికూడ విడిచిపుచ్చి తీసికొని రమ్ము."

ఆ సంభాషణమునంతను ఆలకించిన నెలబాల అచ్చట బిచ్చము దొరకదను సత్యమును గ్రహించెను. అందువలన నామె తాతయ్యను తీసికొని మెల్లన బయటకు పోయెను. వా రెప్పటివలె మరల ప్రయాణము కొనసాగించిరి.

నెలబాల శక్తి అంతకంతకు సన్నగిలి పోవుచుండెను; భవిష్యత్తులో మంచి జరుగునను ఆశకూడ సన్నగిలి పోవుచుండెను. కాని ఆ విషయము నామె మాటలవలన కాని నిట్టూర్పుల వలనకాని బయట పెట్టకుండెను. పూర్తిగా శక్తి నశించు వఱకు నడచి పోవలయుననియే ఆమె నిశ్చయించుకొనెను. అందువలన నామె ఆరోజంతయు నడచి పోవుచునే యుండెను. పైగా ఆమె ఇదివఱకువలె మధ్యమధ్య ఆగి విశ్రాంతి తీసికొనకుండెను. సాయంకాలము వచ్చెను. కాని యింకను చీకటి పడలేదు. ఆ సమయమున వారు మంచిసందడిగానున్న ఒకపట్టణములో ప్రవేశించిరి.

నెలబాల ఆ పట్టణ వీధులలో నడచుచున్న వారిని పలువురను బిచ్చమడిగెను. కాని ఒక్కరును సాహాయ్యము చేయరైరి. ఆమె కొన్ని యిండ్లవద్ద ఆగి ధర్మ మడిగెను. కాని ఆ యిండ్లవారికి ధర్మమను మాట క్రొత్తగా నుండెను. ఎక్కడకు బోయినను, "లేదు" అన్న మాటయే వినవచ్చుచుండెను. అందువలన తాతా మనమరాండ్రు సాధ్యమైనంత త్వరలో నా పట్టణమును వీడి బయట పడవలయునని నిశ్చయించు కొనిరి. పట్టణ

మున కావల అచ్చటచ్చట గృహములుండును. ఆ గృహముల లోని వారెవ్వరైన ధర్మము చేయవచ్చునని వారు ఆశించు చుండిరి.

వారు కడపటి వీధిలో ప్రయాణము చేయుచుండిరి. ముందుకు పోవుటకింక తనకు శక్తిలేదని నెలబాల భావించుచుండెను. అంతలో వారి ముందొక మనుజుడు కనబడెను. అతడు కూడ వారు పోవుచున్న దిక్కుకే పోవుచున్నట్లుండెను. అతని చంకలో నొక చిన్న పెట్టె యుండెను. అతడొక దుడ్డుకఱ్ఱ మీద ఆనుకొనుచు ఒక చేతిలోనున్న గ్రంథమును చదువుచుండెను. అతనిని సమీపించి సాహాయ్యము చేయుమని ప్రార్థించుట ఏమంత సులభమైన పనికాదు. ఏలయన అతడు కడువేగముగ నడచి పోవుచుండెను. వారికి అతనికి మధ్య కొంత దూరముండెను. ఎట్టకేలకు ముందుపోవుచున్న వాడొకచోట నాగెను. పుస్తకములోని ఒక వాక్యమునుబాగుగ పరిశీలనగ చూడవలయునను నుద్దేశ్యముతో నతడు ఆగెను. అది నెలబాలకు ఆశాజనకముగ నుండెను. అందువలన నామె తాతయ్యను వదలిపెట్టి శరవేగమున ముందుకుపోయి అతనిని సాహాయ్యము చేయవలసినదని ప్రార్థింప మొదలుపెట్టెను. అంతట నతడు నెలబాలవంక తలత్రిప్పెను. నెలబాల చేతులు జోడించి గావుకేక పెట్టెను. వెంటనే స్పృహతప్పి అతని పాదములవద్ద పడిపోయెను.

ఆతడెవ్వరు? పూర్వము ఒకసారి తాతా మనమరాండ్రను మన్ననగా చూచిన పాఠశాలోపాధ్యాయుడు. అవును, అతడే! ఆ పాఠశాలోపాధ్యాయుడే! మఱియింకెవ్వరును కారు! నెలబాల అతనిని గుర్తించి అపరిమితముగు ఆశ్చర్యముతో స్పృహతప్పి

పడిపోయెను. కాని ఉపాధ్యాయునకంత ఆశ్చర్యము కలుగులేదు. అంత చలనము కలుగలేదు. నెలబాలను పైకి లేవనెత్తవలయు నను అభిప్రాయముకూడ అతనికి వెంటనే తట్టలేదు.

కాని అనతికాలములోనే అతడు తన కర్తవ్యమును జ్ఞప్తికి తెచ్చుకొనెను. వెంటనే అతడు కఱ్ఱను, పుస్తకమును నేలమీద పడవైచెను. ఒక మోకాలిమీద కూర్చుండి నెలబాలకు స్పృహ తెప్పించుటకు చేయవలసిన పనులన్నిటిని చేసెను. అంతకు మునుపే అచ్చటకు వచ్చిన తాతయ్య చేతు లాడించుచు, "నెలబాలా! నెలబాలా! మాట్లాడుము! ఒక్కమాట మాట్లాడుము" అని కడు దీనముగ ప్రార్థింపసాగెను.

ఉపాధ్యాయుడు తలపైకెత్తి ముసలివాని మొగమువంక చూచుచు, "ఈమె పూర్తిగా అలసిపోయినది; శక్తిపూర్తిగా సన్నగిలి పోయినది" అని యనెను.

"ఈమె ఆహార మే మాత్రము లేక ఇట్లయిపోయినది. ఇంతవఱకు నే నీమె పరిస్థితిని గుర్తించి యుండలేదు" అని తాతయ్య అనెను.

ఉపాధ్యాయుడు మఱియొకసారి తాతయ్యవంక చూచెను. ఆ చూపులో సగము మందలింపు, సగము సానుభూతి యుండెను. పిమ్మట నతడు నెలబాలను చేతులలోనికి తీసికొని శరవేగమున పోసాగెను. అతని వెంట తాతయ్యకూడ పోసాగెను.

అచ్చటకు సమీపమున ఒక చిన్న పూటకూళ్ళ యిల్లుండెను. అసలు ఉపాధ్యాయుడు అచ్చటకే పోవుచుండెను. అత డిప్పుడు స్పృహతప్పియున్న నెలబాలను తీసికొని ఆ పూటకూళ్ళ యింటికే తీసికొని పోయెను. అతడు తిన్నగా ఒకగదిలో

ప్రవేశించి నెలబాలను కుంపటికి దగ్గరగానున్న కుర్చీలో కూర్చుండ బెట్టెను. అప్పుడాగదిలో నున్నవారు కంగారుగా లేచిరి. వారు నెలబాల పరిస్థితిని గుర్తించి తమకు తోచిన మందులను పేర్కొన సాగిరి. కాని ఒక్కరును వానిని తెచ్చుటకు ప్రయత్నింప కుండిరి.

"అమ్మాయికి గాలి బాగుగ తగులవలయును" అని అందరును అనుచుండిరి. కాని అదే సమయమున వారామెచుట్టును గుమిగూడి ఆమెకు సరిగా గాలి తగులకుండ చేయుచుండిరి. "ఈ పని చేయరేమి? ఆపని చేయరేమి?" అని వారు అఱచుచుండిరి. ఆపని తామే చేయవచ్చునను తలంపుమాత్రము వారికి కలుగకుండెను.

అదృష్టవశమున నా యింటి యజమానురాలు ఇతరులందరికంటె తెలివైనది. అట్టి సందర్భములలో నేమిచేయవలయునో ఆమెకు బాగుగా తెలియును. అందువలన నామె బ్రాందీ, వాసనచూచు మందులు మున్నగువాని నన్నిటిని తెచ్చి ఉపయోగించెను. తత్ఫలితముగా నెలబాలకు స్పృహవచ్చెను. ఆమె హీనస్వరమున తనకు సాహాయ్యముచేసినవారి కందఱకు కృతజ్ఞతను తెలియజేసెను. ఉపాధ్యాయుడచ్చటనే బిక్కమొగముతో నిలబడియుండెను. నెలబాల అతని హస్తమును పట్టుకొనెను. ఇంటి యజమానురాలింక నామెను మాట్లాడనీయలేదు. ఆమె నెలబాలను తీసికొనిపోయి ఒక శయ్యమీద పరుండబెట్టెను. శరీరమునిండ దుప్పటి కప్పెను, పిమ్మట వైద్యునకు కబురు పంపించెను.

వైద్యుడచ్చటకు శరవేగమున వచ్చెను. అతడు నెల

బాల శయ్యకు ప్రక్కనే కూర్చుండి, గడియారము బయటకుతీసి, నాడి పరీక్షింపసాగెను. తరువాత నతడామె నాలుకనుచూచెను. పిమ్మట మరల నాడిచూచెను. ఎట్టకేల కతడు ఇట్లనెను: "ఈ అమ్మాయికి అప్పుడప్పుడు ఒక ఔన్సు బ్రాందీ - నీరు ఈయవలెను."

అప్పుడు ఇంటి యజమానురాలు సంతోషముతో నిట్లనెను: "అయ్యా! మేము సరిగా నదేపని చేసినాము!"

వైద్యు డింకను నిట్లు చెప్పెను: "ఆమె పాదములను వేడినీటిలో పెట్టి ఫ్లానెల్ గుడ్డతో చుట్టవలయును. మఱియు ఆమె కిప్పుడు కొంచెము ఆహారము పెట్టవలయును." అత డింకను నెలబాలను చూడవలసిన విధానమునుగూర్చి మఱి కొన్ని సూచనలు చేసెను. పిమ్మట నతడు వెళ్ళిపోయెను.

అప్పు డచ్చట నున్నవా రందఱు నిట్లనిరి: "వైద్యుడు మేము చెప్పినట్లే చెప్పినాడు! ఈ విషయముల నన్నిటిని మేము ముందే చెప్పినాము! అంతయు మన మనుకొన్నట్లుగనే జరిగినది."

నెలబాలకు కావలసిన ఆహారపదార్థములు తయారగు చుండెను. ఈ లోపల నెలబాల నిదురించెను. ఆహార పదార్థములు తయారైనతరువాత ఆమెను నిదురనుండి లేపిరి. అంతట నామె తాతయ్యతో కలిసి భోజనముచేసెను. పిమ్మట నిరువురను నిదురింపసాగిరి.

ఉపాధ్యాయుడుమాత్రము వంటయింటిలోని కుంపటివద్ద నిలబడి పొగపీల్చసాగెను. అతని మొగములో సంతోషము తాండవించుచుండెను. అనుకోకుండ నెలబాలను కలసికొని

ఆమెను రక్షింపగలిగినందుల కతడెంతయు ఆనందపడుచుండెను. నెలబాలకు సంబంధించిన జీవితవిషయము లన్నిటిని తెలిసికొనవలయునని ఇంటి యజమానురాలు ఎంతయు కుతూహల పడుచుండెను. అందువలన నామె ఉపాధ్యాయుని రకరకములుగా ప్రశ్నింపసాగెను. ఉపాధ్యాయుడు సిష్కపటి. ఏ విషయమును చెప్పవలయునో, ఏ విషయమును చెప్పకూడదో అతనికి సరిగా తెలియదు. అందువలన నతడు అడిగినవారికి తనకు తెలిసిన విషయముల నన్నిటిని చెప్పివేయును. నెలబాల విషయమునుగూడ నతడు ఇంటి యజమానురాలికి చెప్పివైచి యుండెడివాడే. కాని అదృష్టవశమున నతనికి నెలబాలచరిత్ర ఏమియు తెలియదు. ఆ విషయమునే అతడు యజమానురాలికి చెప్పెను.

యజమానురాలు ఉపాధ్యాయుని సమాధానముతో సంతృప్తి చెందలేదు. ఉపాధ్యాయుడు తన ప్రశ్నలకు సమాధానము చెప్పకుండ తప్పించుకొనుచున్నాడని ఆమె భావింపసాగెను.

"అయ్యా! మీరు నా ప్రశ్నలకు సమాధానము చెప్పకుండ నుండుటకు ఏదో కారణ ముండియుండును. నా యింటికి వచ్చువారి వ్యవహారములలో జోక్యము కలుగజేసికొనుట నా యుద్దేశ్య మేమాత్రముకాదు. భగవంతుని దయవలన నా కట్టి బుద్ధిలేదు. నా వ్యవహారములే ఎన్నో యున్నవి. ఇతరుల వ్యవహారములలో జోక్యము కలుగజేసికొనుటకు నాకు వ్యవధి లేదు. నేనేదో మర్యాదగా ప్రశ్నించినాను. నాకు అట్టి సమాధానమే వచ్చునని ఆశించినాను. మీరేదో సమాధానము చెప్పినారు. నేను సంతృప్తి చెందినాను; పూర్తిగా సంతృప్తి

చెందినాను. నా ప్రశ్నలకు సమాధానము చెప్పుట మీ కిష్టము లేదని మీరు స్పష్టముగా చెప్పిన బాగుండెడిది. నేనా పరిస్థితిని చక్కగా అర్థము చేసికొనగలిగి యుండెడిదానను. నేను బాధ పడుటకు నాకు ఎట్టి హక్కు లేదన్నమాట నిజమే. ఈ విషయ మున సరియైన నిర్ణయమును తీసికోవలసినవారు మీరే. మీ యిష్టమువచ్చినదానిని చెప్పుటకు మీకు సంపూర్ణమగుహక్కు ఉన్నది. ఆ విషయమున మీతో నెవ్వరును ఒక్క క్షణకాల మైనను తగవులాడుటకు వీలులేదు. వీలులేదు! ఏమాత్రము వీలులేదు!" అని ఆమె అనెను.

అప్పుడు ఉపాధ్యాయుడు ఇట్లనెను: "అమ్మా! మీరు నామాట నమ్మవలయును. నేను మీకు నాకు తెలిసిన విషయ మును చెప్పినాను. నెలబాల చరిత్ర ఏమో నాకు తెలియదు. ఆ విషయమునే మీకు చెప్పినాను. తెలియని విషయమును చెప్ప మొదలిడి బాధపడుట సమంజసము కాదుగదా!"

"మీరు సత్యమునే పలుకుచున్నారని నేను నమ్ము చున్నాను. మీకు బాధ కలిగించినందుకు నే నెంతయు విచా రించుచున్నాను. కాని ఇతరుల విషయములను గురించి తెలిసి కొన వలయునని కుతూహలపడుట స్త్రీలకు సహజమగు లక్ష ణము. అది వారికి శాపము. ఇది ముమ్మాటికి నిజము."

యజమాను డప్పు డచ్చటనే యుండెను. అతడు భార్య మాటలు విని తల గోకుకొనెను. ఒక్కొకప్పుడా శాపము పురుషజాతినిగూడ బాధపెట్టునని అతడు అనుకొనసాగెను. కాని అతడు పైకి ఏమియు సనలేదు. బహుశా అతడేమైన అని యుండెడివా డేమోకాని అంతలో ఉపాధ్యాయుడు మాట్లాడుట

వలన ఏమియు అనలేదు.

ఉపాధ్యాయుడు యజమానురాలితో నిట్లనెను : "అమ్మా! మీరు వరుసగా విధివిరామము లేకుండ ఆరు గంటలు ప్రశ్నింపుడు. మీ కెట్టి అభ్యంతరము ఉండదు. నేను ఓపికతో మీకు సమాధానము లిచ్చెదను. ఏలయన మీ హృదయము అపరిమితమగు దయతో నిండియున్నది; మీరా దయను చాల చక్కగ ప్రదర్శించినారు. అమ్మా! మీరా అమ్మాయిని గురించి జాగ్రత్త తీసికొనుడు. తెల్లవారిన తరువాత ఆమె ఎట్లున్నదో నాకు తెలియజేయుడు. తాతయ్యకు, నెలబాలకు, నాకు అగు ఖర్చంతను నేనే భరింతును."

యజమానురాలు సంతృప్తి చెందెను. అంతట ఉపాధ్యాయుడు పరుండుటకై తన గదిలోనికి పోయెను. యజమానుడు, యజమానురాలు తమ గదిలోనికి పోయిరి.

తెల్లవారిన తరువాత నెలబాల పరిస్థితి అభివృద్ధి చెందు చున్నదను విషయమును ఉపాధ్యాయుడు తెలిసికొనెను. కాని ఆమె చాల బలహీనముగ నుండెను. ఆమె తిరిగి ప్రయాణము సాగింపవలయునన్నచో కనీస మొక రోజైన విశ్రాంతి తీసికో వలయును; మంచి సేవను పొందవలయును.

ఆ వార్త ఉపాధ్యాయునకు సంతోషమును కలిగించెను. "ఒకరోజు వేచియుండుటకు నేను సిద్ధముగానున్నాను. ఒకరోజే అననేల? రెండు రోజులు వేచియుండుటకుగూడ అవకాశ మున్నది" అని ఉపాధ్యాయుడనెను. అతడు నెలబాలను సాయం కాలమువరకు కలసికొనదలచుకోలేదు. అంతవరకు నతడు తన వద్దనున్న పుస్తకమును చదువుచు కూర్చుండెను.

నిర్ణీత సమయమునకు ఉపాధ్యాయుడు నెలబాల గదిలోనికి పోయెను. అప్పుడచ్చట వారిరువురుమాత్రమే యుండిరి. ఉపాధ్యాయుని చూడగనే నెలబాల ఏడ్చెను. బక్కచిక్కియున్న నెలబాలనుజూచి అతడు కన్నీరు కార్చెను. "మనమీ విధముగ ప్రవర్తించుట చాల తెలివితక్కువతనము. ప్రయత్నించి మన మిట్లు చేయకుండ నుండవచ్చును" అని అతడు అనెను.

అంతట నెలబాల అనెను: "అయ్యా! మీరు నాపట్ల అపారమగు దయను ప్రదర్శించుచున్నారు. అయినను నేను విచారించుచున్నాను. మేము మీకు భారముగ నున్నామేమోయని భయపడుచున్నాను. నేను మీ ఋణము నెట్లు తీర్చుకోగలను? మీపట్ల కృతజ్ఞత నెట్లు ప్రకటింపగలను ? ఎక్కడో నివసించుచుండిన మీరు, ఇచ్చటకు వచ్చుట దైవికముగ జరిగినది. మిమ్ములను కలిసికొని యుండకపోయినచో నేను మరణించి యుండెడిదానను. మా తాతయ్య ఒంటరివాడైపోయి యుండెడివాడు."

"మరణమునుగూర్చి మాట్లాడవలదు. ఇక భారము మాట అందువా? నామాట వినుము. నీవు నా పాఠశాలలో నిమరించినతరువాత నాకు అదృష్టము పట్టినది."

"నిజముగా?" అని నెలబాల అపరిమితమగు సంతోషముతో ననెను.

"నిజమే చెప్పుచున్నాను. నే నిచ్చటకు చాలదూరమున నున్న ఒక గ్రామములో ఉపాధ్యాయునిగా నియమింపబడినాను. ఆ గ్రామమున నేను పూర్వము నివసించుచుండిన ప్రదేశమున కింకను చాలదూరమన్నమాట! నాకు సంవత్సరమునకు ముప్పది

ఐదు పౌనుల జీతమిత్తురు."

"నేను చాల సంతోషించుచున్నాను. అబ్బ! ఎంతో సంతోషించుచున్నాను."

"నే నిప్పుడా గ్రామమునకే ప్రయాణమై పోవుచున్నాను. వారు నాకు బండిమీద పోవుటకు కావలసిన సొమ్ముకూడ ఇచ్చినారు. భగవంతుడు నీకు మేలుచేయుగాక. వారు నాకు కావలసిన అన్ని సౌకర్యములను సమకూర్చుటకు ఏమాత్రము వెనుదీయరు. కాని నేనచ్చటకుపోయి చేరుకొనుటకు చాల వ్యవధి యున్నది. అందువలన నడచిపోవలయుననియే నిశ్చయించుకొంటిని. ఇంతవఱకు నడచివచ్చితిని. ఆ విధముగా చేసినందుకు, నే నిప్పుడెంత సంతోషపడవలయును!"

"మనమెంత సంతోషపడవలయును!"

"అవునవును. నీవు చెప్పినది ముమ్మాటికి నిజము. కాని అమ్మాయి! నీవు ఎచ్చటకు పోవుచున్నావు? ఎచ్చటనుండి వచ్చుచున్నావు? నన్ను వదలిపెట్టి వచ్చినప్పటినుండి ఏమిచేయుచున్నావు? అంతకుమునుపు నీవు ఏమిచేయుచుంటివి? ఈ విషయములన్నియు నాకు చెప్పుము. తప్పక చెప్పుము. నాకీ ప్రపంచపు సంగతులేవియు తెలియవు. బహుశా ఆ విషయమున నాకు తగిన సలహాలనిచ్చుటకు నీవే ఎంతయు తగ్గియున్నావు. నేను నీకు సలహా యిచ్చుటకు తగినవాడను కాను. కాని నేను చిత్తశుద్ధి కలిగియున్నాను. నేను నిన్ను ప్రేమించుటకొక కారణమున్నది. నీవా కారణమును మఱచిపోలేదనుకొంటాను. నే నతనిని ప్రేమించియుంటిని; అతడు మరణించి నీ వతని ప్రక్కనే ఉండి చూచియుంటివిగదా!"

నెలబాలకు ఉపాధ్యాయుని మాటలు నచ్చెను. అందు వలన నామె కతనిపట్ల సంపూర్ణమగు విశ్వాస మేర్పడెను. అతని వద్ద దాచియుంచవలసిన విషయమేదియు లేదని ఆమె నిశ్చయించుకొనెను. అతనికి తన జీవితచరిత్ర అంతయు చెప్పెను. దాని సారాంశమిది: "మాకు బంధువులుగాని, స్నేహితులుగాని ఎవ్వరును లేరు. మా తాతయ్యను ఇతరుల బారినుండి రక్షించుకొనుటకుగాను మేము పారిపోయివచ్చితిమి. ఇప్పుడు అతనిని అతనిబారినుండియే రక్షించుటకు పారిపోవుచున్నాము. ఎటువంటి ఆకర్షణలులేని ప్రశాంత ప్రదేశమునకు పోవలయునని నిశ్చయించుకొన్నాము. అక్కడ నింక మాకు ఎట్టిబాధలు నుండవు."

నెలబాల చరిత్రనంతను ఉపాధ్యాయుడు అత్యాశ్చర్యముతో వినెను. తరువాత నతడు ఇట్లు అనుకొనెను: "ఈ అమ్మాయి! ఈ అమ్మాయి ఎటువంటిది! ఎంత మనోనిబ్బరము కలది! ఎంత మంచిది! ఎన్నిబాధలను తప్పించుకొని తన తాతయ్యను రక్షించుకొనుచున్నది! కాని యీామె సంగతి నెవ్వరును పట్టించుకోరు. ఈమె చరిత్ర ఎవ్వరికిని అక్కఱలేదు! నేనీ చరిత్రనుండి చక్కని గుణపాఠమును నేర్చుకొనవలసియున్నది!"

ఉపాధ్యాయుడింకను ఏమి ఆలోచించుకొనెనన్నది. అంత ముఖ్యమైన విషయముకాదు. ఫలితము ముఖ్యము. "మీా ఇరువురును నాతో కలసి నేను పోవుచున్న గ్రామమునకు రావలయును; అచ్చట మీాకుగూడ తగిన పనులు నేర్పాటు చేయుదును. మీా రచ్చట ప్రశాంతముగ, సుఖముగ జీవింపవచ్చును. మీాకు ఏలోటు ఉండదు" అని ఉపాధ్యాయుడు తాతా మనమ

రాంద్రతో ననెను. తాతా మనమరాంద్రు అందుకు వెనలేని సంతోషముతో అంగీకరించిరి.

అందఱును మఱునాటి సాయంకాల మచ్చటికి వచ్చు కోచిబండిలో ప్రయాణమై పోవలయునని నిశ్చయించుకొనిరి. కోచిబండి సకాలమునకు వచ్చెను. ఉపాధ్యాయుడు, తాతా మనమరాంద్రు కోచిబండిలో ప్రవేశించిరి. బండి ప్రయాణము సాగించెను. నెలబాల కా ప్రయాణము ఎంతో హాయిగా నుండెను.

బండి ఒక పెద్ద పట్టణమువద్ద ఆగెను. అచ్చటవారు ఒక రాత్రి గడపిరి. మఱునాడు బండి ప్రయాణము సాగించెను. వారి గమ్యస్థానము అంతకంతకు సమీపించుచుండెను. ఎట్టకేలకు వారు నివసింపవలసిన గ్రామమువచ్చెను. అచ్చటవారు బండిలో నుండి క్రిందకు దిగిరి.

ఉపాధ్యాయుడు సంతోషస్వరమున నెలబాలతో నిట్లనెను: "అల్లదిగో చర్చి కనబడుచున్నది. దానికి సమీపమున నున్న ప్రాతభవనమే పాఠశాలాభవనమై యుండును. ఈచక్కని ప్రదేశములో సంవత్సరమునకు ముప్పదియైదు పౌనులు!"

ఆ ఇరువురును చర్చిని పరిపరివిధముల ప్రశంసింపసాగిరి. అంతియకాదు; వా రచ్చటి ప్రకృతి సౌందర్యమును వేనోళ్ల కొనియాడసాగిరి. అటువంటి ప్రదేశమును చేరుకోవలయుననియే చిన్నారి బాల నెలబాల ఎన్నో కష్టములు సహించియుండెను. అటువంటి మనోహరప్రదేశము నెప్పటికైన చేరుకొనగలనని ఆమె గట్టిగా నమ్ముచుండెను. ఆ నమ్మకము నిజమగు సమయ మిప్పుడు వచ్చినది. ఇరువురును చాలసేపు ప్రశాంతముగనచ్చటి

సౌందర్యమును గ్రోలిరి.

ఎట్టకేలకు ఉపాధ్యాయుడు నెలబాలతో నిట్లనెను: "నేను కొంచెముసేపు మిమ్ములనెచ్చటనైన విడిచి వెళ్ళవలయును. నేను అధికారులకొక యుత్తరము చూపవలసియున్నది. కొన్ని విషయముల నడిగి తెలిసికొనవలసియున్నది. మఱి మిమ్ములను నేనిప్పు డెచ్చటకు తీసికొని వెళ్ళను?"

"మే మిచ్చటనే వేచియుందుము. గేటు తెఱచియున్నది కదా! మీరు తిరిగి వచ్చువఱకు మేము చర్చిముందుభాగమున కూర్చుండియుందుము" అని నెలబాల అనెను.

"అవును. ఇది మంచిప్రదేశమే" అని ఉపాధ్యాయుడని మిగిలిన ఇరువురను అచ్చటకు తీసికొనిపోయెను; "మీ రిచ్చటనే కూర్చుండి యుండుడు. నేను అనతికాలములోనే తిరిగివత్తును. మీకు శుభ వర్తమానమును తీసికొని వత్తుననుటకు ఎట్టి సందేహమును లేదు."

పిమ్మట ఉపాధ్యాయుడు వారిని వదలిపెట్టి తొందఱ తొందఱగా వెళ్లిపోయెను. వెళ్లుచున్న ఉపాధ్యాయుని నెలబాల చూచుచునే యుండెను. కాని కొంతసేపటి కతడు కనుచాటయ్యెను. అంతట నెలబాల చర్చి ఆవరణలో అటు నిటు తిరుగసాగెను. ఆ చర్చి నిర్మింపబడి చాల వందలసంవత్సరములై యుండును. చర్చిలో చాలభాగము శిథిలమై నేలలో కలసిపోయి యుండెను. ఆవరణలోని సమాధులుకూడ శిథిలావస్థలోనుండెను. ఒకచోట రెండు చిన్న యిండ్లుండెను. అవికూడశిథిలావస్థలోనే యుండెను. వానిలో ఎవ్వరును నివసించుటలేదు. నెలబాల దృష్టి యింక ఆ యిండ్లమీదనే యుండెను. చర్చి, శిథిలములు,స మా

ధులు మున్నగునవన్నియు క్రొత్తవారి దృష్టిని సమానముగనే ఆకర్షించుచుండును. కాని కారణమేమోకాని ఆ యిండ్లను చూచినప్పటినుండి నెలబాల ఇంక తన దృష్టిని మరల్చలేదు. ఆమె యొకచోట కూర్చుండి ఉపాధ్యాయునిరాకకొఱకు ఎదురు చూచుచుండెను; అప్పుడుకూడ ఆమె ఆ యిండ్లనే చూచుచు కూర్చుండెను. ఆ యిండ్లకును తనకును ఏదో అవినాభావ సంబంధ మున్నట్లామె భావింపసాగెను.

వేమన గ్రంథాలయం, తెల్ప్రాలు :: నెల్లూరు జిల్లా.

12

ఉపాధ్యాయుడు చాలసేపైన తరువాత మరల కనబడెను. అతడు చేత త్రుప్పపట్టిన తాళపు చెవులగుత్తిని పట్టుకొని శర వేగమున వచ్చుచుండెను. తాతా మనమరాండ్రు కూర్చుండి యున్న ప్రదేశము నాతడు చేరుకొనెను. సంతోషాతిశయమున నతడు ఏమియు మాట్లాడలేకుండెను. అతడు నెలబాల చూచు చున్న రెండు ఇండ్ల వంకకు చేయిపెట్టి చూపసాగెను.

ఎట్టకేలకు అతడిట్లనెను: "చూడుము. అచ్చట రెండు ఇండ్లు కనబడుచున్నవి."

"మీరు ఈప్రదేశమునుండి వెళ్లిపోయినప్పటినుండియు నేనా రెండు ఇండ్లను చూచుచునే యున్నాను."

"నేను చెప్పదలచుకొన్న విషయమును నీవు ఊహించు కొనియుండినచో, ఇంకను ఎక్కువకుతూహలముతో ఆయిండ్లను

చూచియుండెడిదానవు. ఆ యిండ్లలో నొకటి నాది."

ఉపాధ్యాయు డింక నేమియు చెప్పలేదు; నెలబాల సమాధానము చెప్పుటకు అవకాశమీయలేదు; ఆనందముతో ప్రకాశించుచున్న మొగముతో ఆమె చేయి పట్టుకొని అచ్చటకు తీసికొనిపోసాగెను.

వా రిరువురును ఒక యింటిముందు ఆగిరి. ఆ యింటి తలుపులకొక పెద్దతాళము వేయబడియుండెను. ఉపాధ్యాయుడు ఆ తాళమును తెఱవవలెనని ఎన్నో తాళపుచెవుల నుపయోగించెను; కాని లాభ మేమియు లేకపోయెను. ఎట్టకేలకొక తాళపుచెవి సరిపోయెను. తాళము ఊడిపోయెను. ఇరువురును తలుపులు తెఱచుకొని లోపలకుపోయిరి. వారివెనుక ముసలివాడు కూడ వెళ్లెను. ఒకప్పు డా యిల్లు గొప్ప శిల్పకళా నైపుణ్యముతో ఒప్పుచుండెడిది. కాని యిప్పుడది శిథిలావస్థలోనున్నది. అయినను పూర్వపు ఔన్నత్యము ఇప్పటికిని కనబడుచున్నది. ఇంటిలోపల కొన్ని కుర్చీలు, బల్లలు, పెట్టెలు మున్నగునవికూడ నుండెను. ఒకచోట వంట కుపయోగించు కట్టెలుగూడనుండెను.

ఆ యిల్లు చాల విశాలముగనుండెను. అందొక కుటుంబమువారు సుఖముగ కాపురముచేయవచ్చును. నెలబాల గంభీరభావముతో ఆ యింటినంతను కలయజూచెను. ఎట్టకేల కామె మెల్లన నిట్లనెను: "ఈ యిల్లు కడు మనోహరముగ నున్నది!"

అంతట ఉపాధ్యాయు డిట్లనెను: "నీ వందుకు విరుద్ధమగు నభిప్రాయము నేర్పఱచుకొని యుంటివేమోయని నే నెంతయు భయపడియుంటిని. మన మీ యింటిలో ప్రవేశింపగనే నీవు వణకియుంటివి. నీకు చెడ్డ అభిప్రాయము కలిగెనేమోయని నేను

భయపడితిని."

చుట్టును చూచుచు కొంచెదిగా వణకుచు నెలబాల ఇట్లనెను: "అదికాదు. అదికాదు. కాని అవియేమో నేను సరిగా చెప్పజాలను. కాని చర్చి బయట నిలబడి ఈ యింటిని చూచినప్పుడు నాకొకవిధమగు భావము కలిగినమాట నిజమే. ఈ యిల్లు చాల ప్రాతదిగ కనబడుటయే అందుకు కారణమై యుండవచ్చును."

"సుఖముగా జీవించుట కిది కడు ప్రశాంతమైన ప్రదేశము. నీవటుల భావించుటలేదా?"

"నాకందుకు సందేహ మేమాత్రములేదు. ఇది కడు ప్రశాంతముగనున్న ప్రదేశము! జీవించుటకు, మరణించుట ఎట్లో నేర్చుకొనుటకు ఎంతయు తగియున్నది!"

"ఇది నివసించుటకు, జీవించుట ఎట్లో నేర్చుకొనుటకు, శారీరకముగను, మానసికముగను చక్కని ఆరోగ్యమును సంపాదించుకొనుటకును ఇది ఎంతయు తగియున్నది. ఈ పురాతన గృహాముమీదే!" అని ఉపాధ్యాయు డనెను.

"మాదా!" అని నెలబాల అఱచెను.

"అవును" అని ఉపాధ్యాయుడు సంతోషముతో చెప్పసాగెను; "చాల, చాల సంవత్సరములవఱకు ఈ పురాతన గృహాముమీదే యని నేను గట్టిగా చెప్పుచున్నాను. నేను మీ పొరుగుననే—ప్రక్కయింటిలోనే—యుందును; ఈ యిల్లు మాత్రము మీయది."

ఆవిధముగ ఉపాధ్యాయుడు ఆశ్చర్యకరము, సంతోషకరమునగు వార్తను దెలిపుచ్చి తన హృదయభారమును తీర్చు

కొనెను. పిమ్మట నత డొకచోట కూర్చుండెను. అతడు నెల బాలను తన ప్రక్కనే కూర్చుండబెట్టుకొని ఆమెతో నిట్లు చెప్ప సాగెను: "అమ్మాయి! నెలబాలా! నా కీయింటినిగూర్చి కొన్ని విషయములు తెలిసినవి. ఈ పురాతన గృహములో కొన్ని వారముల క్రిందటివఱకు నూఱు సంవత్సరముల వయస్సుగల వృద్ధురాలొక ర్త నివసించుచుండెను. ఆమె యిచ్చట ఎన్నో సంవత్సరములనుండి నివసించుచుండెను. చర్చి తాళ్ళపుచెవులు ఆమెయొద్దనే యుండెడివి. ప్రార్థనాసమయములం దామె చర్చిని తెఱచుచుండెడిది. క్రొత్తవారికి చర్చిని చూపెట్టుచుండెడిది. ఆమె మరణించిన తరువాత ఆస్థానము నాక్రమించుటకు తగిన వారు మఱి యెవ్వరును లేకుండిరి. ఈ విషయముల నన్నిటిని కీళ్లవాతముతో బాధపడుచు ఇంటివద్ద మంచము పట్టియున్న రెండవ చర్చి ఉద్యోగివద్దనుండి తెలిసికొన్నాను. అంతట నేను ధైర్యము వహించి నాతో నొకవృద్ధుడు వచ్చియున్నాడనియు, అత డా యుద్యోగమున కెంతయు తగియుండుననియు చెప్పితిని. అతడు నా సలహాను ప్రశంసించెను. ఆ విషయమును మతాచార్యునకు చెప్పవలసినదని అతడు సలహాచెప్పెను."

అంతట నేను పోయి మతాచార్యునికా విషయమును, చెప్పితిని. నా ప్రయత్నముల ఫలితమేమనగా: రేపు నిన్ను, మీ తాతయ్యను మతాచార్యునివద్దకు తీసుకొని పోదును. ఖాళీగా నున్న ఉద్యోగములో మీరు నియమింప బడినట్లుగనే భావింప వలయును. రేపు మీ రతని కలసికొనుట, అతడు మిమ్ము చూచుట మర్యాద కొఱకు మాత్రమే. ఈ యుద్యోగము చేసి నందుకుగాను మీకు కొంత జీత మిత్తురు. అది యంత పెద్ద

మొత్తము కాని మాట నిజమే. కాని యిచ్చట నివసించుటకు సరిపోవుననుట కెట్టి సందేహమును లేదు. మీ జీతము, నా జీతము కలిపి మనము ధైర్యముగా జీవయాత్ర గడవవచ్చును. అందుకు సందేహమేమాత్రము లేదు. మనము భయపడవలసిన పని అణుమాత్రమైనను లేదు.

"భగవంతుడు మీకు మేలు చేయుగాక!" అని నెలబాల ఆనంద బాష్పములు కార్చుచు అనెను.

"తథాస్తు. నెలబాలా! భగవంతుడు కరుణామయుడు. అతడందఱకు మేలు చేయును. మనకుగూడ తప్పక మేలు చేయును. ఇక మనము పోయి నాయిల్లు చూతము. రండు!"

తదుపరి వారు రెండవ యింటివద్దకు పోయిరి. ఆ యిల్లు గూడ తాళము వేయబడి యుండెను. ఉపాధ్యాయుడు త్రుప్పు పట్టిన తాళపు చెవుల నెన్నిటినో ఉపయోగించి చూచెను. ఎట్ట కేలకు సరియైన తాళపు చెవికి తాళము ఊడి వచ్చెను. ముగ్వు రును లోపలకు వెళ్ళిరి. ఆ యిల్లుకూడ బాగుగనే యుండెను. కాని అది మొదటి ఇంటికంటె చిన్నది. అందులోకూడ కొన్ని కట్టెలు, బల్లలు. కుర్చీలు మున్నగునవి యుండెను.

ఇక్కడ నొక్క విషయము చెప్పవలసి యున్నదీ. అసలు మొదటి యిల్లే ఉపాధ్యాయుని కొఱకు నిర్ణయింపబడినది. రెండవ యిల్లే చర్చిలో పనిచేయువారి కొఱకు నిర్ణయింపబడి యున్నది. కాని ఉపాధ్యాయుడు నెలబాల యందుగల ప్రేమచే పెద్దయింటిని ఆమెకు కేటాయించి, చిన్న యింటిలో తానుండుటకు నిశ్చ యించుకొనెను.

ఇకవారు ఆ రెండు గృహములను బాగుచేయు పనికి

పూనుకోవలసి యుండెను. అనతికాలములోనే వారు ఆ పనికి పూనుకొనిరి. మఱికొంత సేపటికి రెండు యిండ్లలోను, కుంపట్లు వెలుగ సాగెను. నెలబాల కిటికీ తెరలు మున్నగు వానిని బాగు చేసెను. ఉపాధ్యాయుడు నేలను బాగుచేసెను. ఇంటిముందు భాగమును చక్కజేసెను. ముసలివాడు కొంచెముసేపు ఉపాధ్యాయునకు సాహాయ్యము చేయుచుండెను. మఱికొంచెముసేపు నెలబాలకు సాహాయ్య పడుచుండెను. అతడావిధముగ సాహాయ్య పడ గలిగినందులకు ఎంతయు సంతసింపసాగెను. చుట్టుప్రక్కల నున్న కొందఱుగూడ వచ్చి వారికి తోడ్పడ సాగిరి. కొందఱు వారికి కావలసిన వస్తువులను కొన్నిటిని సమకూర్చిరి. వారిపను లింకను పూర్తికాక మునుపే చీకటి పడెను. వారికి ముందుగా చీకటి పడినట్లుండెను.

వారు ముగ్గురును పెద్ద యింటిలోనే రాత్రి భోజనమును తీసికొనిరి. భోజనమైన తరువాత ముగ్గురును కుంపటిచుట్టు కూర్చుండి మెల్లన మాట్లాడుకో సాగిరి. వారి ప్రశాంత హృదయములు సంతోషముతో నిండియుండుటవలన మాటలు గట్టిగా వచ్చుటలేదు కాబోలు! వారు తమ భవిష్యత్తు కార్యక్రమమును గూర్చి చర్చించు కొనిరి. ఇంక నిదురింపవలసిన సమయము వచ్చెను. అంతట ఉపాధ్యాయుడు కొన్ని ప్రార్థనా గీతములను గట్టిగా చదివెను. పిమ్మట నతడు తన యింటికి పోయెను.

తాతయ్య ఒక శయ్యమీద పరుండి ప్రశాంతముగ నిదురించు చుండెను. అంతయు నిశ్శబ్దముగ నుండెను. అట్టి సమయమున నెలబాల కుంపటిముందు అటునిటు తిరుగసాగెను. ఆమె తన పూర్వ జీవితమునుగూర్చి ఆలోచింపసాగెను. అదియంతయు

నామెకు ఒక కలవలె నుండెను. ఆమె ఆకలలోనుండి ఇప్పుడే మేల్కొనినట్లుండెను. ఆమె నచ్చటి వాతావరణము ఆలోచనా పరంపరలలో ముంచివైచెను. కాని ఆమె ఏ మాత్రము భయ పడుటలేదు. ఆ రాత్రి ఆమె చాల ఆలస్యముగ నిదురించెను. ఆ నిదురలోకూడ నామెకు రకరకముల కలలు వచ్చెను.

తెల్లవారెను. మరల ముప్పురును కడచిన రోజున ఆగి పోయిన పనులను పూర్తిచేయ సాగిరి. మధ్యాహ్నము వఱకు వారా పనులలో మునిగి యుండిరి. తరువాత వారు మతాచా ర్యుని గృహమునకు పోయిరి.

మతాచార్యుడు సహృదయుడు. నిరాడంబర జీవి. అత నికి ప్రాపంచిక విషయము లేవియు తెలియవు. ఎన్నో సంవత్స రములకు పూర్వమత డచ్చటకు వచ్చి స్థిరపడి యుండెను. అతని భార్య అతడిప్పుడున్న గృహములోనే మరణించి యుండెను. అప్పటినుండి అతడే విషయములోను అంతగా జోక్యము కలి గించుకొనుట లేదు.

మతాచార్యుడు వారిని సాదరముగ స్వీకరించెను. అతడు నెలబాలపట్ల అభిమానము చూపసాగెను. ఆమె పేరు, వయస్సూ, జన్మస్థలము, ఆమె నచ్చటకు తీసికొని వచ్చిన పరిస్థితులు మున్నగు వానిని గూర్చి ప్రశ్నించెను. ఉపాధ్యాయు డంతకు మునుపే ఆమె చరిత్రను మతాచార్యునకు చెప్పియుం డెను. "తాతా మనమరాండ్రకు వేఱు స్నేహితులు కాని, బంధువులుకాని లేరు. వారికి యిల్లులేదు, నాతోబాటు జీవించు టకై వారువచ్చి యున్నారు. ఆమెను నేను గాఢముగ ప్రేమించు చున్నాను. నా స్వంత కూతురువలె చూచుకొను చున్నాను"

అని ఉపాధ్యాయుడనెను.

"మంచిది, మంచిది. మీ యిష్టప్రకారమే కానిండు. ఆమె చాల చిన్నది" అని మఠాచార్యుడనెను.

"వయస్సులో చిన్నది కావచ్చును. కాని ఎంతో వయస్సుకలవారివలె కష్టములు అనుభవించినది" అని ఉపాధ్యాయుడనెను.

"భగవంతుడీమెకు మేలుచేయుగాక! ఆమె పూర్వపు కష్టములన్నిటిని మఱచి పోవలయును. కాని అమ్మాయి! ప్రాత చర్చి నీవంటి చిన్నదానికి ఉత్సాహము కలిగింపకపోగా నిరుత్సాహము కలిగించును."

"కాదు, కాదు! అయ్యా! నా కటువంటి అభిప్రాయ మేమియు లేదు" అని నెలబాల అనెను.

అపుడు మఠాచార్యు డిట్లనెను: "అమ్మాయి! రాత్రి సమయములందు నీవు ఉత్సాహముతో చర్చిముందున్న పచ్చని గడ్డిపై నాట్యము చేయుచుందుము. అయ్యది నా కెంతయో సంతోషమును కలిగించును. అంతియకాని నీవు పురాతన భాగము చూచి నిరుత్సాహపడుట ఏ మాత్రము తగదు. ఉపాధ్యాయ మిత్రమా! మీరీ విషయమున జాగ్రత్త తీసికోవలయును, ఈ పురాతన శిధిలము లామె హృదయమును గట్టి పఱచకుండ మీరు జాగ్రత్త పడవలయును. మిత్రమా! మీ కోరికను అంగీకరించుచున్నాను."

మఱికొంతసేపు సరససంభాషణము జరిగిన తరువాత ముప్పురును మఠాచార్యునియొద్ద సెలవుతీసికొని వెళ్ళిపోయిరి. ముప్పురును నెలబాలయింట కూర్చుండి తమ అదృష్టమునుగూర్చి

ముచ్చటించుకొనసాగిరి. అంతలో వారికి మఱియొక మిత్రుడు పరిచయమయ్యెను.

అతడు కొంచెము వయసుమీరిన గౌరవనీయుడు. అతడు మతాచార్యుని ఇంట నివసించుచుండెను. పదునేను సంవత్సరముల క్రిందట మతాచార్యుని భార్య మరణించి యుండెను. అప్పుడు మతాచార్యుని ఓదార్చుటకై అతడు వచ్చి యుండెను. మఱి యింక నతడు తిరిగి వెళ్ళిపోలేదు. వారిద్దరును కళాశాలలో మిత్రులు; చివరకు జీవితరంగములోగూడ మిత్రులైరి.

అతడు సామాన్యుడుకాడు. ఆ గ్రామమున కతడు జీవకఱ్ఱ వంటివాడు. ఎవ్వరికే తగవు వచ్చినను చక్కని తీర్పిచ్చి ఆ తగవులను మాన్పును. ఆయూరిలో నేయుత్సవములు జరుగవలయునన్నను అతడే భారము వహింపవలయును. మతాచార్యుని తరఫున అతడు దానధర్మములు చేయును. తానుగూడ స్వంతముగ దానధర్మములు చేయును.

నిరాడంబర జీవులగు గ్రామీణులు అతనిపేరు తెలిసికొనుటకు ప్రయత్నింపలేదు. ఒకవేళ పేరు తెలిసినను దానిని జ్ఞాపకముంచుకొనుటకు ప్రయత్నింపలేదు. అతనికి వివాహాము కాలేదు. అందువలన నందఱును అతనిని 'బ్రహ్మచారి' అని పిలువసాగిరి. ఆపేరు అతనికి వచ్చెను. ఆపేరు అతనికి మఱి ఇతరపేర్లవలెనే చక్కగా సరిపోయెను. అందువలన అతడు బ్రహ్మచారిగనే స్థిరపడిపోయెను. చర్చి ఆవరణలోని రెండు ఇండ్లలోను కట్టెలున్నట్లు ఇదివఱకు చెప్పియుంటిని. ఆ కట్టెల నచ్చట బ్రహ్మచారియే స్వయముగా వేసియుండెను.

బ్రహ్మచారి నెలబాల ఇంటితలుపులు త్రోసి కొంచెము సేపు గుమ్మమువద్ద నిలబడెను. తరువాత ఆయింటికి ఏమా త్రము నూతనుడు కానట్లు లోని కడుగుపెట్టెను.

అతడు ఉపాధ్యాయునకు నమస్కరించుచు, "ఇచ్చటకు క్రొత్తగావచ్చిన ఉపాధ్యాయులు మార్టన్ మహాశయులు మీరేనా ?" అని ప్రశ్నించెను.

"అయ్యా ! నేనే !"

"మీరిచ్చటకు మంచి సిఫారసుతో వచ్చియున్నారు. మిమ్ములను చూడగలిగినందులకు నేను ఎంతయు సంతోషించు చున్నాను. నిన్న నేను మిమ్ము త్రోవలో కలసికొని యుండెడి వాడనే. కాని నేను కొన్ని మైళ్ళ దూరమున నివసించుచున్న ఒకరికి ఒక ముఖ్యమైన వార్తను తీసికొని పోవలసిన అవసర మేర్పడెను. అందువలన నేనచ్చటకు పోయియుంటిని. అచ్చటి నుండి ఇంతకుముందే తిరిగి వచ్చియుంటిని. చర్చిపనిచూచు అమ్మాయి ఈ అమ్మాయియేనా ?" అని అతడు నెలబాల చెక్కిళ్ళను ముద్దుపెట్టుకొనుచు ఆమెవంక కదియొక విధముగా చూచెను. ఉపాధ్యాయుడదిచూచి యిట్లనెను: "అయ్యా ! ఆమె ఇటీవల జబ్బుపడినదని తెలుపుట కెంత విచారించు చున్నాను."

"అవునవును. ఆ విషయము నాకు తెలియును. ఆమె ఎన్నో బాధలుపడినది. ఆమె హృదయము తీవ్రముగ గాయ పడినది."

"అయ్యా! మీరన్నమాట నిజమే."

బ్రహ్మచారి తాతయ్యవంక చూచెను. తరువాత నెల

బాల వంకను చూచెను. ఆమె హస్తమును మెల్లన తన చేతుల లోనికి తీసికొనెను. పిమ్మట నిట్లనెను: "అమ్మాయి! నీ విచ్చట సుఖముగా జీవింపవచ్చును. మేమందఱ మందులకు తోడ్పడుదుమని విశ్వసింపుము అప్పుడే నీ విచ్చట చాల మెఱుగులు దిద్దినావు. ఇదియంతయు నీవు చేసినపనియేనా?"

"అవును, మహాశయా!"

"ఇంకను కొన్ని మెఱుగులు దిద్దుట కవకాశమున్నది. ఆ పనులనుగూడ చేయుదము. ఏయేపను లింకను చేయవలెనో చూతము. ఒకసారి చూతము."

అట్లని ఆతడు ఆ యింటిలోని గదులన్నిటిని పరిశీలనగా చూచెను. అప్పుడతని వెంట నెలబాలకూడ నుండెను. తరువాత వారు ఉపాధ్యాయునిగృహమునుగూడ పరిశీలనగాచూచిరి. రెండు ఇండ్లలోని చిన్న చిన్న సౌకర్యముల నెన్నిటినో సమకూర్చ వలసిన అవసరమున్నదని అతడు అభిప్రాయపడెను. "ఈ సౌకర్యములన్నియు నున్నచో జీవిత మెంతయు సుకరముగా నుండును. వీనినన్నిటిని నే నిప్పుడే సమకూర్తును"అని అతడనెను. ఆతడన్నట్లుగనే ఎన్నోవస్తువు లచ్చటకు వచ్చెను. అతడు వెళ్ళిపోయి అయిదారు నిముషములలో ప్రత్యక్షమయ్యెను; అతడు తనతోబాటు ఎన్నో వస్తువులు తీసికొనివచ్చెను. అతనివెంట ఒకబాలు డుండెను. ఆ బాలుడుకూడ ఎన్నో వస్తువులను తీసికొని వచ్చెను. వారా వస్తువుల నన్నిటిని నేలమీద పఱచిరి. వానినన్నిటిని అమర్చుటకు చాలసేపుపట్టెను. బ్రహ్మచారి ఎంతో సంతోషముతో ఆపనిని చేయించెను.

పని అంతయు పూర్తియైనతరువాత బ్రహ్మచారి తన

వెంటవచ్చిన బాలునితో నిట్లనెను: "అబ్బాయి! నీవు వెంటనే పోయి నీతోడి విద్యార్థులనందఱను ఇచ్చటకు తీసికొనిరమ్ము. క్రొత్తగావచ్చిన ఉపాధ్యాయ మహాశయుల పరిచయము చేసికొనవలసి యున్నది."

పిమ్మట నతడు ఉపాధ్యాయునివంకతిరిగి ఇట్లనెను: "మార్టన్ మహాశయా! ఇచ్చటి విద్యార్థులు చాల మంచివారు. మీకు సంపూర్ణమగు సంతృప్తి కలిగింతురు. కాని వారినిగూర్చి నేనీ విధముగ అభిప్రాయ పడుచున్నట్లు వారికి తెలియనీయను. తెలిసినచో వారు పాడైపోవుదురు."

మఱికొంతసేపటికి కచ్చటకు పలువురు విద్యార్థులు వచ్చిరి. బ్రహ్మచారిని చూడగనే వారందఱును రకరకములుగా తమ గౌరవ భావములను, భక్తిప్రవృత్తులను ప్రకటింపసాగిరి. అవి బ్రహ్మచారికి సంపూర్ణమగు సంతృప్తిని కలిగించెను. అందువలన నతడు తల ఊపియు, రకరకములుగా మందహాసము చేసియు ఆ సంతృప్తిని బహిరంగ పఱచెను. విద్యార్థులను బహిరంగముగా ప్రశంసింపనని అతడంతకముందు ఉపాధ్యాయునకు చెప్పియుండెను. కాని యిప్పుడతని ప్రవర్తన అందుకు విరుద్ధముగా నుండెను. వారిని ప్రశంసించుచు అతడు మెల్లన మాట్లాడ సాగెను. కాని ఆతని మాటలు ప్రతి విద్యార్థికి వినబడుచునే యుండెను.

బ్రహ్మచారి ఉపాధ్యాయునితో నిట్లు చెప్పసాగెను: "ఉపాధ్యాయ మహాశయా! ఈ మొదటి విద్యార్థి జాన్ అవన్. చాల మంచివాడు. నిజాయితీపరుడు. మనస్సులోని విషయమును బయటకు వెళ్ళగ్రక్కుచుండును. కాని యితనికి కొంచెము

ఆలోచన తక్కువ; స్వేచ్ఛగా మాట్లాడు చుండును. ఆట లనిన నితనికి ఎక్కువ ప్రీతి. ప్రాణములు పోగొట్టుకొనుటకైన సిద్ధపడును."

తరువాత బ్రహ్మచారి మఱియొక విద్యార్థిని చూపి ఇట్లు చెప్పసాగెను: "అయ్యా! ఈ అబ్బాయిని చూడుడు. ఇతనిని చూచుచున్నారా? ఇతని పేరు రిచర్డుఇవాన్సు. పాఠములను చక్కగా నేర్చుకొను చుండును. అద్భుతమగు జ్ఞాపకశక్తి కలదు. విషయములను అర్థముచేసి కొనుటయందు గొప్పనేర్పు కలదు. ఇతనికి మధురమైన గొంతుకలదు. ప్రార్థనా గీతములు పాడుటయందితనికి సమానమైన విద్యార్థి మఱియొకడు లేడు. కాని యితడు సహజమరణము పొందడు. చర్చిలో ఇతడెప్పుడును నిదుర పోవుచుండును. మతాచార్యుని బోధన లితనిచెవికి పట్టవు."

బ్రహ్మచారి మఱియొక బాలునిచూపుచు మార్టన్‌మహాశయులతో నిట్లనెను: అయ్యా! యీ బాలుని చూడుడు. పలుచని జుట్టు, నీలి కళ్లుగల ఈ బాలుని చూడుడు. ఇతడు గొప్ప ఈతగాడు. ఒకసారి యితడు గ్రుడ్డివాని కుక్క యొకటి నీటిలో మునిగిపోగా దానిని పైకి తీసి రక్షించినాడు. నాకా సంగతి తెలియగానే ఇతనికి రెండు గినీలు పంపితిని. కాని నేను పంపినట్లు ఇతనికి ఏ మాత్రము తెలియదు. ఈ విషయమును ఎవ్వరికిని చెప్పకుడు."

తరువాత బ్రహ్మచారి ఇంకొక బాలునిగూర్చి చెప్పెను. అటు పిమ్మట మఱియొక బాలునిగూర్చి చెప్పెను. ఆ విధముగా సతడు అచ్చట నున్న బాలురందఱినిగూర్చి చెప్పెను. చివరకు

అందఱకు ఏవేవో బహుమతులనిచ్చి, "ఇంక మీరు ఇంటికి పోవచ్చును. తిన్నగా మీ యిండ్లకు పొండు. మధ్య మధ్య ఆగ వలదు. పెడదారులు త్రొక్క వలదు" అని యనెను. అంతట విద్యార్థులందఱును వెళ్ళిపోయిరి. తరువాత బ్రహ్మచారి నెలబా లకు కొన్ని తాళపు చెవుల నిచ్చి చేయవలసిన పనులను చెప్పి వెళ్ళిపోయెను.

మఱునాటి యుదయమున నెలబాల పెందలకడ లేచి తన యింటిపనులను, ఉపాధ్యాయుని ఇంటిపనులను పూర్తి చేసెను. తరువాత నామె మేకుకు తగిలించియున్న చిన్న తాళపు చెవుల గుత్తిని తీసికొని ఒంటరిగా చర్చివద్దకు పోయెను.

అప్పుడు ఆకాశము కడు ప్రశాంతముగ నుండెను. గాలి పరిశుభ్రముగ నుండెను; క్రొత్తగా రాలిన ఆకుల సౌరభముతో నిండి యుండెను. ప్రక్కనే ప్రవహించుచున్న ప్రవాహము చక్కగా తళతళమని మెఱయుచు ధ్వనిచేయు చుండెను.

కొందఱు బాలురు సమాధుల చాటున దాగు కొనుచు, కేరింతలు కొట్టుచు ఆడుకొను చుండిరి.

నెలబాల చాల యెత్తుగానున్న చర్చి గోపురమును చూచుచు చర్చిని దాటిపోయెను. ఆమె ఆవరణ గేటుకూడా దాటిపోయి గ్రామములో ప్రవేశించెను. తిన్నగా చర్చికి సంబం ధించిన రెండవ ఉద్యోగి వద్దకుపోయెను. అతడు కీళ్ళ వాత ముతో బాధపడుచున్నాడని ఇదివఱకు చెప్పియుంటిమి.

"అయ్యా! తమ ఆరోగ్యము అభివృద్ధి చెందుచున్నదా?" అని నెలబాల చర్చి ఉద్యోగిని ప్రశ్నించెను,

"అభివృద్ధి చెందుచున్నది. నేను నీకెంతయు కృతజ్ఞుడను."

"అనతికాలములోనే తమకు సంపూర్ణారోగ్యము చేకూరును."

"అంతయు దైవచిత్తము. మనము కొంచెము ఓపిక పట్టి యుండవలయును. లోనికిరమ్ము. లోనికిరమ్ము."

అంతవఱకు వారిరువురును యింటిముంగిట నిలబడి యుండిరి. ఉద్యోగి ఇంటిలోనికి పోయెను. నెలబాల అతనిని వెంబడించెను.

"ఇది ఒక్క గదిమాత్రమే. పైన ఒక గదియున్నది. మెట్లు సరిగా లేకపోవుటవలన దాని నుపయోగించుట లేదు. మెట్లు బాగుచేయించి దాని నుపయోగింపవలయునని అనుకొను చున్నాను."

గోడమీద కొన్ని పనిముట్లు వ్రేలాడుచుండెను. నెలబాల వానిని ఆశ్చర్యముతో చూడసాగెను.

"ఆ పనిముట్లన్నియు గోరీలు త్రవ్వుట కుపయోగించునని తలచుచున్నావా?"

"అన్ని పనిముట్లు ఎందుకా అని ఆశ్చర్యపడుచున్నాను."

"నీవు ఆశ్చర్యపడవచ్చును. నేను తోటపని చేయుచుం దును. నేను నేలత్రవ్వి విత్తనములు చల్లుచుందును. మొక్కలు పాతిపెట్టుచుందును. అవి పెరిగి పెద్దవగుచుండును. ఆ మధ్యనున్న పాఱను చూచినావా?"

"అది చాల ప్రాతది. పాడైపోయినట్లున్నది."

"కాదు. దానితో ఎంత పనిచేసితినో నాకు, దానికి

మాత్రమే తెలియును."

"మీ పనిని పూలమొక్కలు మున్నగునవి తెలియ జేయుచునేయున్నవి."

"నీవు చర్చిలోనికి వెళ్ళియుంటివా?"

"నేనిప్పు డచ్చటకు పోయెదను."

తరువాత వారు మఱికొన్ని విషయములను గూర్చి ముచ్చటించుకొనిరి. అటు పిమ్మట నెలబాల చర్చి వద్దకు వెళ్ళెను.

తాతా మనమరాండ్రు, ఉపాధ్యాయుడు తమతమపనులు చక్కగా చేసికొనుచు సుఖముగా జీవించుచుండిరి. ఆ యూరి ప్రజలు వారిని అపరిమితముగా ప్రేమించుచుండిరి. ముఖ్యముగా నెలబాల అందఱి అభిమానమును చూరగొనెను. "ఇటువంటి అమ్మాయిని మే మిదివరకు చూచియుండలేదు. ఈమె దేవతా కన్య" అని అందఱును ఆమెను పరిపరి విధముల ప్రశంసింప సాగిరి.

13

మనము తాతా మనమరాండ్రతో కలసి చాలదూరము వచ్చినాము. మఱి దుర్మార్గుడగు క్విల్పు ఏమైనట్లు? తాతా మనమరాండ్రపట్ల అపరిమితమగు అభిమానము, ప్రేమకల కిట్ ఏమైనట్లు? మనము కొంచెము వెనుకకుపోయి వారి సంగతిని

కూడ గమనింతము.

క్వీల్పు తాతా మనమరాండ్రను పట్టుకొనవలయునను ఉద్దేశ్యముతో ఎన్నో ప్రయత్నములు చేయసాగెను. అతడు స్వయముగా పెద్దపెద్ద పట్టణములకుబోయి వెదకసాగెను. ఆ సందర్భముననే ఒకసారి నెలబాల అతనిని చూచుట తటస్థించెను. కాని అదృష్టవశమున నతడామెను చూచియుండలేదు. ఎన్ని ప్రయత్నములు చేసినను తాతా మనమరాండ్రజాడ అతనికి తెలియకుండెను. కాని అతడు తన ప్రయత్నమును మాత్రము మానలేదు.

ఇక కిట్ విషయమును ఆలోచింతము. అతడు తన తల్లిని, తమ్ముని, చెల్లెలిని పోషింపవలసియుండెను. అందువలన నతడు ఏదేని యుద్యోగము దొరకునని లండను మహానగరములోని అనేక ప్రాంతములకు పోవుచుండెను. ఆ సందర్భమున నతడు పూర్వము తాతా మనమరాండ్రు నివసించిన గృహమునకు ప్రక్కగా పోవుచుండెడివాడు. వారువచ్చిన జాడ ఏమైన కనబడునేమోయని అత డాశపడుచుండెడివాడు. వారు తప్పక తిరిగివత్తురని క్వీల్పు చెప్పియుండెనుగదా! తన ఇంటికి రావలసినదని మున్నతడు నెలబాలను ఆహ్వానించియుండెను. అందువలన వారు తన యింటికిగూడ రావచ్చునని అతడాశించుచుండెను. కాని అతనిఆశ సఫలము కాకుండెను. అయినను అతడు, "వారు త్వరలో తప్పకవత్తురు" అని సంతృప్తి చెందుచుండెను.

ఒకనాడతడు నిట్టూర్పుపుచ్చుచు తన తల్లితో నిట్లనెను: "అమ్మా! వారు తప్పక త్వరలో వత్తురనుకొందును. వారప్పుడే వెళ్ళిపోయి వారము రోజులైనది. వారు లండను మహానగర

మును విడిచిపెట్టి వారము రోజులకంటె ఎక్కువ ఉండరను కొందును. మఱి నీవేమందువు?"

"ప్రతిరోజును నీవీ విధముగనే అనుకొనుచున్నావు. కాని నిరాశ చెందుచున్నావు. ఈ విషయమును జ్ఞప్తియందుంచు కొనుము" అని తల్లి అనెను.

అమ్మా! నీవన్న మాట నిజమే. నీవు ప్రతివిషయమునను బాగుగా ఆలోచించి మాట్లాడుచుందువు. నీ మాటలు నూటికి నూరుపాళ్ళు నిజమగుచుండును. కాని వారు వారము రోజుల కంటె ఎక్కువ ఉండరని అనుకొనుచున్నాను. వారము రోజులు చాల ఎక్కువ కాలము కదా!"

"అవునవును. వారమురోజులు చాల ఎక్కువకాలమే! కాని వారసలు తిరిగి రాకపోవచ్చును."

తల్లిమాటలు కిట్కు నచ్చలేదు. అతడొక్క నిమిషము ప్రశాంతముగ నుండెను. తరువాత నిట్లనెను: "అయినచో అమ్మా! మఱివారు ఏమైపోయినారందువు? వారు సముద్రముల మీదకు పోయిరందువా?"

"వారు నావలలో ఉద్యోగముచేయుటకు పోయియుండక పోవచ్చును. కాని వారే దేని విదేశమునకు పోయియుందురని అనుకొనుచున్నాను."

"అమ్మా! నీవా విధముగ మాట్లాడకుము."

"అబ్బాయి! ఆ విషయము మనకు రుచింపకపోవచ్చును. కాని సత్యమదియే. పలువురు ఆ విధముగ చెప్పుకొనుచుండగా నేను నా చెవులతో వినియున్నాను. వారు ఓడలో ప్రయాణము చేయుచుండగా చూచినవారుకూడ కొందఱున్నారు. వారేదో

పట్టణములో ప్రవేశించినారట. ఆ పట్టణము పేరును ఉచ్చరించుట చాలకష్టము. అందువలన నాకది జ్ఞప్తియందులేను."

"నేనా విషయమును నమ్మను. అందు ఒక్కమాటయైనను నమ్మను. పనిపాటలులేని వదఱుబోతులెవ్వరో ఆవిధముగా చెప్పియుందురు. అందు సత్యము ఆవంతయులేదు."

"వారు చెప్పినది తప్పయియుండవచ్చును. ఆ విషయమునుగూర్చి నేనేమియు చెప్పలేను. బహుశా వారు చెప్పినది సరియై యుండవచ్చును. ముసలివాడు కొంతధనమును దాచినాడట! ఆ సంగతి ఇతరుల కెవ్వరికి తెలియదట! నీవు అప్పుడప్పుడు మఱుగుజ్జు క్విల్పునుగూర్చి చెప్పుచుందువుగదా! అతనికి గూడ ఆ సంగతి తెలియదట! తాతా మనమరాండ్రు ఆ ధనముతో విదేశములకు పోయినారట. అచ్చట వారివద్దనుండి ఆ ధనమును ఎవరును తీసికొనలేరుకదా! వారచ్చట హాయిగ జీవింపవచ్చును. ఈ విషయము నాలోచింపక వారు విదేశములకుపోయి యుండుట సహజమనియే తోచుచున్నది."

కిట్ విచారముతో తల గోకుకొనెను. అతనికి తల్లి మాటలు ఏమాత్రము రుచింపకుండెను.

ఒకనాటి యుదయమున కిట్ ధనికులెక్కువగా నివసించుచున్న వీధిలో నడచిపోవుచుండెను. అప్పుడా వీధిని ఒక గుఱ్ఱపు బండివచ్చి ఒక ఇంటిముందు ఆగెను. ఆ బండిలో గార్లెండ్ దంపతులుండిరి. వారు ఇంటిలోనికి పోయినపుడు గుఱ్ఱమును పట్టుకొనుట కెవ్వరైన దొరకెదరేమోయని అటునిటు చూడసాగిరి. అంతలో నచ్చటకు కిట్ వచ్చెను.

గార్లెండ్ కిట్‌నుచూచి, "అబ్బాయి! మేమిరువురము

లోనికిపోయి తిరిగి వత్తుము. అంతవఱకు నీవీ గుఱ్ఱమును పట్టుకొని యుండుము. ఈ బండినికూడ చూచుచుండుము. నేను నీకు తగిన ప్రతిఫలమిత్తును" అని యనెను.

కిట్ సంతోషముతో అందుల కంగీకరించి గుఱ్ఱమును పట్టుకొనెను. అంతట గార్లెండ్ దంపతులు లోనికిపోయిరి. వారు తమపని ముగించుకొని బయటకు వచ్చిరి. వారు గుఱ్ఱపుబండిలో ప్రవేశించిరి. కిట్‌కు ఆఱుపెన్నీల నీయవలయునని గార్లెండ్ జేబులో చేయిపెట్టెను. కాని అచ్చట ఒకషిల్లింగు నాణెముండెను. కిట్‌కు షిల్లింగు నీయవలసిన పనిలేదనియు, ఆఱు పెన్నీలిచ్చిన చాలుననియు అతడు భావించుచుండెను. కాని చిల్లర ఎక్కడనుండి వచ్చును?

అతడు షిల్లింగు నాణెమును కిట్‌కుఇచ్చి, "అబ్బాయి! ఆఱు పెన్నీలను నాకు తిరిగియిమ్ము" అని అనెను.

"అయ్యా! నావద్ద చిల్లరలేదు!" అని కిట్ అనెను.

"అయినచో షిల్లింగు నాణెమును నీ వద్దనే ఉంచుకొనుము. మరల నిదేరోజున ఇంతకుముందు వచ్చినసమయమునకే ఇచ్చటకు రమ్ము. అప్పుడుకూడ నీవు గుఱ్ఱమును పట్టుకోవచ్చును. ఇంక నీవు నాకు చిల్లరనీయవలసిన పనియుండదు."

"చిత్తము."

సరిగా వారమురోజులకు నిర్ణీత సమయమున కిట్ అచ్చట ప్రత్యక్షమయ్యెను. గార్లెండ్ దంపతులు మరల గుఱ్ఱపుబండిలో నచ్చటకువచ్చిరి. కిట్ అప్పుడుకూడ గుఱ్ఱమును పట్టుకొనెను. కొంతసేపటికి లోపలనుండి ఒకడువచ్చి, "నీవు లోనికి పొమ్ము. నేను గుఱ్ఱమును పట్టుకొనెదను" అనియనెను. అంతట

కిట్ లోనికిపోయెను.

ఒక గదిలో గార్లెండ్ దంపతులును, ఒక గౌరవనీయుడును కూర్చుండియుండిరి.

గౌరవనీయుడు కిట్‌తో నిట్లనెను: "అబ్బాయి! క్రిందటిసారి వీరివద్దనుండి ఒక షిల్లింగు తీసికొనియుంటివి. నీవు వారికి ఆఱుపెన్నీలు తిరిగి యీయవలసియుండెను. అందుకు బదులుగా పనిచేయుటకే కదా నీవు వచ్చినది? మఱియొక షిల్లింగు ఇత్తురని ఆశించుట లేదుకద!"

కిట్ ధైర్యముతో నిట్లనెను: "అయ్యా! మఱియొక షిల్లింగు ఇత్తురని ఆశించుటలేదు. ఆ విధముగ నే నెప్పుడును అనుకొనియుండ లేదు."

"మీ తండ్రి జీవించియున్నాడా?"

"చనిపోయినాడయ్యా!"

"తల్లి?"

"జీవించియున్నదయ్యా!"

"ఆమె తిరిగి వివాహం చేసికొన్నదా?"

"అయ్యా! ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. మీ రామెను ఎఱుగరు. ఎఱిగియున్నచో ఆ విధముగ ప్రశ్నించియుండరు."

అంతట గౌరవనీయుడు కిట్‌ను ప్రశంసించుచు ప్రక్కనే కూర్చుండియున్న గార్లెండ్‌తో మాట్లాడెను. వారు కిట్‌ను మఱికొన్ని ప్రశ్నలు వేసిరి. ఎట్టకేలకు గార్లెండ్ ఇట్లనెను, "అబ్బాయి! నేనిప్పుడు నీ కింకేమియు ఈయబోవుటలేదు."

"నేను మీ కెంతయు కృతజ్ఞుడను."

"కాని నేను నిన్ను గుఱించి మఱికొన్ని విషయములు

తెలిసికొనవలసియున్నది. కావున నీ నివాసమెచ్చటనో తెలుపుము. నేను నా నోటుపుస్తకములో వ్రాసికొందును.”

కిట్ తన విలాసమును చెప్పెను. అతడు దానిని తన నోటుపుస్తకములో వ్రాసికొనెను. అంతట గారెండ్ దంపతులు కిట్‌తో బాటు బయటకువచ్చిరి. వారు గుఱ్ఱపుబండిలో ప్రవేశించి వెళ్ళిపోయిరి.

కిట్ తాతా మనమరాంఢ్రను గూర్చి ఆలోచించుచు మెల్లన ఇంటికిపోయెను. అప్పుడతని ఇంటిముందు గార్లెండ్ దంపతుల గుఱ్ఱపుబండి ఆగియుండెను. అదియచ్చటకెందులకు వచ్చినదా యని అతడాశ్చర్యపడుచు ఇంటిలోనికిపోయెను. లోపల గార్లెండ్ దంపతులు, కిట్ తల్లితో ఏమోమాట్లాడుచుండిరి. కిట్ కంతయు అయోమయముగనుండెను.

గార్లెండ్ మందహాసము చేయుచు నిట్లనెను! “అబ్బాయి! కిట్! చూచినావా? నీ కంటె ముందుగనే మేము మీయింటికి వచ్చినాము.”

“చిత్తము” అనియని కిట్ తల్లివంకకుచూచెను. అతని చూపు, “వీరిచ్చటకెందులకు వచ్చినట్లు?” అని ప్రశ్నించుచున్నట్లుండెను.

అతని ప్రశ్నను గ్రహించినదానివలె కిట్‌తల్లి ఇట్లు చెప్ప సాగెను. “అబ్బాయి! ఈ మహానీయుడు నీవు ఎచ్చట పని చేయుచున్నావో తెలిసికొన గోరినారు. నీవు ఎచ్చట పనిచేయుట లేదనియు, ఉద్యోగముకొఱకు ప్రయత్నించుచున్నావనియు తెలిపితిని. అంతట వీరు దయతో......”

మధ్యలో గార్లెండ్ దంపతులు జోక్యముకలుగుజేసికొని

యిట్లనిరి; "మా యింటిలో పనిచేయుటకొరకు చక్కనిబాలుడు కావలెనని చెప్పియుంటిమి. అన్నిసంగతులు సరిగానున్నచో మాయింట ఉద్యోగమిత్తుమని యంటిమి."

ఆ మాటలనుబట్టి వారు కిట్‌ను తమవద్ద పనికినియమించుకొనవలయునని భావించుచున్నట్లు స్పష్టమగుచుండెను. అందువలననే వారు ఎంతో జాగ్రత్తగా ప్రశ్నలు వేయసాగిరి. కిట్ మాత్రము తనకా విషయమున విజయము లభింపదని భయపడుచుండెను.

గార్లెండ్ సతి, కిట్ తల్లితో ఇట్లు చెప్పసాగెను: "ఇటువంటి విషయములలో చాల జాగ్రత్తగ నుండవలయునను విషయము నీకు బాగుగ తెలియును. మాయింటిలో ముగ్గురము మాత్రమే యున్నాము. ఈ విషయములో మేము పొరపాటు చేసినచో తరువాత విచారింపవలసివచ్చును. కావున ముందుజాగ్రత్త మంచిది."

అంతట కిట్ తల్లి ఇట్లనెను: "అమ్మా! మీరు చెప్పిన మాట ముమ్మాటికి నిజము. మీరు చేయుచున్నపని సముచితముగనున్నది. మా అబ్బాయిని గురించి మీరు ఇష్టమువచ్చినట్లు ప్రశ్నింపవచ్చును. అతని గుణగణములలో నేను సిగ్గుపడవలసినదేదియులేదు. నా కుమారుడు చాలమంచివాడని నేను గుండె నిబ్బరముతో చెప్పగలను. ఈ విషయమున అతనికి తండ్రి అంశ వచ్చినది. నా భర్త తనతల్లికి సుపుత్రుడు. నాకు ఆదర్శప్రాయమైనభర్త." ఆ విధముగా నామె తనకథను చాలసేపుచెప్పెను.

కిట్ తల్లి మాట్లాడుట పూర్తియైనతరువాత గార్లెండ్ సతి మాట్లాడసాగెను: "మీరు నిజాయితీ పరులనుటకు నాకెట్టిసందే

హాము నులేదు. అందువలననే మేము మీయింటికివచ్చి యీవిధ ముగ మాట్లాడుచున్నాము. మీ యిల్లు చాల పరిశుభ్రముగ నున్నది. మీపిల్లలుకూడ చాల పరిశుభ్రముగ నున్నారు. ఇందుకు మిమ్ము నేనెంతయు ప్రశంసించుచున్నాను."

"నేను మీ కెంతయు కృతజ్ఞురాలను" అని కిట్ తల్లి అనెను.

తరువాత గార్లెండ్ సతి కిట్ జీవిత చరిత్రకు సంబంధించిన వివరముల నన్నిటిని అతని తల్లివద్దనుండి తెలిసికొనెను. కిట్ తల్లి ఏ చిన్నవిషయమునుగాని వదలిపెట్టక అన్నివిషయములను తెలిపెను. తరువాత గార్లెండ్ సతి కిట్ విద్యార్హతలు మున్నగువానిని గురించి అడిగి తెలిసికొనెను. ఆమె తనకుమారుడు ఎబెల్ను గూర్చి కిట్ తల్లికి వివరముగా చెప్పెను. మరియు నామె కిట్ కు ఉన్న దుస్తులనుగురించి అడిగి తెలిసికొనెను. అతనికి ఎన్నో దుస్తులు లేవు. అందువలన క్రొత్త దుస్తులను కుట్టించవలసినదని ఆమె కిట్ తల్లికి కొంతసొమ్ము నిచ్చెను. మీఅబ్బాయిని మావద్ద పనిచేయుటకు తీసికొనిపోదుము. అతనికి కావలసిన భోజనవసతి సౌకర్యముల నన్నిటిని సమకూర్చుదుము. పైగా అతనికి సంవత్సరమునకు ఆరుపౌనుల సొమ్మిచ్చెదము" అని గార్లెండ్ దంపతులు అనిరి. కిట్ తల్లి అందులకంగీకరించెను. ఆ ఏర్పాటుకు అందరును అపరిమితముగా సంతోషింపసాగిరి.

"ఎల్లుండి ఉదయముననే నీవు మాయింటికి రావలయును" అని గార్లెండ్ దంపతులు కిట్ తో అనిరి. అందుకు కిట్ అంగీకరించెను. తరువాత నాదంపతులు కిట్ తమ్ముడు జాకబ్ కు ఒక అర క్రౌనునాణెమును, ఊయలలోనున్న పసిబిడ్డకొక అరక్రౌనునాణె

మును బహూకరించిరి. పిమ్మట వారాగృహమును వీడిపోయిరి.

కిట్ వారిని వీధిలోనికి సాగనంపి ఇంటిలోనికి తిరిగివచ్చి తల్లితో నిట్లనెను: "అమ్మా! నాభవిష్యత్తుకు చక్కనిరాజబాట ఏర్పడినదని నమ్ముచున్నాను."

"కిట్! నేనుకూడ ఆ విధముగనే నమ్ముచున్నాను. సంవత్సరమునకు ఆఱుపౌనులు! ఒక్కసారి ఆలోచింపుము.

"అవును! మీరందఱు నింకసుఖముగా జీవింపవచ్చును.

అంతలో నెవ్వరో వికృతముగ నిట్లనిరి; "సంవత్సరమునకు ఆఱుపౌనులా! సంవత్సరమునకు ఆఱుపౌనులా!"

ఆవిధముగ నన్నవాడు దుర్మార్గుడగు క్విల్పు. అతడు లోనికి ప్రవేశించి యిట్లనెను; "అతనికి సంవత్సరమునకు ఆఱు పౌనులసొమ్మునిత్తుమని ఎవ్వరన్నారు? ఆవిధముగ ముసలివాడు అన్నాడు? లేక నెలబాలఅన్నదా? మఱి ఆఱుపౌనులను ఎందుకిచ్చెదమన్నారు? వారు ఎచ్చటనున్నారు?"

వికృతరూపముగల క్విల్పును చూడగనే కిట్తల్లి భయపడి ఊయలలోనికి పిల్లవానిని తీసికొని చాల దూరముననున్నగది మూలకు పోయెను. అంతవఱకు ఊరకకూర్చున్న జాకబ్ అతనిని చూడగనే గోలుగోలున ఏడువసాగెను.

ఆవిధముగ వారిని భయపెట్టగలిగినందుకు మందహాసము చేయుచు క్విల్పుఇట్లనెను: "అమ్మా! భయపడకుము. నీ కుమారుడు కిట్నన్నెఱుగును. నేను పసిబిడ్డలను తినువాడనుగాను. నాకు వారన్న ఏమాత్రమిష్టములేదు. ఆబాలుడు అట్లు ఏడ్చుచున్నాడెందులకు? అతని ఏడ్పును మాన్పుము. అబ్బాయి! ఏడ్పు మానెదవా, మానవా?"

ఆమాటలను వినగానే జాకబ్ ఏడ్పుమాని శిలాప్రతిమ వలె నైపోయెను.

క్విల్పు అతనివంక భీకరముగ చూచుచు, "అబ్బాయి! జాగ్రత్త! మగలవేడ్పు ప్రారంభింపకుము. ఏడ్చినచో నీవీపుబ్రద్దలు కొట్టెదను. కిట్! నీవునన్ను కలసికొందుమనని వాగ్దానము చేసి యుంటివికదా! మఱినీవునాయొద్ద కెందులకు రాలేదు?"

అప్పుడు కిట్ గట్టిగానిట్లునెను; "నేనెందుకురావలయును? నీతో నాకేమి పనియున్నది? నాతో నీకేమిపనియున్నది?"

అంతటక్విల్పు కిట్ తల్లివంకకు తిరిగియిట్లనెను! "అమ్మా! చూడుము, నీకుమారుడేమనుచున్నాడో! నీకుమారుని పూర్వ యజమానుడు కడసారిగా ఇచ్చటి కెప్పుడువచ్చినాడు? లేక కబురుపంపినాడు? అతడిప్పుడిచ్చట నున్నాడా? లేకపోయినచో ఎచ్చటకువెళ్ళినాడు?"

"అతడిచ్చటకు రానేలేదు" అని కిట్తల్లి చెప్పసాగెను; "అతడిప్పుడు ఇచ్చటకువచ్చిన ఎంతయుబాగుండునని మేము అనుకొనుచున్నాము. కనీసమూ తాతా మనమరాండ్రు ఇప్పుడెచ్చట నున్నారో తెలిసినచో ఎంతయు బాగుండును. ఆ సంగతి తెలిసి నచో నాహృదయము, నాకుమారుని హృదయము తేలికపడును."

"అయిన మీకు వారికి సంబంధించిన వార్తలేవియు తెలియవన్న మాట!"

"తెలియవు. తెలిసిన బాగుండుననుకొను చున్నాము."

అంతటక్విల్పు కోపములో బయటకువెళ్ళిపోయెను.

కిట్ ప్రయాణమునకు కావలసిన ఏర్పాట్లనన్నిటెని చేసికొనెను. అతడు తనతల్లినిగూర్చి బాధపడుచుండెను.

"అమ్మా! నీవిచ్చట ఉత్సాహముగ జీవితము గడపవలయును. నేను లేసని నీవు ఏమాత్రము బాధపడవలదు. వీలు చిక్కినపుడెల్ల నేనిచ్చటకువచ్చి మిమ్ము చూచుచుందును. అప్పుడప్పుడు ఉత్తరములు వ్రాయుచుందును. సెలవు లభించినపుడు ఇచ్చటవచ్చి మీతో కలిసియుందును" అని అతడు తల్లితో ననెను.

"నీవు నన్ను గూర్చి ఏమియు భయపడవలదు. భగవంతుడు మనల నందఱను రక్షించుచుండును" అని తల్లిఅనెను.

"అవును. భగవంతుడు మనపక్షమున నున్నాడు కనుకనే నాకీ యుద్యోగము దొరకినది. అందుకు మనమెంతయు కృతజ్ఞులము" అని కిట్ ముకుళిత హస్తములతో ననెను.

నిర్ణీతదినమున కిట్ తనపెట్టెతో బయలుదేఱిపోయి గార్లెండ్ దంపతుల గృహమును చేరుకొనెను. అది చాలచక్కని గృహము. ఆ యింటికొకవైపున గుఱ్ఱపుశాల యుండెను. ఆ గుఱ్ఱపుశాలపై ఒక చిన్నగది యుండెను. ఇంటిగుమ్మములకు, కిటికీలకు తెరలు వ్రేలాడుచుండెను. కిటికీలదగ్గర వ్రేలాడుచున్న పంజరములలోని బంగారురంగు పక్షులు మధురముగ పాడుచుండెను. ఇంటిముందున్న దారికిరువైపులను రకరకముల మొక్కలుండెను. తోటలో రకరకముల పూల మొక్కలుండెను. ఆ పూలను వాసన అంతటను వ్యాపించుచుండెను. ఆ పూలుగూడ చూచుట కెంతయు అందముగా నుండెను. ఇంటిలోనేమి, ఇంటిబయటనేమి అంతయు క్రమముప్రకారముగను, పరిశుభ్రముగను నుండెను. తోటలో ఒక్క కలుపు మొక్కయైనను లేకుండెను.

కిట్ తనచుట్టును కలయజూచుచు ఎంతయు ప్రశంసింప సాగెను. ఎట్టకేలకతడు గంట మ్రోగించెను. ఎవ్వరును బలుక లేదు. అతడు రెండవసారి, మూడవ సారికూడ గంట మ్రోగించి తన పెట్టెమీాద కూర్చుండి వేచియుండెను. ఎవ్వరును రాలేదు. అతడు ఎన్నోసార్లు గంట మ్రోగించెను. అప్పటికిని ఎవ్వరును రాలేదు. ఇంక నతడు విసుగెత్తి మరల పెట్టెపై కూర్చుండెను. అంతలో నొక పనిపిల్ల మెల్లన తలుపులు తెఱచుకొని బయటకు వచ్చెను.

"అయ్యా! మీా పేరు క్రిస్టఫర్ అనుకొందును" అని ఆ పనిపిల్ల అనెను.

కిట్ పెట్టెమీాదనుండిలేచి "అవును. అది నాపేరే" అనియనెను.

"బహుశా మీారు గంటను చాలసార్లు మ్రోగించియుందురని నేను భయపడుచున్నాను. మేము దొడ్డిలో గుఱ్ఱమును పట్టుకొనుటలో నిమగ్నులమై యుంటిమి. అందువలన మాకు గంటమ్రోత వినపడలేదు."

కిట్ తనపెట్టెను తీసికొని పనిపిల్ల వెంట హాలులోనికి వెళ్ళెను. ఇంటియజమానుడు అతనిని సాదరముగ ఆహ్వానించెను. యజమానురాలు కూడ అటులే చేసెను. ఆమె కతడనిన అంతకంతకు సదభిప్రాయము కలుగసాగెను. దంపతు లిరువురును కిట్‌ను, అతని దుస్తులను ఎన్నోసార్లు పరీక్షగా చూచిరి. ఆ విషయమున వారికి సంపూర్ణమగు సంతృప్తి కలిగెను. తరువాత వారు గుఱ్ఱపుశాలలోనికి వెళ్ళిరి. గుఱ్ఱమతనిని చూడగనే ఆనందముతో సకిలించెను. అటుపిమ్మట వారు గుఱ్ఱపుశాలపై

నున్న గదిలోనికిపోయిరి. ఆ గది చాల పరిశుభ్రముగను, సౌఖ్య కరముగను నుండెను. కిట్‌కు ఆ గదిలోనే బసఏర్పాటు చేయ బడెను.

యజమానుడు తరువాత కిట్‌ను తోటలోనికి తీసికొని పోయి ఇట్లనెను: "నీవిచ్చట ఏమేమిపనులు చేయవలయునో నేర్పెదను. నీవు చక్కగా ప్రవర్తించి మంచిపేరు తెచ్చు కొన్నచో నీ జీవితము సుఖప్రదమగుటకు కావలసిన సౌకర్య ములనన్నిటిని సమకూర్చెదను." అతడింకను ఆ విషయమును గూర్చి దీర్ఘముగా మాట్లాడెను. అందుకు కిట్ అపరిమితమగు కృతజ్ఞతను తెలియజేసెను. తరువాత యజమానుడు కిట్‌ను యజమానురాలికి అప్పజెప్పెను. అపుడు యజమానురాలు పని పిల్ల (ఆమెపేరు బార్బరా)ను పిలిచి "అమ్మాయీ! ఇతనిని తీసి కొనిపోయి ఆహారపదార్థములను, పానీయములను ఇమ్ము" అని యనెను.

బార్బరా కిట్‌ను వంటగదిలోనికి తీసికొనిపోయెను. ఆ వంటగది చాల చక్కగానుండెను. అందు రకరకములగు ఆహారపదార్థములు, పానీయములు ఉండెను. కిట్ ఒక బల్ల ముందు కూర్చుండి కొన్ని ఆహారపదార్థములను భుజించి, ఏల్ పానీయమును త్రాగెను. బార్బరా ఆ గదిలోనే యుండెను. కాని ఒకరినొకరు చూచుకొనుటలేదు. కిట్ ఆ గదిలోనున్న బార్బరా వస్తువులన్నిటిని చూచెను. చివరకతడు తలయెత్తి అతనివంక చూడసాగెను. కాని హఠాత్తుగా నిరువురును తమ దృష్టిని ప్రక్కలకు మరల్చుకొనిరి. ఒకరి రహస్యము ఒకరికి తెలిసినందుకు వారు ఆందోళనపడసాగిరి.

14

ఒకనాడు విదేశములనుండి లండను మహానగరమునకొక గౌరవనీయుడు విచ్చేసెను. అతడు శ్వేతజాతీయుడే. కాని ఉష్ణ దేశములలో చాలకాలము ప్రయాణముచేసి యుండుటవలన అతని శరీరము నల్లగానుండెను. అతనికి లండను మహానగర మంతయు బాగుగ తెలిసినట్లుండెను. లండనునగరములో ప్రవేశించిన వెంటనే అతడు తిన్నగా పూర్వము తాతా మనమరాండ్రు నివసించిన గృహమునకు పోయెను. కాని అప్పుడు వారచ్చట లేరు. ఆ యింటితలుపులు తాళమువేసి యుండెను. అదిచూచి అతడెంతో ఆశాభంగము చెందెను.

ఆ యింటికొకబల్ల వ్రేలాడకట్టబడి యుండెను. ఆ యిల్లు అద్దెకీయబడుననియు, వివరములు తెలిసికొనగోరువారు లాయరు బ్రాస్‌ను కలసికోవలయుననియు ఆ బల్లమీాద వ్రాయబడి యుండెను. వెంటనే ఆ నూతనుడు బ్రాస్ గృహమునకు పోయెను. అచ్చట నాతడు బ్రాస్ ఇంటిలోని పైభాగము అద్దెకు ఈయబడునని తెలిసికొనెను. వారమునకొక పౌను అద్దెనిచ్చు షరతుమీాద అతడా భాగములో ప్రవేశించెను. అచ్చట నివసించుచు తాతా మనమరాండ్రనుగూర్చి తెలిసికొన వలయునని అతడు నిశ్చయించుకొనెను.

బ్రాస్ దుర్మార్గుడను విషయమును ఆ నూతనుడు అనతి కాలములోనే తెలిసికొని యుండెను. అందువలన నతడు తాతా

మనమరాంద్రనుగూర్చి బ్రాస్‌ను అడుగలేను; తన అంతర్యము నా దుర్మార్గునకు చెప్పలేదు.

రోజులు గడచిపోవుచుండెను. నూతనుడు తాతా మనమరాంద్రకు సంబంధించిన సంగతులను తెలిసికొనుటకు ప్రయత్నించుచునే యుండెను. కాని అతనికీ విషయమును అంతగా తెలియకుండెను.

ఒకనాడు ఇరువురు కీలుబొమ్మలాటగాండ్రు బ్రాస్ ఇంటి ప్రాంతమునకు వచ్చిరి. నూతనుడు వారిని తనగదిలోనికి తీసికొనిపోయి, రెండు కుర్చీలను చూపి, "ఆ కుర్చీలమీద కూర్చుండుడు" అని యనెను.

బొమ్మలాడగాండ్రు భయపడుచు, ఒకరివంక నొకరు సందేహముతో చూచుకొనుచు కుర్చీ అంచులపై కూర్చుండిరి. నూతనుడు వారికి రెండు గ్లాసులతో చక్కని పానీయము నొసగి ఇట్లనెను: "మీ రిరువురును సూర్యరశ్మికి నల్లపడిపోయి నారు. మీరు చాలకాలమునుండి తిరుగుచున్నారావేమి?" అని ప్రశ్నించెను.

"చిత్తము" అని ఒక బొమ్మలాటగాడు అనెను.

"అవునుస్వామీ!" అని రెండవవాడు అనెను.

ఆ ఆటగాండ్రు ఎవ్వరనుకొన్నారు? తాతా మనమరాంద్రను మోసపుచ్చనెంచిన కాడ్లిన్, షార్ట్ అను పేర్లుగల బొమ్మలాడగాండ్రే వారు. తాతా మనమరాంద్రు వారి బారి నుండియే తప్పించుకొనియుండిరి.

"మీరు సంతలు, ఉత్సవములు, గుఱ్ఱపు పందెములు మొదలగునవి జరుగు స్థలముల కన్నిటికి పోయియుందు రనుకొం

దును ?" అని నూతను డనెను.

"అయ్యా! మేము ఇంగ్లాండు పశ్చిమ ప్రాంతమంతయు సంచారము చేసినాము" అని పార్ట్ సమాధానమిచ్చెను.

"నేను ఇంగ్లాండు, తూర్పు ఉత్తర, దక్షిణ దిగ్భాగము లందు సంచారముచేసిన బొమ్మలాటగాండ్ర నింతవఱకు చూచి యుంటిని. కాని పశ్చిమ దిగ్భాగమున సంచారము చేసినవారిని చూచియుండలేదు.

"అయ్యా! మేము ప్రతి వేసవికాలములోను పశ్చిమ దిగ్భాగమున సంచారము చేయుచుందుము. అది అసలుసంగతి, వసంతకాలములోను, శీతాకాలములోను మేము లండనుకు తూర్పు దిగ్భాగమునందు సంచారము చేయుచుందుము. పశ్చిమ దిగ్భాగమున వేసవికాలములో సంచారము చేయుచుందుము. మే మింతకుముందు వాన అనక, బురద అనక పశ్చిమ దిగ్భాగమున సంచారముచేసినాము. కాని మాకు ఈ సంచారము ఏమియు లాభింపలేదు" అని పార్ట్ అనెను.

"అయిన మఱియొక గ్లాసెడుపానీయమును సేవింపుము."

అపుడు కాడ్లిన్ తన మిత్రుని గ్లాసును ప్రక్కకు త్రోసి వైచి తన గ్లాసుపట్టి ఇట్లనెను: "అయ్యా! మీకు నేనెంతయు కృతజ్ఞుడను. మీరు నా గ్లాసు నింపవలయును. ఏలయన అసలు బాధల నన్నిటిని అనుభవించినది నేను. ప్రయాణములో బాధ లన్నిటిని అనుభవించినవాడను నేను. పట్టణములోనైన, పల్లెలోనైన, ఎండలోనైన, వానలోనైన, చలిలోనైన, వేడిలోనైన బాధపడునది నేను! కాని ఆ విషయమును గుఱించి నేను ఒక్క మాటకూడ అనుకొనుటకువీలులేదు! ఎంతన్యాయముగనున్నదో

ఆలోచింపుడు. నా మిత్రుడు పార్ట్ తన యిష్టమువచ్చినట్లు లేనిపోని బాధ లన్నిటిని గూర్చి చెప్పుకోవచ్చును. కాని నేను ఉన్న బాధలనుగూర్చి చెప్పుకొనుటకు వీలులేదు !"

"కాడ్లిన్ వట్టి నిరుపయోగ మైనవాడని చెప్పుటకు వీలు లేదు. కాని అతనిలో ఒక పెద్దలోటున్నది. అత డెప్పుడును కన్నులు తెఱచుకొని యుండడు. ఒక్కొక్కప్పు డతడు నిదు రించు చుండును కాడ్లిన్! గుఱ్ఱపుపందెములు జరుగు స్థలమువద్ద జరిగిన సంగతి జ్ఞప్తియందున్నదికదా!" అని పార్టు అనెను.

అంతట కాండ్లిన్ ఇట్లనెను: "గోరంతలు కొండంతలుగా చెప్పుట మానవా? ఇతరుల మనస్సును కష్టపెట్టుట మానవా? పుండుపై కారము చల్లెదవా? ఆ సమయమున నేను నిదుర పోతినా ఏమి? నేను డబ్బులు పోగుచేసికొను పనిలో నిమ గ్నుడనై యుంటిని. అది చాల ముఖ్యమైనపనికదా! ఒక్క సారిగా అనేక ప్రదేశములలో జరుగుచున్న విషయములను ఈ కన్నులతో చూచుటెట్లు? నేను ఒక ముసలివానికి, ఒక చిన్న అమ్మాయికి సమఉజ్జీని కాకపోయినచో నీవును కావు. అందు వలన నిందను నాపైననే మోపకుము. ఆ విషయమున మన మిద్దరము ఒకటే అని గ్రహింపుము!"

"ఇంక నీవా విషయమును మానివేయవలెను. ఆసంగతి ఈ గౌరవనీయున కేమాత్రము రుచింపదని నేను నిశ్చయముగ చెప్పగలను" అని పార్టు అనగా కాడ్లిన్ ఇట్లనెను: నీవు ఆవిధ ముగా అభిప్రాయపడుచున్నావా? అయినచో నీవా విషయము నసలు ఎత్తియుండవలసినదికాదు. నీవు నీ యిచ్చవచ్చినట్లు మాట్లాడుట సరికాదు. ఏ విషయమును గుఱించి మాట్లాడు

చున్నామో ఆలోచించి మాట్లాడుట మంచిది. నిన్ను గుఱించి నేనీ మహానీయుని క్షమాపణ వేడుకొనుచున్నాను."

బొమ్మలాటగాండ్రు ఆవిధముగ మాటలాడుచుండగా నూతనుడు వారివంక చూడసాగెను. అతడు సమయము చిక్కినపుడు ఏదో ప్రశ్నించుటకు సిద్ధముగ నున్నవానివలెనుండెను.

ఎట్టకేలకతడు వారితో నిట్లనెను: "అబ్బాయిలు! నాకు కావలసిన ఇద్దఱు మనుజులు మీరే. నేను మీకొఱకే ఎదురుచూచుచున్నాను. మిమ్ములనే వెదకుచున్నాను. మీరు ముసలివానిని గుఱించియు, చిన్న అమ్మాయిని గుఱించియు మాట్లాడినారుకదా! వారిప్పుడెచ్చట నున్నారు?"

పార్టు తటపటాయించుచు, తన మిత్రునివంకచూచుచు, "ఏమన్నారు?" అని యనెను.

"మీతో కలసి ప్రయాణముచేసిన ముసలివాడు, చిన్న అమ్మాయి ఎప్పుడు ఎచ్చట నున్నారు? మీరా విషయమును గూర్చి చెప్పుట మంచిది. మీరనుకొనుచున్నదానికంటె మీకు ఎక్కువగా లాభించును. వారు మిమ్ము విడిచిపోయినారు. గుఱ్ఱపు పందెములు జరుగు స్థలమువద్ద విడిచిపోయినా రనుకొందును. అంతవఱకు నాకు తెలిసినది తరువాత నేమైనదో నాకు తెలియలేదు. మఱి మీ రేమైన చెప్పగలరా?" అని నూతనుడు అనెను.

పార్టు అపరిమితమగు ఆశ్చర్యముతో తన మిత్రునివంక జూచుచు నిట్లనెను: "మిత్రమా! చూచినావా! ఆ యిరువురు ప్రయాణీకులనుగూర్చి ఎవ్వరో ఒకరు అడుగుదురని చెప్పి యుండలేదా?"

తరువాత వా రిరువురును ఆ విషయమునుగూర్చి మాట్లాడుకో సాగిరి. వారి మాటలనుబట్టి వారికింక తాతా మనమరాంధ్ర విషయ మేమియు తెలియదని స్పష్టపడుచుండెను.

అందువలన నూతనుడాగదిలో అటునిటుతిరుగుచు ఇట్లనుకొనసాగెను: "ఓయిభగవానుడా! నేనీ బొమ్మలాటగాండ్రు ఉపయోగకరమగు వార్తలను చెప్పుదురని ఆశించితిని. కాని వారికింక ఏవిషయము తెలియకున్నది! నేను వీరినికలసికొన్నది ఇందులకేనా? వీరిని కలసికొనకుండిన ఎంతయుబాగుండెడిది! అప్పుడు తాతా మనమరాంధ్రసంగతి ఎప్పటికైన తెలియునను ఆశ ఉండియుండెడిది. ఇప్పుడాఆశలేదు. నా ఆశలు భగ్నమైపోయినవి!"

"అయ్యా! ఒక్కనిమిషమాగుడు. జెట్టీ అనుపేరుగల మనుజుడొకడు — అన్నట్లు జెట్టీని నీవెఱుగుదువుకదా, కాడ్లిన్!" అని పార్క్ అనెను.

"జెట్టీనిగురించి నాతో మాట్లాడకము. నాకు అతని సంగతి ఎందులకు? నేను ఆచిన్నారిబాలనుగూర్చి ఆలోచించుచున్నాను"అని కాడ్లిన్ అనెను.

అప్పుడు పార్ట్ తనమిత్రునివదలి నూతనుని వంకకుచూచుచు ఇట్లుచెప్పసాగెను: "అయ్యా! జెట్టీఅను పేరుగలమనుజుడొకడు నాకొక విషయముచెప్పినాడు. తాతా మనమరాండ్రు మైనపుబొమ్మల యజమానురాలితో కలసియుండగా అతడు చూచినాడట. తాతా మనమరాండ్రు మమ్ము మోసగించి వెళ్లిపోయినారుగదా! అందువలన మేమింక వారిసంగతులను తెలిసికొనదలచుకోలేదు. వారు ఏమైపోయినమాకేమి? నేనవసరమై

నచో అతనిని ప్రశ్నింపగలను. మీ చిత్తము."

అపరిమితమగు ఆతురముతో నూతనుడిట్లనెను: "అతడు ఈ పట్టణములోనేయున్నాడా? వెంటనే చెప్పుము."

"నేడు లేడు. కాని త్వరలోనే వచ్చును. అతడు మా యింటిలోనే నివసించుచున్నాడు" అని షార్ట్ తొందరగా ననెను.

"అయిన నతని నిచ్చటికి తీసుకొనిరమ్ము. ఇదిగో, ఈ బంగారునాణెమును తీసికొనిరమ్ము. నీ ద్వారమున నేను వారి యునికిని కనుగొనగలిగినచో నీకింకను ఇటువంటినాణెములను ఇరువదింటినియిత్తును. త్వరలో తిరిగిరమ్ము. ఈ విషయము నెవ్వరికిని చెప్పకుము. ఏదీ, నీ విలాసముచెప్పిపొమ్ము" అని నూతనుడనెను.

షార్ట్ తన విలాసమునొసగెను. అంతట ఇరువురు బొమ్మలాటగాండ్రును వెళ్లిపోయిరి. నూతనుడు మఱి రెండుగంటలు ఆందోళనతో ఆగదిలో అటునిటు తిరిగెను.

మఱునాడు బొమ్మలాటగాండ్రిరువురును తమ మిత్రుడగు జెర్రీతో కలసి నూతనునివద్దకువచ్చిరి. నూతనుడు తాతా మనమరాండ్రనుగుఱించి అతనిని ప్రశ్నించెను. అంతట జెర్రీ తాను వారిని రెండురోజులక్రిందటనే జార్లీసతి మైనపుబొమ్మల ప్రదర్శనములో చూచినట్లుచెప్పెను. ఆ ప్రదర్శనము జరుగుచున్న పట్టణము పేరును, అచ్చటకుపోవలసిన విధానమునుగూడ చెప్పెను. ఆవార్త నూతనునకు అపరిమితమగు సంతోషము కలిగించెను. అతడు ముప్వురను చక్కగాబహూకరించి పంపివైచెను.

నూతనుడు వెంటనే తాతా మనమరాండ్రున్న ప్రదేశ

మునకు పోవలయుననుకొనెను. కాని అంతలోనతనికొక సందేహమువచ్చెను. “నన్ను అతడుచూచి చాలకాలమైపోయినది. నన్నతడు గుర్తుపట్టగలడో? లేడో? నెలబాల అనెను. తనకు అపకారముచేయుటకే నేనువచ్చినానని ఆమె భావింపవచ్చును. అందువలన తాతా మనమరాండ్రను బాగుగా ఎఱిగియున్నవారి నెవ్వరినైన తీసికొనిపోయిన ఎంతయుబాగుండును. కావున ముందు వారిని బాగుగా ఎఱిగియున్నవారెవ్వరో తెలిసికొనవలసి యున్నది” అని అతడనుకొనెను.

ఆ ఆలోచన వచ్చినతక్షణమే నూతనుడు పూర్వము తాతా మనమరాండ్రునివసించుచుండిన ప్రాంతమునకుపోయెను. అచ్చటనతడు వారినిగూర్చియు, వారిని బాగుగానెఱిగియున్న వారినిగూర్చియు అడిగి తెలిసికొనెను. “కిట్ అనునతడు వారివద్ద పనిచేయుచుండెడివాడు. అతడు వారినిబాగుగాఎఱుగును. ఆబాలుడు చాల మంచివాడుకనుక మీకేదేని ఉపకారము చేయగలడు” అని అచ్చటివారందఱునుచెప్పిరి. నూతనుడు వారివద్ద నుండి కిట్ విలాసమును తెలిసికొనెను.

తరువాత నతడు కిట్ ఇంటికిపోయెను. కాని అచ్చటకిట్ లేడు. కిట్ గార్లెండ్ దంపతులవద్ద పనిచేయుచున్నాడను విషయమును అతనితల్లివద్దనుండి తెలిసికొనెను. అంతటనతడు గార్లెండ్ దంపతులయింటికిపోయెను. కాని కిట్ అచ్చటకూడ లేడు. అతడు ఇంటియజమానుల కుమారుడగు ఎబెల్‌తోకలసి విదర్‌డెన్ అనులాయరు ఇంటికిపోయెను. అందువలన నూతనుడు విదర్‌డెన్ ఇంటికిపోయెను. అతడుతిన్నగా విదర్‌డెన్ కార్యాలయము నకుపోయెను. కిట్ అచ్చటలేడు. అందువలన లాయరు అతని

కొలుకు కబురంపెను.

కిట్ ద్వారమువద్దకుపోయి, "అయ్యా! నేను లోనికి రావచ్చునా?" అనియనెను.

"రమ్మురమ్ము! లోనికిరమ్ము, క్రిస్టఫర్" అని లాయరు అనెను.

"ఇతడేనా కిట్?" అని నూతనుడు ప్రశ్నించెను.

"అవును ఇతడేకిట్. చాలమంచివాడు. మీరితడు చెప్పు విషయములనన్నిటిని ఎటువంటి సందేహములేకుండ నమ్మ వచ్చును అని లాయరు అనెను. అప్పుడచ్చట ఎబెల్‌కూడ కూర్చుండియుండెను. లాయరు అతనిని నూతనునకు పరిచయము చేసి, "కిట్ వీరివద్దనే పనిచేయుచున్నాడు" అనిచెప్పెను.

"ఇతడు మీ సేవకుడా?" అని నూతనుడు ఎబల్‌ను ప్రశ్నించెను.

"అవును. ఇతడు మీ సేవకుడుకూడ. మీరితనితో మాట్లాడదలచుకొన్నామని చెప్పినారుగదా!" అని ఎబెల్ అనెను.

"అవును. అందుకు మీరనుమతించుచున్నారా?"

"తప్పక."

అంతట విదర్‌డెన్, ఎబెల్ ఆ ప్రదేశమును వీడిపోవుటకు సిద్ధపడుచుండిరి. అప్పుడు నూతనుడు ఇట్లనెను: "అయ్యా! నాపని రహస్యమైనదేదియుకాదు. సరిగా చెప్పవలయునన్నచో దానిని మీవద్ద రహస్యముగా నుంచవలసిన పనియేదియులేదు. కిట్ ఇదివఱకు పురాతన వస్తువుల వ్యాపారము చేయుచుండెడి ఒక ముసలివానివద్ద పనిచేయుచుండెడివాడు. నేనా ముసలివానిని

కలిసికొనవలయును. అయ్యా! నేను ఈ దేశమును వదలిపెట్టి చాల సంవత్సరము లైపోయినది. నా ప్రవర్తనలో, మాటలలో ఏదేని లోపమున్నచో నన్ను క్షమింపవలయునని కోరుచున్నాను" అని నూతను డనెను.

"క్షమించవలసిన అగత్యమేమియు లేదు" అని లాయరు అనెను. ఎబెల్ కూడ అదేవిధముగ ననెను.

"నేను ఇతని పూర్వయజమానుడు నివసించుచుండిన ప్రాంతమునకుపోయి వాకబు చేసినాను. తరువాత ఇతని యింటికి పోయి, ఈతని తల్లిని కలిసికొన్నాను. ఎట్టకేలకిచ్చటకు వచ్చి చేరుకొన్నాను. నేనిచ్చట నెందుకులకు వచ్చినానో చెప్పినాను గదా!"

"మీరు ఎందుకువచ్చిననేమి? మీ రిచ్చటకువచ్చి నన్ను నా యింటిని పావనము చేసినందుకు నెంతయు సంత సించుచున్నాను" అని లాయారనెను.

అంతట నూతనుడు కిట్‌తో నిట్లనియెను: "అబ్బాయి! నేను తాతా మనుమరాండ్రనుగూర్చి తెలిసికోవలయునని అను కొనుచున్నాను. వారికి అపకారము చేయవలెనను నుద్దేశ్య మున్నదనుకొనుచున్నావా ? నీవా విధముగ తలచుచున్నచో; పొరపడినావని చెప్పకతప్పదు. నామాట నమ్ముము; నేనందుకు రాలేదు. నే నిప్పుడు అనుకోని పరిస్థితిలో నున్నాను. నేనొక సదుద్దేశ్యముతో ఇచ్చటకు వచ్చియున్నాను. ఆ యుద్దేశ్యమును అమలులోపెట్టుట కెట్టి యభ్యంతరము ఉండదని నేను భావించి యున్నాను. కాని నాకు అడ్డుతగిలినది. అంతయు అగమ్య గోచరమైన రహస్యమువలెనున్నది. ఆ రహస్యమును ఛేదించు

టకు నేను ఎంతో ప్రయత్నించినాను. కాని అంతకంతకు అంధ కారము హెచ్చగుచున్నది. ఈ విషయమున బహిరంగముగా ప్రయత్నము చేయుటకు ఎంతయు భయపడుచున్నాను. ఏలయన వారు ఇంకను దూరముగా పాఱిపోవచ్చును. నీవు నాకీ విషయ మున చేయగల సాహాయ్యము చేయుము. అందు నీవు విచా రించవలసిన పనియేమియు నుండదని నిశ్చయముగ చెప్పగలను. నీ సాహాయ్యము నా హృదయభారమును సంపూర్ణముగ తొల గించును."

అపుడు లాయరు ఇట్లనెను: "మీరు ఇతనియందు విశ్వాసముంచుట ఎంతయు సముచితముగనున్నది. ఇతడు మీకు చేయగలిగిన సాహాయ్యమునంతను చేయునని నేను హామీ ఈయగలను."

అంతట నూతనుడు ముసలివానికి సంబంధించిన అనేక విషయములను గూర్చి ప్రశ్నించెను. తాతా మనమరాండ్రకు సంబంధించిన విషయము లన్నిటిని కిట్ అతనికి తెలిపెను. "ఇప్పుడు వారి ఇల్లు క్విల్పు స్వాధీనములో నున్నది. ఆ యింటి నిప్పుడు అద్దె కిత్తురట! అద్దె కుండగోరువారు లాయరుబ్రాస్‌ను కలసికోవలయునని అచ్చట నొకబల్లమీద వ్రాయబడియున్నది" అని కూడ కిట్ చెప్పెను.

"నేను బ్రాస్ గృహములోనే నివసించుచున్నాను" అని నూతను డనెను.

లాయరుబ్రాస్ సంగతిని బాగుగా నెఱిగియున్న లాయరు విదర్‌డెన్ ఆశ్చర్యముతో నిట్లనెను: "లాయరుబ్రాస్ ఇంటిలో నివసించుచున్నారా?"

అపుడు నూతను డిట్లనెను: "అవును. నేను బ్రాస్ గృహములోనే నివసించుచున్నాను. నేను ఎక్కడఉన్ననుఒకటే. కాని అక్కడ నున్నచో ఏదోవిధముగా తాతా మనమరాంద్ర సంగతి తెలియునని తోచుచున్నది. నేను బ్రాస్ ఇంటిలోనే నివసించు చున్నాను. అది అవమానకరమైన విషయమందురా?"

"అది ఒక్కొక్కరి మన స్తత్వమునుబట్టి యుండును. అతడు సందేహాస్పదమగు గుణగణములు కలవాడని అందఱును అనుచుందురు"అని లాయరు విదర్ డెన్ భుజము లెగురవైచుచు అనెను.

"సందేహాస్పదమా? ఆ విషయమునుగూర్చి ఎప్పుడో నిర్ణయమైపోయినదని నేను అనుకొన్నాను. అది సరేకాని, మీతో ఒకటి రెండు మాటలు ప్రత్యేకముగ మాట్లాడవలసి యున్నది" అని నూతను డనెను.

నూతనుని కోరికకు లాయరు అంగీకరించెను. అందువలన నిరువురును వేఱొక గదిలోనికి పోయిరి. అచ్చటవారు సుమారు పదునేను నిమిషములు ఏదో విషయమునుగూర్చి మెల్లన మాట్లాడుకొనిరి. తరువాత వారు ఎప్పటిచోటుకు వచ్చి కూర్చుంౘిరి. వారి వాలకమునుబట్టి చూడగా ఇరువురును మంచి స్నేహితులైనట్లుండెను.

నూతనుడు కిట్తో ఇట్లనెను: "అబ్బాయి! నిన్నింక ఇప్పుడు ఆపియుంచను. ఇదిగో ఈక్రౌనునాణెమును తీసికొనుము. నేను మరల నీతో మాట్లాడుదును. ఈ సంగతులేవియు నీ యజమానునకు, యజమానురాలుకు తప్ప మఱి యింకెవ్వరికి చెప్పరాదు. ఈ సంగతి నీకు తెలియుననుకొందును."

"మా అమ్మ తెలిసికొనుట కెంతయు సంతసించును."

"ఏమి తెలిసికొనుటకు సంతసించును?"

"నెలబాలకు సంబంధించిన ఏ విషయమునైనను తెలిసి కొనుటకు సంతసించును."

"అటులనా? ఆమె రహస్యముగా నుంచగలిగినచో నీ వామెకు చెప్పవచ్చును. కాని ఇతరు లెవ్వరికిని ఒక్కమాట యైన చెప్పరాదు. తెలిసినదా? ఈ సంగతి జ్ఞప్తియం దుంచు కొనుము."

"నేను జాగ్రత్తగనే యుందును. మీ కెంతయు కృతజ్ఞుడను" అని కిట్ అనెను. అంతటితో నా సమావేశము ముగిసెను.

మఱియొకనాడు కిట్ తన యజమానుడగు గార్లెండ్‌తో కలసి తోటలో పనిచేయుచుండెను. అప్పుడు యజమానుడు కిట్‌తో నిట్లనెను: క్రిస్టఫర్! అయిన నీవొక క్రొత్త మిత్రుని సంపాదించినావన్న మాట!"

"అయ్యా! క్షమింపుడు!"

"నీవు లాయరు కార్యాలయములో ఒక క్రొత్తమిత్రుని సంపాదించినావని ఎబెల్ చెప్పినాడు."

"అవునవును. అయ్యా! అతడు చాల చక్కగా ప్రవర్తించినాడు.

"నేనా సంగతి వినుట కెంతయు సంతసించుచున్నాను. అతడు ముందు ముందు ఇంకను చక్కగా ప్రవర్తించును. క్రిస్టఫర్!"

"నిజముగా! అది అతని ఔదార్యమును సూచించు

చున్నది. కాని నాకది ఏమియు అక్కఱలేదు."

"అతడు నిన్ను తనవద్ద పనికి నియమించుకొనుట కెంతయు ఆతురపడుచున్నాడు."

"నన్ను తనవద్ద పనికి నియమించుకొనునా? అతడా విధముగ తమాషాకు అన్నాడనుకొందును."

"కాదు, కాదు. అతడు తమాషాకు అనలేదు. మన స్ఫూర్తిగనే అన్నాడు. ఆ విధముగ నతడు ఎబెల్‌కు చెప్పియున్నాడు."

"నే నెప్పుడును ఇటువంటి సంగతిని వినియుండలేదు. ఇందుల కెంతయు ఆశ్చర్యపడుచున్నాను."

"అబ్బాయి! క్రిస్టఫర్! ఇది నీకు చాల ముఖ్యమైన విషయము. దీనిని నీవు ఆ దృష్టిలో ఆలోచింపవలయును. అతడు నీపట్ల ఎక్కువదయను, అభిమానమును ప్రదర్శింపగలడు. ముఖ్యముగా నే నిచ్చుచున్నదానికంటె ఎక్కువ డబ్బు ఈయగలడు."

"ఆ తరువాత?"

"చెప్పెదను వినుము. నీవు నీ పూర్వపు యజమానుల వద్ద చాల విశ్వాసముగా పనిచేసియుంటివి. ఇప్పుడీ గౌరవ నీయుడు వారిని వెదకి తీసికొని రావలయునని కృతనిశ్చయుడై యున్నాడు. ఆ విషయమున అతనికి నీ సాహాయ్యము కావలయును. విజయము సాధించినచో నీకు గొప్ప బహుమానము వచ్చును. మఱియు ఆ తాతా మనమరాండ్రను కలసికొనుట నీకు ఆనందదాయకముగు విషయమేకద! క్రిస్టఫర్! నీ వీ విషయములనుగూర్చి ఆలోచింపకుము. తొందఱపడి వ్యతిరేక నిర్ణయమునకు రాకుము."

"ఎంత ఆశపెట్టినను నేను అతనివద్దకు పోను. నేను తన వద్దకు వత్తునని అత డనుకొనుటకు ఆస్కారమేమియులేదు. నేను అంత బుద్ధిహీనుడ ననుకొన్నాడా ఏమి?"

"నీ వతనియొద్ద పనిచేయుట కంగీకరింపనిచో, నిన్ను గూర్చి అతడావిధముగ అభిప్రాయపడవచ్చును."

"ఆ విధముగ అనుకొనిండు. అతడు ఏమనుకొనిన నాకేమి? నే నేమాత్రము లెక్కచేయను. అతని అభిప్రాయ మునకు నే నెందుకు విలువ ఈయవలెను? నా యిప్పటి యజమానులను నేను ఎందుకు వదలుకోవలయును? వదలు కొన్నచో నేను వట్టి బుద్ధిహీనుడనే అగుదును."

తరువాత కిట్ అచ్చటనే యున్న గార్లెండ్ సతి వంకకు తిరిగి యిట్లనెను: "అమ్మా! నెలబాల తిరిగివచ్చినచో ఏమి చేయవలయునన్నది వేఱు విషయము. నేను కావలయునని ఆమె అన్నచో నే నేమి చేయవలెను? ఇక్కడి పనులన్నియు పూర్తియైనతరువాత మీ అనుమతి పొంది అప్పుడప్పుడు ఆమె వద్దకు పోవుచుందును. కాని ఆమె తిరిగివచ్చినపుడు నా అవసర మామెకు ఉండునా యని సందేహించుచున్నాను. ఆమె తాతయ్య ఆశించినట్లు ఆమె గొప్ప ధనికురాలై తిరిగివచ్చును. అప్పుడు నా అవసర మామె కేమియు నుండదు. అవును! ఆమెకింక నా అవసరమేమియు నుండదు. ఆమెకింక నా అవసర ముండరాదనియే కోరుచున్నాను. నాకుమాత్ర మామెను చూడవలయునని యున్నది."

అంతలో నచ్చటకు బార్బరా (పనిపిల్ల) వచ్చి గార్లెండ్ కొక చీటీ ఇచ్చెను. దానిని పూర్తిగా చదువుకొని అతడు

కిట్‌తో ఇట్లనెను: "అబ్బాయి! మనమింక నా విషయమును గూర్చి ప్రస్తావింపవలదు. మమ్ము వదలియుండుట నీకు ఏమాత్రము ఇష్టములేదు. అదేవిధముగా నిన్ను వదలుకొనుట మాకేమాత్రము ఇష్టములేదు. అయినను ఒక్క విషయము మాత్రమున్నది. ఆ గౌరవనీయుడు అప్పుడప్పుడు ఒక రోజుకాని, ఒక గంటకాని నీ సేవను కోరవచ్చును. అప్పుడు నిన్నతనివద్దకు పంపుట మేము అంగీకరింపవలసి యున్నది. పోవుటకు నీవు అంగీకరింపవలసియున్నది. ఇప్పుడు నీవు లాయరు విదర్‌డెన్ ఇంటికిపోయి అచ్చటనున్న గౌరవనీయుని కలసికోవలసియున్నది."

అంతట కిట్ తన యజమానులవద్ద సెలవుతీసికొని లాయరు విదర్‌డెన్ కార్యాలయమునకు పోయెను. అచ్చట ఎబెల్ కూర్చుండి యుండెను; నూతను డచ్చటలేడు.

"నీతో మాట్లాడదలచిన గౌరవనీయు డిప్పుడిచ్చటలేడు; అతడు బయటకు పోయియున్నాడు. అతడు తిరిగి ఇచ్చటకు తిరిగివచ్చుటకు కొంతకాలము పట్టవచ్చును" అని ఎబెల్ అనెను.

కాని గౌరవనీయుడు ఎంతకును తిరిగిరాలేదు. అతడు వచ్చులోపల కిట్ భోజనముచేసెను; తేనీరు సేవించెను; కొన్ని పుస్తకములను చదివెను; నిదురపోయెను; నిదురనుండి మేల్కొనెను. అంతలో గౌరవనీయుడు హడావుడిగా తిరిగివచ్చెను.

గౌరవనీయుడు రాగానే లాయరును కలసికొని అతనితో ఏకాంతముగనేమో ముచ్చటించెను. తరువాత ఎబెల్ అచ్చటకు పోయెను. ముగ్గురును కలసి కొంచెముసేపు మాట్లాడుకొనిరి. ఈ లోపల కిట్, "వీరు నన్నెందులకు పిలిచినట్లు?" అని ఆశ్చర్య పడసాగెను.

గౌరవనీయుడు కిట్‌వున్న గదిలోనికివచ్చి ఇట్లనెను: "క్రిస్టఫర్! నీ పూర్వపు యజమానుడు, యజమానురాలు ఎచ్చటనున్నారో నేను తెలిసికొన్నాను."

ఆ మాటలను వినగానే కిట్ కన్నులు సంతోషముతో ప్రకాశింపసాగెను. "అయ్యా! అటులనా! వారెచ్చటనున్నారో కనుగొన్నారా? అయ్యా! వారెచ్చటనున్నారు. అయ్యా! వారెట్లున్నారు? వారిచ్చటకు దగ్గరలోనే యున్నారా?"

గౌరవనీయుడు తలఊపుచు నిట్లనెను: "వారిచ్చటకు చాలదూరమున నున్నారు. కాని వారిని తిరిగి ఇచ్చటకు తీసికొని వచ్చుటకు నేను ఈరాత్రే పోనున్నాను. నీవుకూడ నాతో రావలయునని కోరుచున్నాను."

"నేనా!" అని గౌరవనీయుడు సంతోషముతోను, ఆశ్చర్యముతోను అనెను.

గౌరవనీయుడు ఏదో ఆలోచించుచున్న వానివలె ప్రక్కనేయున్న లాయరువంక తిరిగి, "వారున్న ప్రదేశమిచ్చటకు అరువదిమైళ్ళ దూరమున నున్నదికదా?" అని అనెను.

"అరువదిమైళ్ళకు, డెబ్బదిమైళ్ళకు మధ్యనుండును" అని లాయరు సమాధానమిచ్చెను.

అంతట గౌరవనీయు డిట్లనెను: "హుం. మనమీరాత్రి అంతయు ప్రయాణముచేసినచో రేపటి యుదయమున కాప్రదేశమును చేరుకోగలము. కాని యిప్పుడొక సమస్య వచ్చిపడినది. వారు నన్నెరుగరు. క్రొత్తవారెవ్వరు వచ్చినను తమ్ము తీసుకొని పోవుటకే వచ్చినారని నెలబాల భావించుచుండెను. కనుక తెలిసియున్న వారెవ్వరినైన నాతో తీసుకొనిపోవుట ఎంతయుమంచిది.

అందుకు ఈ కిట్ ఎంతయు తగియున్నాడు. ఇతనికంటె తగిన వాడు మఱియొకడులేడు. ఏలయన వారిపుపురును ఇతనిని బాగుగ నెఱుగుదురు. ఇతడు నాతో ఉన్నచో నేను వారిపట్ల స్నేహ భావము కలిగియున్నట్లు స్పష్టపడును."

"అవును. ఎటువంటి పరిస్థితులలోనైనను మీతో బాటు క్రిస్టఫర్‌ను తీసికొనిపొండు'' అని లాయరు అనెను.

అపుడు క్రిస్టఫర్ ఇట్లనెను: "అయ్యా! నన్ను క్షమింపుడు. ఆ యుద్దేశ్యముతో మీరు నన్నచ్చటకు తీసికొని పోవలచు న్నారో? అయినచో నావలన ఉపకారము జరుగుటకు బదులు అపకారము జరుగును. నెలబాల నన్ను బాగుగ నెరుగును; ఆమె నన్ను సంపూర్ణముగ విశ్వసించును. కాని తాతయ్య మాత్రము జబ్బుపడినప్పటినుండి నన్ను చూచుట కిచ్చగింపకుండెను. అందుకు కారణము నాకు తెలియదు. ఇతరు లెవ్వరికిగూడ తెలియదు. నేనింక అతని దగ్గఱ కెన్నడును పోరాదట. అతని నెన్నడును చూడరాదట. ఈ విషయము నెలబాలయే చెప్పినది. నేను వచ్చినచో మీ ప్రయత్నమంతయు చెడిపోవునని నేనెం తయు భయపడుచున్నాను. నేనువచ్చుట కిష్టపడుచున్నాను. కాని అయ్యా! మీరు నన్ను తీసుకొని పోకుండనుండుటయే మేలు.''

"అబ్బా! మఱియొక చిక్కు-సమస్య! నేను ఎన్ని చిక్కు-సమస్యల నెదుర్కొనవలసి వచ్చుచున్నది! వారిని బాగుగ నెఱిగిన ఇతరు లెవ్వరునులేరా? వారి విశ్వాసమును చూరగొన్న ఇతరు లెవ్వరునులేరా? నాకిప్పుడు ఉపయోగపడువా రెవ్వరును లేరా?'' అని గౌరవనీయు డనెను.

"క్రిస్టఫర్! ఎవ్వరైననున్నారా?" అని లాయరు

ప్రశ్నించెను.

"ఎవ్వరును లేరు. అన్నట్లు మాఅమ్మ ఉన్నది" అని కిట్ అనెను.

"వా రామెను ఎఱుగుదురా?" అని గౌరవనీయుడు ప్రశ్నించెను.

"ఎఱుగుదురా! ఆమె ఎప్పుడును వారి ఇంటికి వచ్చుచు పోవుచు నుండెడిది. వారు నన్ను ఎంత దయగా చూచెడివారో నన్నుకూడ అంతదయగా చూచెడివారు. వారు తనఇంటికి వత్తు రని ఆమె ఆశించుచున్నది" అని కిట్ అనెను!

"అయిన ఆమె ఇప్పుడెచ్చటనున్నది? ఆమె ఇప్పుడిచ్చట నెందులకు లేదు? అవసరము వచ్చినపు డామె ఇచ్చట ఉండక ఎచ్చటనో ఎందులకుండును?"అని గౌరవనీయుడు ఆతురముతో నని బల్లమీాదనున్న టోపీని చేతిలోనికి తీసికొనెను.

అప్పుడు గౌరవనీయుని పరిస్థితి ఎట్లుండునో తెలియునా? అతడు వెంటనే ఆ ప్రదేశము వీడిపోయి కిట్ ఇంటికి పోదలచు చుండెను. కిట్ తల్లిని మెడపట్టుకొని బయటకు తీసికొనివచ్చి బలవంతముగా బండిలోని కెక్కింపదలచుచుండెను. అక్కడ నుండి తాతా మనమరాండ్రవద్దకు తీసుకొని పోదలచుచుండెను. కాని లాయరు, ఎబెల్ కలసి విశ్వప్రయత్నములుచేసి, బతి మాలుకొని గౌరవనీయుని ఆ ప్రయత్నమునుండి విరమింప జేసిరి.

"ఈ విషయమును గుఱించి కిట్‌తో మాట్లాడుట మంచిది. ఇంతస్వల్పవ్యవధిలో ఆతనితల్లినీతో కలసి ప్రయాణము చేయుటకు అంగీకరించునటుచేయుట మంచిది" అని వారు

గౌరవనీయునితో ననిరి.

ఆ విషయమున కిట్ కొన్ని సందేహములను వెలి పుచ్చెను. గౌరవనీయుడు ఏ మాత్రము ఆలస్యమును సహింపని వానివలె మాట్లాడెను. లాయరు, ఎబెల్ అందఱకు నచ్చునట్లు ఎన్నో విధముల మాట్లాడిరి. కిట్ ఆ విషయమును గుఱించి బాగుగ ఆలోచించెను. మంచిచెడ్డలను పరామర్శించుకొనెను. ఎట్టకేల కతడు తన తల్లి తరఫున ఇట్లు వాగ్దానము చేసెను: "అయ్యా! నాతల్లి ఇప్పటినుండి రెండుగంటలలో ప్రయాణము నకు సిద్ధమగునట్లు చేయుదును. ఆమెను ప్రయాణమునకు సర్వ విధముల సంసిద్ధముచేసి ఇచ్చుటకు తీసికొనివత్తును. నా తల్లి తర ఫున నేను మీకీ వాగ్దానము చేయుచున్నాను.

కిట్ ఆ విధముగ వాగ్దానము చేసెను. అది సామాన్య మైన వాగ్దానముకాదు. ఎంతో ధైర్యసాహసములతో కూడిన వాగ్దానమది. ఆ వాగ్దానమును అమలు పరచుటకై కిట్ శరవేగ మున నింటికిపోసాగెను. అనతికాలములో నతడు ఇల్లు చేరు కొనెను. కాని యిల్లు తాళము వేయబడి యుండెను. కిట్ తల్లి తన యిరువురు పిల్లలను తీసుకొని చర్చికిపోయి యుండెను. అత నిని చూడగనే తల్లి పిల్లలతోబాటు బయటకు వచ్చెను. అంద ఱును వారి యింటివైపుకు పోసాగిరి. కిట్ త్రోవలో, లాయరు ఇంట జరిగిన విషయమునంతను తల్లికి తెలిపెను. అంతట తల్లి ఎన్నో అభ్యంతరములను తెలిపెను. కాని కిట్ వానికన్నిటికి సరి యైన సమాధానములను చెప్పెను.

"నెలబాలను నీవు తిరిగి కలసికొనగలుగుట ఎంత ఆనంద మగు విషయము! ఆమెను విజయవంతముగ తిరిగి తీసుకొని

రాగలుగుట ఎంత గర్వకారణమగు విషయము!" అనికూడ కిట్ అనెను. ఎట్టకేలకు తల్లి ప్రయాణమునకు అంగీకరించెను.

కొంతసేపటికి వారు ఇల్లు చేరుకొనిరి. "అమ్మా! నేను పెట్టిన గడువుకింక పదినిమిషములు మాత్రమున్నది. ఇదిగో చేతిపెట్టె. నీకు కావలసిన వస్తువుల నిందుపెట్టెదను. వెంటనే బయలుదేఱుము."

కిట్ తొందఱ తొందఱగా ఆ చేతిపెట్టెలో అవసరమగు వస్తువుల నన్నిటిని వదలివైచి అనవసరమగు వస్తువులను క్రుక్కెను. కిట్ తల్లి పిల్లలను ప్రక్కయింటివారికి అప్పగించెను. వారు మొదట ఏడ్చిరికాని; మంచిమంచి ఆటవస్తువులను తెచ్చి యిత్తుమనగా ఊరకుండిరి. తల్లి పిల్లలను తెగముద్దుపెట్టుకొ సాగెను. అది కిట్ కెంతయు విసుగుగానుండెను. ఎట్టకేలకు వారికువుకను లాయరు విదర్ డెన్ ఇంటికి బయలుదేఱిరి. వారు ఆ యిల్లు చేరుకొనుసరికి రెండుగంటలపైన కొన్ని నిమిషములు గూడ గడచిపోయియుండెను.

ఆ యింటివద్ద నాలుగు గుఱ్ఱములు లాగుబండి యొకటి సిద్ధముగా నుండెను. దానినిచూచి కిట్ ఇట్లనెను: "అదిగో నాలుగు గుఱ్ఱములబండి! అమ్మా! నీవు నాలుగుగుఱ్ఱముల బండిపై ప్రయాణము చేయనున్నావు! అయ్యో! ఆమె ఇదిగో! అయ్యో! మా అమ్మ ఇదిగో! అయ్యో! మాఅమ్మ సిద్ధముగా నున్నది!"

"మంచిది. మంచిది. అమ్మా! ఏ మాత్రము భయపడకుము. నేను నిన్నుగూర్చి చాలజాగ్రత్త తీసికొందును. అవసరమగు వస్తువులతోనున్న పెట్టెఏది?" అని నూతనుడు అనెను.

"ఇదిగో ఇక్కడనున్నది. కిట్! నీవుపెట్టెను లోపల పెట్టుము!" అని లాయరు విదర్ డెన్ అనెను.

"అటులనే! నేను సిద్ధము!" అనియని కిట్ పెట్టెను లోపలపెట్టెను. నూతనుడు కిట్ తల్లికి చేయిఅందిచ్చి ఆమెను బండిలో కూర్చుండబెట్టెను. తరువాత నతడు ఆమె ప్రక్కనే కూర్చుండెను. మఱికొంతసేపటికి బండి ప్రయాణము ప్రారంభించెను.

కిట్ రోడ్డుమధ్య నిలబడి పోవుచున్న బండివంకకు చూడ సాగెను. అతని కన్నులనుండి నీరు కారసాగెను. అవి విచార బాష్పములుకావు; వెళ్ళిపోవుచున్న వారినిగూర్చి అతడు ఏ మాత్రము విచారించుటలేదు. అవి ఆనందబాష్పములు; తిరిగి రాబోవుచున్న వారిని తలచుకొని అతడు సంతోషించు చుండెను.

తాతా మనమరాండ్రనుగూర్చి కిట్ ఈ విధముగ అను కోసాగెను: "వారు నడచి వెళ్ళిపోయినారు; అప్పుడు వారితో ఒక్క మంచిమాటయైన మాట్లాడినవారు లేరు; వారిని సాదర ముగ సాగనంపిన వారెవ్వరును లేరు. కాని వారు ఇప్పుడు నాలుగుగుఱ్ఱములు లాగుచున్న బండిలో తిరిగి వత్తురు. వారికి మిత్రుడుగా ధనికుడగు గౌరవనీయుడుండును. వారి కష్టము లన్నియు పోవును."

మఱి కొంతసేపటికి బండి అదృశ్యమైపోయెను. అయినను కిట్ తాను నిలబడియున్న ప్రదేశమునుండి కదలలేదు. లాయరు, ఎబెల్ చాలసేపటి క్రిందటనే ఇంటిలోనికి వచ్చిరి. కిట్ ఇంకను రోడ్డుపై ఎందుకు నిలబడియున్నాడాయని వారు ఆశ్చర్యపడ

సాగిరి. మఱి కిట్ ఏమేమో ఆలోచించుచుండెను. ఎట్టకేల కతడుగూడ ఇంటిలోనికి వచ్చెను.

గౌరవనీయుడు కిట్ తల్లితో కలసి రెండు రాత్రిళ్ళు, ఒక పగలు ప్రయాణము చేసెను. మూడవరోజు ఉదయమున వారు గమ్యస్థానమును చేరుకొనిరి. గుఱ్ఱపుబండి తిన్నగాపోయి జార్లీసతియున్న ఇంటివద్ద ఆగెను. బండిలోకూర్చున్న ఇరువురును క్రిందకు దిగిరి.

ఆ యింటిలో ఎవ్వరిదో వివాహము జరిగినట్లుండెను. ఆ స్థితినిచూచి నెలబాల నెవ్వరో బలవంతముగా వివాహము చేసికొన్నారని గౌరవనీయుడు భావింపసాగెను. అతడు ఆగ్రహము పట్టజాలక ఏమేమో కేకలు వేయసాగెను. ఆ కేకలు విని ఒక మనుజుడు ఇంటిలోనుండి బయటకువచ్చి, "అయ్యా! మీ కేమి కావలయును?" అని గౌరవనీయునితో ననెను.

"మిత్రమా? ఇచ్చట ఎవరి వివాహము జరిగినది?"

"నా వివాహము."

"ఎవ్వరిని పెండ్లి చేసికొన్నావు?"

"ఆ విషయముతో మీ కేమి పని?"

"నా కేమి పనియా! నీవు మైనరు బాలికను పెండ్లిచేసికొన్నావేమో! ఇక్కడ నొక అమ్మాయి యుండవలయును. ఆ అమ్మాయి ఏది? ఆమెపేరు నెలబాల. ఆమె ఎక్కడనున్నది?"

అంతలో తెల్లని దుస్తులను ధరించియున్న లావుపాటి వనిత యొకర్తె బయటకు వచ్చెను. ఆమె ఎవ్వరనుకొన్నారు. ఆమెయే పూర్వాశ్రమమున జార్లీసతి. ఇప్పుడామె గౌరవ

సీయునితో పూట్లాడిన జార్జిని వివాహ మాడియున్నది.

"నెలబాల ఎక్కడనున్నది?" అని గౌరవనీయుడు ప్రశ్నించెను.

"అయ్యా! మీరామెకేదేని మంచిచేయుటకు వచ్చియున్నారా? అయినచో ఒకవారము రోజులక్రితమే మీరెందులకు రాలేదు?" అని పెండ్లికూతురు అనెను.

"ఆమె మరణించినదా ఏమి?"

"అంత అధ్వానపరిస్థితి ఏర్పడలేదు."

"భగవంతుడు కరుణామయుడు! మమ్ము లోనికిరానిండు."

గౌరవనీయుడు, కిట్ తల్లితో కలిసి లోనికివెళ్లెను. పిమ్మట నతడు నూతనదంపతులతో నిట్లనెను! "నేను తాతా మనమరాండ్రను వెదకుకొనుచు వచ్చినాను. నా ప్రాణముకంటె వారన్న నాకు ఎక్కువ ఇష్టము. వారు నన్ను తెలిసికోలేరు. నారూపురేఖలు వారికి క్రొత్తవిగా నుండును. వారిరువురిలోనే ఒక్కరుగాని యిచ్చటనున్నచో నాతో వచ్చిన యీ వనితను వారున్న చోటుకు తీసికొనిపొండు. వారిరువురును ఈమెను బాగుగా నెఱుగుదురు. నేను వారికి అపకారము చేయ వలయునను తలంపుతో రాలేదు. ఆ విషయమును ఈ వనిత చక్కగా రుజువుచేయగలదు. మీరేమియు భయపడవలదు."

"నేనెప్పుడును అనుకొనుచుంటిని! ఆమె సామాన్యపు బాలికకాదని నేనెప్పుడును చెప్పుచుంటిని! కాని అయ్యా! మీకు సాహాయ్యము చేయుటకు మాకు శక్తిలేదు. మేము ఎన్నో ప్రయత్నములు చేసితిమి. కాని అన్నియు వృథాయైపోయినవి" అని పెండ్లికూతురు అనెను.

తరువాత నామె తనకు తాతా మనమరాండ్రనుగూర్చి తెలిసిన విషయమంతయు వివరముగా చెప్పెను. వారినికలసి కొన్నప్పటినుండి, వారు అదృశ్యమై పోవువఱకు జరిగిన విషయము నంతను చెప్పెను.

ఆమె యింకను ఇట్లనెను: "వారు ఏటుల అదృశ్యమై పోయిరో, ఎందులకు అదృశ్యమైపోయిరో నా కంతయు అయోమయముగనున్నది. మేము వారిని వెదకి పట్టుకొనుటకు విశ్వ ప్రయత్నము చేసితిమి. కాని లాభమేమియు లేకపోయినది. మేము వారు సురక్షితముగ నున్నారో లేదోయని ఎంతో భయపడితిమి. వారు హఠాత్తుగ అదృశ్యమై పోయినారు కనుక వారిని గూర్చి ఎన్నో అనుమానములు కూడ బయలుదేఱ వచ్చునని భయపడుచున్నాము. ముసలివాడు అదియొక తరహామనిషి. అతడు చెడ్డసహవాసము చేసెడివాడని తోచుచున్నది. నెలబాల ఎప్పుడును అతనినిగూర్చి బాధపడుచుండెడిది. ఆమె మానసికముగను, శారీరకముగను కృశించిపోవు చుండెడిది. తాతయ్య ఎక్కడకైన ఒంటరిగా వెళ్ళిపోయినాడేమో! అతడెక్కడకు వెళ్ళినాడో తెలిసినలేక ఊహించిన నెలబాల ఆదారిని పోయినదేమో! లేక ఇరువురును కలసియే వెళ్ళిపోయినారో! ఏసంగతియు మాకు నిర్ధారణగా తెలియకున్నది. వారికి సంబంధించిన వార్తలు తెలియునను ఆశను వదలుకొన్నాము. వారిచ్చటకు తిరిగి వత్తురను ఆశను వదలుకొన్నాము."

పెండ్లికూతురు చెప్పినవిషయమునంతను గౌరవనీయుడు విచారముతోను, భగ్నహృదయముతోనూ వినెను. ముసలివానిమాట వచ్చినపుడెల్ల అతడు కన్నీరు కార్చసాగెను.

అంతయు విన్నతరువాత గౌరవనీయుడు, "మీరు సత్యమునే చెప్పినారని నేను గాఢముగా విశ్వసించుచున్నాను. నేను మీకెంతయు కృతజ్ఞుడను."

గౌరవనీయుడు, కిట్‌తల్లితో బాటు బయటకువచ్చెను. ఇరువురు మరల బండిలో కూర్చుండిరి. బండి మరల ప్రయాణమైపోయి ఒక పూటకూళ్ళయింటివద్ద ఆగెను. అచ్చట నిరువురును దిగి లోనికిపోయిరి. లోపలవారికి దుర్మార్గుడగు క్విల్పు కనబడెను. అతడొక గదిలోపలనిలబడి బయటకు తలపెట్టి ఇట్లనుచుండెను. "అయ్యా! అమ్మా! దయయుంచి నాగదిలోనికిరండు. నన్ను పావనముచేయుడు!"

అతనినచ్చటచూచి కిట్‌తల్లి ఎంతో ఆశ్చర్యపడెను.

"దయయుంచి నాగదిలోనికిరండు!" అని క్విల్పు మఱియొకసారి అనెను.

"నేను ప్రత్యేకముగానుందును" అని గౌరవనీయుడనగా క్విల్పు తనగదితలుపు మూసికొనెను.

"మనము లండనులో బయలుదేఱుటకు కొన్ని నిమిషములకుముందే నేను క్విల్పును చర్చిలోచూచియుంటిని. అతడప్పుడే ఇచ్చటకువచ్చినాడు" అని కిట్‌తల్లి అనెను.

"అటులనా?" అనియని గౌరవనీయుడు అచ్చటనున్న సేవకునితో నిట్లనెను: "నాతో ఇప్పుడు మాటాడినవాడిచ్చటకెప్పుడు వచ్చినాడు?"

"ఉదయముననే వచ్చినాడు."

"ఇచ్చటినుండి ఎప్పుడు వెళ్ళిపోవును?"

"సరిగా తెలియదయ్యా!"

"అయిన నతనినొకసారి యిచ్చటకు తీసికొనిరమ్ము."

సేవకుడు వెళ్ళి పిలువకపూర్వమే క్విల్పు అచ్చటకువచ్చి "అయ్యా! నమస్కారములు. మీరు క్షేమముగానున్నారని అనుకొందును" అనియనెను.

గౌరవనీయుడు ఏమియు మాట్లాడలేదు. అంతట క్విల్పు కిట్ తల్లివంకకుతిరిగి ఇటనెను: "క్రిస్టఫర్ తల్లి! ఆహా! ఎంత చక్కనివనిత! ఎంతమంచివనిత! క్రిస్టఫర్ వంటి మంచివానినికన్న తల్లి! మీరందఱు క్షేమముగానున్నారా? మీరందఱు సురక్షితముగనున్నారా?"

"క్విల్ప్!" అని గౌరవనీయుడు అనెను.

క్విల్పు చెవిదగ్గఱ చేయిపెట్టుకొని వినయముగా వినసాగెను.

"మనమిరువురము ఇదివఱకు కలసికొన్నాము" అని గౌరవనీయుడనగా క్విల్పు, "అవునవును. మనముకలసికొన్నాము. మీరు నాకాభాగ్యము కలిగించినందులకు నేనెంతయు గర్వించుచున్నాను" అని అనెను.

"నేను లండనులో దిగి తిన్నగా నెలబాల గృహమునకు వచ్చినాను. ఆయిల్లప్పుడు దస్యూముల కొంపవలెనున్నది. ఇరుగు పొరుగువారు నిన్నుపోయి కలసికోవలసినదిగా సలహా ఇచ్చినారు. నేను భోజనమైన చేయకుండ నీ వద్దకు వచ్చినాను!"

"అవునవును!"

"నీవు మఱియొకరి ఆస్తిని అన్యాయముగా వశపఱచుకొన్నావు. అంతవఱకు అతడు ధనికుడు. మఱి హఠాత్తుగా నతడు బీదవాడైనాడు. ఇల్లువాకిలి వదలి వెళ్ళిపోయినాడు."

"అయ్యా! మేము చేసినపనికి వారంటు ఉన్నది. అతనిని వెళ్ళిపోవలసినదని నేను కోరియుండలేను. అతడే వెళ్ళిపోయినాడు. రాత్రికి రాత్రి అదృశ్యమై పోయినాడు."

"ఏమైననేమి? అతడు వెళ్ళిపోయినాడు."

"అవును. అతడు వెళ్ళిపోయినాడు. అతడు వెళ్ళిపోయినాడనుటకు సందేహమేమియు లేదు. ఎక్కడకు వెళ్ళిపోయినాడన్నదే సమస్య. అది యింకను సమస్యగానే యున్నది."

"నీవు వట్టికుటిలుడవు. వారికి సంబంధించిన సమాచారమును నాకు తెలుపుటకు నిరాకరించుచున్నావు. ఆ సమాచారమును దాచుకొనుచున్నావు. పైగా నన్ను వెంబడించి వచ్చుచున్నావు!"

"నేను మిమ్ములను వెంబడించి వచ్చుచున్నానా!"

"అవును. నీవు గూఢచారివలె నన్ను వెంబడించి వచ్చుటలేదా? ఈ మంచివనిత వెళ్ళినచర్చిలో నీవు కనబడలేదా? మఱి నీవిచ్చటకు రాలేదా?"

"ఆమెగూడ అచ్చటకు వచ్చినదా? మఱి మీరేనన్ను వెంబడించి వచ్చుచున్నారని నేను అన్నచో ఎట్లుండును? నేను చర్చికి వెళ్ళినమాట నిజమే. అయిననేమి? ప్రయాణము చేయుటకు ముందు, సురక్షితముగ తిరిగిరావలెనని యాత్రికులు చర్చికి పోవుచుందురు. వారెంతో తెలివైనవారు. ఏలయన ప్రయాణములు చాల అపాయకరమైనవి. బండిలో ప్రయాణము చేయుచున్నప్పుడు చక్రములు ఊడిపోవచ్చును. గుఱ్ఱములు బెదరవచ్చును. బండివాడు వేగముగా త్రోలవచ్చును. బండిబోర్లగిలపడవచ్చును. ప్రయాణమునకుముందు నేనుకూడ చర్చికి పోవుచుందును. నేను

ఆ పని చేయుట ఎప్పుడును మానను."

"నీవు అసత్యము పలుకుచున్నావు. నేనిచ్చట కెందులకు వచ్చినానో నీకు తెలియును. మఱి నీవేదో దుర్బుద్ధితోనే ఇచ్చటకు వచ్చినావు. నీకు తెలిసిన విషయములను చెప్పుము!"

"నాకెట్లు తెలియును! నేనేమి జోస్యుడును కాను. జోస్యుడనైయుండినచో నా అదృష్టము నాకు తెలిసియుండెడిదిగదా!"

"దుష్టుడా! ఇంక మాట్లాడకుండ పొమ్ము."

"పోయెదను. తప్పక పోయెదను."

అటులని క్విల్పు తన గదిలోనికి పోయెను.

తాతా మనమరాండ్రను పట్టుకొనలేక పోయినందుకు గౌరవనీయుడెంతయు విచారింపసాగెను. ఆ విచారముతో నతడా పూటకూళ్ళ యింటిలో కొంతకాలము గడపెను. తరువాత నతడు బయటకుపోయి కిట్ తల్లి మరునాడు లండను నగరమునకు తిరిగిపోవుటకు కావలసిన ఏర్పాట్లను చేసెను. అతడు మఱియొక పనిపై వేఱొక ప్రదేశమునకు పోవలసియుండెను. అందువలన నతడు కిట్ తల్లితోబాటు లండనుకు పోకుండెను.

మఱునాడు కిట్ తల్లి లండను నగరమునకు పోవుచున్న కోచిలో ప్రవేశించెను. ఆ కోచిలో పైభాగము, క్రిందిభాగము అని రెండు అరలుండెను. కిట్ తల్లి క్రిందిభాగములో కూర్చుండెను. ఆ భాగములో మఱి యితర ప్రయాణీకులెవ్వరును లేరు. పైభాగములో కూడ ఎవ్వరును లేరు. కొన్ని నిమిషములు గడచునప్పటికి క్విల్పువచ్చి కోచి పైభాగములో ప్రవేశించెను. కిట్ తల్లి ఒంటరిగా కూర్చుండి యున్నవిషయము నతడు గ్రహించెను. అది అతనికి ఎంతయు సంతోషదాయకముగ నుండెను. ఆమెను

భయపెట్టి ఏడ్పించవలయునని అతడు నిశ్చయించుకొనెను.

మఱి క్విల్పు కిట్‌తల్లిని ఎందుకు ద్వేషించుచున్నాడు? క్విల్పు కడుదుర్మార్గుడు. మంచివారన్న అతనికి సహజముగ ద్వేషముకలదు. కిట్‌తల్లి తాతా మనమరాండ్రకు మంచిస్నేహితురాలు. కిట్ తాతా మనమరాండ్రకు అపూర్వమగు సేవనుచేసియుండెను. తాతా మనమరాండ్రు వెళ్ళిపోయిన తరువాతగూడ కిట్ నెలబాల నామస్మరణ చేయుచున్నాడు. కిట్‌తల్లి తాతా మనమరాండ్రను వెదకవచ్చిన గౌరవనీయునకు సాహాయ్యము చేయుచున్నది. గౌరవనీయుడు క్విల్పును దూషించుచుండగా కిట్‌తల్లి విన్నది. దుర్మార్గుడగు క్విల్పునకివి యన్నియు దోషములుగా తోచుచున్నవి. అందువలననే అతడు కిట్‌కు, అతనితల్లికి సాధ్యమైనంతవఱకు అపకారము చేయవలయునని నిశ్చయించుకొన్నాడు.

క్విల్పు ప్రయాణసమయమున కిట్‌తల్లిని పరిపరి విధముల అవమానింపసాగెను; భయపెట్టసాగెను. క్విల్పు వికృతరూపము కలవాడుకదా! ఆ రూపముతో నతడు ఆమెను వెక్కిరింపసాగెను. అప్పుడాతని మొగము ఎంతో భయంకరముగను, అసహ్యకరముగను కనబడుచుండెడిది. ఆమె యా రూపమును ఏమాత్రము చూడలేకుండెడిది. అతడామెను వికృతపునామములతో పిలువసాగెను. ఏ స్త్రీ గాని అట్టిపేర్లను సహింపలేదనుట నిక్కవము. దుర్మార్గుడగు క్విల్పుకు అబలలన్న అణుమాత్రమైన సానుభూతి లేదు. అతడామెకు పిడికిలిచూపి బెదరింపసాగెను గూడ. అందువలన నామె క్రుళ్ళిక్రుళ్ళి ఏడువసాగెను. అది శిలాహృదయముకల క్విల్పు కెట్టి సానుభూతిని కలిగింప లేకపోయెను.

పైగా అతనికది ఎంతో సంతోష కారణముగ నుండెను.

ఎట్టకేలకు కోచిలండను మహానగరమును చేరుకొనెను. అది నిర్ణీత స్థలమును చేరుకొనెను. తల్లి తిరిగివచ్చుచున్న సంగతి నెఱిగిన కిట్ అచ్చట వేచియుండెను. అతనికి వికృతాకారముగల క్వీల్పు కనబడెను.

"క్రిస్టఫర్! నీ వెట్లున్నావు? అందఱు క్షేమమే కదా! మీ అమ్మ లోపలనున్నది!" అని క్వీల్పు కిట్ తో అనెను.

అంతలో కిట్ తల్లి క్రిందకు దిగెను. అపుడు కిట్ మెల్లన ఆమెతో నిట్లనెను: "అమ్మా! ఈ దుర్మార్గుడు కోచిలోని కెందుకువచ్చినాడు? ఎట్లువచ్చినాడు?"

"నాయనా! అతడెందుకువచ్చినాడో, ఎట్లువచ్చినాడో, నాకు తెలియదు. కాని నేను లోపలకూర్చుండి యున్నంత కాలము అతడునన్ను సర్వవిధముల భయపెట్టినాడు; ఏడ్పించినాడు" అని తల్లి అనెను.

"అటులనా!" అని కిట్ కోపముతోను, ఆశ్చర్యముతోను అనెను.

"నీవునమ్మవు. నీవునమ్మవు. కాని అతనితో నేమియు మాట్లాడకుము. అతడు మానవుడుకాడని నేను గట్టిగానమ్ముచున్నాను. అతడు నరరూపరాక్షసుడు. నేనేమిచెప్పుచున్నానో వినవలయునని అతడెట్లు ప్రయత్నించుచున్నాడో చూడుము" అని తల్లి అనెను.

కిట్ క్వీల్పువంకకుచూచెను. క్వీల్పు ఏమియునెఱుగని వానివలె ఆకసమువంకకు చూచుచుండెను.

"ఇతడు వట్టిమోసగాడు. ఏమియు నెఱుగనివానివలె

ఎట్లుచూచుచున్నాడో చూడుము. అయిన మన కేమి? నాతో వచ్చివేయుము. అతనితో మాట్లాడవలదు. మనమింకపోదము" అని కిట్ తల్లి అనెను.

"అమ్మా! అటులనే" అని కిట్ అనెను. కాని అతడు క్విల్పునుద్దేశించి ఇట్లనెను: "ఓయీ! నీవు అసందర్భప్రలాపన చేసి..."

క్విల్పు మందహాసముచేసి చుట్టును చూడసాగెను.

కిట్ ఇంకను ఇట్లనెను: "......మాఅమ్మను భయపెట్టి నావట! నీ కేమి పోగాలమువచ్చినది? ఆమెవంటిపవిత్రను బాధ పెట్టుటకు నీమనస్సు ఎట్లు అంగీకరించినది? నీకు సిగ్గులేదా! స్త్రీల నవమానించుట ఘోరమైన విషయముకదా! ఓరీ! రాక్షసుడా!"

"రాక్షసుడా!" అని క్విల్పుతనలోతాను అనుకొనెను.

కిట్ తల్లి పెట్టెనుచేతబట్టుకొని ఇంకను ఇట నెను: మఱి యొకసారి ఈవిధముగా ప్రవర్తింపుము! అప్పుడు నిన్నేమిచేసె దనోచూడుము. నీప్రవర్తనునేనింక ఏమాత్రము సహింపసని నిశ్చయముగచెప్పుచున్నాను. ఆవిధముగ చేయుటకు నీకు ఎట్టి హక్కు లేదు. నీవ్యవహారములలో మేమెన్నడును అనవసరపు జోక్యము కలుగజేసికొని యుండలేదు. నీవీవిధముగచేయుట కిది మొదటిసారికాదు. ఈసారి యిట్లుచేసినచో, నాకు ఎంతకష్ట ములేకపోయినను నీవీపు చిల్లులుపడునట్లు కొట్టెదను."

క్విల్పు కోచిలోనుండి క్రిందకుదిగెను. కాని అతడేమియు

మాట్లాడలేదు. నాలుగైదుసార్లు కన్నులు పెద్దవిచేసికొని అతడు తల్లీకొడుకుల వంకచూచెను. పిమ్మట నా ప్రదేశమునతడు వీడి పోయెను. అటుపిమ్మట తల్లీకుమారులు తమయింటికి వెళ్ళి పోయిరి.

16

క్విల్పు కిట్‌ను అపరిమితముగ ద్వేషించుచుండెను. అందువలన అతని కేవిధముగనైన అపకారము చేయవలయునని అతడు నిశ్చయించుకొనెను. ఆయుద్దేశ్యముతో నతడు మఱియొక దుర్మార్గుడగు లాయరు బ్రాస్‌ను కలసికొనెను.

క్విల్పు బ్రాస్‌తో నిట్లనెను: "నీవు కిట్ అనుబాలుని ఎఱుగుదువుకదా!"

''ఎఱుగుదును. అతనితో ఏమిపనివచ్చినది?"

''అతడు పట్టిదుర్మార్గుడు. కుటిలుడు. నా ప్రయత్నములనన్నిటిని అతడు భగ్నముచేయుచున్నాడు. కావున నేనతనిని తీవ్రముగ ద్వేషించుచున్నాను. అతడు నాదారికడ్డములేకుండ చేయువలయును. ఈ బాధ్యతను నీపై నుంచుచున్నాను."

దుర్మార్గుడగు బ్రాస్ రహస్యములను క్విల్పుకు తెలియును. అందువలన నతడు చెప్పినట్లు చేయకతప్పదు.

"మీరు చెప్పినట్లుచేయుదును" అని బ్రాస్ అనెను.

"నేను నీమాట నమ్ముచున్నాను. నీవు నీయిచ్చవచ్చిన

పన్నాగముపన్ని విజయము సాధింపవలయును” అని యని క్విల్ప్ బ్రాస్‌తో కరచాలనము చేసెను. పిమ్మట నిరువురును విడి పోయిరి.

*　　　*　　　*

తాతా మనమరాండ్రును వెదకబోయిన గౌరవనీయుడు లండను నగరమునకు తిరిగివచ్చెను. అతడెప్పటివలె బ్రాస్ యింటి పైభాగమున నివసింపసాగెను. కిట్ అప్పుడప్పుడువచ్చి గౌరవనీయుని కలసికొనుచుండెను.

ఒకనాడు కిట్ గౌరవనీయుని కలసికోవలయునను ఉద్దేశ్యముతో బ్రాస్ యింటికివచ్చియుండెను. అప్పుడు క్రిందనున్న హాలులో బ్రాస్‌వద్ద పనిచేయుచున్న గుమాస్తా రిచర్డు స్వివలర్ కూర్చుండియుండెను.

“గౌరవనీయుడు ఇంటనున్నారా?” అని కిట్ గుమాస్తాను ప్రశ్నించెను.

“నేను గౌరవనీయుడను కానాఏమి?” అనిగుమాస్తా అనెను.

“నేను మేడమీద నివసించుచున్న గౌరవనీయునిగూర్చి అడిగినాను.”

“ఎందుకు?”

“ఇంటనున్నచో అతనికొక యుత్తరము నీయవలసి యున్నది.”

“ఆ ఉత్తర మెవ్వరు వ్రాసినారు?”

“గార్లెండ్!”

“అటులనా? అయిన నీవా యుత్తరమును నాకిచ్చి వెళ్ళి

పోవచ్చును. నీకు సమాధానము కావలసినచో వరండాలో నిల బడి యుండుము. అచ్చట నీకు చక్కని గాలివచ్చును."

"కృతజ్ఞుడను. కాని నేనే స్వయముగా ఈ యుత్తరము నతనికి అందజేయవలసి యున్నది."

అంతలో మేడమీాదనున్న గౌరవనీయుడు ఇట్లు అఱ చెను: "నా కొఱకు ఎవ్వరో వచ్చినట్లున్నది. వారిని పైకి పంపుము."

"అయ్యా! వచ్చినారు. అయ్యా! వచ్చినారు" అని గుమస్తా అనెను.

"అయిన అతడెక్కడ నున్నాడు?"

"ఇక్కడనే ఉన్నాడు! ఇక్కడనే ఉన్నాడు! ఓయీా! నీకా మాటలు వినబడుట లేదా? చెవుడు వచ్చినదా ఏమి? పైకి పొమ్ము."

కిట్ ఏమియు సమాధాన మీాయకుండ పైకి వెళ్ళి పోయెను.

మఱికొంత సేపటి కచ్చటకు బ్రాస్ వచ్చెను. అతడు గుమస్తాను చూచి, "నే నిప్పుడు చక్కగా నున్నానా? లేదా?" అని ప్రశ్నించెను.

"చాల చక్కగా నున్నారు. చాల సంతోషముగ నున్నారు!" అని గుమస్తా అనెను.

"అవును. మనము భరద్వాజ పక్షులవలె ఎప్పుడును సంతోషముగ నుండవలయును. మనము ఆనంద దాయకమగు ప్రపంచములో నివసించు చున్నాము. రిచర్డ్! ఈ ప్రపంచములో దుర్మార్గులున్నారు. మఱి దుర్మార్గులు లేకపోయినచో మంచి

లాయర్లు ఎట్లుందురు! అహాహా! రిచర్డు! పోస్టులో ఏ వేని ఉత్తర ములు వచ్చినవా?"

"రాలేదు."

"రాకపోయిన వచ్చిన నష్టమేమియు లేదు. ఈ రోజు పని లేకపోయినచో రేపు పని చాల చక్కగా నుండును; ఎక్కువ ఉండును. సంతృప్తియే జీవితమునకు ఆనందము. మఱి గౌరవ నీయునికొఱ కెవ్వరైన వచ్చినారా?"

"వచ్చినారు. ఇంకను అతని వద్దనే యున్నారు."

"వచ్చినవారు స్త్రీ కాదు కదా!"

"స్త్రీ కాదు. కిట్ అను పేరుగల బాలుడు వచ్చినాడు."

"ఓహో! కిట్ వచ్చినాడా!"

పిమ్మట బ్రాస్ ఏదోపని చెప్పి గుమస్తాను బయటకు పంపెను. తరువాత నతడు తన బల్లవద్ద కూర్చుండి కూని రాగ ములు తీయుచు ఏదో వ్రాసికొన సాగెను. కొంత సేపటికి కచ్చ టకు పైనుండి కిట్ వచ్చెను.

బ్రాస్ మందహాసము చేయుచు, "కిట్! క్షేమముగ నున్నావు కద!" అని ఆప్యాయముగ పలుకరించెను.

కిట్ సముచితముగ సమాధాన మొసగి వెళ్ళిపోబోవు చుండెను, కాని బ్రాస్ అతనిని వెనుకకు పిలిచెను.

"కిట్! వెళ్ళిపోవలదు! వెళ్ళిపోవలదు! ఇటురమ్ము! ఇటు రమ్ము. మిత్రమా! ప్రియమిత్రమా! నిన్ను చూచి నపుడెల్ల నాకా మధురాతి మధురమైన చిన్నారి మొగము జ్ఞప్తికి వచ్చు చుండును. నీ వచ్చుటకు రెండు మూడుసార్లు వచ్చిన విషయము నా కింకను జ్ఞప్తియందున్నది. కిట్! ప్రియమిత్రమా! ఒక్కొక్క

ప్పుడు నా వృత్తిలో నున్నటువంటి వారు బాధా కరమగు విధ్యుక్త ధర్మములను నెఱవేర్ప వలసి యుండును. అందువలన నీవు మమ్ము ద్వేషింపరాదు!"

నే నెన్నడు ద్వేషింపను. మంచి చెడ్డలను నిర్ణయించుట నావంటివారికి తగనిపని."

"కాని మాకొక్క ఔదార్యమాత్ర మున్నది. మేము గాలిని పూర్తిగా అడ్డుకొని త్రిప్పివేయలేకపోవచ్చును. కాని దాని వేగమునుమాత్రము తగ్గింపగలము."

"అటులనా!" అని కిట్ మనస్సులో అనుకొనెను.

"ఆ సందర్భమున నేను క్విల్పుతో గట్టిగా దెబ్బలాడి వారికి స్వేచ్ఛను ప్రసాదించినాను. అటుల చేయుటవలన నే నొక కాతాదారును కోల్పోవు అపాయము కలదు. అయినను నేను లెక్కచేయక ఆవిధముగ చేసితిని."

"ఇతడు అందఱు అనుకొనుచున్నంత చెడ్డవాడుకాడు!" అని కిట్ మనస్సులో అనుకొనెను.

"కిట్! నేను నిన్ను గౌరవింతును. నీవు తక్కువస్థితిలో నుంటివి; బీదవాడవు; అయినను నీ గుణగణములు మంచివని అప్పుడే గ్రహించితిని. నేను మనుజులు ధరించు విలువైన దుస్తులను చూడను. వారి హృదయములను చూతును. దుస్తులు పంజరమువంటివి. హృదయము పంజరములోని పక్షివంటిది."

కిట్‌కు బ్రాస్‌పట్ల సదభిప్రాయము హెచ్చుచుండెను." ఇతడు ఎంతమంచివాడు!" అని అతడు అనుకొనసాగెను.

"నాయనా! కిట్! నీవు చాల మంచివాడవు. నీ కొక ఉపకారము చేయవలెనని అనుకొనుచున్నాను. ఈ బల్లమీాద

నున్న రెండు క్రౌను నాణెములను తీసికొనుము."

కిట్ నాణెములవంక చూచెను; బ్రాస్‌వంక చూచెను. అతనికేమియు చేయుటకును తోచకుండెను.

"ఈ నాణెములు నీకే!"

"ఎవరివద్దనుండి?"

"ఎవరివద్దనుండి యైననేమి? నీకిష్టమైనచో, నావద్ద నుండియే అనుకొనుము. పైన సరసము తెలియనివా రున్నారు. అందువలన ప్రశ్నలు వేయరాదు. ఎక్కువగా మాట్లాడరాదు. అర్థమైనదా? ఆ నాణెములను తీసికొనుము. అంతియ మిగిలిన సంగతులు వలదు. మనలో మనమాట. ఈ విధముగ నిచ్చుటకు ఇదియే కడపటిసారికాదు. ఇది ఆఖరుసారి కారాదని నేను ఆశించుచున్నాను. ఇంక నీవు పోవచ్చును. కిట్! గుడ్‌బై!"

కిట్ బ్రాస్‌కు కృతజ్ఞతను తెలియజేసెను. "నేను ఇంతవఱకు బ్రాస్‌నుగూర్చి పొరపాటు అభిప్రాయము నేర్పరచుకొని యుంటిని. ఇతడు చాల మంచివాడు" అని కిట్ అనుకొని, రెండు నాణెములను తీసికొని ఇంటికి వెళ్ళిపోయెను. బ్రాస్ మందహాసము చేసెను.

తరువాత బ్రాస్ కిట్‌ను ఎన్నోసార్లు కలసికొనెను. కిట్‌కు బ్రాస్‌పట్ల సదభిప్రాయము దినదినాభివృద్ధి యగుచుండెను. అతనికి చాలసార్లు డబ్బు ముట్టుచుండెను. మేడమీదనున్న గౌరవనీయుడు బ్రాస్‌ద్వారా తనకా సొమ్మును అందజేయుచున్నాడని కిట్ భావింపసాగెను.

ఒకనాడు ఎప్పటివలె బ్రాస్ తన గుమాస్తాతో కలసి హాలులో కూర్చుండి యుండెను.

కిట్ వచ్చి, "అయ్యా! మేడమీది గౌరవనీయుడు ఉన్నారా?" అని ప్రశ్నించెను.

"ఉన్నారు, కిట్! ఉన్నారు, కిట్. నిన్ను చూడగలిగి నందుకు నే నెంతయు సంతసించుచున్నాను. నిన్ను చూచుటకు నే నెంతయు అబ్బురపడుచున్నాను. కిట్! పని పూర్తియైన తరువాత మరల నిచ్చటకు రమ్ము" అని బ్రాస్ అనెను.

అంతట కిట్ పైకిపోయెను. పదునేను నిమిషములు గడచిన తరువాత కిట్ తన పని ముగించుకొని మరల క్రిందకు వచ్చెను. అప్పటికి బ్రాస్ ఒంటరిగ కూర్చుండియుండెను. కాని అతడు ఇదివఱకువలె బల్లముందు కూర్చుండి యుండలేదు. కూనిరాగములు తీయుచుండుటలేదు. అతడు కుంపటిముందు నిలబడి యుండెను. అతని మొగము వికృతముగ నుండెను. అది చూచి అతనికి హఠాత్తుగా జబ్బుచేసినది కాబోలునని కిట్ అనుకొనెను.

"అయ్యా! అది ఏమి అట్లున్నారు?" అని కిట్ అనెను.

"ఎట్లున్నాను?"

"మీరు చాల పాలిపోయినట్లున్నారు. మీరు మీరని గుర్తించుట అసాధ్యముగ నున్నది."

"అంతయు నీ ఊహ! నీ ఊహ! జీవితములో నే నెప్పుడు బాగున్నాను! నే నెప్పుడు బాగున్నాను! మన మేడమీదిమిత్రుడు ఎట్లున్నాడు?"

"ఆరోగ్యము కొంచెము బాగుగనే యున్నది."

"నేనావార్త తెలిసికొనుట కెంతయు సంతసించుచున్నాను. అతడు చాల మంచివాడు. ఉత్తముడు. ఉదార

హృదయుడు. కడుంగడు ప్రశంసనీయుడు. అతనివలన నాకు ఎట్టి బాధలేదు. గార్లెండ్ బాగుగనున్నాడా? అతని ఆరోగ్యము బాగుగనే యున్నదని ఆశించుచున్నాను."

కిట్ బ్రాస్‌ప్రశ్నకు సముచితముగ సమాధాన మిచ్చెను. కాని బ్రాస్ ఏమో పరధ్యానముగ నున్నట్లుండెను. అతడొక స్టూలుపై కెక్కి కిట్ చొక్కాగుండీ పట్టుకొని ఇట్లనెను: "కిట్! నేను మీ అమ్మకు ఏదేని సాహాయ్యము చేయవలయునని అనుకొనుచున్నాను. అన్నట్లు నీకు అమ్మ యున్నదిగదా! నాకు సరిగా జ్ఞాపక మున్నదనుకొందును. నీవొకసారి నాకు..."

"అయ్యా! నాకు తల్లి యున్నది."

"పాప మామె విధవకదా! చాలా పరిశ్రమచేయు విధవ!"

"ఆమె ఎంత కష్టపడి పనిచేయునో ఎవ్వరును ఊహింపజాలరు. అంతచక్కనితల్లి మఱియొకర్త యుండదని నేను గాఢముగ విశ్వసించుచున్నాను."

"అవునవును! అందుకు నేనెంతయు సంతసించుచున్నాను. అవునవును! ఆమె తన సంతానమును చక్కగా పెంచుటకు - వారికి సర్వసౌఖ్యములను సమకూర్చుటకు - విశ్వప్రయత్నము చేయుచున్నది. ఇది సామాన్యమైన విషయముకాదు. నీ టోపీని అచ్చట పెట్టుము కిట్!"

"కృతజ్ఞుడను. నేను వెంటనే వెళ్ళిపోవలయును."

కాని బ్రాస్ కిట్‌వద్దనుండి టోపీని తీసికొనెను. అతడు దానిని బల్లమీద పెట్టుటకుముందు, బల్లమీదనున్న కాగితములను చిందరవందరచేసి ఖాళీ చేసెను. ఆ ఖాళీలో టోపీ పెట్టెను.

ఆ పనినతడు ఎంతో నైపుణ్యముతో చేసెను.

పిమ్మట బ్రాస్ ఇట్లనెను: "కిట్! మా యింటి వ్యవహారములను సరిచూచుటకు నమ్మకమైన స్త్రీ ఒకర్తె కావలసియున్నది. అందుకు మీ అమ్మ సరియైనదని నేను కొన్నిరోజుల నుండి అనుకొనుచున్నాను. అందువలన నాపని నెఱవేఱి నట్లగును. బీదఱికముతోనున్న మీకు కొంచెము సాహాయ్యము చేసినట్లగును. అప్పుడామె సర్వసౌకర్యములను అనుభవింపవచ్చును. అది ఎంతో వాంఛనీయమైన విషయముకదా! మఱి ఇందులకు నీవు ఏమందువు? నీ కిందులకు ఏమైన అభ్యంతరమున్నదా? కిట్! నీకు, నీ కుటుంబమునకు సాహాయ్యపడవలయునని నేను హృదయపూర్వకముగ కోరుకొనుచున్నాను. మఱి నా సూచన నీకేదేని అభ్యంతరమున్నచో స్వేచ్ఛగా చెప్పవచ్చును."

"అయ్యా! మీరు ఎంతో దయకలవారు. మాపట్ల అభిమానముంచి ఆ సూచన చేసినారు. మఱి దానికి నేను అభ్యంతర మెట్లు చెప్పగలను? మీ కెట్లు కృతజ్ఞతను తెలియజేయవలయునో నాకు తోచుటలేదు. నిజముగా నాకు తోచుటలేదు."

ఈ లోపల బ్రాస్ కిట్ టోపీని రెండు మూడుసార్లు సవరించెను.

బ్రాస్ హఠాత్తుగా కిట్ ముఖములో తన ముఖముపెట్టి "అయిన నింకెందుకు? అది అయినది" అని వికృతముగ ననెను. ఆ మాటలువిని కిట్ కలవరపడెను. బ్రాస్ ఇంకను ఇట్లనెను: "అయినది! అయిపోయినది. కిట్! ఆ విషయము నీకు తెలిసి

వచ్చును. అబ్బ! గుమాస్తా వెళ్ళి ఎంత సేపయినది! ఇంకను రాలేదు. ఇచ్చవచ్చినట్లు పనిపాట్లు లేకుండ తిరుగుచున్నాడు కాబోలు! కిట్! నీవు ఒక్క నిమిషము మిచ్చట నుండుము! ఒక్కసారి పైకిపోయి వచ్చెదను. ఒక్కనిముషము మాత్రమే! అంతకంటె ఎక్కువ ఆలస్యము చేయను, కిట్!"

అట్లనుచు బ్రాస్ హాలువిడిచి వెళ్ళిపోయెను. అనతికాలములో నతడచ్చటకు తిరిగి వచ్చెను. సరిగా నదే సమయమున కచ్చటకు గుమాస్తా వచ్చెను. అప్పటికే ఆలస్యమైపోయినదన్న భయముతో కిట్ తొందఱతొందఱగా వెళ్ళిపోసాగెను. అతడు టోపీ నెత్తిమీద పెట్టుకొని యుండెను.

"కిట్ ఎంతయు మంచివాడు! కిట్ ఎంతయు మంచివాడు!" అని బ్రాస్ అనెను. కాని వెంటనే అతడు ఏదో కనబడనట్లు బల్లమీద వెదకసాగెను.

"అయ్యో! ఏమి పోయినది?" అని గుమాస్తా అనెను.

బ్రాస్ జేబులు వెదకుకొనుచుండెను. బల్ల సొరుగుచూచుచుండెను. బల్లమీది కాగితములను తీయుచుండెను. "అయ్యో! అయ్యో! నోటు! రిచర్డు! అయిదుఫౌనుల నోటు! అది ఏమైపోయి యుండును! దానిని నేనిచ్చట పెట్టియుంటిని. భగవంతుడు నన్ను రక్షించుగాక!" అని బ్రాస్ అనెను.

"అయ్యో! అయిదుపౌనుల నోటు నిజముగా పోయినదా?" అని గుమాస్తా ప్రశ్నించెను.

"ఆ విషయమును గురించి నీకు సందేహమెందులకు? ఇందేదో మోసము జరిగినదని భయపడుచున్నాను. రిచర్డు! అయిదుపౌనుల నోటు పోయినదనుటకు సందేహమే మాత్ర

మును లేదు. మఱి యిప్పుడేమి చేయవలయును?"

బ్రాస్, గుమాస్తా లిరువురును వీధిలోనికి పరుగెత్తుకొని పోయిరి. వారు ప్రాణములను రక్షించుకొనుటకు పరుగెత్తు చున్నట్లు పరుగెత్తుచుండిరి. కిట్ గూడ తొందఱగా పోవలయు నన్న ఉద్దేశ్యముతో పరుగెత్తుచుండెనుగాని అంత వేగముగా పరుగెత్తుటలేదు. అయినను కొన్ని నిమిషములకు ముందే బయలుదేఱి యుండుటవలన అతడు ముందు ఉండెను. కొంత సేపటి కతడు ఆయాసములో ఒకచోట ఆగెను. సరిగా నా సమయమున కచ్చటకు బ్రాస్, గుమాస్తా లిరువురును చేరుకొనిరి. బ్రాస్ కిట్ భుజము నొకదానిని పట్టుకొనెను. గుమాస్తా మరి యొక భుజమును పట్టుకొనెను.

"ఆగుము, కిట్! అంత వేగమెందులకు? తొందఱగా నున్నదా ఏమి?" అని బ్రాస్ అనెను.

కిట్ ఆశ్చర్యముతో బ్రాస్ వంకను, గుమాస్తావంకను చూచుచు "అవును, తొందఱగానున్నది" అని యనెను.

"కిట్! నేను నమ్మలేకున్నాను. కాని విలువైన దొకటి నా కార్యాలయములో పోయినది. దాని సంగతి నీకేమియు తెలియదను కొందును" అని బ్రాస్ అనెను.

"ఓయి భగవానుడా! దేని సంగతి? మీ యుద్దేశ్య మేమి?" అని యనుచు కిట్ గజగజ వణకిపోసాగెను.

"ఏమియులేదు! ఏమియులేదు! నేనేమియు ఉద్దేశ్య పడుటలేదు. నీవు చేసినావని నేను అనుటలేదు. నీవు ప్రశాంత ముగ వెనుకకు తిరిగి వత్తువనుకొందును."

"తప్పక వత్తును. ఎందుకురాను?"

"తప్పక! నిన్ను గూర్చి నేను ఎంతమంచి అభిప్రాయము నేర్పఱచుకొని యుంటినో నీకు తెలియునా?"

"నన్ను అనవసరముగా అనుమానించు చున్నందుకు మీరు తప్పక విచారింతురు. రండు వెనుకకు తిరిగిపోదము తొందఱగ పోదము."

"తప్పగ తొందఱగ పోదము. రిచర్డు! నీవా చేయిపట్టు కొనుము. నేను ఈ చేయి పట్టుకొందును. ఈ విధముగ ముప్పురును కలిసి నడచుట సులభముకాదు. కాని ప్రస్తుత పరి స్థితులలో మనము చేయదగినపని మఱియొకటి కనబడుట లేదు."

కిట్ మొగము తెల్లపడెను; ఎఱ్ఱపడెను; మరల తెల్ల పడెను. వారా విధముగ పట్టుకొనగా తిరుగబడవలయునని కిట్ ఒక్క క్షణకాల మనుకొనెను. కాని తిరుగబడినచో వారు కాలరు పట్టుకొని వీధులలో ఈడ్చుకొని పోవచ్చును. అందు వలన నతడా ప్రయత్నమునుండి విరమించు కొనెను. "అయ్యా మీ రింపుల కెంతయు విచారింతురు! మీ రిందుల కెంతయు విచారింతురు !" అనిమాత్ర మతడు మాటిమాటికి అన సాగెను.

ముప్పురును బ్రాస్ ఇంటికి పోవుచుండిరి. త్రోవలో గుమాస్తా కిట్ చెవిలో నిట్లుచెప్పెను: "అబ్బాయి! నీ తప్పును అంగీకరింపుము. మాటలతో అంగీకరింపవలసిన పనిలేదు. సంజ్ఞ లతో అంగీకరించిన చాలును. ఇకముందెన్నడును ఇట్టిపనులు చేయనని వాగ్దానము చేయుము. నీవు తప్పించుకొనిపోవు ఏర్పాటు చేయుదును." కాని కిట్ అపరిమితమగు కోపముతో ఆ సూచనను నిరాకరించెను. అంతట గుమాస్తా కిట్‌ను యిది

వణకుకంటె ఎక్కువ గట్టిగా పట్టుకొనెను. ఎట్టకేలకు వారు బ్రాస్ ఇల్లు చేరుకొనిరి.

"అబ్బాయి! కిట్! నీవీ పనిని తెలియక చేసినావను కొందును. అయినచో జరిగిన విషయమునంతను వివరముగ తెలుపుము, అందువలనఎవరికి కష్టముండదు. అందఱకుసంతృప్తి కలుగును. నీవు పరీక్షకు అంగీకరించినచో, అందఱకు సంతృప్తి కలుగును. కావున పరీక్షకు అంగీకరింపుము" అని బ్రాస్ అనెను.

అంతట కిట్ చేతులు పైకెత్తి, "నేను ఏపాపమెఱుగని అమాయకుడును. మీరు మీ యిష్టమువచ్చినట్లు వెదకు కొనుడు. ఈ పనికి మీరు జీవితాంతమువరకు విచారింపవలసి వచ్చునను విషయమును మాత్రము జ్ఞప్తియందుంచుకొనుడు" అని అనెను.

"ఇది చాల బాధాకరమైన విషయము! ఇది చాల బాధా కరమైన విషయము!" అని యనుచు బ్రాస్ కిట్ జేబులను వెదకసాగెను. "చాల బాధాకరమైన విషయం! ఇచ్చటనేమియు లేవు. రిచర్డ్! అంతయు సంతృప్తికరముగా నున్నది. ఇచ్చట నేమియులేవు. రిచర్డ్! ఇచ్చటను ఏమియులేవు! ఎచ్చటను ఏమియులేవు! అంతయు సంతృప్తికరముగా నున్నది."

గుమాస్తా కిట్ టోపీని చేతబట్టుకొని బ్రాస్ చేయు చున్న పనిని జాగ్రత్తగా పరిశీలించుచుండెను. కిట్ దుస్తులను వెదకుట పూర్తియైన తరువాత బ్రాస్ హఠాత్తుగా గుమాస్తా వంక తిరిగి, "ఆ టోపీని వెదకుము! ఆ టోపీని వెదకుము!" అని అనసాగెను.

"టోపీలో చేరుమాలొకటి యున్నది" అని గుమాస్తా

అనెను.

"అందువలన అపాయమేమియు లేదు. చేరుమాలులో అపాయమేమున్నది? కాని ఒక్క విషయము చేరుమాలును టోపీలో పెట్టుకొనుట అంత ఆరోగ్యకరమైన విషయముకాదని పెద్దలు చెప్పగా విన్నాను. అందువలన బాగుగా వేడెక్కిపోవు నట! కాని చేరుమాలు అచ్చట నుండుటకు నాకెట్టి అభ్యంతర మును లేదు. ఎట్టి అభ్యంతరము లేదు" అని బ్రాస్ అనెను.

కాని అంతలో గుమాస్తా టోపీలోనుండి అయిదు పౌనులునోటు నొకదానిని బయటకుతీసి, "ఇదిగో, అయిదు పౌనుల నోటు!" అని గట్టిగా అఱచెను.

"బ్రాస్ గుమాస్తా చేతిలోనున్న అయిదుపౌనుల నోటును చూచెను. "ఇది చేరుమాలుక్రింద నున్నది!" అని గుమాస్తా అనెను. బ్రాస్ గుమాస్తావంక, గోడలవంక, నేల వంక, మిద్దెవంక చూచెను; కాని కిట్ వంక మాత్రము చూడ లేను. కిట్ శిలాప్రతిమవలె నిలబడియుండెను.

బ్రాస్ ఇట్లనసాగెను: "ఇదియేనా ప్రపంచము! గ్రహముల ప్రభావముగల ప్రపంచమిదియేనా? ఇదియేనా మానవ స్వభా వము! ఇదియేనా మానవస్వభావము! ఓస్వభావమా! ఓస్వభా వమా! ఈ మోసగానికి నేనింతవరకు ఎన్నో విధముల సాహాయ్యముచేయుచు వచ్చినాను. ఇంకను ఎన్నోవిధముల సాహాయ్యము చేయవలయునని అనుకొన్నాను. ఇప్పు డితనికి స్వేచ్ఛ నొసగవలయునని నేను తీవ్రముగ వాంఛించుచున్నాను. కాని నేను లాయరును. నా కర్తవ్యమును నెఱవేర్పవలయును. కర్తవ్య నిర్వహణమందు ఏ మాత్రము వెనుదీయరాదు. నేను

ఇతరులకు ఉదాహరణముగా నుండవలయును! నాకు మానసిక బలహీనత పనికిరాదు. నైతిక విజయమే అపూర్వమగు విజయము! రిచర్డ్! నీవు తొందఱగాపోయి ఒక రక్షకభటుని తీసుకొని రమ్ము."

కిట్ ఇంకను శిలాప్రతిమవలె నిలబడియుండెను. మఱికొంతసేపటికి గుమాస్తా ఒక రక్షకభటుని తీసికొనివచ్చెను. బ్రాస్, రక్షకభటునకు, కిట్ దొంగతనము చేసినాడన్న విషయమును వివరముగా చెప్పెను. అంతట కిట్‌ను రక్షకభటుడు తన అధీనములోనికి తీసికొనెను.

"నేనితనిని ఇప్పుడే మేజిస్ట్రేటువద్దకు తీసికొనిపోయెదను. బ్రాస్! మీరు, మీ గుమాస్తాకూడ నాతో రావలయును!" అని రక్షకభటుడనెను.

అంతట కిట్ రక్షకభటునితో నిట్లనెను: "అయ్యా నా ఒక్కమాట వినుడు. మీరందఱు ఎంతనిర్దోషులో నేనును అంతే నిర్దోషిని. నేను నేరగాడనుకానను మాటను మనసార చెప్పుచున్నాను. నా మాటనమ్ముడు. నేను దొంగనా! ఇది ఎంత ఆశ్చర్యకరమైన విషయము!" పిమ్మట నతడు బ్రాస్‌తో నిట్లనెను: "అయ్యా! మీరు నన్ను బాగుగా నెఱుగుదురు. నన్ను మీరు బాగుగా నెఱుగుదురని విశ్వసించుచున్నాను. ఇది మీకు న్యాయముకాదు. నిజముగా ఇది మీకు న్యాయముకాదు."

అంతట బ్రాస్ రక్షకభటునితో నిట్లనెను: "మిత్రమా! ఈ దొంగతనము జరుగువఱకు నేనీబాలునిపట్ల అపరిమితమగు విశ్వాసము కలిగియుంటిని. అతనికిది వఱకెంతో సాహాయ్యము చేసితిని. ఇంకను ఎంతో సాహాయ్యము చేయవలయుననుకొంటిని.

అంతలో ఈ దొంగతనము జరిగినది."

"నన్ను ఎఱిగి యున్నవారందఱును నా పట్లనమ్మకము కలిగియుందురు. నన్ను ఎఱిగియుండి, నాపట్ల నమ్మకము లేనివారు ఎవరున్నారు ? ఎవ్వరినైన నడుగుడు ! ఎవ్వరైన, ఎప్పుడైన నా సత్ప్రవర్తనమును శంకించినారేమో ! ఎవ్వరిదగ్గఱనైన ఒక్కరాగి నాణెమునైన తస్కరించినానేమో అడిగి తెలిసి కొనుడు. నేను ఆకలితో బాధపడినప్పుడుకూడ నిజాయితీగ ప్రవర్తించితిని. మఱియిప్పుడు అవినీతికరముగ ప్రవర్తింతునా ! మీరు చేయుచున్నపని యేమో ఒక్కసారి జాగ్రత్తగ ఆలోచింపుడు. ఈ నేరారోపణ సామాన్యమైనది కాదు. ఈనేరారోపణను నెత్తిమీద పెట్టుకొని నా మిత్రులను, అభిమానులను ఇంక ఎటులకలసి కొనగలను ?"

ఆ విషయమును నీవు దొంగతనము చేయకముందే ఆలోచించుకొని యుండినచో ఎంతయు బాగుండెడిది. నీకప్పుడు ఆఆలోచన తట్టలేదు. చేతులు కాలినతరువాత ఆకులుపట్టుకొనుట వలన లాభమేమియున్నది ?" అని బ్రాస్ అనెను.

అంతలో మేడమీదనున్న గౌరవనీయుడు, "ఏమిజరిగినది? ఏమిజరిగినది? ఈ గోల అంతయు నేమి ? అని అఱచెను. అపుడు కిట్ అతనివద్దకు పోవుటకు సిద్ధపడెను. కాని రక్షకభటుడతనిని గట్టిగా పట్టుకొనెను. అంతట తనయిచ్ఛ వచ్చినట్లు చెప్పుటకై బ్రాస్ గౌరవనీయునివద్దకు పోయెను.

బ్రాస తిరిగివచ్చి యిట్లనెను: "నేను చెప్పినదంతయు అతడు విన్నాడు. అతడు నమ్మలేకపోయినాడు. ఎవ్వరుమాత్రము నమ్మగలరు ? నేను నా ఇంద్రియములశక్తిని సందేహించిన

బాగుండును. కాని ఎట్లుసందేహింపగలను? నాకన్నులతో స్వయముగ చూచినదానిని నేను నమ్మకుండ నెట్లుండగలను? మన మింక మేజిస్ట్రేటు కార్యాలయమునకు పోవుటమంచిది."

"అయ్యా! ఒకమాట. నాకొక చిన్న ఉపకారము చేయుడు. నన్ను మొదట లాయరు విదర్‌డెన్ వద్దకు తీసికొని పొండు" అని కిట్ అనెను.

బ్రాస్ తల ఊపెను.

"అయ్యా! నన్నచ్చటకు తీసికొని పొండు. నా యజమాను డచ్చట నున్నాడు. దయయుంచి నన్నచ్చటకు తీసికొని పొండు'' అని కిట్ మఱియొకసారి అనెను.

"నాకు తెలియదు! రక్షకభటుడా! మనము తిన్నగా మేజిస్ట్రేటు కార్యాలయమునకు పోవలయునా? లేక మఱి యింక నెచ్చటికైన పోవుటకు వ్యవధి యున్నదా?" అని బ్రాస్ అనెను.

"మనము వెంటనే బయలుదేఱినచో ఇంక నెచ్చటికైన పోవచ్చును. ఇచ్చట ఆలస్యము చేసినచో తిన్నగా మేజిస్ట్రేటు కార్యాలయమునకు పోవలసినదే" అని రక్షకభటుడు సమాధానమిచ్చెను.

అంతట నందఱును ఒకబండిలో ప్రవేశించిరి. బండి లాయరు విదర్‌డెన్ ఇంటికి ప్రయాణమై పోవుచుండెను. బండిలో కూర్చున్న స్కిర్లోషి కిట్ జరిగిన విషయమునుగూర్చి పరిపరి విధముల ఆలోచింపసాగెను. అతనికంతయు నొక కలవలె నుండెను.

త్రోవలో బండిలోని వారికి క్విల్పు కనబడెను. అతడు బండిలోని వారిని చూచి ఇట్లనెను: "బ్రాస్! ఇప్పుడెక్కడకు

పోవుచున్నావు? ఎక్కడకు పోవుచున్నావు? నీ గుమస్తాకూడ నున్నాడా! కిట్‌కూడ నున్నాడా! నిజాయితీపరుడు కిట్!"

"అయ్యా! ఇదియొక విచారకరమైన అనుభవము! ఎవ్వరి నిజాయితీనిగాని మనము నమ్ముటకు వీలు లేకున్నది!" అని బ్రాస్ అనెను.

"ఎందుచేత? ఎందుచేత? ఇతరుల నిజాయితీని ఎందుచేత నమ్మరాదు?" అని క్విల్పు ప్రశ్నించెను.

"అయ్యా! నా కార్యాలయములో అయిదు పౌనుల నోటు ఒకటి పోయినది. అది ఇతని టోపీలో దొరకినది. అంతకు మునుపితడు కార్యాలయములో ఒంటరిగ నున్నాడు. ఇతడే దానిని దొంగిలించాడనుటకు సందేహము లేదు. ఇందుకు సంపూర్ణమగు సాక్ష్యమున్నది!" అని బ్రాస్ అనెను.

"ఏమి! కిట్ దొంగ! కిట్ దొంగ! హాహాహా! ఎంత వికృతాకారముగల దొంగ ఇతడు! హాహాహా! కిట్! ఇతడు నావీపు చిల్లులు పడునట్లు కొట్టుటకు ముందే అరెస్టు చేసినారా? కిట్! కిట్! ఇంతవఱకు వచ్చినదా నీ సంగతి! నీవారి నందఱను అడిగినానని చెప్పుము!" అని యని క్విల్పు వెళ్ళిపోయెను.

మఱికొంత సేపటికి బండి లాయరు విదర్‌డెన్ ఇల్లు చేరుకొనెను. మొదట బ్రాస్ బండిలోనుండి క్రిందకు దిగెను. తరువాత గుమస్తా దిగెను. ఇరువురును లోనికి వెళ్ళిరి. లోపల లాయరు విదర్‌డెన్, ఎబెల్‌తోను, గార్లెండుతోను ఏమేమో మాట్లాడు చుండెను. విదర్‌డెన్, బ్రాస్‌ను గుర్తించెను.

బ్రాస్ నిట్టూర్పుపుచ్చుచు ఇట్లు చెప్పసాగెను: "అయ్యా! నన్నందఱును బ్రాస్ అందురు. కొన్నికొన్ని విషయములలో

రక్షకభటుని, కిట్‌ను ఇచ్చటకు తీసికొని రమ్ము."

గుమాస్తా బయటకు పోయి రక్షకభటుని, కిట్‌ను లోనికి తీసికొని వచ్చెను.

కిట్ విదర్‌డెన్‌ను, ఇరువురు గౌరవనీయులను చూడగనే ఉద్వేగముతో నిట్లనెను: "అయ్యా! నేను నేరగాడను కాను. ఏపాప మెఱుగని అమాయకుడను. నేను నిర్ఘోషించను విషయ మును భగవంతు డెఱుగును. ఆ మహనీయుడు అన్ని విషయ ములను చూచుచునే యుండును. నా టోపీలోనికి అయిదు పౌనుల నోటు ఎట్లు వచ్చినదో నాకు తెలియదు."

కిట్ జరిగిన విషయమునంతను వివరముగా చెప్పెను. అప్పుడు ఒకరివంక నొకరు చూచుకొనసాగిరి.

ఎట్టకేలకు విదర్‌డెన్ ఇట్లనెను: "టోపీలో ఐదుపౌనుల నోటు ఉండుట కాకతాళీయముగ జరిగి యుండవచ్చును. బల్ల మీద కాగితములను తీయుచుండగా ఆ పని జరిగియుండ వచ్చును."

"పొరపాటున జరిగినదని చెప్పుటకు వీలులేదు. నోటు టోపీలో దొరికిన తీరును చూడగా దాయవలయునని దాచినట్లే కనబడినది" అని బ్రాస్ గుమాస్తా చెప్పెను. మఱియు నతడు నోటుదొరికిన విధమును ప్రదర్శించి చూపెను.

అంతట బ్రాస్ ఇట్లనెను: "ఇది ఎంతయు బాధాకరమైన విషయము. ఎంతో బాధాకరమైన విషయమనుటకు సందేహ మణుమాత్రమైననులేదు. ఇతని పూర్వసత్ప్రవర్తన మునుబట్టి కరుణ చూపవలసినదని సిఫారసు చేయుటకు నేనెం తయు సంతసింతును. నేను ఇదివఱకుగూడ సొమ్ము పోగొట్టు

కొన్నాను. అంతమాత్రాన ఆ సొమ్మునుకూడ ఇతడే తీసినా డనికాదు. కాని ఇతడే తీసియుండునని తలచుట సహజము. ఆ విధముగ తలచుటలో అసహజమైన విషయమేదియు లేదు. కాని మనము క్రైస్తవులముకదా!"

అంతట రక్షకభటుడు అందఱివంక చూచుచు నిట్లనెను : "అయ్యా! ఇటీవల ఈ బాలునివద్ద చాలడబ్బు ఉండెడిదని ఎవ్వ రైన చెప్పగలరా? మీకేమైన తెలియునా?"

అపుడు గార్లెండ్ ఇట్లనెను: "ఈమధ్య ఇతనివద్ద డబ్బు కనబడుచుండెడిది. ఆ డబ్బును బ్రౌన్ ఎంతో దయతో ఇచ్చు చున్నాడని ఇతడు చెప్పుచుండెడివాడు."

"అవునవును. బ్రౌన్ నాకెన్నోసార్లు డబ్బు ఇచ్చుచుండెడి వాడు. బ్రౌన్! ఆమాట నిజముకాదా!" అని కిట్ అనెను.

"నేనా! నీకు డబ్బు ఇచ్చుచుండెడివాడనా!"

"మీరు నాకు క్రౌను నాణెములను ఇచ్చుచుండెడివారు కదా! నేను మీరా సొమ్మును మేడమీదనున్న గౌరవనీయుని తరఫున ఇచ్చుచున్నారని తలంచుచుండెడివాడను."

"ఏమి బ్రౌన్! నీ వెవ్వరి తరఫుననైన ఇతనికి డబ్బు నిచ్చుచుండెడివాడవా?" అని గార్లెండ్ అపరిమితమగు ఆతురతతో ప్రశ్నించెను.

"నే నితనికి డబ్బునిచ్చుటయా! ఇది ఏమిమాట! ఇ ది అంతయు ఎంత చోద్యముగనున్నది. రక్షకభటుడా! ఇంక మనము పోదము. ఇచ్చట నింక నాకు పనిఏమియు లేదు" అని బ్రౌన్ అనెను.

"ఏమి! నాకు డబ్బీయలేదని బ్రౌన్ అనుచున్నాడా?

దయయుంచి ఎవ్వరైన మఱియొకసారి అడుగుడు. అతడు ఇచ్చి నాడో లేదో అడిగి తెలిసికొనుడు" అని కిట్ అనెను.

"బ్రాస్! నీ వితనికి డబ్బునిచ్చినావా?" అని విదర్‌డెన్ అడిగెను.

"గౌరవనీయులారా! ఈ విధముగ మాట్లాడుటవలన అతనికేమియు లాభము కలుగదు. అతడు మఱియొక మార్గము ననుసరించుట మేలు. మీరతని మంచిని కోరుచున్నచో ఆ విధముగ సలహాచెప్పుడు. నే నతనికి డబ్బునిచ్చి యుంటినా! నే నెప్పుడును ఒక్క రాగినాణెమునైన నిచ్చియుండలేదు" అని బ్రాస్ అనెను.

కిట్ ఏదో గ్రహించిన వానివలె నిట్లనెను: "గౌరవనీయులారా! నేను మఱియొకసారి గట్టిగా చెప్పుచున్నాను. ఇతడు నాకనేకసార్లు డబ్బు నిచ్చినాడు. ఇది యంతయు నన్ను సర్వనాశనము చేయుటకు పన్నిన హేయమైన కుట్ర. మఱి ఇతనికి నేనేమి అపకారము చేసినానో నాకు తెలియదు. గౌరవనీయులారా! ఇదియంతయు కుట్రయని గ్రహింపుడు. ఇకముందేమైన జరుగనిండు. నా టోపీలో నితడు స్వయముగ అయిదు పౌనుల నోటును పెట్టియుండునని గట్టిగా నమ్ముచున్నాను. బ్రాస్‌వంక చూడుడు! అతని ముఖకవలికలు ఎట్లు మాఱిపోవుచున్నవో చూడుడు! మా యిరువురిలో ఎవరు నేరగానివలె కనబడుచున్నారు? అతడా? నేనా?"

అప్పుడు బ్రాస్ ఇట్లనెను: "గౌరవనీయులారా! మీరతని మాటలు వినుచున్నారా? మీరతని మాటలు వినుడు. ఇతడు గొప్ప మోసగాడను విషయము మీకు అర్థమగుటలేదా? ఇది

సామాన్యమైన నేరముకాదు. హేయమైన ద్రోహబుద్ధితో కూడిన నేరము. మీ ఎదుట ఇతడు చెప్పినాడు కనుక సరిపోయినది. ఇతడు లేకుండ నేను చెప్పియుండినచో మీరు నా మాటలు నమ్మియుండెడివారు. ఇప్పుడు మీ కంతయు నర్థమగుచున్నదా?"

"ఇంక మేము పోవలయును" అని రక్షకభటు డనెను.

రక్షకభటుడు, బ్రాస్, గుమాస్తా, కిట్-వీరల నలుగురును బండిలో ప్రవేశించిరి. బండి తిన్నగా మేజిస్ట్రేటు కార్యాలయమునకు పోయెను. విడర్ డెన్ ఇద్దఱు గౌరవనీయులతో కలసి మఱియొక బండిలో అచ్చటకు పోయెను. మేజిస్ట్రేటు కార్యాలయము లో బ్రాస్ మేడమీద నివసించుచున్న గౌరవనీయుడు ఆతురముతో వేచియుండెను.

కాని అచట ఎంతమంది గౌరవనీయు లున్న నేమి? కిట్‌కు సాహాయ్యము చేయుస్థితిలో నెవ్వరును లేకుండిరి. మేజిస్ట్రేటు కిట్‌పై ఆరోపింపబడిన నేరమును నమోదుచేసికొని విచారణను వాయిదా వేసెను. అంతవరకు కిట్‌ను జైలులో పెట్టవలసినదని ఆజ్ఞాపించెను.

ఒక అధికారి కిట్‌ను జైలుకు తీసికొనిపోవుచు నిట్లనెను: "అబ్బాయి! నీవు నిరుత్సాహపడవలసిన పనిఏమియు లేదు. త్వరలోనే విచారణ జరుగును. నీకు ద్వీపాంతరవాసశిక్ష విధింపబడును. పదునేనురోజులలో అంతయు పూర్తి అగును. విచారింపకుము."

17

జైలులోనున్న కిట్ నాటిరాత్రి ఎంత బాధపడెనో వర్ణించిచెప్పుట ఎవ్వరికిని సాధ్యముకాదు. తప్పుచేసినవారు బాధపడుట సహజము. అమాయకుడగు కిట్ తన్ను అనవసరముగా జైలులో పెట్టినారని ఎంతయు బాధపడసాగెను. "నన్ను గుఱించి గార్లెండ్ దంపతులు ఏమనుకొందురు? ఎబెల్ ఏమనుకొనును? బార్బరా ఏమనుకొనును? నాతల్లి ఏమనుకొనును? వారందఱును నేను నిజముగా నేరగాడనని భావింతురేమో!" అని యనుకొనుచు అతడు విచారింపసాగెను. అతడు తాను నిర్బంధింపబడియున్న గదిలో చాలసేపు అటునిటు పచార్లు చేసెను. ఎట్టకేల కతనికి నిదురపట్టెను. కాని ఆ నిదురలలో నతనికన్నియు బాధాకరమగు కలలే! ఎట్టకేలకు తెల్లవాఱినది.

ఆ గదిలో ఒక్క కిట్ మాత్రమే యుండెను. మఱి ఇంకనెవ్వఱును లేరు. అనగా ఆనాలుగుగోడలమధ్య అతడుస్వేచ్ఛగా తిరుగవచ్చును. అతడేమిచేసినను అడ్డుపెట్టువారెవ్వరును లేరు. అది యాతనికి కొంతఓదార్పుగానుండెను. జైలు ఉద్యోగి ఒకడు అతనికి భోజనము తెచ్చియిచ్చెను.

"నీమీద నేరారోపణ చేయబడియున్నది. కాని నేరమింకను రుజువుకాలేదు. అందువలన ఇతర నేరగాండ్రకును నీకును తేడాయున్నది. నిన్ను చూచుటకు నిర్ణీత సమయములందు నీవారు రావచ్చును" అని జైలుఉద్యోగి కిట్కుచెప్పెను. ఆసమాచారముకూడ కిట్కు కొంచెము ఓదార్పుగ నుండెను. కిట్ ఒక

మూలనుండి కూర్చొండి ఏదో పుస్తకమును చదువుకొన సాగెను.

కొంతసేపటికి జైలుఉద్యోగివచ్చి తలుపులు తెరచి, "కిట్! రా రమ్ము" అని అనెను.

"ఎక్కడకు?" అని కిట్ ప్రశ్నింపగా, ''నిన్ను చూచుట కెవరో వచ్చినారు" అని మాత్రము జైలుఉద్యోగి సమాధానము చెప్పెను. కిట్ గదిలోనుండి బయటకువచ్చెను. ఉద్యోగి అతని భుజము పట్టుకొని అనేక దారులగుండా ఒక రక్షిత ప్రదేశమునకు తీసికొనిపోయెను. అతనికి కొన్నిఅడుగుల దూరమున నతని తల్లి ఇరువురు పిల్లలతో నిలబడియుండెను.

కిట్‌ను చూడగనే తల్లి గోలుగోలున నేడువసాగెను. తల్లితో బాటు ఇరువురు పిల్లలును ఏడువసాగిరి. వారితో బాటు కిట్‌కూడ నేడువసాగెను. ఒక్కరును ఏమియు మాట్లాడకుండిరి.

జైలు ఉద్యోగి ఆ దృశ్యమునుజూచి తల్లితో నిట్లనెను: ''అమ్మా! మీరు కాలము వృథాచేయరాదు. ఇచ్చిన అవకాశమును సద్వినియోగము చేసికొనవలయునని సలహా ఇచ్చుచున్నాను. ఇచ్చట మీరు మీ యిష్టము వచ్చినంతసేపు ఉండుటకు వీలులేదు. ప్రభుత్వమువారు నిర్ణయించిన కాలవ్యవధిలోనే మీ మాటలు పూర్తిచేసుకొనవలయును. వ్యవధి దాటిపోయిన తరువాత మీరింక నిచ్చటనుండుటకు వీలులేదు. మఱియు పిల్లలిచ్చట నేడువరాదు. అది నిబంధనలకు వ్యతిరేకము."

''నే నతని తల్లిని. ఇత డతని తమ్ముడు" అని తల్లి ఏడ్చుచు ననెను.

"ఎవ్వరైననేమి? నేను మీకు చేయగలిగిన సాహాయ్య

మేదియు లేదు. ప్రభుత్వ నిబంధనల కందఱును సమానమే. నీకు మారుడొక్కడే ఇటువంటి పరిస్థితిలో లేడు. నీకుమారునివంటి వారు మఱికొందఱు ఇచ్చటనున్నారు. ఆ విషయమునుగూర్చి గొడవచేయుటవలన లాభమేమియునునుండదు" అని ఉద్యోగి అనెను.

తల్లి ఇట్లని సాగెను; "ప్రియమైనకిట్! నాయనా! నేనెంత దురదృష్టవంతురాలను! నీవెంత దురదృష్టవంతుడవు! నేను నిన్నిచ్చట చూడవలసి వచ్చినది!"

"వారు నామీద అనవసరముగా నేరారోపణచేసినారు. నీవు వారి మాటలను నమ్ముచున్నావా? అమ్మా!"

"నేను నమ్ముటయా! నీవు జీవితములో ఒక్కసారియైన అసత్యము పలుకలేదు. ఒక్క చెడ్డపనియైన చేసియుండలేదు. నేను నిన్నుగూర్చి ఒక్కసారియైన విచారించియుండలేదు. నీవు ఇతరులకు తగినంత ఆహారముండదని తక్కువ ఆహారము తినుచుండెడివాడవు. అప్పుడుమాత్రము నేను విచారించు చుండెడిదానను. చిన్నవాడవైనను నీ ఆలోచనలుగొప్పవి. నీ స్వార్థము చూచుకొనక ఇతరులమేలు కోరుచుండెడివాడవు. నీవు పుట్టినప్పటి నుండియు నాకు సంతోషమునే చేకూర్చుచు వచ్చినావు. నీవు ఒక్కసారియైన నాకు కోపము తెప్పించుపని చేసియుండలేదు. నీవు నేరముచేసినావని నేను నమ్ముటయా! కిట్!"

"భగవంతుడు కరుణామయుడు! నీమాటలు నాకు సంపూర్ణమగు సంతృప్తిని కలిగించుచున్నవి. ముందేమిజరిగిననుసరే! నీ మాటలు నా హృదయములో నెప్పుడును కదలుచుండును. అవియేనాకు అనిర్వచనీయమగు సౌఖ్యమును కలిగించు

చుండును."

ఆమాటలనువిని కిట్‌తల్లి మరల నేడువసాగెను. తమ్ముడు జాకబ్ కూడ మెల్ల మెల్లన నేడువసాగెను.

కిట్‌తల్లి కన్నులు తుడుచుకొని నేలమీాదనుండి ఒక బుట్టతీసి జైలు ఉద్యోగితో నిట్లనెను: "అయ్యా! దయయుంచి నాయీా ఒక్క మాటవిందురా?"

ఆమె యీావిధముగ ప్రశ్నించినపుడు జైలుఉద్యోగివార్తాపత్రికలో నవ్వుపుట్టించు విషయమును దేనినో చదువుచుండెను. అతడు దానిని చదువుటలో నిమగ్నుడై యుండెను. అందువలన నతడు, "ఒక్క నిమిషముఆగుము" అనునర్థము వచ్చునట్లు చేయి పైకెత్తెను. అతడు చదువుట పూర్తియగువఱకు ఆ చేతిని యథాస్థానమునకు తీసికొనిరాలేదు. తరువాత నతడు కొన్నిక్షణములు ఆగి మందహాసముచేసెను. పిమ్మట, "మీాకేమి కావలయును?" అనిప్రశ్నించెను.

"అయ్యా! నాకుమారుడు తినుటకై కొన్నిపదార్థములను తెచ్చియున్నాను. అయ్యా! వీనినతడు తీసికొనుటకు దయతో అనుమతింపుడు. మీారు చాల మంచివారు."

"అతడు వానిని స్వీకరింపవచ్చును. స్వీకరింపరాదను నిబంధనలేవియులేవు. మీారు వెళ్ళిపోవునపుడు వానిని నాకు ఇండు. నేనవి అతనికందునట్లు చేయుదును.

"అయ్యా! ఒక్కమాట. దయయుంచి నామీాద మీాకు కోపమువలదు. అతడు నా కుమారుడు. నేనతని తల్లిని. మీారు కూడ ఒక తల్లికన్నవారేకదా! అతడు నా ఎదుట కొంచము తినవలయునని వాంఛించుచున్నాను. అతడు తినుచుండగా

చూచిన నాకెంతయు ఆనందము కలుగును. తరువాత నేను వెళ్ళి పోయెదను.

అట్లని ఆమె మరల నేడువ సాగెను. జైలు ఉద్యోగి కామె కోరిక క్రొత్తదిగాను, వింతగాను నుండెను. అది అసాధారణమైన కోరికయని అతడు అనుకొన సాగెను. అయినను అతడు వార్తా పత్రికను చదువుటమాని ఆమె వద్దకు వచ్చి బుట్టను తీసికొనెను. అందలి పదార్థములను జాగ్రత్తగా పరిశీలించిన తరువాత దానిని తీసికొనిపోయి కిట్‌కు ఇచ్చెను. తరువాత నతడు యథాస్థానమునకు పోయి కూర్చుండెను.

కిట్‌కు ఆకలి సరిగా లేనిమాట నిజము. అయినను అతడు తల్లిని సంతృప్తి పఱచుటకై బుట్టలోని ఆహార పదార్థములను ఎంతో కష్టముమీద తినసాగెను. అప్పుడు తల్లి మాటి మాటికి ఏడువసాగెను. కాని ఆ ఏడుపులో కుమారుడు భుజించు చున్నాడను సంతృప్తికూడ మిళితమై యుండెను.

"గార్లెండ్ దంపతులు, ఎబెల్ మున్నగు వారందఱును క్షేమముగ నున్నారా? నామీద నేరారోపణనుగూర్చి వారే దేని అభిప్రాయమును వెలిపుచ్చినారా?" అని కిట్, తల్లిని ప్రశ్నించెను.

"అందఱును క్షేమముగనే నున్నారు. నిన్న రాత్రి ఎబెల్ ఎంతో దయతో మన యింటికి వచ్చి నీవు జైలులో పెట్టబడిన విషయమును వివరించి చెప్పినాడు. కాని అతడు ఎట్టి అభిప్రాయమును వెలిపుచ్చి యుండలేదు. నీవు దోషివనికాని, నిర్దోషివనికాని చెప్పియుండలేదు."

కిట్ బార్బగాను గుఱించి అడుగవలయునను కొనెను.

కాని అంతలో జైలు ఉద్యోగి, "మీ కీయబడిన కాలము అయి పోయినది. ఇంక మీరు పోవచ్చును" అని యనెను. పిమ్మట నతడు కిట్‌ను ఎప్పటి చోటుకు తీసికొని పోసాగెను.

అంతలో మఱియొక జైలు ఉద్యోగి వారిని కలసికొని, "నిన్న రాత్రి దొంగతనము చేసినాడన్న నీ నేరారోపణపై జైలులో పెట్టబడిన కిట్ ఇతడేనా?" అని ప్రశ్నించెను.

''అవును. అతడే ఇతడు."

అపుడు రెండవ జైలు ఉద్యోగి కిట్‌తో నిట్లనెను: ''అయినచో ఇదిగో నీకోసము బీరు పానీయమును తెచ్చి యున్నాను. ఏమి అట్లు చూచుచున్నావు? నీకు ఆశ్చర్యముగ నున్నదా ఏమి?''

''అయ్యా! క్షమింపుడు. ఈ పానీయమును నాకెవ్వరు పంపియున్నారు.''

"నీకా సందేహ మెందులకు? నీ మిత్రుడే పంపినాడు. అతడు నీకు ప్రతి దినమును బీరు పానీయమును పంపుదునని వాగ్దానము చేసియున్నాడు. మఱి అతడు ప్రతిదినము సొమ్మిచ్చి నచో నీకు పానీయము అందుచుండును.''

"నా స్నేహితుడు! ఎవ్వరా స్నేహితుడు!"

''నీ స్నేహితుడు ఎవ్వరో నీకే తెలియదా? అంతయు ఆశ్చర్యకరముగ నున్నదే! ఇదిగో ఉత్తరము. దీనిని తీసికొని చదువు కొనుము. నీ కంతయు అర్థమగును."

కిట్ బీరు పానీయమును, ఉత్తరమును తీసికొనెను. అతడు జైలు గదిలో కూర్చుండి ఉత్తరము నిట్లు చదువ సాగెను.

"మిత్రమా! ఈ బీరు పానీయమును సంతోషముగ త్రాగుము. ఇందలి ప్రతి చుక్క నీ కష్టములను తొలగించును. ఇది అమృతము వంటిది. నేను సర్వదా నీ క్షేమమును కాంక్షించు చున్నాను. రి. స్వి."

"రి. స్వి! ఎవరీతడు!" అని కొంచెముసేపు కిట్ ఆలోచించెను. ఎట్టకేల కతడు ఇట్లను కొనెను: "బ్రాస్‌వద్ద గుమాస్తాగా పనిచేయుచున్న రిచర్డు స్వివలర్ అన్నమాట! అతడు చాల దయతో పంపియున్నాడు. నేను అతనికి హృదయపూర్వకముగ కృతజ్ఞత తెలియజేయుచున్నాను."

18

కిట్ త్వరలోనే విచారింపబడు ననియు, అంతయుపదు నేను దినములలో పూర్తి యగుననియు ఒక యుద్యోగి అతనికి చెప్పి యుండెనుగదా. అతడు చెప్పినమాట నిజమయ్యెను. అనతి కాలములోనే విచారణ ప్రారంభమయ్యెను.

"నీవు బ్రాస్‌అను పేరుగల లాయరువద్దనుండి అయిదు పౌనులనోటు నొకదానిని అపహరించినట్లు నేరము ఆరోపింపబడినది. ఇందువలన శాంతికి భంగము వాటిల్లినది. మఱి నీవా నేరము చేసితివో లేదో చెప్పుము" అని న్యాయాధికారి కిట్‌తో అనెను.

అంతట కిట్ వణకుచున్న హీనస్వరముతో నిట్లనెను. "అయ్యా! నేను ఆ నేరముచేసి యుండలేదు."

ఆతని మాటలను విని న్యాయస్థానములోనున్న కొందఱు ఇట్లనుకొనిరి! "చూడుడు! కొన్నిరోజులు జైలులో ఉన్నంత మాత్రాన ఇతడెట్లయి పోయినాడో! జైలుమానవులను పీల్చి పిప్పిచేయును. ఇంతకుముందు ఎంతో గట్టిగా మాట్లాడుచుండెడి కిట్ ఇప్పుడు వణకుచు మెల్లన మాట్లాడుచున్నాడు." ఇంకను పలువురు పలువిధముల అనుకొనసాగిరి.

జైలులోనున్న కిట్‌ను గార్లెండ్ దంపతులుకాని, విదర్ డెన్‌కాని కలసికొని యుండలేదు. కాని అతని తరపున వాదించుటకు వారొకన్యాయవాదిని నియమించినారన్న విషయమాత్ర మతనికి తెలిసెను. న్యాయస్థానములో నొక న్యాయవాదిలేచి న్యాయాధికారి నుద్దేశించి, "ప్రభూ! నేను ముద్దాయిపక్షమున వాదించుటకు వచ్చియున్నాను" అని యనెను. కిట్ అతనికి నమస్కరించెను. తరువాత మఱియొక న్యాయవాదిలేచి, "ప్రభూ! నేను ముద్దాయికి వ్యతిరేకముగ వాదించుటకు వచ్చియున్నాను" అని యనెను. అప్పుడు కిట్ గజగజవణకుచు అతనికి గూడ నమస్కరించెను.

మొదట బ్రాస్ తరఫునవచ్చిన న్యాయవాది మాట్లాడ వలసియుండెను. అతడు న్యాయస్థానమునంతను ఒక్కసారి కలయజూచెను. అతనికి కిట్ తరఫునవచ్చిన గౌరవనీయులు పలువురు కనబడిరి. గార్లెండ్ దంపతులు, ఎబెల్, తాతా మనుమ రాండ్రను వెదకవచ్చిన గౌరవనీయుడు మున్నగు వారందఱు నచ్చటనుండిరి. కిట్ తల్లి, బార్బరా మున్నగువారుకూడ వచ్చి యుండిరి.

బ్రాస్ న్యాయవాది కిట్‌మీద ఆరోపింపబడిన నేరము

నంతను వివరించి చెప్పెను. కిట్ సామాన్య కుటుంబమునకు చెందినవాడనియు, అతనికి దొంగతనము చేయవలసిన అవసర మున్నదనియు, గౌరవనీయు లెవ్వరును అతనిని సమర్థింపరాదని న్యాయవాది ఉద్ఘాటించెను. తరువాత నతడు బ్రాస్ గొప్పతన మును వివరించిచెప్పెను. బ్రాస్‌వంటి గౌరవనీయుడు అనవసర ముగా కిట్‌మీద నేరారోపణ చేయడనియు, అందువలన అతని మాటను నమ్మవలసియున్నదనియు చెప్పెను.

తరువాత సాక్ష్యము చెప్పుటకై బ్రాస్ బోనులో ప్రవే శించెను. అతడు మందహాసముచేయుచు న్యాయాధికారికి నమ స్కరించెను. ఆ మందహాసము, "మన మిగుపురము ఎంతో కాలమునుండి మిత్రులము" అని చెప్పుచున్నట్లుండెను. అతని పక్షమున పనిచేయుచున్న న్యాయవాది చక్కని తెలివితేట లుపయోగించి అతనిని ప్రశ్నించెను. ఆ ప్రశ్నలకు సమాధాన ముగ బ్రాస్ కిట్‌పై నేరమును పూర్తిగా రుద్దెను.

తరువాత కిట్ న్యాయవాది బ్రాస్‌ను ప్రశ్నించెను. కాని బ్రాస్ వద్దనుండి అసలు విషయమును లాగలేకపోయెను. న్యాయవాదివేసిన దీర్ఘమైన ప్రశ్నలకతడు ముక్తసరిగా సమా ధానమిచ్చెను. తరువాత నతడు బోనులోనుండి బయటకు వచ్చెను.

పిమ్మట బ్రాస్‌వద్ద గుమాస్తాగా పనిచేయుచున్న రిచర్డు స్వివలర్ బోనులో ప్రవేశించెను. అతడుకూడ కిట్‌కు వ్యతిరేక ముగ చెప్పెను. కాని అతని మాటలలో తటపటాయింపు కన బడుచుండెను. అతడు కిట్‌పట్ల సానుభూతి కలిగియున్నాడను విషయము బ్రాస్ న్యాయవాదికి తెలిసెను. అందువలన నతడు

గుమాస్తాను ఇట్లు ప్రశ్నించెను: "రిచర్డు! నిన్న నీవు ఎచ్చట భోజనము చేసినావు?"

"నిన్న నేను ఎచ్చట భోజనము చేసినాను?"

"నేను ఆ ప్రశ్ననే అడుగుచున్నాను. నిన్న నీవు ఎచ్చట భోజనము చేసినావు? ఇచ్చటకు సమీపముననే భోజనము చేసినావా?"

"అవునవును. త్రోవలోనే భోజనము చేసినావు. ఒంటరిగ భోజనము చేసినావా?"

"ఏమన్నారు?"

"ఒంటరిగానే భోజనము చేసినావాయని ప్రశ్నించుచున్నాను. లేక మఱి ఎవ్వరితోనైన కలసి భోజనము చేసినావా?"

"మఱియొకరితో కలసి భోజనము చేసినాను."

"ఆ మఱియొకరు ఎవరు? కిట్ సోదరుడేనా?"

"అయ్యా! మఱి నేను..."

"నాకు ఆ గొడవ అంతయు వలదు. అవును, కాదు అని చెప్పుము."

"మఱి మీరు నన్ను చెప్పనిచ్చెదరా? లేదా?"

"అవును, కాదు అనిచెప్పుము."

"అవును. కాని..."

"నాకింక మిగిలిన విషయము అనవసరము. నీవు చాల మంచి సాక్షివి."

ప్రాస్ న్యాయవాది మఱి ఇంకనేమియు అనక కూర్చుండెను. కిట్ తరఫున వాదించుచున్న న్యాయవాదికి అసలు విష

యమేమో బోధపడలేదు. అందువలన నతడు ప్రాస్ గుమా స్తాను ప్రశ్నింపలేదు. గుమాస్తా బోనులోనుండి దిగి వెళ్ళి పోయెను.

తరువాత కిట్ తరఫున సాక్షుల విచారణ జరిగెను. గార్లెండ్ బోనులోనికి వచ్చెను. "అయ్యా! కిట్ మంచి గుణ ములు కలవాడని మీకెవ్వరు సిఫారసు చేసియున్నారు?" అని ప్రాస్ న్యాయవాది అతనిని ప్రశ్నించెను.

"ఎవ్వరును సిఫారసు చేయలేదు. అతని మంచి గుణము లనుగూర్చి అతనితల్లి చెప్పగా విన్నాను."

"కిట్ పూర్వము ఎవరివద్ద పనిచేసినాడో మీకు తెలి యునా ? అచ్చట నతడు ఎందుకు మానివైచినాడో తెలి యునా?"

"కిట్ పూర్వము ఒక ముసలివానివద్ద పనిచేయుచుండెడి వాడనివిన్నాను. మఱియూ ముసలివాడు ఎందుకో అతనిని పని నుండి తొలగించినాడట."

"అయ్యా! మీరు గౌరవనీయులు; గొప్ప అనుభవము కలవారు. అటువంటి మీరు కిట్‌వంటి వానిని పనిలో ఎట్లు పెట్టుకొన్నారో నాకు అర్థము కాకున్నది. మీరీ విషయమున కొంచెము విచక్షణా జ్ఞానమును ఉపయోగించి యుండ వలసినది."

ప్రాస్ న్యాయవాది ఆ విధముగనే మిగిలిన సాక్షులను గూడ మెల్లమెల్లన మందలించెను.

న్యాయాధికారి కిట్ దోషి అని నిర్ణయించెను. "నేను దోషినికాను" అని కిట్ ఎన్నిసార్లు చెప్పినను అతని మాటలను

ఆలకించు వారెవ్వరును లేకుండిరి. అతడు తిరిగి జైలులో పెట్ట బడెను. అతనికి ద్వీపాంతరవాస శిక్ష విధింపబడెను.

కిట్ తల్లి ఎంతయు విచారింపసాగెను. ఆమె మఱల జైలువద్దకుపోయెను. అచ్చటి యుద్యోగి ఆమెతో చక్కగా మాట్లాడెను. "కిట్ ఐదుపౌనుల నోటును ఎందుకు దొంగిలించి నాడో నాకు అర్థము కాకున్నది" అని అతడనెను.

"అతడసలు దొంగతనము చేయలేదు."

"నేను ఆ మాటను కాదనను. అతడు చేసినను, చేయక పోయినను ఇప్పుడు అంతయునొకటే."

జైలు ఉద్యోగి కిట్‌ను గదిలోనుండి బయటకు తీసికొని వచ్చెను. అతనిని చూచి తల్లి వలవల ఏడవసాగెను.

"అమ్మా ఏడవకుము. ధైర్యముకలిగి యుండుము" అని కిట్ తల్లికి ధైర్యము చెప్పసాగెను. "మనలను రక్షించుట కొఱకు భగవానుని దయవలన ఎవ్వరో ఉద్భవింతురు. అందుకు సందేహమేమియు లేదు. ఆ విషయమున నాకు సంపూర్ణమగు విశ్వాసమున్నది, ఇప్పుడు కాకపోయినను కొంతకాలమునకైనను ఆ విధముగ జరుగును. నేను ఏ పాపమెఱుగని అమాయకుడనను విషయము రుజువగును. అప్పుడు నన్ను తిరిగి యిచ్చటకు తీసుకొనివత్తురు. నేనీ విషయమును గాఢముగ నమ్ముచున్నాను."

అంతలో కిట్ తల్లి మూర్ఛపోయెను. అప్పుడు బ్రాస్ గుమాస్తావచ్చి ఆమెను ఇంటికి తీసుకొనిపోయెను. ఆమెకు తెలివివచ్చువఱకు నతడచ్చటనే యుండెను. తరువాత నతడు బ్రాస్‌వద్దకు పోయెను

అతని చూడగనే బ్రాస్, "ఓహో! రిచర్డ్! గుడ్ ఈవెనింగ్!" అని యని మందహాసముచేసెను.

బ్రాస్ ఏదో కుట్రపన్ని కిట్‌ను నేరములో ఇరికించినట్లున్నాడను విషయమును గుమాస్తా గ్రహించినట్లుండెను.

"అయ్యా! నాకు సొమ్ము కావలయును!" అని గుమాస్తా అనెను.

బ్రాస్ జేబులోనుండి పర్సుతీసి, "సొమ్ము! నీకు సొమ్ము కావలయునా? అవునవును, నీకు తప్పక సొమ్ము కావలయును. మనుష్యులందఱును జీవింపవలయునుగదా మఱి! నీవద్ద ఐదు పౌనుల నోటుకు చిల్లరయున్నదా?"

"లేదు."

అటులనా! అయిన నిదిగో నీకీయవలసినసొమ్ము! ఇంక నేమియు బాధఉండదు. ఈ సొమ్ము తీసికొనుము."

గుమాస్తా ఆ సొమ్ము తీసికొని వెనుకకు తిరిగెను.

"రిచర్డు! పాపము, నీవింక నిచ్చటకు తిరిగి రావలసిన పనిలేదు. ఆ విషయమున నేమాత్రము కష్టపడకుము" అని బ్రాస్ అనెను.

"ఏమనుచున్నారు?"

"ఏమియు అనుటలేదు. నీవంటివానికి మావంటివారివద్ద పని అంత ఉత్సాహకరముగ నుండదు. ఇచ్చట పని అంతయు నిరుత్సాహ కరముగ నుండును. నీవు అపూర్వమైన తెలివితేటలు కలవాడవు. ఆ తెలివితేటలకు తగిన ఉద్యోగమందు ఉండవలసిన వాడవు. ఇక ఉద్యోగరీత్యా నీ విచ్చటకు రావలసిన పనిలేదు. కాని మిత్రునిగా అప్పుడప్పుడు వచ్చిపోవుచుండుము. నీకిచ్చిన

సొమ్మ నీ కీయవలసిన సొమ్మును సరిగా సరిపోయిన దనుకొందును. నీవొకసారి కిటికీ నొకదానిని పగులగొట్టినావు. దానిని బాగుచేయించుటకు కొంతసొమ్మ ఖర్చయినది. కాని నేనా సొమ్మకు నీకీయవలసిన సొమ్మలో తగ్గించుకోలేదు. మనము మిత్రులుగా విడిపోవుచున్నాము. కావున కొంచెము వితరణబుద్ధి చూపవలసియున్నది. ఇందుకు నీ వెంతయు సంతసింతువని నమ్ముచున్నాను."

గుమాస్తా ఒక్క మాటయైన మాట్లాడకుండ తిన్నగా ఇంటికిపోయెను. ఆరాత్రి అతనికి జబ్బుచేసెను. ఇరువదినాలుగు గంటలలో నది విషజ్వరముగా మారెను.

19

ఒకనాడొక చిన్న అమ్మాయివచ్చి ఎబెల్‌ను కలసికొనెను. అప్పుడు ఎబెల్ ఏదో ముఖ్యమైన పనిచేయుటలో నిమగ్నుడై యుండెను. అందువలన నతడా అమ్మాయినిచూచి విసుగుకొనెను.

"అయ్యా! మీతో నొక ముఖ్యమైనమాట చెప్పవలసియున్నది."

"నీతో మాట్లాడుట కిప్పుడు వ్యవధిచాలదు. బయటకు పొమ్మ."

"అయ్యా! ఆ విధముగ అనకుడు. ముఖ్యమైనపని."

"నీకు కాదా చెప్పుచున్నది! పోపో!"

"అయ్యా! కిట్..."

"కిట్ సంగతి ఏమి?"

"కిట్ ఏపాప మెఱుగని అమాయకుడు."

"ఏమను చున్నావు?"

"కిట్ ఏపాపము ఎఱుగని అమాయకుడు. అతడు బ్రాస్ నోటును దొంగిలించి యుండలేదు."

"కిట్ దొంగతనము చేసియుండలేదను విషయము నీకెట్లు తెలియును?"

"అయ్యా! చెప్పెదను వినుడు. నేను కొన్ని రోజులకు ముందు లాయరు బ్రాస్ ఇంట పనిచేయుచుండెడిదానను. బ్రాస్ వద్ద రిచర్డుస్వివలర్ అను నతడు గుమాస్తాగా పనిచేయుచుండెడి వాడు. బ్రాస్ అతనిని ఉద్యోగమునుండి తొలగించివైచెను. నాటిరాత్రి అతనికి జబ్బుచేసెను. అత డప్పటినుండి జ్వరముతో బాధపడుచున్నాడు. నేను బ్రాస్‌వద్ద పనిమాని అతనికి సేవ చేయు చున్నాను. కడచిన రాత్రి అతడు చిత్తమువచ్చినట్లు మాట్లాడసాగెను. ఆ మాటలలో కిట్ ప్రసక్తి వచ్చెను. కిట్‌ను ఆస్ట్రేలియాకు పంపివైచెదరట. కిట్ టోపీలో అయిదు పౌనుల నోటు ఒకటి దొరికినదట. అందులకే అతనికి ద్వీపాంతర వాస శిక్ష విధించినారట.

ఆ మాటలను విన్న నాకు కొన్ని రోజులక్రిందట బ్రాస్ ఇంట జరిగిన విషయ మొకటి జ్ఞప్తికి వచ్చినది. ఆనాడు నేను బ్రాస్ కార్యాలయములో బ్రాస్‌ను, ఒక బాలుని చూచి యుంటిని. బ్రాస్, బాలుని టోపీలో అయిదు పౌనుల నోటు

నొకదానిని పెట్టెను. కాని బాలుడా విషయమును గమనింప లేదు. నేనా విషయమునంతను తాళపుచెవి కంతలోనుండి చూచితిని. రిచర్డుమాటలు విన్నతరువాత ఆ మాటలకును, నేను బ్రాస్ ఇంట చూచినదానికిని సంబంధము కలదని గ్రహించితిని.

నేటి యుదయమున రిచర్డు బాగుగనున్నాడు. అందువలన నే నతనికి నాకు తెలిసిన విషయము నంతను చెప్పితిని. అంతట నతడు మిమ్ము కలసికొని చెప్పవలసినదని నాకు సలహా ఇచ్చెను. అతని సలహా ప్రకారము నేను మీవద్దకు వచ్చినాను. చెప్పవలసినదంతయు చెప్పినాను. తరువాత మీ చిత్తము."

"ఇంకచాలును. ఇంకచాలును" అని యనుచు ఎబెల్ తిన్నగా లాయరు విదర్ డెన్ ఇంటికిపోయెను. చిన్నఅమ్మాయి తానువచ్చినపని నెఱవేఱినందుకు సంతసించుచు రిచర్డువద్దకు పోయెను.

ఎబెల్ తన లాయరుతో కొంచముసేపు ఏమేమో మాట్లాడెను. అంతట లాయరు ఒక చీటివ్రాసెను. ఆచీటిలో నిట్లు వ్రాయబడియుండెను: "బ్రాస్ మహాశయా! ఒక్కసారి మీరు మా కార్యాలయమునకు రావలయును. మీతో మన వృత్తికి సంబంధించిన కొన్ని విషయములను మాట్లాడవలసి యున్నది. కావున మీరు తప్పకరావలయును. వెంటనే రావలయునని కోరుచున్నాను."

లాయరు ఆ చీటిని తన గుమాస్తాకిచ్చి, "ఈ చీటిని లాయరు బ్రాస్‌కు ఇచ్చిరమ్ము" అని యనెను. గుమాస్తా వెంటనే అచ్చటకుపోయెను. ఈ లోపల బ్రాస్ కార్యాలయ పైభాగమున

నివసించుచున్న గౌరవనీయునకుగూడ కబురువెళ్లెను. అతడు అనతికాలములో వచ్చెను, గార్లండ్ మహాశయుడుకూడ వచ్చెను. మఱి కొంతసేపటికి బ్రాస్‌కూడవచ్చెను. అచ్చట నున్నవారినందఱనుచూచి అతడు ఆశ్చర్యపడెను; కలవరపడెను. కాని ఏమియు నెఱుగనివానివలె మందహాసముచేయుచు విదర్‌డెన్ ప్రక్కన నిలబడెను.

అప్పుడు విదరడెన్ ఇట్లనెను: "బ్రాస్‌మహాశయా! వచ్చినారా! మీరు వచ్చినందుకు నాకెంతయు సంతోషముగనున్నది. మీకు క్షేమమేకద! మీ పనులన్నియు సక్రమముగ సాగిపోవుచున్నవనుకొందును. మనవృత్తికి సంబంధించిన ఒకవిషయమును గూర్చి మాట్లాడుకోవలయునని మీకు కబురుపెట్టియున్నాను. అంతే అంతకంటె మఱియొక విషయమేదియులేదు. దయచేసి ఆ ఆసనమున కూర్చుండుడు."

అపుడు కుటిలుడగు బ్రాస్ ఒక ఆసనముపై కూర్చుండెను.

అంతట విదరడెన్ ఇటుల చెప్పసాగెను: "అన్నట్లు ఆ అబ్బాయి పేరేమి? ఆ జ్ఞాపకమువచ్చినది. కిట్! కిట్!"

'కిట్' అనుమాటను వినగానే బ్రాస్‌నవనాడులు క్రుంగిపోయినట్లయ్యెను. అయినను అతడు ధైర్యము తెచ్చుకొని ఎప్పటివలె నిబ్బరముగాకూర్చుండి యుండెను.

విదర్‌డెన్ ఇంకను ఇట్లు చెప్పసాగెను: "బ్రాస్! నీ అయిదుపౌనులనోటును అతడు దొంగిలించినట్లు నేరము ఆరోపింపబడినదిగదా! అతనిని న్యాయస్థానమువారు విచారించినారు. ద్వీపాంతరవాసశిక్ష విధించినారు. అప్పటికి లభించిన సాక్ష్యమును

బట్టి అతనికాశిక్ష విధింపబడినది. కాని యిప్పుడు కొన్ని ముఖ్య మైన అంశములు తెలిసినవి. ఇవి చాల ముఖ్యమైనవి అంశములు అసాధారణమైనవికూడ. నీకు సంబంధించినంతవఱకు ఇవిచాల తీవ్రమైనవి. ఇపుడు సాక్ష్యమంతయు సిద్ధముగానున్నది. ఆసాక్ష్య మంతయు నీకు వ్యతిరేకముగనున్నది. కావున నీవు జరిగిన విష యమునంతను స్పష్టముగా, సంపూర్ణముగా చెప్పివేయవలయు నని మేము కోరుచున్నాము. నీవు మాకు సత్యమునే చెప్పవల యును. సత్యమంతయు చెప్పవలయును. సత్యముతప్పమఱి ఇతర మేమియు చెప్పరాదు. మేము నీమాటలు వినవలయునని ఆతు రముతో వేచియున్నాము."

బ్రౌస్ మొగములో రక్తపుచుక్క లేకుండెను. తన గుట్టం తయు వారికి తెలిసిపోయినదని అతడు గ్రహించెను. సత్యమును దాచుటకుగాని, అసత్యమును కల్పించి చెప్పుటకుగాని వీలు లేదని అతడు గ్రహించెను. అందువలన నతడు జరిగిన విషయము నంతను పూసగ్రుచ్చినట్లుచెప్పెను. "ఇదియంతయు దుర్మార్గు డగు క్వీల్పుపని. అటువంటిక్రూరుడు, దుష్టుడు, నీచుడు మరి యొకడుండడు" అని అతడు ఉద్ఘాటించెను.

బ్రౌస్ ఇంకను ఇట్లుచెప్పెను: "అయ్యా! నేను ఏ పనిని గాని సగముసగముచేసి వదలిపెట్టు వాడనుగాను. మీరు నన్ను మీయిష్టము వచ్చినట్లు ఉపయోగించు కొనవచ్చును. మీయి ష్టమువచ్చిన ప్రదేశమునకు తీసికొనిపోవచ్చును. నేనుచెప్పిన విష యమునంతను కాగితముమీద పెట్టవలసినదని మీరు కోరినచో ఆ విధముగ చేయుటకు నేను సిద్ధముగనున్నాను. మీరు నన్ను దయజూతురను విషయము నాకు బాగుగా తెలియును. మీ

రంటును గౌరవనీయులు; దయార్ద్రహృదయులు. నేను అవసర మునుబట్టి దుర్మార్గుడగు క్విల్ప్సుకు లొంగిపోయినాను. అవసర మునకు చట్టమనునది లేదు. నేను అవసరమునుబట్టి మీకు లొంగి పోవుచున్నాను; అట్లుచేయుట నా విధానముకూడ; అదియుకాక ఇట్టిభావములు చాల కాలమునుండి నాలో పనిచేయుచున్నవి. గౌరవనీయులారా! క్విల్ప్సను శిక్షింపుడు. అతని నెత్తిమీద పెద్ద బండ పెట్టుడు. అతనిని పిండిపిండిచేయుడు. కాళ్ళతో త్రొక్కి నలిపివేయుడు. అతడు నన్ను ఎన్నో విధముల బాధించినాడు. అతడా బాధల ఫలితము ననుభవింపవలయును."

అంతట విదర్ డెన్, ఎబెల్, బ్రాస్ ఇంటిపై భాగమున నివసించుచున్న గౌరవనీయుడు కలసి ఒక ప్రక్కకుపోయి కొంచెముసేపు ఏమో మాట్లాడుకొనిరి. తరువాత వారు యథా స్థానములకువచ్చిరి. విదర్ డెన్, బ్రాస్‌కు వ్రాతపరికరములను చూపి ఇట్లనెను: "బ్రాస్! నీవు వ్రాతపూర్వకముగ ఏ విష యమునైన తెలియజేయదలచినచో, ఇప్పుడట్లు చేయుటకు అవ కాశమున్నది. మఱియింకొకవిషయము. నీవు మాతో బాటిప్పుడు న్యాయాధికారివద్దకు రావలసియున్నది. నీవు ఏమిచేసినను, చెప్పి నను నీ విచక్షణాజ్ఞానము నుపయోగించుకొనవలసి యున్నది."

అంతట బ్రాస్ ఇట్లనెను: "గౌరవనీయులారా! మీరు నాపట్ల అపరిమితమగు దయను చూపుచున్నారు. నేనందుకు తగినవాడనని రుజువు చేసికొందును. మీరు నాపట్ల కరుణను చూపకపోయినచో నేను ఎందుకును పనికిరాకుండ పోదును."

పిమ్మట నతడొక బల్లముందుకూర్చుండి అంతకుముందు చెప్పిన విషయమునంతను కాగితముమీద పెట్టసాగెను. కొంత

నేపటికతడావని పూర్తిచేసెను. అంతట పైనపేర్కొన్న ముగ్గురు గౌరవనీయులును, బ్రాస్‌కలసి న్యాయాధికారి వద్దకుపోయిరి. బ్రాస్‌వ్రాసి సంతకము పెట్టినపత్రము అతనికి అందజేయబడెను. అంతయు చదువుకొన్నతరువాత న్యాయాధికారి బ్రాస్‌ను ఒక గదిలో బంధించెను. పిమ్మట నతడు గౌరవనీయులతో నిట్లనెను: "మీరింక మీయిండ్లకు పోవచ్చును. క్విల్పును అరెస్టుచేసి తీసికొని వచ్చుటకై తేపు వారంటు పంపెదను. ఇక నేమాత్రము ఆలస్యముచేయకుండ నిర్దోషియగు కిట్‌నువిడుదలచేయబడును."

అంతట గౌరవనీయులు ఎంతయు సంతసించి రిచర్డు స్వివలర్ ఇంటికిపోయిరి. అప్పటికతడు మంచి ఉత్సాహముతో నుండెను. వచ్చినవారందఱితో నతడు చక్కగామాట్లాడెను. గౌరవనీయులు తాము చేసిన పనినంతను అతనికి వివరించిచెప్పిరి. కొంచెముసేపైన తరువాత విదర్‌డెన్‌తప్ప మిగిలినవారు వెళ్ళి పోయిరి.

విదర్‌డెన్, రిచర్డుతో నిట్లనెను: "నీ ఆరోగ్యము బాగుగ నున్నది. కనుక నా వృత్తిధర్మము ననుసరించి నీ కొక వార్త చెప్పుటకు నేను సాహసించుచున్నాను."

"అయ్యా! చెప్పుడు. మీరు చెప్పబోవు విషయము నా మనస్సునకు కష్టము కలిగించునది కాదను కొందును."

"కష్టము కలిగించు విషయమైనచో ఇప్పుడెందుకు చెప్పెదను? మఱియొకప్పుడు చెప్పియుండెడివాడను. ఇంతవఱకు ఇచ్చట నుండిన నా స్నేహితుల కెవ్వరకు ఆ విషయము తెలియదు. వారు నీపట్ల ఎంతో దయతో ప్రవర్తించు చున్నారు."

"నేను మీకెంతయు కృతజ్ఞుడను."

"నేను కొంతకాలమునుండి నీ గురించి వాకబు చేయుచున్నాను. కాని నిన్ను నే నీ పరిస్థితులలో కలసి కొందునని ఎన్నడును ఊహించి యుండలేదు. నీవు రెబెకాస్వివెల్ అను వనితకు చుట్టమవు. ఆమె మరణించినది."

"మరణించినదా?"

"అవును. ఆమె వ్రాసిన వీలునామా ప్రకారము నీకు సంవత్సరమునకు నూట యేబది పౌనుల సొమ్ము వచ్చును. ఇందుకు నిన్ను నే నెంతయు అభినందించు చున్నాను."

ఆ మాటలను విన్న రిచర్డు స్వివలర్ ఆనంద బాష్పములు కార్చుచు నిట్లనెను: "అయ్యా! ఈ వార్త చెప్పినందుకు నేను మీ కెంతయు కృతజ్ఞుడను. పాపము! ఈ చిన్న అమ్మాయి నేను మరణావస్థలో నుండగా నాకు అపూర్వమగు సేవచేసినది. నే నామెకు చదువు చెప్పించెదను. చక్కని దుస్తులు కుట్టించెదను. నగలు చేయించెదను. ఈ విధముగ నేనామె చేసిన సేవకు కృతజ్ఞతను తెలియజేసి కొందును. ఈ వార్త చెప్పిన మీకు మరియొకసారి కృతజ్ఞతను తెలియజేసికొను చున్నాను."

20

తన గుట్టు బట్టబయలు అయినదన్న విషయము క్విల్పుకు ఏ మాత్రము తెలియదు. అతడు నది యొడ్డుననున్న తన కార్యాలయములో కూర్చుండి తన ప్రణాళికలు విజయవంతముగ

కొనసాగుచున్నందులకెంతయు సంతసింప సాగెను. అతడింకను కొన్ని ప్రణాళికలను గురించి ఆలోచించుచుండెను. అంతలో ఆతని గది తలుపుల నెవ్వరో మెల్లన తట్టిరి. రెండు మూడుసార్లు తట్టిన తరువాత క్వీల్పు కిటికీ తలుపులు తెఱచి, "ఎవరక్కడ?" అని గట్టిగా అఱచెను.

"క్వీల్పు! నేనే!" అని ఎవ్వరో అనిరి. ఆ ధ్వని ఒక స్త్రీ మాట్లాడినట్లుండెను.

"ఓహో! నీవేనా? నీ విచ్చటకెందులకు వచ్చినావు? నా తలుపు తట్టుటకు నీకెంత సాహసము వచ్చినది?"

ఆ వచ్చిన స్త్రీ క్వీల్పు భార్య. ఆమె యిట్లనెను: "నేను మీకొక వార్త తీసికొని వచ్చినాను. దయయుంచి నన్ను కోపగింపకుడు."

"అది చాలా సంతోషకరమైన వార్తయేనా? నేను ఎగిరి దుముకుటకు తగిన వార్తయేనా? ఎవ్వరైన మరణించినారా? వారి ఆస్తికి నేను వారసుడ నగుదునా?"

"వార్త ఏమో నాకు తెలియదు. అది మంచిదో, చెడ్డదో నాకు తెలియదు."

"అయిన ఎవ్వరును మరణింపలేదన్నమాట! నాకు ఆస్తి రాదన్నమాట. ఇంక నీవు పోవచ్చును."

"నేను మీకొక ఉత్తరము తీసికొని వచ్చినాను."

"అయినచో ఆ వుత్తరమును కిటికీలోనుండి లోపలకు విసరి వేయుము. తరువాత వెళ్ళిపొమ్ము. నేను బయటకు వచ్చినచో నీవీపు చిట్లగొట్టెదను."

"క్విల్ప్! దయయుంచి నామాట వినుము! దయయుంచి

నా మాట వినుడు. నన్ను ఇంకను మాట్లాడనిండు."

"అయిన మాట్లాడుము. చెప్పదలచుకొన్న విషయ మును క్లుప్తముగా, తొందరగా చెప్పుము. తెలిసినదా?"

"ఈ యుత్తరమును ఒక బాలుడు తీసికొని వచ్చినాడు. ఈ యుత్తరమును పంపిన వారెవ్వరో తనకు తెలియదన్నాడు. కాని మీకు వెంటనే అందజేయ వలయునని చెప్పినాడు. ఈ ఉత్తరములోని విషయము చాల ముఖ్యమైనదనికూడ చెప్పినాడు. కాని ఒక ముఖ్యమైన ప్రార్థన. నన్నుగూడ లోపలకు రానిండు. నా మనస్సు ఎంతో ఆందోళనగా నున్నది. నేను లోపల అయిదు నిమిషముల కంటె ఎక్కువ కాలముండను. దయయుంచి నన్ను లోపలకు రానిండు."

భార్య ప్రార్థనను గూర్చి భర్త కొంచెముసేపు తట పటాయించెను. "ఈ యుత్తరమునకు సమాధానము పంపుట అవసరము కావచ్చును. అప్పుడా సమాధానమును ఈమె ద్వారమున పంపవచ్చును" అని అతడు అనుకొనెను. పిమ్మట నతడు కిటికీ తలుపులు మూసివైచి, వాకిలి తలుపులు తెఱచి, "లోనికి రమ్మ" అని అనెను.

భార్య లోనికి ప్రవేశించి తన చేతిలోని ఉత్తరమును భర్తకిచ్చి కుంపటివద్ద కూర్చుండెను. భర్త తలుపులు మూసి వైచి భార్యతో నిట్లనెను: "నీ మనస్సు ఆందోళనగా నున్నం దుకు నే నెంతయు సంతసించు చున్నాను. నీవు బాధపడుట నాకు ఆనందదాయకమైన విషయము. నా కెంతయు సంతోషదాయక మైన విషయం!"

భార్య ఏడ్చుచు, "క్లైవ్! మీరు ఎంత క్రూరముగ

మాట్లాడుచున్నారు!" అని యనెను.

"నేను మరణించానని అనుకొన్నావా? అప్పుడు నా సొమ్మంతయు నీకు చెందునని తలచినావా? తిరిగి మఱియొకనిని వివాహము చేసికొనవచ్చునని తలచినావా? నీకు ఎంత ఆశ ఉన్నది?"

ఏ పాపమెఱుగని భార్యకా పలుకులు అశనిపాతమువలె నుండెను. ఆమె యా మాటల నేమాత్రము సహింపలేక గోలు గోలున నేడువసాగెను. ఆ దృశ్యమును చూచి దుర్మార్గుడగు భర్త ఎంతయు సంతసింపసాగెను. భార్య ఏడ్పు, భర్తకెట్లు ఆనందము కలిగించునో అతనికే తెలియవలయును మఱి!

"ఇంక నీ యుత్తరమును చదువుకొందును. ఇది బ్రౌస్ చెల్లెలు వ్రాతవలెనున్నది. ఆమెకు నేనన్న నెంతయు ప్రేమ! ఆమె అందాలరాశి! ఈ యుత్తరములో నామె తన ప్రేమను వెల్లడించి యుండును!" అని క్విల్పు అనుకొనెను.

అతడు ఉత్తరము తెఱచి ఇట్లు చదువుకోసాగెను: "సోదరుడు బ్రౌస్ శత్రువులకు లొంగిపోయినాడు. విషయమంతయు చెప్పివైచినాడు. రహస్యమంతయు బట్టబయలై పోయినది. కొందఱు నిన్ను కలసికొనుటకువత్తురు. వారింతవఱకు ప్రశాంతముగ నున్నారు. ఒక్కసారి నిన్ను ఆశ్చర్యసాగరమున ముంచవలయునని వారు తలచుచున్నారు. ఇక కాలమును వృథాచేయకుము. నేను చేయలేదు. నేనింక ఎవ్వరికిని, ఎచ్చటను కనబడను. దీనినిబట్టి నీవుకూడ ఏమిచేయవలయునో ఊహించుకొనుము."

ఆ యుత్తరమును క్విల్పు అరడజనుసార్లు చదువుకొనెను.

అప్పుడతని ముఖములో వచ్చిన మార్పులను వర్ణించుటకు క్రొత్తభాష కావలయును. ఇప్పుడున్న భాషలేవియు పనికిరావు. చాలసేపటివఱకు అతడు ఒక్కమాటయైన మాట్లాడలేదు.

ఎట్టకేలకతడు "అతడిక్కడ నున్నచో ఏమి చేయుదునో! అతడిక్కడ నున్నచో ఏమిచేయుదునో!" అని యన సాగెను.

"క్విల్ప్! అసలు విషయమేమి? మీకు ఎవ్వరిపై కోపముగా నున్నది?" అని భార్య ప్రశ్నించెను.

భార్య మాటలను లెక్కచేయక క్విల్పు ఇట్లనసాగెను: "అతనిని నదిలో ముంచివేయుదును. చంపివేయుటకిది దగ్గఱిదారి. మరణము సులభముగాను, తక్కువ కాలములోను వచ్చును. నది దగ్గఱగా నున్నది. ఇప్పుడతడు ఇచ్చటనున్న ఎంత బాగుండును! అతనిని మంచిమాటలు చెప్పుచు హఠాత్తుగా నదిలోనికి త్రోసివేయుదును. మునిగిపోవువారు మూడుసార్లు పైకి తేలుదురట. ఆ మూడుసార్లును అతనిని హేళనచేయుదును. అది ఎంతయు సంతోషకరముగ నుండును!"

"క్విల్పు! ఏమి జరిగినది? ఏమిజరిగినది?" అని భార్య ప్రశ్నింపసాగెను.

"వాడు వట్టికుక్క! హీనుడు! ద్రోహి! విశ్వాసఘాతకుడు! వాడు వట్టిపిఱికివాడు. కనుక ఎప్పుడును నోరుమూసికొని పడియుండునని తలచితిని. కాని ఇప్పుడు వానికి నోరువచ్చినది. బ్రాస్! బ్రాస్! ఇప్పుడు నీవిచ్చట నున్నచో ఏమిచేసి యుండెడివాడనో!"

భార్య మరల మాట్లాడుటకు ప్రయత్నింపసాగెను.

అంతట క్విల్పు బయటనున్న బాలసేవకుని పిలిచెను. బాలుడు వెంటనే వచ్చెను. క్విల్పు అతనితో నిట్లనెను: "ఓరీ! ఈమెను ఇంటికి తీసికొనిపొమ్ము. రేపు ఇచ్చటకు రాకుము; ఏలయన ఇచ్చటి తలుపులన్నియు మూయబడి యుండును. నేను కబురు పెట్టువఱకుగాని, కనబడువఱకుగాని ఇచ్చటకు రాకుము. అర్థమైనదా?"

అర్థమైనదన్నట్లు బాలుడు తల ఊపెను.

తరువాత క్విల్పు భార్యతో నిట్లనెను: "ఇక నీకు చెప్పుచున్నాను. వినుము నన్ను గుఱించి ఏమియు ప్రశ్నింపకుము. నాకోసము వెదకుటకు ప్రయత్నింపకుము. నన్ను గుఱించి ఏమియు మాట్లాడకుము. నేను మరణింపను. నీకు ఓదార్పును కలిగింతును. అతడు నీ గుఱించి జాగ్రత్త తీసికొనును."

"క్విల్పు! అసలు విషయమేమి? మీరెక్కడకు పోవుచున్నారు? నాకు మఱికొంత చెప్పుడు."

"నీవు వెంటనే బయటకు పొమ్ము. అటుల చేయుట ఉత్తమోత్తమమైనపని. లేనిచో నీవీపు చిట్లగొట్టెదను."

"ఏమి జరిగినది? ఏమిజరిగినదో దయయుంచి నాకు చెప్పుడు. దయయుంచి నాకు చెప్పుడు."

"ఏమి జరిగిన నీకేమి? నీవేమి చేయవలయునో ఇదివఱకే చెప్పినాను. నా మాటకు వ్యతిరేకముగ నేమియు చేయకుము. నీవు వెంటనే వెళ్ళెదవా? వెళ్ళవా?"

"నేను వెంటనే పోయెదను. కాని నా ఒక్క ప్రశ్నకు మొదట సమాధానము చెప్పుడు. మీరు చదివిన యుత్తరము నకును, ప్రియమైన నెలబాలకును సంబంధమేమైన నున్నదా?

నేను మిమ్ములను ఈ ప్రశ్నను అడగవలసి యున్నది. తప్పక అడగవలసి యున్నది. నేను అప్పుడు నెలబాలను మోసగించి మీకు సాహాయ్యము చేసినాను. అందుకు ఫలితముగా ఎన్నో రాత్రింబగళ్ళు విచారముతో గడపుచున్నాను. నేను చేసిన పని వలన ఆమెకు ఎట్టిహాని కలిగినదో కదా! నేను మీ కొఱకే అంతపని చేసినాను. నేను నా అంతరాత్మకు విరుద్ధముగా ఆపని చేసినాను. దయయుంచి నా యీ ఒక్కప్రశ్నకు సమాధానము చెప్పుడు."

అంతట క్వీల్పు దుడ్డుకఱ్ఱ నొక దానిని తీసికొని బాల సేవకుని, భార్యను బయటకు తమిటికొట్టెను.

చీకటి పడినతరువాత రక్షకభటులు కొందఱు క్వీల్పు గృహమునకు పోయిరి. ఇల్లంతయు వెదకిరి. కాని వారి కతడు ఎచ్చటను కనబడలేదు. "నీ భర్త ఎక్కడ నున్నాడు?" అని వారు భార్యను ప్రశ్నించిరి. నదియొడ్డున నున్న కార్యాలయ ములో నున్నాడని ఆమె సమాధానము చెప్పెను. తన భర్త కొఱకు రక్షకభటు లెందుకు వచ్చినారో మాత్ర మామెకు అర్థము కాకుండెను.

రక్షకభటులు తిన్నగా క్వీల్పు కార్యాలయమునకు పోయిరి. వారు తలుపులు కొట్టిరి. కాని ఎంతకును ఎవ్వరును తలుపులు తీయలేదు. అందువలన వారు తలుపులు బ్రద్దలుకొట్టి లోపలకు ప్రవేశించిరి. వారు ఇల్లంతయు వెదకిరి. కాని ఎవ్వ రును కనబడలేదు. ఆ యింటి దొడ్డి తలుపులుమాత్రము తెఱచి యుండెను. అందువలన రక్షకభటులు ఆ ద్వారమున బయటకు

పోయి అంతయు వెదకిరి. ఒక మనుజుడు ఆ దారిని వెళ్ళిన ఆనవాళ్ళు కనబడెను. కాని మనుజుడు మాత్రము కనబడలేదు. క్వీల్పు తప్పించుకొని పాఱిపోయినాడని రక్షకభటులు తలచిరి.

మఱి క్వీల్పు ఏమైపోయినట్లు? రక్షకభటులు రాకముందే తప్పించుకొని పాఱిపోవలయునని అతడు దొడ్డిదారిని బయటకు పోయి యుండెను. కాని కాలుజాఱి నదిలో పడెను. అతడు ఒడ్డున చేరుకొనుటకు విశ్వప్రయత్నము చేసెను. కాని లాభమేమియు లేకపోయెను. అతడు ప్రవాహ వేగమునకు కొట్టుకొని పోయి మరణించెను. అతని శవము నదిలో ఒకచోట ఒడ్డు పట్టెను. రక్షకభటులా శవమును పట్టుకొనిరి. అది క్వీల్పు శవమని వారు గుర్తించిరి.

న్యాయస్థానమువారు బ్రాస్‌ను విచారించిరి. అతడు అసలువిషయము నంతను అంగీకరించినందున న్యాయస్థానమువారతనిపట్ల కరుణ చూపిరి. అతడు విదేశములలో శిక్ష ననుభవింప వలసిన పనిలేదనియు, స్వదేశములోని జైళ్ళలోనే జీవిత పర్యంతము శిక్ష ననుభవించిన చాలుననియు వారు నిర్ణయించిరి. ఆ నిర్ణయము ప్రకారము బ్రాస్ ఒక గట్టి జైలులో బంధింపబడెను.

21

కిట్ ఆస్ట్రేలియాకు పంపబడు-రోజు వచ్చినది. కాని కిట్‌ను ఆస్ట్రేలియా తీసికొని వెళ్ళరు. అతడు నేరగాడుకాడు. అతడు ఏపాపము నెఱుగని నిర్దోషి. కాని ఆ విషయము నతని కెవ్వరును ఒక్క-సారిగా చెప్పలేదు. ఒక్క-సారిగా చెప్పినచో ఆ ఆనందముతో నతడు గుండె పగిలి మరణింపవచ్చును.

"నిన్ను మిగిలినవా రందఱితో బాటు ఇప్పుడే ఆస్ట్రేలియాకు తీసికొనిపోరు" అని ఒకసారి అనిరి.

"నీ నేరమునుగూర్చి కొన్ని సందేహములు వచ్చినవి. విషయసేకరణ చేయుచున్నారు. బహుశా నిన్ను క్షమింప వచ్చును" అని మఱియొకసారి అనిరి.

సాయంకాలమునకు జైలు అధికారులు కిట్‌ను ఒక గది లోనికి తీసికొనివచ్చిరి. ఆ గదిలో కొందఱు గౌరవనీయులు కూర్చుండియుండిరి. కిట్‌ను చూడగనే గార్లెండ్ లేచి అతని దగ్గఱకు బోయి చేయి పట్టుకొని, "నీవు నిర్దోషివని ఋజువైనది. నీకు స్వేచ్ఛ లభించినది" అని యనెను. ఆ మాటలు వినగానే కిట్ సమాధానము చెప్పుటకు ప్రయత్నించెను. కాని మూర్ఛ పోయెను.

మఱికొంతసేపటికి కిట్‌కు తెలివివచ్చెను. అప్పుడచ్చట వారొకరు అతనితో నిట్లనిరి: "నీవు గుండెనిబ్బరము కలిగి యుండవలయును. ఈ సంతోషవార్తను గుండె నిబ్బరముతో

స్వీకరింపవలయును."

"నీ తల్లి సంగతి ఆలోచింపుము" అని మఱియొకరు అనిరి.

కిట్ తన తల్లి సంగతి ఎక్కువగ ఆలోచించుచున్నాడు కనుకనే ఆ సంతోషకరమగు వార్తను అతడు భరింపలేని పరిస్థితి ఏర్పడినది.

"సత్యము అందఱకు తెలిసినది. అందఱును నీపట్ల సానుభూతి చూపుచున్నారు" అని అందఱును అనసాగిరి.

కిట్ కామాటలు చెవికెక్కుటలేదు. అతడు తనయింటిని గుఱించి మాత్రమే ఆలోచించుచుండెను.

"నా తల్లికీవిషయము తెలియునా? ఆమె ఏమన్నది? ఆమె కెవ్వరు చెప్పినారు?"—ఇవియే అతని ఊహాలు.

ఒక రతనికి ద్రాక్ష సారాయమును తెచ్చి యిచ్చిరి. దాని నతడు త్రాగెను. అతనికి కొందఱు మంచి కబుర్లుచెప్పిరి. కిట్ ఎట్టకేలకు బాగుగ సేదదేఱెను.

"నీవిప్పు డెట్లున్నావు? నీ కిష్టమైనచో ఇప్పుడే బయటకు పోదము" అని గార్లెండ్ కిట్‌తో ననెను.

అచ్చట నున్నవా రందఱును కిట్‌తో కరచాలనము చేసిరి.

"మీ కందఱకు నే నెంతయు కృతజ్ఞుడను" అని కిట్ అనెను. కాని అతడింక నేమియు మాట్లాడలేకపోయెను. గార్లెండ్ కిట్‌ను పట్టుకొని బయటకు తీసికొని రాసాగెను. జైలు అధికారులు కిట్‌ను పరిపరివిధముల అభినందింపసాగిరి. ఎట్టకేలకు కిట్ జైలుబైటకు వచ్చెను.

గార్లెండ్ చేసిన ఏర్పాట్ల ప్రకారము కోచి బయట సిద్ధ

ముగా నుండెను. గార్లెండ్ మొదట కిట్‌ను అందులోని కెక్కించెను. తరువాత తాను ఎక్కెను. కోచి శరవేగమున పోసాగెను. అనతికాలములో నది గార్లెండ్ గృహమును చేరు కొనెను. గార్లెండ్ కిట్‌ను కోచిలోనుండి క్రిందకు దింపెను. ఇరువురును ఇంటిలోనికి వెళ్ళిరి.

అచ్చట కిట్ తల్లి తన కుమారుని రాకకొఱకు వేచి యుండెను. కుమారుని చూడగనే ఆమె ముందుకు వచ్చెను; అతనిని హృదయపూర్వకముగ కౌగిలించుకొనెను. అచ్చట బార్బరాకూడ నుండెను. కిట్‌ను చూడగనే ఆమె బావురుమని ఏడ్చెను. గార్లెండ్‌సతి అతనిని హృదయపూర్వకముగ నాహ్వా నించెను. ఎబెల్ ప్రతియొక్కరిని కౌగిలించుకొనుటకు సిద్ధముగా నుండెను. అతని ఆనందమునకు పట్ట పగ్గము లేకుండెను. బ్రాస్ ఇంటి పై భాగముననున్న గౌరవనీయుడుకూడ అచ్చటనుండెను. ఏమిచేయుటకును తోచనివానివలె అతడు అటునిటు తిరుగ సాగెను.

అచ్చట నున్నవా రందఱును కిట్ ఆరోగ్యమును కాంక్షించుచు పానీయములను సేవింపసాగిరి. తరువాత వారంద ఱును అతనికి ఎన్నో బహుమానముల నొసగిరి. కిట్ వాని నన్నిటిని ఎంతో కృతజ్ఞతతో స్వీకరించెను.

తరువాత నచ్చట అందఱును కలసి భోజనము చేసిరి. ఆరాత్రికందఱును అచ్చటనే ఉండవలయునని నిర్ణయించుకొనిరి.

భోజనము లైనతరువాత గార్లెండ్ కిట్‌ను ఒకగదిలోనికి తీసికొనిపోయెను. అచ్చట వారిరువురుతప్ప ఇంకెవ్వరును లేరు.

"కిట్ ! నేను నీకొక విషయము చెప్పబోవుచున్నాను.

అది నీ కెంతయు ఆశ్చర్యము కలిగించును" అని గార్లెండ్ కిట్‌తో ననెను.

ఆమాటలను వినగానే కిట్ పాలిపోయినట్లయ్యెను.

కిట్! నేను చెప్పబోవు విషయము నీకెంతయు ఇష్టమైన దిగ నుండును. రేపు ఉదయమున నీవు ప్రయాణమై పోవుటకు సిద్ధముగా నుందువా?" అని కూడ గార్లెండ్ అనెను.

"ప్రయాణమా!"

"నాతోను, ఈ ప్రక్కగదిలోనేయున్న నామిత్రునితోను కలసి ప్రయాణమై రావలయును. ఈప్రయాణపు టుద్దేశ్యమేమో నీవు గ్రహింపగలవా?"

కిట్ ఇదివఱకుకంటె ఎక్కువగా పాలిపోయినట్లయ్యెను. అతడు తల ఊపెను.

"నీవు ఊహింపగల వనుకొందును. ప్రయత్నించి చూడుము."

కిట్ ఏమేమో మాట్లాడసాగెను. కాని ఆ మాటలలో 'నెలబాల' అను పేరుమాత్రమే మూడునాలుగుసార్లు వినబడెను. అతడట్లనుచు తల ఊపసాగెను. నెలబాలను తిరిగి కలసికొను అవకాశములేదు" అని అతడు అభిప్రాయ పడుచున్నట్లుండెను.

గార్లెండ్, "మరల ప్రయత్నించిచూడుము" అని అగునని కిట్ తలచుచుండెను. కాని అతడు ఆవిధముగ ననలేదు. "నీవు సరిగానే ఊహించినావు" అని అతడు అనెను. అత డింకను నిట్లనెను: "వారు ఎచ్చట నివసించుచున్నారో తెలిసినది. మనము అచ్చటకే ప్రయాణమై పోనున్నాము."

"ఆ ప్రదేశ మెక్కడ నున్నది? దానిని ఎట్లు కనుగొ

న్నారు? ఎప్పుడు కనుగొన్నారు? ఆమె సుఖముగా నున్నదా?" అని కిట్ ప్రశ్నించెను.

"ఆమె సుఖముగా నున్నదనుటకు ఎట్టి సందేహమును లేదు. అనతి కాలములోనే ఆమెకు సంపూర్ణారోగ్యము చేకూరునని నమ్ముచున్నాను. ఆమె ఇటీవల బలహీనముగ నున్నదని వినియున్నాను. నీకు మిగిలిన విషయము నంతనుకూడ చెప్పెదను వినుము" అని గార్లెండ్ అనెను.

కిట్ ఆతురముతో వినుటకు సిద్ధపడెను.

గార్లెండ్ ఇట్లు చెప్పసాగెను: "నా కొక సోదరుడున్నాడు. అతడు ఇచ్చటకు చాల దూరమున నున్న ఒక గ్రామ మతాధికారితో కలసి నివసించుచున్నాడు. ఆ మతాధికారి, నా సోదరుడు బాల్య స్నేహితులు. నేను, నా సోదరుడు ఒకరి నొకరము గాఢముగా ప్రేమించుకొనుచున్నాము. అయినను మేము కలసికొని చాల సంవత్సరములైనది. ఉత్తర ప్రత్యుత్తరములు మాత్రము తఱచుగా జరుగుచున్నవి. ఎప్పటికప్పుడు కలసికోవలయునని గాఢముగా వాంఛించుచున్నాము. కాని ఆ పని మాత్రము జరుగుటలేదు. ఎప్పటి కప్పుడు వాయిదా పడుచు వచ్చుచున్నది.

నా సోదరుడు ఎన్నో సద్గుణములు కలవాడు. అతడు బ్రహ్మచారి. అతడు నివసించుచున్న గ్రామములోని వారికందఱకు నతడు ఉపకారము చేయుచుండును. వారందఱును అతనిని భక్తి భావముతో గౌరవించుచుందురు; పూజించుచుందురు. ఈ విషయమైనను చాల సంవత్సరముల తరువాత మాత్రమే తెలిసినది. ఏలయన నా సోదరుడు స్వంత డబ్బా వాయించు

కొను రకమునకు చెందిన వాడుకాడు. అతడు ఇతరుల మంచిని గూర్చి చెప్పునేగాని తన గొప్పతనమునుగూర్చి ఏ మాత్రము చెప్పుకొనడు. అందువలన నతడు గ్రామములోని తన స్నేహితులనుగూర్చి ఎప్పుడును ఏమియు వ్రాసెడివాడు కాడు. అట్టి నా సోదరుని మనస్సును ఆ గ్రామములోని ఇరువురు బాగుగా ఆకర్షించినారు. ఆ యిరువురిలో నొకరు ముసలివాడు, రెండవవారు బాలిక. నా సోదరుడు వారిపట్ల దయను చూపుచుండెడివాడు. కొన్ని రోజుల క్రిందట నా సోదరుని వద్దనుండి నా కొక యుత్తరము వచ్చినది. అందాతడు వారిరువురనుగూర్చి విపులముగా వ్రాసినాడు. వారు ఎన్నో ప్రాంతములు తిరిగి ఆ గ్రామము చేరుకొన్నారట. వారు ఒకరి నొకరు గాఢముగా ప్రేమించుకొనుచున్నారట. వారినిగూర్చి నా సోదరుడు వ్రాసిన విషయమును చదివినచో ఎట్టి వారికైనను కన్నీరు వచ్చును.

ఆవిషయమునంతను చదివినతరువాత వారు తాతా మనమరాండ్రయి యుందురని నేను నిర్ణయమునకు వచ్చినాను. వారిరువురును నా సోదరుని దయకు పాత్రులగుట భగవంతుని మహిమయే. ఇక ఏ విధమగు సందేహము లేకుండ నుండుటకుగాను వారికి సంబంధించిన మఱికొన్ని వివరములను తెలుపవలసినదని నేను నా సోదరునకొక యుత్తరము వ్రాసియుంటిని. దానికి సమాధానముగా నా సోదరుడొక ఉత్తరము వ్రాసినాడు. అది నేటి యుదయముననే నాకు అందినది. ఆ యుత్తరమును బట్టి వారిరువురును తాతా మనమరాండ్రను విషయము నిర్ధారణమైనది. అందువలన అచ్చటకు ప్రయాణమై పోవలయునని నిశ్చయించుకొన్నాను. రేపే మన ప్రయాణము.

ఈ లోపల నీకు చాల విశ్రాంతి అవసరమైయున్నది. కావున నీవింక నిదురింపుము. భగవంతుడు మనల నా గ్రామము నకు సురక్షితముగ చేర్చునని ఆశించుచున్నాను."

తరువాత కిట్ నిదురింపబోయెను.

కిట్ తెల్లవాఱకముందే నిదురనుండి లేచి ప్రయాణము నకు సిద్ధపడసాగెను. అతడొక్కడేకాక ఇంటిలోని వాఱందరును లేచి ప్రయాణమునకు కావలసిన ఏర్పాటు చేయసాగిరి. బ్రాస్ ఇంటిపై భాగమున నివసించెడి గౌరవనీయుడు మాత్రము ఏపని చేయుటలేదు. ఇతరులు చేయుచున్న పనులను చూచుచు అటు నిటు తిరుగుచుండెను. తెల్లవాఱుసరికి ప్రయాణమునకు కావల సిన ఏర్పాట్లన్నియు పూర్తి అయ్యెను. కాని ప్రయాణముకొఱకు ఏర్పాటు చేయబడిన బండి తొమ్మిది గంటలవరకురాదు. కిట్‌కు ఆకాలము కొన్ని యుగములవలె నుండెను. ఈ లోపల సంద ఱును ఉదయకాలపు భోజనమును తీసికొనిరి.

బార్బరా మాత్రము అంత వుత్సాహాకరముగ లేదు. ఆమె కిట్‌ను ప్రేమించుచుండెను. కిట్ ఆమెను ప్రేమించుచుండెను. అందువలన ప్రయాణము తనకెంతో ఉత్సాహాకరముగ నున్న దని కిట్ బార్బరాకు చెప్పెను. ఆ మాటలు చెప్పగానే బార్బరా ఇదివఱకుకంటె ఎక్కువగా నీరు కారిపోయెను.

ఆమెకిట్‌తో నిట్లనెను:"క్రిస్టఫర్! నీవుఇంటికివచ్చిఎంతో కాలముకాలేదు. మఱి అప్పుడే ప్రయాణమై పోవుచున్నావు. ఈ ప్రయాణమనిన నీకంత సంతోషమెందులకో నాకు అర్థము కాకున్నది."

నేను ఎటువంటి ముఖ్యమైన పనిమీద ప్రయాణమై

పోవుచున్నానో తెలియునా! నెలబాలను ఇచ్చుటకు తిరిగి తీసి కొని వచ్చుటకు పోవుచున్నాను! ఆమెను తిరిగి చూడబోవు చున్నాను. ఒక్కసారి ఆ విషయమునుగూర్చి ఆలోచింపుము. నాకెంతో సంతోషముగ నున్నది. బార్బరా! ఆమెనుచూచి నీవుకూడ సంతోషింతువని నేను అభిప్రాయపడుచున్నాను."

బార్బరా ఆ మాటలువిని తలఊపెను. తనమాటలు ఆమె కెందులకు ఉత్సాహము కలిగింపలేదో కిట్‌కు ఆశ్చర్య కరముగానుండెను. ఆమె ధోరణి అతనికేమాత్రము అర్థము కాకుండెను.

"ఆమె ముఖము ఎంతో మధురముగను, ఎంతో అంద ముగను నుండును. ఆమెనుచూచిన తరువాత నీవు నా అభిప్రా యముతో ఏకీభవింతువనుటకు ఎట్టి సందేహమునులేదు. అవును నాకెట్టి సందేహమునులేదు" అని కిట్‌కూడ అనెను.

బార్బరా అసంతృప్తి చెందినదానివలె మరల తల ఊపెను.

"బార్బరా! ఏ కారణమున నిట్లున్నావు?"

బార్బరా సమాధానమేమియు చెప్పలేదు. కాని ఆమె మొగమునుచూచిన కిట్ ఒక విషయమును గ్రహించెను. కిట్ నెలబాలను ప్రేమించుచున్నాడని ఆమె అసూయ పడుచున్నది.

కిట్ బార్బరాను ముద్దుపెట్టుకొని, "బార్బరా! మనము మిత్రులము. నా కష్టములలోనెల్ల నిన్ను తలచుచునేయున్నాను. నీ సహచర్యము లేకపోయినచో నా జీవితము దుర్భరమైయుండె డిది. నీ కోసమే, నీ వలననే నేను ఈ విధముగ జీవించు చున్నాను."

ఆ మాటలనువిన్న బార్బరా ముఖములో నొక విధమగు కళ కనబడెను.

కిట్ ఇంకను నిటు చెప్పసాగెను: "బార్బరా! నేను నిజమునే చెప్పుచున్నాను. నెలబాలనుచూచి సంతోషింపవలసినదని నేనెందుకు కోరుచున్నాను? నాకు సంతోషము కలిగించువారిని చూచి నీవుకూడ సంతోషింపవలసినదని మాత్రమే కోరుచున్నాను. నేను ఆమెసేవ చేయవలయునని గాఢముగ వాంఛించుచున్నాను. ఆమెను ఒక్కసారిచూచినచో నీకుగూడ అట్టి అభిప్రాయమే కలుగుననుటకు ఎటువంటి సందేహమును లేదు."

ఆ మాటలనువిన్న బార్బరా తన పూర్వధోరణికెంతయు విచారింపసాగెను.

"నా దృష్టిలో నెలబాల దేవత. నేనా ధోరణికి బాగుగ అలవాటుపడియున్నాను. ఆమెను చూడవలయునని నేను గాఢముగ వాంఛించుచున్నాను. ఆమె మధుర మందహాసముతో నా మనోనేత్రములందు ప్రత్యక్షమగుచున్నది. ఆమె చేతులుచాచి నన్ను పేరుపెట్టి పిలిచి ఆహ్వానించుచున్నట్లున్నది. ఆమె ధనికురాలైన తరువాత నన్ను గుర్తింపదేమోయని ఒకప్పుడు భయపడుచుండెడివాడను. ఆ విధముగ తలచి ఆమెకు అపచారము చేసినందులకు నేనెంతయు సిగ్గుపడుచున్నాను. ఆమె నన్ను మరచిపోదు. నే నామెను మరచిపోను. ఆమె నా యజమానురాలు. నేను ఆమెను ఆ దృష్టితోనే ప్రేమించుచున్నాను; గౌరవించుచున్నాను; పూజించుచున్నాను. నే నామెకు ఎంతయు కృతజ్ఞుడను. ఇది మా యిరువురకు మధ్యగల సంబంధము" అనికూడ కిట్ అనెను.

అంతయు విన్నతరువాత బార్బరా పశ్చాత్తాపపడి కన్నీరుకార్చెను. తరువాత నామెకు అపూర్వమగు ఉత్సాహము వచ్చెను.

మఱి కొంతసేపటికి విదర్ డెన్ గుమాస్తావచ్చెను. అతడు తాతా మనమరాండ్రను వెదకి పట్టుకోవలయునని ఆతురపడు చున్న గౌరవనీయునకు ధనమును, కొన్ని కాగితములను ఇచ్చెను.

ఆగుమాస్తా ఎబెల్‌తో నిట్లనెను: "అయ్యా! ఈసారి కిట్ కూడ తాతా మనమరాండ్రవద్దకు ప్రయాణమై పోవుచున్నాడా? అతనిని చూచుటకు ముసలివాడు ఏ మాత్రము ఇష్టపడడుగదా! అందువలననేకదా క్రిందటిసారి కిట్ గౌరవనీయునితో బాటు వెళ్ళక, తనతల్లిని పంపినాడు."

అంతట ఎబెన్ ఇట్లనెను : "గౌరవనీయుడు ఇప్పుడు కిట్‌నుతనతో బాటు తీసుకొనిపోవలయునని గాఢముగ వాంఛించు చున్నాడు. కిట్‌నుచూచి ముసలివాడు అసహ్యించుకొనునను భయముగాని, అనుమానముగాని యిప్పుడేమియు లేదు. ఏలయన మా పినతండ్రియొకడు తాతా మనమరాండ్రు నివసించుచున్న గ్రామములోనే నివసించుచున్నాడు. అతనిపట్ల వారికి సంపూర్ణ మగు విశ్వాసము కలదు. ఇప్పుడు కిట్ నా తండ్రితో బాటు వెళ్లు చున్నాడు కనుక తాతాయ్య అతనిని అసహ్యించుకొనడు; అత నిని మిత్రునిగనే భావించుకొనును."

తొమ్మిదిగంటలయ్యెను. బండివచ్చి వాకిట నిలబడెను. గార్లెండ్, గౌరవనీయుడు, కిట్ బండిలో ప్రవేశించిరి. మిగిలిన

వారందఱు క్రింద నిలబడియుండిరి. అనతికాలములో బండి బయలుదేఱెను. నిలబడియున్నవారందఱును బండి కనబడు చున్నంతసేపు చేరుమాళ్ళను ఊపిరి.

22

బండి ప్రయాణమై పోవుచుండెను. కాని ఆరోజు వాతా వరణమేమియు బాగుండలేదు. గాలి కడుతీవ్రముగా వీచుచుం డెను. బండి గాలికెదురుగా పోవుచుండెను. కిట్ మాత్రము ప్రతి కూల వాతావరణము నేమాత్రము లెక్క చేయకుండెను. బండి కూడ ఏమాత్రము లెక్కచేయక ముందుకు సాగిపోవు చుండెను.

పగలంతయు గాలి తీవ్రముగ వీచుచునేయుండెను. చీకటి పడిన తరువాతకూడ తీవ్రత ఏమియుతగ్గలేదు. చలి ఎముకలను కొఱికి వేయుచుండెను. కొంచెము వెచ్చగానుండిన బాగుండు నని కిట్ అప్పుడప్పుడు తలపసాగెను.

బండిలోని మిగిలిన ఇరువురు ప్రయాణీకులు నిదురపోవు పరిస్థితిలో లేకుండిరి. వారు వివిధవిషయములనుగూర్చిమాటాడు కొనుచుండిరి. అనతికాలములోనే తాతా మనమరాండ్రను కలసికొనవచ్చునని వారు ఎంతయు సంతసింపసాగిరి.

అర్ధరాత్రమగుసరికి గౌరవనీయుడు ఏదో ఆలోచనలో

మునిగిపోయినట్లుండెను. కాని అతడు హఠాత్తుగా గార్లెండ్‌తో ఇట్లనెను: "నేను మీకు ఒకకథ చెప్పెదను. విందురా?"

"ఉత్సాహకరముగ నున్నచో విందును. ఉత్సాహము లేకపోయినను ఉన్నట్లు నటింతును."

"మంచిది. నేను మీకు క్లుప్తముగ చెప్పెదను."

గౌరవనీయుడు ఈ విధముగా చెప్పసాగెను.

"ఒకప్పుడు ఇరువురు సోదరులు నివసించుచుండిరి. వారొకరినొకరు గాఢముగా ప్రేమించుకొనుచుండిరి. వారిరువురి వయస్సులకుమధ్య తేడా పండ్రెండు సంవత్సరములుండెను. అందు వలననే కాబోలు వారు అంతఎక్కువగా ప్రేమించుకొనుచుండిరి. వారిరువురి వయస్సులలోను అంత తేడావున్నను, ఇరువురును ఒకే కన్యను గాఢముగా ప్రేమించుట తటస్థించెను. వారు తమ హృదయపూర్వకమైన ప్రేమను ఒకేకన్యపై కేంద్రీకరించుట జరిగెను. ఆ విషయమున వారు పోటీదారులైరి.

ఆ విషయమును మొట్టమొదట తమ్ముడు గ్రహించెను. అప్పుడతడు దుర్భరస్థితి ననుభవించెను. అతని ఆత్మ క్షోభించిపోయెను. అతడు మానసికముగ నెంతబాధపడెనో వర్ణింప నలవికాదు. తమ్ముడు చిన్నప్పుడు ఎప్పుడును ఏదో వ్యాధితో బాధపడుచునుండెడివాడు. అన్న మంచి ఆరోగ్యవంతుడు; బలశాలి; సహసశీలుడు. అతడు తన ఆటపాటలన్నిటినిమాని ఎప్పుడును తమ్ముని ప్రక్కనే కూర్చుండి సేవచేయుచుండెడివాడు. అతనిని బయటకు తీసికొనిపోయి ఆడించుచుండెడివాడు. వేయేల? తమ్మునకు సంతోషమును, ఆరోగ్యమును చేకూర్చుటకు చేయవలసిన పనులన్నిటిని చేయుచుండెడివాడు. ఆ పనులన్నిటిని ఇప్పుడు

వర్ణింపబూనినచో ఈ కథకు అంతమనునది యుండదు. తమ్ముడు కొంతకాలమునకు మంచి ఆరోగ్యవంతు డయ్యెనని చెప్పిన చాలును.

అట్టి అన్నదమ్ములిప్పుడు ఒకే కన్యను ప్రేమించుచున్నారు. ఆ సంగతిని ముందుగా తెలిసికొనిన తమ్ముడు తనకు అన్న పూర్వముచేసిన అపూర్వమైన సేవనంతను జ్ఞప్తికి తెచ్చుకొనెను. ఆ సేవకు తగిన ప్రతిఫలమును చూపవలయునను విషయము నతడు జ్ఞప్తికి తెచ్చుకొనెను. అన్నకు సౌఖ్యమును చేకూర్పవలయునను నిశ్చయమునకు వచ్చెను. తన మనస్సులోని విషయము నతడెవ్వరికిని చెప్పలేదు. అతడొకనాడు తన మాతృదేశమును వదలిపెట్టి విదేశములకు పోయెను. మాతృదేశమునకిక నెన్నడును తిరిగి రారాదనియు, విదేశములలోనే మరణింపవలయుననియు నతడు నిశ్చయించుకొనెను.

అన్న తాను ప్రేమించిన కన్యను వివాహము చేసికొనెను. వారి ప్రేమఫలముగా నొక కూతురు పుట్టెను. కాని అనతికాలములో తల్లి స్వర్గలోకమును చేరుకొనెను. ఆ కూతురు ముమ్మూర్తుల తల్లివలెనే యుండును. అన్న భార్యను ఎంతో ప్రేమించుచుండెను. కాని దురదృష్టవశమున ఆమెను పొందిన స్వల్పకాలములనకే కోల్పోయెను. ఇది ఎంతయు హృదయవిదారకమైన విషయము. అన్న తన కూతురును హృదయమునకు హత్తుకొని గాఢముగా ప్రేమింపసాగెను.

కూతురు పెరిగి పెద్దదయ్యెను. ఆమె ఒక యువకుని ప్రేమింపసాగెను. ఆ యువకుడు మంచివాడుకాడు. అమ్మాయి తండ్రికా విషయము తెలియును. కాని అతడేమి చేయగలడు?

కూతురు ఇష్టమున కతడు వ్యతిరేకముగ పోలేదు. పెండ్లియైన తరువాతనైన యువకుడు బాగుపడునని అతడు ఆశించెను. అందువలన నతడు వారిరువురకు వివాహముచేసెను.

వివాహమైన తరువాత భర్త భార్యను ఎన్నో విధముల బాధపెట్టెను. భార్య పరిస్థితి కడు దుర్భరముగ నుండెను. భర్త భార్యను ఏమాత్రము లెక్కచేయకుండెను. అది యొక విషాద గాథ; భయంకరకదనము. కొమార్తెను గాఢముగా ప్రేమించుచుండిన తండ్రి అప్పుడు ఎంత బాధపడెనో వర్ణింప నెవ్వరికిని శక్యముకాదు. ఎవ్వరు బాధపడినను ఏమిచేయగలరు? ఆ దుర్భర పరిస్థితిలోనే వారికి ఒకకొడుకు, కూతురు జన్మించిరి. అదృష్ట వశముననో, దురదృష్టవశముననో ఒకనాడు భర్త మరణించెను. అనతికాలములోనే భార్యగూడ మరణించెను.

అన్న తాతయ్య అయ్యెను. అతడు ఇరువురుని పెంచవలసిన పరిస్థితి ఏర్పడెను. అతని విచారమునకు అంతము లేకుండెను. వయస్సుచేతగాక విచారముచేత నతడు ముసలివాడయ్యెను. అతనికున్న ఆస్తినిదివఱకే అల్లుడు హారతి కర్పూరమువలె ఖర్చు చేసి యుండెను. మిగిలియున్న సొమ్ముతో నతడొక పటముల అంగడి ప్రారంభించెను. క్రమక్రమముగా నతడు ఎన్నోరకముల పురాతన వస్తువులను ప్రోగుచేసి, వానినమ్మి జీవనాధారము సంపాదింప సాగెను. అతనికి చిన్నప్పటినుండియు పురాతన వస్తువులను ప్రోగుచేయుట అన్న ఎంతయుప్రీతి. అదియే ఇప్పుడతనికి జీవనాధారమయ్యెను.

మనమడు తండ్రివలె తయారయ్యెను. మనమరాలు తల్లి వలెనుండెను. తాతయ్య ఆ బాలికను మోకాళ్ళమీదకూర్చుండ

బెట్టుకొని ఆమెను, ఆమె నీలికళ్ళను పరిశీలనగా చూచు చుండె డివాడు. అప్పుడతనికి కూతురు ఆ పసిబిడ్డ రూపములో నున్న ట్లనిపించు చుండెడిది. మనమడు పెరిగి పెద్దవాడై చెడ్డఅలవాట్లకు లోనయ్యెను. అతడొకనాడు ఇల్లు వదలిపెట్టి వెళ్ళిపోయెను. మఱి అతడు తిరిగిరాలేదు. అప్పటినుండి తాతా మనమరాండ్రు మాత్రమే కలసి జీవింపసాగిరి.

తాతయ్య తన భార్యను, కూతురను అపరిమితముగా ప్రేమించుచుండెడివాడు. కాని దురదృష్ట వశమున నతడు వారి నిరువురను కోల్పోయెను. అందువలన నతడా ప్రేమనంతను మన మరాలిపట్ల ప్రదర్శింపసాగెను. కాని అతడు ధనికుడుకాడు. తన మనమరాలిని గొప్ప ధనికురాలినిచేయుట ఎట్లాయని అతడు రాత్రింబవళ్లు ఆలోచింపసాగెను. అతని కా ఆలోచన తప్ప మఱియింకొక ఆలోచన ఏదియు లేకుండెను.

ఇక తమ్ముడేమైనాడు? అతడు ఎవ్వరిని వివాహము చేసి కొనలేదు. ఒంటరిగనే విదేశములలో సంచారము చేయసాగెను. అతడు తనంతట తాను ఎవ్వరికి చెప్పకుండ విదేశములకు పోయి యుండెనుగాదా! అందువలన అతనిని కొందఱు అపార్థము చేసి కొనసాగిరి. అది అతనికెంతయు బాధాకరముగ నుండెను. ఆ బాధ అతనిని వెన్నంటసాగెను. అయినను ఆ యిరువురుమధ్య అప్పుడప్పుడు ఉత్తర ప్రత్యుత్తరములు జరుగుచుండెను. వాని మూలముననేనే నిప్పుడు చెప్పిన విషయములను తమ్ముడు తెలిసికొన గలుగుచుండెను.

చాల సంవత్సరములు గడచిపోయెను. అన్నను కలసి కొవలయునని తమ్ముడు గాఢముగ వాంఛించుచుండెను. అతడు

స్వల్పకాలములో తన సమస్యలనన్నిటిని పరిష్కరించుకొనెను. తన వస్తువులనన్నిటిని డబ్బుగా మార్చివైచెను. అన్నాదమ్ము లిరువురును గౌరవప్రదముగ జీవించుటకు తగిన ధనముతో తమ్ముడొకనాడు అన్నగారి గృహము వద్దకు వచ్చెను!"

"మిగిలిన విషయమంతయు నాకు తెలియును" అని గార్లెండ్ అనెను.

"అవును. మీకు తెలియును. ఆ విషయముల నన్నిటిని మరల చెప్పివిసిగింపను. ఆ తమ్ముడను నేనే. తాతా మనమ రాండ్రను పట్టుకొవయునని నేను ప్రయత్నములు చేసినాను. కాని అవియన్నియు విఫలమై పోయినవి. వారు ఇరువురు బొమ్మలాట గాండ్రతో కలసి ప్రయాణముచేసిన విషయము తెలిసినది. నేను ఆ ఇరువురను కలసికొన్నాను. తాతా మనమరాండ్రు వారిని వదలిపెట్టి మఱియొక ప్రదేశమునకు పోయినారన్న విషయము తెలిసినది. ఆ మఱియొక ప్రదేశమునకుగూడ పోయినాము. కాని అప్పటికి ఆలస్యమై పోయినది. వారు వేఱొక ప్రదేశము నకు పోయియుండిరి. ఇప్పుడు మనము ఆలస్యముగ పోవుటలేదని విశ్వసించుచున్నాను. భగవంతుని ప్రార్థించుచున్నాను" అని గౌర వనీయుడనెను.

"మనము ఆలస్యముగ పోవుటలేము. ఈసారి మనకు తప్పక విజయము లభించును" అని గార్లెండ్ అనెను.

"నేను ఆ విధముగ జరుగునని నమ్ముచున్నాను. ఆశించు చున్నాను. నమ్ముటకు, ఆశించుటకు ప్రయత్నించుచున్నాను. కాని మిత్రమా! నా ఉత్సాహము సన్నగిలి పోవుచున్నది. నేను విచారవలయములో చిక్కుకొని పోవుచున్నాను. ఆశాలేక

కనబడుట లేదు."

"నీవు ఆ విధముగ భావించుచుండుట నాకు ఆశ్చర్యముని కలుగ జేయుటలేదు. అది నీవిప్పుడు చెప్పిన విషయములన్నిటి ఫలితమని నేను ఊహింపగలను. ఈ కాలము, ప్రదేశము అటువంటివి. అన్నింటికంటె ఈ భయంకర కాళరాత్రి ఎట్లున్నదో చూడుడు. నిజముగా నిది కాళరాత్రి! గాలి ఎట్లు సవ్వడి చేయుచు వీచుచున్నదో గమనింపుడు. అయినను మనకు విజయము చేకూరుననియే నేనుగాఢముగ విశ్వసించుచున్నాను. ఆ విధముగ విశ్వసింపవలసినదని మిమ్ము కోరుచున్నాను."

23

తెల్లవారెను. బండి ఇంకను ప్రయాణము చేయుచునే యుండెను. బాట ఏమాత్రము బాగుండలేదు. వాతావరణము ప్రతికూలముగ నున్నది. అందువలన ప్రయాణము కోరుకొనుచున్నంత వేగముగ సాగకుండెను. అయినను ప్రయాణీకులు ధైర్యముతో పోవుచుండిరి. మరల చీకటిపడెను. అప్పటికి గమ్యస్థానమును చేరుకొనుటకు వారింకను చాల మైళ్ళదూరము ప్రయాణము చేయవలసియుండెను. క్రమక్రమముగాగాలి వేగము తగ్గిపోయెను. మంచు తీవ్రముగా కురియసాగెను.

సరిగా రాత్రి పండ్రెండు గంటలకు బండి గమ్యస్థానమును చేరుకొనెను. బండి ఒక పూటకూళ్ళ యింటివద్ద నాగెను.

చర్చి గడియారము పండ్రెండుగంటలు కొట్టెను.

బండివాడు క్రిందకుదిగి పూటకూళ్ళ యింటి తలుపులు తట్టెను. ఎవ్వరును పలుకలేదు. గట్టిగా తట్టినను ఎవ్వరును పలుకలేదు. కిటికీలవద్ద దీపముకూడ కనబడలేదు. అంతయు ప్రశాంతముగను చీకటిగను నుండెను. మఱి ఆ ఇంటిలో నెవ్వరైన నున్నారో లేరో! నిదురించినవారు నిదురలోనే మరణించినారేమో!

బండిలోని ముఫ్వురును క్రిందకు దిగిరి. వారు ముఫ్వురును ఏమేమో మాట్లాడుకొనిరి. చిట్టచివరకు గౌరవనీయుడు (తాతయ్య తమ్ముడు) ఇట్లనెను: "మనము ముందుకు సాగిపోదము. ఈ బండివాడు తనకు చేతనైనచో ఈ ఇంటిలోనివారిని మేల్కొల్పును. మనము ఆలస్యముగ రాలేదని తెలియువఱకు నాకు విశ్రాంతియుండదు. భగవన్నామస్మరణచేయుచు ముందుకు సాగిపోదము."

"పూటకూళ్ళ యింటిలోనివారు లేచినచో మాకు కావలసిన సౌకర్యములను ఏర్పాటు చేయింపుము" అనిచెప్పి వారు ముందుకు పోసాగిరి. వారు క్రమక్రమముగా పల్లములోనికి పోసాగిరి. వారికిక చర్చి కనబడకుండెను. మఱి కొంచెము సేపటికి వారికి చర్చి గోపురము కనబడసాగెను. వారికి సమీపమునన్నున్న ఒక యింటిలోనున్న దీపము కనబడసాగెను. కిట్ అచ్చటకు పరుగెత్తుకొనిపోయి కేకలు వైచెను.

అంతటనొక ముసలివాడు బయటకువచ్చి "ఇంత అర్ధరాత్రి సమయమున నా కొఱకు వచ్చినవారు ఎవరు? ఈ సమయమున నన్ను ఎవరును లేపరు. నీకేమి కావలయును?" అని

ప్రశ్నించెను.

"అయ్యా! మీరు ముసలివారనియు, జబ్బుగా నున్నారనియు నాకు తెలియదు, క్షమింపుడు."

"ముసలివాడనా! నేను ముసలివాడనని నీకెట్లు తెలియును? బహుశా నీవు అనుకొనుచున్నంత ముసలివాడనుకాను. ఇక జబ్బుగా నున్నానందువా! చాలమంది యువకులు నాకంటె అధ్వానస్థితిలో నున్నారను విషయమును తెలిసికొనుము. ఈ కాలపు యువకులు ఎంతో బలహీనులుగ నుండుట ఎంతయు విచారింపదగిన విషయము. నేను మొదట కొంచెము మొఱటుగా మాట్లాడినందుకు క్షమింపుము. రాత్రి సమయమున నా కన్నులు సరిగా కనబడవు. నీవీ యూరికి క్రొత్తవాడవను విషయమును నేను గుర్తింపలేదు."

"అయ్యా! మిమ్ము నిదురనుండి లేపినందుకు నేను ఎంతయు విచారించుచున్నాను. కాని అల్లదిగో, ఆ గేటువద్ద ఇరువురు గౌరవనీయులు నిలబడియున్నారు. వారుకూడ నీగ్రామమునకు క్రొత్తవారే. వారు మఠాధికారి ఇంటికి పోవలసియున్నది. దయయుంచి అచ్చటకు దారి తెలుపగలరా?"

"తెలుపలేక పోవుటేమి? నేనిచ్చటకు ఏబది సంవత్సరములనుండి ఉద్యోగము చేయుచున్నాను. కుడిచేతి దారిని పోయినచో మీకు కావలసిన ఇల్లు వచ్చును. మఠాధికారికి మీరు చెడ్డవారను తీసుకొని వచ్చుట లేదుగదా!"

"లేదు, లేదు మీకెంతయు కృతజ్ఞుడను" అని యని కిట్ తన వారున్న దగ్గరకు పరుగెత్తుకొనిపోయెను. ముగ్గురును కలసి సరియైన దారినిపోయి మఠాధికారి ఇల్లు చేరుకొనిరి.

అచ్చటినుండి వారికి కొన్ని శిథిల గృహములు కనబడసాగెను. అచ్చటనొక దీపము వెలుగుచుండెను. ఆ దీపము వారిని ఆకర్షించెను.

"అదియేమి దీపము?" అని తమ్ముడు ఆశ్చర్యముతో ననెను.

"మనవారు అచ్చటనే నివసించుచున్నారని నేను అనుకొనుచున్నాను. వేఱొకచోట నాకు శిథిల గృహములు కనబడుటలేదు" అని గార్లెండ్ అనెను.

"అయ్యో! మీరిచ్చట మఠాధికారిని కలసికొని మాట్లాడుచుండుడు. నేను ఆ దీపమున్న ప్రదేశమునకు పోయివత్తును. అచ్చట నెవరైన మనుజులు నివసించుచున్నారేమో తెలిసికొని వత్తును" అని యని కిట్ దీపమున్న వంకకు పరుగెత్తుకొని పోయెను.

కిట్ తిన్నగా ఆ దీపమున్న శిథిల గృహమువద్దకు పోయెను. అతడు మెల్లన ఇంటి కిటికీని సమీపించెను. ఇంతలో సంతయు ప్రశాంతముగ నుండెను. అతని కేవిధమగు ధ్వనియు వినబడుటలేదు. అతడు ఇంటిలోనికి తొంగి చూడదలచెనుగాని కిటికీకి తెరయుండుటవలన అట్లు చేయుటకు వీలులేకపోయెను.

కిట్ ద్వారమువద్దకుపోయి మెల్లన తలుపు తట్టెను. కాని ఎవరును సమాధానమీయలేదు. కాని లోపలనేదో వింతధ్వని వినబడెను. అది ఏమిధ్వనియో నిర్ణయించుట కష్టముగనుండెను. అది ఒక విధముగా అమితమగు బాధతో నెవ్వరో మూలుగుచున్నట్లుండెను. దానిని వినగానే కిట్ రక్తము చల్లబడినట్లుండెను. అయినను నతడు మరల తలుపుతట్టెను. కాని జవాబు

లేదు. లోపల ధ్వనిమాత్ర మెప్పటివలె నుండెను. అంతట కిట్ తలుపు త్రోసెను. తలుపులు తెఱచుకొనెను.

కిట్ లోపలకు ప్రవేశించెను. కుంపటివద్ద నెవరో కూర్చుండి యుండిరి. అతనివద్దనుండియే వింతధ్వని వచ్చుచుండెను. అత డొక ముసలివానివలె నుండెను. అచ్చటి వాతావరణ మంతయు హృదయ విదారకముగ నుండెను. కిట్ మాట్లాడుటకు ప్రయత్నించెను. అతని నోటివెంట కొన్నిమాటలుకూడ వచ్చెను. కాని అవి ఏమో అతనికీ సరిగా తెలియదు. వింతధ్వని మాత్రము ఇంకను వినబడుచునే యుండెను.

కిట్ అంతకంతకుముందుకురాసాగెను. అతడు ముసలివాని ముఖమును చూచెను. ఆ ముఖములో చాలమార్పు వచ్చినది. కాని కిట్ ఆ ముఖమెవ్వరిదో గుర్తించినాడు.

"అయ్యా! మీరా!" అని యని కిట్ చేయిచాచెను.

ముసలివాడు మెల్లన అతని వంకకుచూచి, "మరల నిది యొకటి! నేటిరాత్రి ఇచ్చటకు ఎన్ని దయ్యములు వచ్చుచున్నవి!" అని అనెను.

"అయ్యా! నేను దయ్యమనుకాను. నేను మీ ప్రాత సేవకుడను. ఇప్పుడు మీరు నన్ను నిశ్చయముగ గుర్తించినారనుకొందును. నెలబాల ఆమె యెచ్చటనున్నది? ఆమె యెచ్చటనున్నది?"

"అందఱు అదే చెప్పుచున్నారు! అందఱు అదేప్రశ్న వేయుచున్నారు. దయ్యము!"

"అయ్యా! అయ్యా! ఆమె ఎచ్చటనున్నది? దయయుంచి యీ ప్రశ్నకు సమాధానము చెప్పుము."

—

"ఆమె నిదురించుచున్నది. అల్లదిగో అక్కడ నున్నది."

"భగవంతుడు కరుణామయుడు."

"అవును భగవంతుడు కరుణామయుడు! ఆమె నిదురించుచున్నప్పుడు నేను ఎన్నో రాత్రులు భగవానుని ప్రార్థించినాను. ఆ విషయము భగవానునకు తెలియును. అదిఏమి? ఆమె పిలిచినదా?"

"నాకే ధ్వనియు వినబడలేదు."

"నీవు వింటివి. ఇంకను వినుచున్నావు. ఆధ్వని వినబడుట లేదని చెప్పుచున్నావా?"

అతడు మరల వినుటకు ప్రయత్నింపసాగెను. విజయ సూచకమగు మందహాసముతో నిట్లనెను: "అదికాదా? ఆధ్వనిని నేను యెఱిగియున్నంత బాగుగా మఱియింకెవ్వరును ఎఱుగరు. ఉండు ముందుము."

ప్రశాంతముగ నుండవలసినదని సంజ్ఞచేయుచు ముసలివాడు మఱియొక గదిలోనికిపోయెను. కొంచెముసేపు గడచిన తరువాత నతడు చేతనొక దీపముతో యథాస్థానమునకు తిరిగి వచ్చి మెల్లన నిటనెను: "ఆమె యింకను నిదురించుచున్నది. నీవు చెప్పినదే నిజము. ఆమె పిలువలేదు. ఒకవేళ నిదురలో కలవరించిన కలవరించి యుండవచ్చును. ఇదివఱకొకసారి నన్నామె నిదురలో పిలిచినది. నేనామె ప్రక్కనే కూర్చుండి చూచితిని. ఆమె పెదవుల కదలికను చూచితిని. ధ్వని ఏదియు బయటకు రాకపోయినను ఆమె నాపేరు నుచ్చరించినదను విషయము నాకు తెలియును. కాంతి ఆమె కన్నులను మిరుమిట్లు గొల్పునను నుద్దేశ్యముతో నేను దీపమును ఇచ్చటకు తీసికొని వచ్చినాను."

ఆ మాటల నాతడు తన ఎదుటనున్న వానితోగాక తనలోతానే అనుకొన్నట్లుండెను. అతడు దీపమును బల్లమీద పెట్టెను. కాని అంతలో ఆ వచ్చిన వాడెవ్వడో తెలిసికోవలయునను తలంపుతో బల్లమీదనుండి దీపమును పైకెత్తెను. కాని అంతలో ఆ తలంపును మఱచిపోయి దీపమును బల్లమీద పెట్టెను.

తరువాత నతడిట్లు అనెను. "ఆమె గాఢముగ నిదురించుచున్నది. అందుకు ఆశ్చర్యపడవలసిన పనియేమియు లేదు. దేవతలు నేలనంతను మంచుతో నింపివైచి యున్నారు. అందువలన ఆమెకు ఎవ్వరి అడుగుల సవ్వడియు వినబడదు. ఆమె పక్షులకు ఆహారము పెట్టుచుండెడిది. కాని ఇప్పుడు ఆ పక్షులన్నియు మరణించి యున్నవి. అందువలన నవి ఆమెను లేపవు."

పిమ్మట నతడు మాట్లాడుట మానివైచి ఏమో విన సాగెను. ఆ విధముగ నతడు చాలసేపు ఉండెను. అటు పిమ్మట నతడు ఒక పెట్టెలోనుండి నెలబాల దుస్తులనుతీసి వానిని నిమురసాగెను.

"నెలబాలా! అచ్చట నట్లు పడియున్నావెందులకు? చూడుము. బయట ఎఱ్ఱ చేరిపండ్లు నీ కొఱకు ఎట్లు వేచి యున్నవో! వానిని నీవు కోయవలయునట! నీ చిన్నారి మిత్రులందఱును వచ్చి, 'మా నెలబాల ఎక్కడ? మా నెలబాల ఎక్కడ?' అని అడుగుచున్నారు. నీవు కనబడుటలేదని వారు గోలు గోలున నేడ్చుచున్నారు. అల్లరి పిల్లలుకూడ ఆమె చెప్పినట్లు వినుచుండెడివారు. అందఱను ఆమె చక్కగా మచ్చికచేసి కొను చుండెడిది."

కిట్‌కు మాట్లాడుటకు శక్తిలేకుండెను. అతని కన్నులు

అశ్రుజలముతో నిండిపోయెను.

"ఇవి ఆమె దుస్తులు! ఆమె ఇంటివద్ద ధరించు చుండెడి దుస్తులు! వారు వీని నిచ్చట దాచి వైచినారు. కాని నేను వీనిని ఆమె కిచ్చెదను. నాకీ ప్రపంచ సంపద నంతను ధారపోసి నను నే నామెకు విసుగు కలిగింపను" అని యని అతడా దుస్తులను తన హృదయమునకు హత్తుకొనెను.

తరువాత నతడింకను ఇట్లనెను: "అనవసరముగా పరుండుట ఆమె అలవాటుకు విరుద్ధమైనపని. ఆమె ఎప్పుడును పెందల కడ లేచుచుండెడిది. కాని అప్పుడామె శరీరారోగ్యము చాల బాగుండెడిది. మనము కొంచెము ఓపికపట్టి యుండవలయును, శరీరారోగ్యము బాగుపడిన తరువాత ఆమె ఎప్పటివలె పెందల కడలేచి బయటకుపోయి తిరుగును. ఆమె ఉదయకాలమున ఎచ్చటకు పోవుచుండెడిదో తెలిసికో వలయునని చాలసార్లు ప్రయత్నించినాను. కాని మంచులో ఆమె చిన్నారి పాదముల అడుగు జాడలు కనబడెడివికావు. ఎవరక్కడ? తలుపుమూసి వేయుడు. తొందరగా మూసివేయుడు. ఆమె చలిబాధను సహింపలేదు. ఆమెకు వెచ్చదనము కావలసియున్నది."

నిజముగా నెవ్వరో తలుపు తెఱచి యుండిరి. తాతయ్య తమ్ముడు, గార్లెండ్ మఱి యిరువురితో కలసి లోనికి వచ్చిరి. ఆ యిరువురును బ్రహ్మచారి, ఉపాధ్యాయుడుతప్ప మఱియింకెవ్వరు? ఉపాధ్యాయుని చేతిలో నొక దీపముండెను. అతడు కిట్ తాతయ్య ఇంటిలో ప్రవేశించుటకు కొన్ని క్షణములకుముందే తన యింటికిపోయి యుండెను.

ఉపాధ్యాయుని, బ్రహ్మచారిని చూడగానే తాతయ్య

కోపము తగ్గిపోయెను. తలుపు తెఱచినవారు తన మిత్రులని గ్రహించుటయే అందుకు కారణము. కాని అతడు క్రొత్తగా వచ్చిన ఇరువురిని లెక్కచేయకుండెను. అతడు వారిని చూచెను గాని అతని కావిషయమున నెట్టి కుతూహలమును లేనట్లుండెను. తాతయ్య తమ్ముడు ప్రత్యేకముగా నొకచోట నిలబడియుండెను. బ్రహ్మచారి తాతయ్యకు దగ్గఱగా కూర్చుండెను. చాలసేపు గడచిన తరువాత నతడు మాట్లాడుటకు సాహసించెను.

బ్రహ్మచారి మెల్లన నిట్లనెను: "మఱియొకరాత్రి! ఈ రాత్రికూడ నిదుర పోవుటలేదు. నీవు నాకు చేసిన వాగ్దానమును జ్ఞప్తియందుంచుకోవలయునని కోరుచున్నాను. నీవు కొంచెము విశ్రాంతి ఏల తీసికోవు?"

"నిద్ర నన్ను వదలిపోయినది. అది ఆమెను ఆవహించి యున్నది" అని ముసలివాడు సమాధాన మిచ్చెను.

"నీవీ విధముగ కనిపెట్టుకొని కూర్చున్నావని తెలిసినచో ఆమె ఎంతయు బాధపడును. ఆమెకు బాధను కలిగించుట నీకు ఇష్టమా?"

"ఆమెకు మెలకువ వచ్చినచో నేను దానిని గుఱించి అంతగా లెక్కచేయను. ఆమె చాల సేపటినుండి నిదురించు చున్నది. అయినను నేను ఇంత కఠినముగా మాట్లాడరాదు. ఆమె పోవుచున్నది సుఖనిద్రయేకదా?"

"నిశ్చయముగ సుఖనిద్రయే! నిశ్చయముగ సుఖనిద్రయే!"

"మంచిది. మంచిది. మఱి మేల్కొనుట..."

"అదియు మంచిదే. దానిని వర్ణించుటకు మాటలు చాలవు."

అంతట ముసలివాడు దీపము తీసికొని మఱియొక గది

లోనికి పోయెను. అచ్చట నతడేమో మాట్లాడసాగెను. బయట గదిలో నున్నవారు ఒకరినొకరు చూచుకొనుచు కన్నీరు కార్చ సాగిరి.

తాతయ్య యథాస్థానమునకు వచ్చి, "ఆమె ఇంకను నిదురించు చున్నది. కాని నిదురలో కొంచెము కదలినట్లు కన బడినది. ఆమె చేయి కొలదిగా కదలినది. చేయి కదలినదని నేను నిశ్చయముగ నమ్ముచున్నాను. ఇదివఱకుకూడ నామె అట్లే కదలించుచుండెడిది. నేనా కదలికను సులభముగా గుర్తింప గలను" అని హీనస్వరమున ననెను. పిమ్మట నతడు తల్పపై చేతులు పెట్టుకొని ఒకవిధముగా అఱచెను. ఆ అఱపు ఎన్నటి కిని మఱపురానిది.

అంతట ఉపాధ్యాయుడు తాతయ్యకు రెండవ ప్రక్కన కూర్చుండెను. బ్రహ్మచారి, ఉపాధ్యాయుడు కలసి తాతయ్య చేతులను అతని నెత్తిమీదనుండి తీసి తమ చేతులలో పెట్టు కొనిరి.

"తాతయ్య నామాట వినునని నేను గాఢముగ విశ్వ సించుచున్నాను. మనము బతిమాలుకొన్నచో ఇతడు మీ మాటగాని, నామాటగాని వినును. ఆమె ఎప్పుడును వినును" అని ఉపాధ్యాయుడనెను.

"ఆమె కిష్టమైన గొంతు నాకుగూడ ఇష్టమైనదే. ఆమె ప్రేమకు పాత్రులైన వారందఱు నా ప్రేమకు పాత్రులైనవారే" అని తాతయ్య అనెను.

"నాకా విషయము బాగుగ తెలియును. నీవు నామాట తప్పక విందువు. అందుకు నాకెట్టి సందేహము లేదు. ఆమెను గూర్చి ఒక్కసారి ఆలోచింపుము; మీ రిరువురును కలసి బాధ

పడినారు; విచార సాగరమున ఈదినారు; ఆనందము ననుభవించి నారు."

"అవునవును. నేను మఱియే యితర విషయమునుగూర్చి గాని ఆలోచింపను."

"ప్రియ మిత్రమా! నేటిరాత్రి మఱి ఏ యితర విషయ మునుగూర్చిగాని ఆలోచింపుమని చెప్పను. నీ హృదయమును మెత్తపఱచు విషయములనుగూర్చి మాత్రమే ఆలోచింపుము. పూర్వకాలమునుగూర్చియు, పూర్వకాలపు ప్రేమనుగూర్చియు ఆలోచింపుము. నీతో ఆమె ఈవిధముగనే మాట్లాడును. ఆమె తరఫున నే నిప్పుడు నీతో మాట్లాడు చున్నాను."

"మీరు మెల్లగ మాట్లాడుట మంచిది ఆమెను మనము నిదురనుండి మేల్కొల్పరాదు. నే నామె కన్నులను, మందహాస ము తిరిగి చూచుట కెంతయు సంతసింతును. ఆమె ముఖమున నిప్పుడుకూడ మందహాసము కనబడుచున్నది. కాని ఆ మందహాస ములో మార్పు కనబడకున్నది. మందహాసము వచ్చుచు, పోవుచు నుండవలయునని నేను కోరుకొనుచున్నాను. అది అనతి కాలములోనే జరుగునని ఆశించు చున్నాను. మన మామెను మేల్కొల్పరాదు."

"ఆమె ఇప్పటి పరిస్థితిని గుఱించి మనము మాట్లాడ వలదు. మీ రిపువునను కలసి ప్రయాణము చేయుచున్నపుడు ఆమె ఎట్లుండెడిది? మీ రిపువునను కలసి లండను గృహమున నున్నప్పుడు ఆమె ఎట్లుండెడిది? అప్పటి పరిస్థితిని గుఱించి మాట్లాడు కొందము. ఆమె అప్పుడు ఎంతో సంతోషముగ నుండెడిది."

"అవునవును! ఆమె ఎప్పుడును సంతోషముగనుండెడిది."

"ఆమె ప్రతి విషయమునను తన తల్లిని పోలియుండెన దని నీవు పలుమార్లు చెప్పుచుండెడివాడవు. ఆమెను గుఱించి ఆలోచింపగలవా? ఆమెను జ్ఞప్తికి తెచ్చుకో గలవా?"

ముసలివాడు సమాధాన మేమియు నీయలేదు.

అంతట బ్రహ్మచారి ఇట్లనెను: "ఇంక అంతకు ముందు జరిగిన విషయమునుగూర్చికూడ ఆలోచింపుము. అది చాల సంవత్సరముల క్రిందటిమాట! బాధ కాలమును పొడిగించు చుండును. నీవు నీ ప్రియురాలిని కోల్పోయిన తరువాత కూతురును ఎంతో గాఢముగ ప్రేమించినావు! అంతకంటె పూర్వపు విషయములు జ్ఞప్తియందున్నవా? నీ వప్పుడొక బాలుడవు! మఱియొక బాలుని గాఢముగ ప్రేమించుచుండెడివాడవు. ఆమఱియొక బాలుడు నీ తమ్ముడు. నీ వతనిని చూచి చాలకాలమైనది. నీ వతనిని మఱచిపోయినావు. మీరు పూర్తిగ వేఱైపోయినారు. నీకు అత్యవసరమైన యీ సమయమున నిన్ను ఓదార్చు కతడు తిరిగి వచ్చియున్నాడు."

అంతట తమ్ముడు అన్నముందు మోకరిల్లి ఇట్లనెను: "ఒకప్పుడు నీవు నాకు సేవచేసితివి. నీవు సేవచేయవలయునని నేనిప్పుడు వచ్చియున్నాను. ఒకప్పుడు నీవు నన్ను గాఢముగా ప్రేమించితివి. నేను నిన్నిప్పుడు ప్రేమించుటకు వచ్చియున్నాను. మనము ఎన్నో సంవత్సరములు వేఱుగా జీవించితిమి; ఇప్పుడింకకలసి జీవింతము. అన్నయ్యా! అన్నయ్యా! నన్ను గుర్తించినట్లు ఒక్కమాట పలుకుము. మనమింక అపూర్వ సోదరులవలె జీవింతము. మనకింక విచారమనునది యుండదు."

తాతయ్య అచ్చట నున్నవారి మొగములు చూచెను;

అతని పెదవులు కదలెను; కాని బయటకు ధ్వనిఏమియు రాలేదు.

తమ్ముడు ఇంకను ఇట్లు చెప్పసాగెను: "అన్నయ్యా! మనము చిన్నప్పుడు అపూర్వమైన అనురాగముతో కలసికట్టుగా జీవించితిమి. మనమిప్పుడు తిరిగి చిన్నపిల్లలవలె నున్నాము. మనముక్రైఇప్పుడుకూడ అపూర్వమైన అనురాగముతో జీవింతము. చిన్నపిల్లలవలె జీవింతము. అన్నయ్యా చిన్నపిల్లలవలె జీవింతము!"

తాతయ్య నెలబాల యున్న గదివంకకు చేయిపెట్టి చూపుచు వణకుచున్న పెదవులతో నిట్లనెను: "మీరందఱు కుట్రపన్ని నా హృదయమును ఆమెనుండి దూరము చేయ వలయునని ప్రయత్నించుచున్నారు. మీరెన్నటికిని ఆపని చేయ లేరు. నా యీ శరీరములో ప్రాణముండగా మీరు ఆపని చేయ లేరు. నాకు ఆమెతప్ప మఱి స్నేహితులుగాని, బంధువులుగాని ఎన్నడునులేరు. ఇంకముందుకూడ నుండరు. నా జీవిత సర్వ స్వము ఆమెయే. మా యిరువురను వేఱుచేయుటకు సమయము మించిపోయినది."

పిమ్మట నతడు మెల్లన ఆ గదిలోనికిపోయెను. మొదటి గదిలోనున్న వారందఱును దగ్గఱకుచేరి ఏమో మాట్లాడు కొనిరి; తరువాత తాతయ్య ఉన్నగదిలోనికి వెళ్ళిరి. వారు చాల మెల్లగా వెళ్ళుటవలన అడుగుల సవ్వడి ఏమియు వినబడ లేదు. కాని వారందఱును విచారముతో కన్నీరు కార్చసాగిరి.

నెలబాల మరణించినది. ఆమె తన చిన్నారిశయ్యపై శాశ్వతముగ విశ్రాంతి తీసికొనుచున్నది.

నెలబాల మరణించినది. ఆమె కడు మనోహరముగ నిదు రించుచున్నది; ఆమె ముఖములో బాధాచిహ్నము లేవియు కన

బడుటలేదు; చూచుట కెంతయు అందముగనున్నది. ఆమె నప్పుడే భగవంతుడు తయారుచేసినట్లుండెను; ఇంక ప్రాణము పోయుట మాత్రము జరుగవలసినట్లుండెను. కొంత కాలము జీవించి మరణించినట్లు మాత్రమామె లేకుండెను.

నెలబాల మరణించినది; అందఱకు ప్రియమైనది; సాధు స్వాభావముకలది; సహనశీలము గలది; ఉదారస్వభావముకలది; అట్టి నెలబాల మరణించినది.

ఆమె పడిన బాధలు మున్నగువాని చిహ్నము లెక్కడ నున్నవి? అన్నియు మటుమాయమైపోయినవి. ఆమెలో నింక నిప్పుడు విచారములేదు; శాంతి, సౌఖ్యము ఇప్పుడా స్థానమున నెలకొన్నవి. తాతయ్య నెలబాలచేతి నొకదానిని దీసికొని తన హృదయమునకు హత్తుకొనుచుండెను. తాతయ్యను నడిపించిన దా హస్తమే! అతనికి అభయప్రధాన మొసగినది ఆ హస్తమే. అప్పుడప్పుడు అతడా హస్తమును తన పెదవులవద్ద పెట్టు కొనుచుండెను. తరువాత హృదయమునకు హత్తుకొనుచుండెను. "చేయి వెచ్చగానే ఉన్నది" అని అత డప్పుడప్పుడు అను చుండెను. ఆ సమయమున నతడు విచారముతో చుట్టునున్న వారి వంకకు చూచుచుండెను. ఈమెకు సాహాయ్యము చేయుడు" అని అతడు వారిని ప్రార్థించుచున్నట్లుండెను.

నెలబాల మరణించినది. ఆమె సాహాయ్యమును స్వీక రించుస్థితిదాటిపోయినది. ఆమెకు సాహాయ్యము అవసరములేదు. ఆమె యింక ఆ యింటిలో అటునిటు తిరుగదు; బయటకుపోయి తిరుగదు. ఆమె యింక తాతయ్యకు ఏ సాహాయ్యమును చేయదు.

ఉపాధ్యాయుడు కన్నీరుగార్చుచు నెలబాలను ముద్దుపెట్టు

కొని యిట్లనెను: "ఈమె సామాన్య బాలికకాదు. ఈమె చిన్నారి దేవత. ఈమె భగవంతుని సాన్నిధ్యమును చేరుకొన్నది. ఇది ఆమె అదృష్టమని చెప్పకతప్పదు. ఈమె ధన్యురాలు. ఈమె పరిచయభాగ్యముకల మనమందఱము ధన్యులము."

తెల్లవాఱిన తరువాత వారు ప్రశాంతమున మాట్లాడు కొనుటకు వీలుకలిగెను. అప్పుడు వారు నెలబాల ఎట్లు కన్ను మూసెనో తెలిసికొనిరి.

నెలబాల మరణించి రెండురోజులైనది. ఆ సమయమున పలువురు ఆమెవద్ద నుండిరి. ఏలయన ఆమె జీవితము అంతము కానున్నదను విషయము వారికి తెలియును. ఆమె తెల్లవాఱిన తరువాత మరణించెను. అంతకుముందు రాత్రి వారామెతో మాట్లాడిరి; కొన్ని గ్రంథములలోని భాగములను చదివి వినిపించిరి. కాని క్రమక్రమముగా ఆమె క్షీణింపసాగెను. ఆమె నిదురమునిగెను. ఆ నిదురలో నామెకు కలలువచ్చెను. ఆమె ఆ కలలలో హీనస్వరమున నేమో అనుచుండెడిది. ఆ కలలు తాతా మనమరాండ్ర ప్రయాణమునకు సంబంధించినవి. అవి సాధాకరమగు దృశ్యములకు సంబంధించినవికావు; వారికి దయతో సాహాయ్యము చేసినవారికి సంబంధించిన దృశ్యములు. ఏలయన కలలలో నామె మాటిమాటికిని "భగవంతుడు మీకు మేలుచేయుగాక! భగవంతుడు మీకు మేలుచేయుగాక!" అని అనుచుండెడిది.

ఎట్టకేలకామె నిదురనుండిలేచి, "నాకు మధురమైన సంగీతము వినబడుచున్నది!" అని అనెను. ఆ విషయము భగవానునికే తెలియును, బహుశా ఆమెకట్టి సంగీతము వినబడి యుండవచ్చును.

తరువాత నామె, "అయ్యలారా! మీరందఱు నన్నొక సారి ముద్దుపెట్టుకొనుడు!" అని ప్రార్థించెను అపుడందఱు నటుల చేసిరి. అంతట నామె మధుర మందహాసముతో ముసలి వానివంకకు తిరిగెను. (అటువంటి మందహాసమును వారిదివఱ కెన్నడును చూచియుండలేదు. ఆ మధురమందహాసమును వారెన్నటికిని మఱచిపోజాలరు.) పిమ్మట నామె అతని మెడను తన రెండు చేతులతో పెనవైచుకొనెను. ఆమె ప్రాణవాయువు లనంతాకాశమున లీనమైపోయెను.

నెలబాల జార్జీసతివద్ద పనిచేయుచుండినపుడు ఇరువురు సోదరీమణుల కనుక వారికి తెలియకుండగనే పోవుచుండెడిది గదా! నెలబాల తఱచుగా వారినిగూర్చి మాట్లాడుచుండెడిది. "నేను వారినిగూర్చి ఎంతగా ఆలోచించితినో వారికెవ్వరైన చెప్పిన బాగుండును. వారి ననుసరించిపోయి వారిని గమనించు చుండెడిదాననన్న విషయమునుగూడ చెప్పిన బాగుండును" అని ఆమె అనుచుండెడిది. కిట్‌నుగూడ చూడవలెనను కోరిన నామె తఱచుగా వెలిపుచ్చుచుండెడిది. ఆమె మధురమందహాసము చేయుచు "నేను కిట్‌ను హృదయపూర్వకముగ ప్రేమించు చున్నానను విషయము నాతని కెవ్వరైన తెలియజేసిన బాగుం డును" అని యనుచుండెడిది. ఆమె ఎప్పుడును తన బాధలను గూర్చి చెప్పెడిదికాదు. ఇతరులనుగూర్చి ఫిర్యాదుచేసెడిదికాదు. అందఱకు కృతజ్ఞత తెలియజేయుచుండెడిది. ఆమె ప్రశాంత ముగ మరణించెను.

నెలబాల మరణించినదను విషయము నింకను తాతయ్య గ్రహించినట్లులేదు. ఆమె యింకను మేల్కొనుననియే అతడు తలచుచుండెను. కాని మఱునాడు ఆమెను సమాధిచేయవల

యుండెను. అందువలన నెలబాలను గాఢముగ ప్రేమించు చుండిన బాలుడొకడువచ్చి అతనిని ఎచ్చటికో బయటకు తీసి కొనిపోయెను.

ఆనాడు గ్రామమంతయు విచారసాగరమున మునిగి యుండెను. అందఱును నల్లని దుస్తులను ధరించిరి. విచార సూచకముగ చర్చిగంటలు మ్రోగుచుండెను. నెలబాల శవమును చర్చి ఆవణలోనికి తీసికొనిపోయిరి. గ్రామప్రజలంద ఱును నచ్చటకువచ్చి ఆమె అంతిమ దర్శనముచేసికొని కన్నీరు కార్చిరి. ఆమె మంచితనమునుగూర్చి పలువిధముల చెప్పుకొనిరి. తరువాత నామె సమాధి చేయబడెను. అంతట బరువైన హృదయములతో ఎవరి యిండ్లకు వారు పోయిరి.

తాతయ్య ఇంటికి తిరిగివచ్చుసరికి బాగుగా చీకటి పడి యుండెను. బాగుగ అలసిపోయిన తాతయ్య బాలుని ఇంటికి పోగానే గాఢముగ నిదురింపసాగెను. అతనిని ఎవ్వరును నిదుర నుండి మేల్కొల్పలేదు. చాలసేపు నిదురపోయినతరువాత అతడే లేచెను. అప్పుడు బాలుడు తాతయ్యను ఇంటికి తీసికొని వచ్చెను.

తాతయ్య తమ్ముడు అన్నగారి రాకకొఱకు ఇంటివద్ద వేచియుండెను. అన్న కనబడగానే అతనిని పట్టుకొని ఇంటిలోనికి తీసికొనిపోయెను.

తాతయ్య తిన్నగా రెండవగదిలోనికి పోయెను. అచ్చట నతనికి కావలసినవారు కనబడలేదు. అందువలన నతడు ఆందో ళనా పూరితములైన నయనములతో అందఱును ఉన్న మొదటి గదిలోనికి వచ్చెను. అక్కడనుండి అతడు నెలబాల పేరుపెట్టి పిలుచుచు ప్రక్కనేయున్న ఉపాధ్యాయుని ఇంటిలోనికి పోయెను.

అందఱును అతనిని వెంబడించి పోయిరి. అతని కచ్చటకూడ నెలబాల కనబడలేదు. అతనిని వారు మెల్లన ఇంటిలోనికి తీసికొనివచ్చిరి.

తాతయ్య ఇంటిలో అటునిటు తిరుగసాగెను. వారతనిని ఎన్నోవిధముల అనునయించిరి. ఎట్టకేల కతడు ఒకచోట కూర్చుండెను. అప్పుడు వారు అసలు విషమును తెలిసికొను టకు అతని మనస్సును సిద్ధముచేయసాగిరి. వారు మందు అందుకు సంబంధించిన విషయమునుగూర్చి చెప్పిరి. నెలబాలను గూర్చి మాట్లాడిరి. కడకు అసలువిషయమును బయలుపెట్టిరి. ఆ మాటను విన్నంతనే తాతయ్య హత్యచేయబడినవానివలె నేల గూలెను. అతడింక బ్రతుకడని చాలమంది అనుకొనిరి. కాని ఎన్నోగంటలు గడచిన తరువాత అతనికి తెలివి వచ్చెను.

తరువాత నతని కంతయు శూన్యముగా నుండెను. అతడు దేనినో వెదకుచున్న వానివలె తన యిచ్చవచ్చినట్లు తిరుగసాగెను. అతనిలో ఏమాత్రమైన జ్ఞాపకశక్తి మిగిలి యున్నచో అది నెలబాలకు సంబంధించినది మాత్రమే. అతడు తమ్మునిని గుర్తించినట్లు లేకుండెను. తమ్ముడు అన్నను వెంటాడు చుండెను. కాని అన్నవద్దనుండి గుర్తింపులేకుండెను. ఏమాటలు చెప్పినను అన్న వానిని పెడచెవిని పెట్టుచుండెను. అసలు నెలబాలసంగతి మాత్ర మతనివద్ద ఎవ్వరు ఎత్తకుండిరి.

ఒకనాటి యుదయమున తాతయ్య చాల పెందలకడ నిదురనుండి లేచెను. అతడు తిన్నగా నెలబాల సమాధి వద్దకు పోయి కూర్చుండెను. ఆపగలంతయు నతడచ్చటనే యుండెను. అతని ఏకాగ్రత నెవ్వరును భగ్నపఱచలేరు. బాగుగ చీకటి పడిన తరువాత అతడచ్చటినుండి లేచి ఇంటికి తిరిగివచ్చెను.

అతడు శయ్యమీద పరుండి, "ఆమె తేపు తిరిగివచ్చును!" అని మెల్లన ననెను.

మఱునాడుకూడ తాతయ్య పెందలకడ సమాధివద్దకు పోయి చీకటి పడువఱకు అచ్చటనే కూర్చుండెను. నాటిరాత్రి కూడ నతడు శయ్యమీద పరుండి, "ఆమె తేపు తిరిగివచ్చును!" అని అనెను. అతడా విధముగ ప్రతిదినము సమాధివద్దకు పోయి చీకటిపడినతరువాత ఇంటికి తిరిగివచ్చుచుండెను.

మఱియొకనాడతడు ఎప్పటివలె సమాధివద్దకు పోయెను. కాని అత డెప్పటివలె ఇంటికి తిరిగిరాలేదు. అప్పుడందఱును సమాధివద్దకు పోయిరి. తాతయ్య అచ్చట చచ్చి పడియుండెను. వారు తాతయ్యను నెలబాలకు ప్రక్కనే సమాధిచేసిరి.

తాతా మనమరాండ్రు ఆచర్చిలోనే కలసి ప్రార్థనచేసిరి. ఆ చర్చి ఆవరణలోనే చేయి చేయి పట్టుకొని తిరిగిరి. ఆ చర్చి ఆవరణలోనే వారిరువురును గాఢముగ నిదురించుచున్నారు. వారి నిదురను ఎవ్వరును వేఱుచేయజాలరు. తాతయ్య ప్రేమ అట్టిది! మనమరాలి ప్రేమ అట్టిది! వారిది అమరప్రేమ.

24

తాతయ్య తమ్ముడు ఉపాధ్యాయునకు చాల ధనము నొసగెను. ఉపాధ్యాయుడు శిథిల గృహములోనే నివసించుచు, పిల్లలకు పాఠములుచెప్పుచు సుఖముగా జీవితము గడపసాగెను. తనతో వచ్చియుండవలసినదని తాతయ్య తమ్ముడు కోరెనుగాని ఉపాధ్యాయుడందులకు అంగీకరింపలేదు. అతడు ప్రశాంత జీవితమునే కోరుకొనెను.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA110B162
పుస్తకం పేరు	తాతయ్య ప్రేమ
తారీఖు	26/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	333
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Haseena
పేజీలు విడదీసినది	Haseena
స్కాన్ చేసినది	Heena
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good